

చీర కట్టిన ఆ సొగసు
వినయ్ కాటన్ చీరకు తెలుసు
vinay®
COTTON SAREES
ISKRA/VNY/C8

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

విడిప్రతి వెల నాలుగు రూపాయలు!

సంపుటం 82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 34

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్లు : 75667, 61247, 61248

వీక్లీపోస్ట్

దృష్టి

23-3-90 "వెలువడిన" ఉగాది ప్రత్యేక సంచిక ముఖచిత్రం బావుంది. కానీ ఉగాది సంచిక అని దృష్టిలో పెట్టుకొంటే మాత్రం సాంప్రదాయబద్ధంగా లేదు. చీరకట్టు, అలంకరణ, బొట్టు... లేకపోవటం కాస్త సంప్రదాయ విరుద్ధంగా వుంది. కనీసం ప్రత్యేక సంచికలైన... "దసరా, ఉగాది, సంక్రాంతి" సంచికలకైనా చిత్రకారులు వేసిన ముఖచిత్రాలు ప్రచురించకపోవటం శోచనీయం. మీ పత్రికలో విమర్శించే వారికి చోటులేదా? పైగా ఉత్తమ విమర్శకునకు 'వీక్లీ పోస్ట్'లో బహుమతి అంటూ ఆ మధ్య ప్రచురించి ఆపేసారేం? ఏది ఏమైనప్పటికీ సంపాదకీయం చాలా విజ్ఞానదాయకంగా వుంటోంది. క్రొత్త సీరియల్ "హిట్‌లిస్ట్" శ్రీ జి. వి. అమరేశ్వరరావుగారు చాలా చక్కని కథాంశాన్ని తీసుకున్నట్టు ఆదిలోనే అర్థమౌతోంది.

–మహమ్మద్ రఫీ (శ్రీకాకుళం)


'రాక్ ట్రాజెడీ'

23-3-90 సంచికలో 'తాజాకాలమ్' ఎంతో ఆలోచనా స్ఫోరకంగా వుంది! మన పాలకుల వైఖరి వాస్తవ చిత్రణ 'వీరాజీ'గారి తాజాకాలమ్: ఎన్నో కోట్లు ప్రజా ధనం, తమ పేరు కోసం, గొప్ప కోసం, తమ పేర్లు శిలాఫలకాలమీద చెక్కించుకొని చరిత్రలో స్థానం పొందాలన్న ఆకాంక్ష మన పాలకులది! అయితే తథాగతుని హుస్సేన్ సాగర్‌లో జిబ్రాల్టర్ ప్లాట్‌ఫారంపై ఎక్కించే పథకం వెనుక ఎంతమంది శ్రామికులు శ్రమించారో కదా! 'రాక్ ట్రాజెడీ'లో కొంతమంది అమాయకులు ప్రాణాలు సైతం కోల్పోయారు. ఇది అత్యంత బాధాకరమైన విషయం! ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి రూపొందించిన పథకం 'బుద్ధుడు హుస్సేన్ సాగర్'లో నిమజ్జనంతో ముగియడం గొప్ప విషాదాంతం!హుస్సేన్ సాగర్ మధ్య అతి పెద్ద బుద్ధ విగ్రహం నిలబెట్టలేక అతి పెద్ద పాషాణ విగ్రహం నిమజ్జనం చేసిన మన ప్రభుత్వం వారి ప్రయోజకత్వం నివ్వెరపోయేలా చేస్తోంది. అసువులు బాసిన నిర్దోషుల కుటుంబాలని తలచి మనసు కలచి వేస్తోంది!

సి. రవితేజస్వి, చింతలూరు

(68 వ పేజీ చూడండి)

పదండి లోపలికి!



ముఖచిత్రం:
"విశ్వామిత్ర ఎప్పుడో?"
మీనాక్షి శేషాద్రి
(ఫొటో: జగ్‌మోహన్)

పై వారం:
'టానా' బహుమతి పొందిన అద్భుత కథ
"అందని బహుమతి"

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఎడిటోరియల్ అడ్వయిజర్: శివలెంక రాధాకృష్ణ   ఎడిటర్: వీరాజీ   ముద్రాపకులు: ప్రచురణకర్త: శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ   13-4-1990   [illegible]ం. 1912 చైత్రమాసం 23వ తేదీ

'పార్టీ'ల "చెర" విడిపించిన నేపాల్ ప్రజలు!

రాజు అన్నవాడు-ప్రజల కోసం యితర దేశాలతో యుద్ధం చేయాలి కాని నేపాల్ రాజు బీరేంద్రా మాత్రం తన ప్రజల మీదనే యుద్ధం మొదలుపెట్టి-కొన్ని వేల మందిని జైలులో బంధించాడు. ఫిబ్రవరి 18న ఊపు అందుకున్న ఉద్యమం యాభై రోజులలో దావానలమైంది. మూడు వందల మందికిపైగా అమాయక నిరపరాధులైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారు-ముప్ఫయి సంవత్సరాలుగా గుర్తింపు లేకుండావున్న నేపాల్ కాంగ్రెస్ మున్నగు రాజకీయ పక్షాలన్నీ ఏకమై-యేకోన్ముఖమై విజృంభించాయి! నేపాల్‌లో జరుగుతున్న పోరాటానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది!

జాతీయ పంచాయత్ పేరున కీలు బొమ్మ వ్యవస్థను పెట్టుకుని 1961 నుంచి-ప్రజా వ్యతిరేక పరిపాలనను కొనసాగిస్తున్న నేపాల్ రాజు ప్రజాస్వామ్యం కోసం బహుళ పార్టీ వ్యవస్థ కోసం-దేశంలోని అన్ని రాజకీయ పక్షాలు ఏకమై-ప్రజల "దన్ను"తో మొదలు పెట్టిన ఉద్యమాన్ని అంతగా మొదట లక్ష్య పెట్టలేదు. లోగడ ఎన్నికలలో మూడింట రెండు వంతులు బలం గెల్చుకున్నప్పుడే 1958లో నేపాలీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజు గుర్తించ లేదు-దానిని రెండు సంవత్సరాలు పూర్తి కాక మునుపే -సైన్యం సాయంతో రాజు కూలద్రోసి-అధికారాన్ని పూర్తిగా, తన గుప్పిట్లోకి తీసుకున్నాడు-అదే మాదిరిగా 1980లో "ప్రజాస్వామ్యం-బహుళ పార్టీ వ్యవస్థ మీకు కావాలా? వద్దా?" అని ప్రజల నుంచి తీర్పు కోరుతూ నిర్వహించిన "రిఫరెండంలో"-ఫలితాలు తారుమారు చేసి-తన హయాంలో జోహుకుమ్ అంటూ పని చేసే పంచాయత్ వ్యవస్థను ఆయన ప్రవేశబెట్టారు!

ఈ కీలుబొమ్మ వ్యవస్థ పరిపాలన యేర్పాటైన దగ్గర నుంచి కూడా మంచు కొండల మీద పలసిల్లే నేపాల్ భూభాగంలో-అన్ని వైపుల నుంచి నిరసన, అసంతృప్తి వ్యక్తం అవుతూ వచ్చాయి!

ఉద్యమం బుసలు కొడుతూ పడగ విప్పకమునుపే-త్వరలోనే బహుళ పార్టీ వ్యవస్థకి మార్గం సుగమం చేస్తామంటూ-రాజు బీరేంద్ర ఉత్తుత్తి మాటలు చెప్పి ప్రజలను బుజ్జగిస్తూ వచ్చాడు. కాని ఆయన మాయ మాటలు యెంతో కాలం సాగలేదు! ప్రజలు ఆగ్రహోద్రిక్తులై తిరగబడ్డారు. కోటి డెబ్బయి అయిదు లక్షల మందిలో ముసలి ముతకా-పిల్లా పాపా తప్ప అందరూ-జ్వాలాముఖులై ప్రజా స్వాతంత్ర్యం కోసం సంగ్రామ భూమిలో దూకారు. చల్లని మంచు పర్వత సానువులు ఎర్రని వెచ్చని రక్తంతో తడిసిపోయాయి!

చివరి ప్రయత్నంగా 'రాజు'గారు మారీచుని మంత్రివర్గాన్ని తీసిపారేసి ఆ జాగాలో బహదూర్ చాంద్ మంత్రి వర్గాన్ని యేర్పాటు చేశాడు. కాని ఎడమ చేయి తీసి పుర్ర చేయి ప్రవేశపెట్టినట్లున్న యీ మార్పుతో ప్రజానీకం మరింత భగ్గుమన్నారు. నేపాల్‌లోని ప్రధాన నగరాలయిన ఖట్మాండూ, లలిత్ నగర్, భక్తపూర్‌లలో కర్ఫ్యూని ధిక్కరించి జనం రోడ్ల మీద కెక్కి విలయతాండవం చేశారు. రక్తం ధారపోశారు-మొదట రకరకాల ప్రతిపాదనలతో అనేక చిత్ర ప్రతిపాదనలు చేసిన శ్రీ బీరేంద్రా యెట్టకేలకు 8వ తేదీ ఆదివారం అన్ని రాజకీయ పార్టీలతోను నేరుగా చర్చలు జరిపారు-ఈ పార్టీ నాయకులలో చాలా మందికి రాజుగారితో "కరచాలనం" చేయడం కూడా అదే మొదటిసారి. చివరికి ప్రజలే గెలిచారు. వారి అభిప్రాయమే నిలిచింది. బహుళ పార్టీ వ్యవస్థకు మార్గం సుగమం చేస్తూ రాజ్యాంగంలో అవసరమైన మార్పులన్నీ తీసుకురాగలమని నేపాల్ ప్రభువు "తలవొగ్గడం"తో ప్రజా నాయకులు ఆ మాటలను "చెవియొగ్గి" విని-ఉద్యమాన్ని ఆదివారం (ఏప్రియల్ 8) అర్ధరాత్రి నుంచి విరమించారు. రాజకీయ పార్టీలకు గత 30 సంవత్సరాలుగా పట్టిన గ్రహణం విడిపోయింది! రాజ్యాంగయుతంగా రాజకీయ పార్టీల మీద విధించిన ఆంక్షలను శ్రీ బీరేంద్ర ఎత్తివేశారు! అంతవరకూ రక్తం చిందిస్తూ-తమ దుస్తుల మీది ఎర్రని మరకలతో ఉరుకులు పరుగులు తీస్తున్న ప్రజానీకం రంగులు జల్లుకుంటూ రోడ్ల మీద కేరింతలు కొడుతూ మరోసారి హోలీ పండుగ చేసుకున్నారు.

నేపాల్ దేశంలో వచ్చిన యీ "పరిణామాలు" హిందూ దేశంలో కన్నా ప్రపంచంలో మరెక్కడా ఆనందాన్ని కలిగించవు. నేపాల్ అసలు సిసలు హిందూ మతదేశం-అక్కడి ప్రజలకు కాశీక్షేత్రమే ముఖ్యమైన పుణ్య క్షేత్రం!

ఇతరుల అనవసర జోక్యం అక్కర లేకుండా నేపాల్ ప్రజలు తమ భవిష్యత్ మార్గాన్ని తామే రక్తసిక్త హస్తాలతో నిర్మించుకున్నారు. వారికి మన అందరి అభినందనలు అందాలి! జై వీర నేపాల్ అంటూ మనం వారి విజయాన్ని హర్షించాలి! ○




[illegible]

భారతదేశానికి శత్రుదేశాలున్నాయి కాని లతామంగేష్కర్ మధుర కంఠానికి శత్రుదేశాలు లేవు. ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఆమెను కొనియాడుతూ వస్తున్నారు. 48 సంవత్సరాల సుదీర్ఘ సేవ లందించిన ఆమె భారతీయ చలనచిత్రరంగంలో సాటిలేని మేటి పార్శ్వగాయని - ఈ ఏడాది 60 వసంతాలు నిండిన సందర్భంగా సత్కారాలెన్నో అందుకున్న ఆమెను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించడం అందరికీ ఇష్టమే! అక్టోబర్ ఆరో తేదీ కాజాకాలంలో చాలా కబుర్లు యీ "నైటింగేల్ ఆఫ్ ఇండియా" మీద చెప్పుకున్నాం కనుక ఇక్కడామెని అభినందించి ఆనందించటమే నా ఉద్దేశం! భారతీయ భాషలన్నింటా (తెలుగులో చాలా పాటలున్నాయి) ఆమె పాటలు పాడారు. - ఏడుకొండలవాడి గుడిలో ఆమె ఆస్థాన సంగీత విద్వాంసురాలు!

పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో కూడా 'లతా' గాన మాధుర్యం తర్వాతే మరో గాయనికి ఆదరణ. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు తగిన సంగీత తారనే ఎంచుకున్నారు. ఈ అవార్డు రావాల్సిన మరో ఇద్దరు తెలుగువారున్నారు? ఆ ఇద్దరూ ఎవరో తెలుసా?......

ఇదో రికార్డు

భారతరత్న అవార్డుని - మరణానంతరం అందుకున్న మహనీయుడు ఫ్రాంటియర్ గాంధీ ఖాన్ అబ్దుల్ బహదూర్ ఖాన్ సాహెబ్. ఆయనకి ఈ అవార్డు అతని 99వ ఏట అందింది. అది రికార్డు. మరణానంతరమే "భారతరత్న" లయిన కామరాజ్, ఎమ్. జీ.ఆర్. ప్రభృతులు ఎవ్వరూ యింత



ఆలస్యంగా భారతరత్నాలు అవలేదు - కాని డా. అంబేద్కర్‌గారిని వారి శతజయంతినాడు "భారతరత్న" బిరుదంతో సత్కరించటం ద్వారా కేంద్రప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది! మూరో పుట్టింరో జునాడు యీ సత్కారం లభిస్తున్న ఏకైక కీర్తిశేషులు అంబేద్కర్‌గారు. 'బాబూజీ'గా వాసికెక్కిన జగ్జీవన్‌రామ్‌గారికి కూడా యీ అవార్డు బ్రతికుండగానే రావాల్సింది. అతనికి, ఏ గవర్నమెంటు యెప్పుడు యీ అవార్డు యిస్తుందో?

అసలు అంబేద్కర్ అవార్డు అని ఒక టిపెట్టి దేశంలో రాష్ట్రాలవారీగా ఏటా తాడిత, పీడిత, దళిత జాతులకు సేవచేసిన వారికి యివ్వాలంటాను నేను!

అక్కినేని

మాదో 'జాతి' అంటే జర్నలిస్టులజాతి అన్నమాట! పెళ్ళి యెవరిదైనా ముత్తైదువలంతా పట్టుచీరెలు కట్టేసుకుని వీసవిసా వెళ్ళిపోయినట్లు - అవార్డులు రివార్డులు యెవ్వరికి లభించినా - సందడిగా ఆనందంగా "కలం" సాగదీస్తాం - అందులోనూ మన అక్కినేనికి రఘుపతి వెంకయ్య అవార్డు వచ్చిందంటే మాకు మహదానందంకదా? ఈ ఏడాది అక్కినేనికి వంట బాగుంది. పద్మభూషణుడైనాడు - యీ అత్యుత్తమ అవార్డు నందుకున్నాడు. శ్రీ నాగేశ్వరరావుతో నాకు పూర్వాశ్రమంలో పరిచయంవుంది - మద్రాసు నుంచి - హైద్రాబాద్‌కు తరలివస్తూ - పత్రికల వారితో అక్కినేని మాట్లాడిన మాటలు - అతని మద్రాసు యింటి "లాన్స్"లో మేమంతా "ఆటలో అరటిపండు" గా వరస్పరం "కట్"చేసుకున్న "జోకు"లు - "కేకులు" యివన్నీ జ్ఞాపకం లేక పోలేదు! హైద్రా"బాధ"లు (మొదట్లో) మన తెలుగు సినీ పరిశ్రమ చాలావడ్డది. వాటినిమోసిన తొలి నాయకుడు అక్కినేని! - నేను యిది రాస్తున్నప్పుడు "అక్కినేని" యీ అవార్డు అందుకొనడానికి విశాఖపట్నం వెళ్తూవుండాలి - వైజాగ్‌లో నంది అవార్డుల ఉత్సవంపెట్టుకోడం మంచిపని - అక్కడ సినిమా ప్రేక్షకులకి సొంతబాణీవుంది. పైగా 60 చిత్రాలు పూర్తి కాగానే అక్కినేనికి - "వజ్రోత్సవం" అన్నారు. అప్పుడు అక్కడే ఘన సన్మానం జరిగింది అని నాకు జ్ఞాపకం (జానా?)

తాజాకాలమ్ వీరాజీ




"అక్కినేని"కి ఎవర్‌గ్రీన్ అన్న ప్రజలుయిచ్చిన బిరుదువుంది. అదేంపాడైపోకుండా వెరైటీపాత్రలు వేయవలసిన అవసరం వుందంటాను నేను - దాదాముని అంటే అశోక్‌కుమార్ లాగా తెలుగుతెర మీద ఎ.ఎన్.ఆర్, ఎన్.టి. ఆర్.లు - అంతర్జాతీయ స్థాయి వెరైటీవేషాలు వేయాల్సిన సమయ మిదేకదూ?

** ** ** ** ** **

ఈ వారం పంజాబ్‌మీద 'బటాలా' చూశాక రాయాలంటే దుఃఖమొస్తోంది. కాశ్మీర్‌మీద దుఃఖించాలంటే యూనివర్సిటీ వి.సి.ని దుండగులు లెత్తుకుపోయారని విన్నాక ఆగ్రహమొస్తోంది - దుఃఖం ఆగ్రహం లాంటి 'రియాక్షన్‌లు' కథలు రాస్తున్నప్పుడేగాని - వార్తా వ్యాఖ్యలు రాస్తున్నప్పుడు వుండరాదని నేను మద్రాసులో "కబ్"గా వున్న రోజుల్లోనే పెద్దలు నన్ను హెచ్చరించేవారు. కాని జర్నలిస్టులకీ హృదయముంటుంది.కాశ్మీ వంజాబ్ రాష్ట్రాల విషయంలో హృదయమున్న అందరికీ ఆందోళనవుంటుంది- హోంమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ గారి సొంత రాష్ట్రం కాశ్మీర్. వారికికూడా హృదయమూ; దుఃఖమూ చాలినంత వుండాలని మన కోరిక.

[*]

పార్లమెంటు ప్రవేశ ద్వారం ముందు ధర్నా చేసిన పంజాబ్‌నాయకులు శ్రీ సిమ్రంజిత్‌సింగ్ మాన్, శ్రీ ధ్యాన్‌సింగ్ మాండ్ ప్రభృతులు.



గుప్పెట్లో నిప్పులు

— బి. ఆగరాజు

"ఎవరమ్మో లోపల? ఇంత నిప్పుదే. చుట్ట కాలుస్తా" అంటూ ఆగంతకుడు గుడిసె ముందు ఒకింత పక్కకు గొంగడేసుకొని, పొందుగా, తీరిగ్గా కూర్చున్నాడు.

చుట్టూ చీకటి చిక్కగా అలముకొని ఉంది. ఎలాంటి అలికిడి ఆ దరిదాపుల్లో మచ్చుకైనా లేదు.

అది బాయిగడ్డ మీది గుడిసె. ఆ గుడిసెలో బంగారమ్మ తన బిడ్డడికి చనుగుడుపుతున్నదప్పుడు.

ఆగంతకుని పిలుపుకు గతుక్కుమంది.

ఆ వేళకు తానెరిగినంత వరకు ఎప్పుడూ ఒక్క పురుగైనా రాలేదు.

మగమనిషిలేని సమయాన ముక్కూముఖమూ తెలియని మనిషి రావడం, ఆమె కొకింత కంగారు కలిగించింది.

పసి నిసుగును పక్కన పడుకోబెట్టి లేచింది. నెత్తి మీదుగా కొంగు వేసుకుంది. పొయ్యిలోంచి పిడికెడు నిప్పులు దీసుకొని, వెలుపలికి వచ్చి, తల ఎత్తకుండానే "నిప్పులు" అంది.

ఆగంతకు డాశ్చర్యంతో కొన్ని లిప్తల పాటు ఆమె వైపు తీక్షణంగా చూశాడు. చీకట్లో ఆమె మోము స్పష్టంగా కనిపించలేదు. చేతో నిప్పులు పట్టుక రావడం చూసి "ఇది మనిషిలా ఉన్నా మనిషి మాత్రం కాదు" అని తనలో తాననుకొని రుమాలు కొంగు పట్టాడు.

బంగారమ్మ నిప్పుల్ని అతడు పట్టిన రుమాలు కొంగులో వేసి, గిరుక్కున వెనుదరిగి, గుడిసెలోకి దూరింది.

ఆగంతకుడు వాటిని మూట కట్టుకొని లేచాడు. లేచి క్షణం కూడా నిలువకుండా వడివడిగా అడుగులేస్తూ, తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ అగంతకుడు మళ్ళీ రాకుండా హడలగొట్టాలని బంగారమ్మ యత్నించింది. కాని అతడు అందుకు తానేమీ తీసి పోలేదన్నట్టు, ఆమె ఎత్తుకు పైఎత్తులా ఆ నిప్పుల్ని మూట కట్టుకపోయాడు. దానితో బంగారమ్మ ఇసుమంత భయానికి లోనయింది. అది ఆమెలో నిప్పు రవ్వలా రాజుకుంది.

★ ★ ★ ★

ఆ బాయిగడ్డ చుట్టూ ఎటు చూసినా చాలా వరకు చెట్లు చేమలు, గుబురు గుబురు పొదలు, ముళ్ళడొంకలు. పట్టపగలైనా అటు రావాలన్నా, పోవాలన్నా పురుగూపుట్రా అనే భయంతో ఎవరూ రారు. ఇక రాత్రి మాట వేరుగా చెప్పేదేముంది?

ఆగంతకుడు బాయిగడ్డ నుండి ఫర్లాంగు దూరం వెళ్ళాక మంచి వయసులో ఉన్న కోడెకాడు ఎదురయ్యాడు. ఇరువురూ ఒకరి ముఖం ఒకరు పరిశీలనగా చూసుకున్నారు.

"పోయేది బాయిగడ్డ మీది గుడిసెకేనా?" అని అడిగాడు ఆగంతకుడు.

"అవును. నీ కెట్లా తెలుసది?"

"ఈ పిల్లబాట పోయెదక్కడికే గదా. ఈ మాత్రం తెలుసుకోలేని ఎడ్డోడివి. అందుకే ఆ దయ్యం నిన్ను బుట్టలో వేసుకుంది."

"ఎవరు? మా ఇంటిదా?"

"ఓ యబ్బో! అది, నీ ఇంటిదా? కాలు దొక్కి కళ్యాణ మాడావా? కాదు. ఉంచుకున్నదను– ఎక్కడ దాపురించింది? ఎలా జత కలిసింది నీకు? ఎవరూ, ఏం పేరూ, ఏ ఊరో ఏమన్నా తెలుసా? తెలియదు. నువ్వడిగినా అది చెప్పదు. నాకు తెలుసు." అని కాసేపు మౌనంగా ఉండిపోయాడాగంతకుడు.

నిజమే. ఎప్పుడడిగినా చెప్పలేదు. విషయాన్ని ఎప్పటి కప్పుడు దాట వేసింది. హొయలు పోతూ, మరులు గొలుపుతూ మనిషిని మరో వైపు మరల్చుకుంది.

"ఏడాదికి పైగా దాని పక్కలో పంటున్నావుకదా! ఎప్పుడైనా అది నిద్దర్లో ఉండగా నువ్వు నిద్రలేచి చూశావా? లేదు. చూడలేదు. ఈ రాత్రి చూడు. నువ్వు చూసేలా చేస్తా. నే నిచ్చేది నీ నడుం కట్టులో పెట్టుకో. నీకు నిద్దరే రాదు. వచ్చినట్టు నటించు, చాలు. దాని అసలు రంగు బయటు పడుతుంది చూడు." అని తన రుమాలు కొంగు ముడి విప్పాడు.

నిప్పులు కణకణలాడు తున్నాయి.

"ఏమిటవి?" అని కోడెకాడు అప్రయత్నంగా అడిగాడు.

"నిప్పులు. అయినా భయపడకు. ఇవి నీ చెయ్యిని కాల్చవు. నిన్నేమీ చేయవు. నీకేమీ కాదు." అంటూ ఒక నిప్పు ముక్కను కోడెకాడి చేతిలో పెడుతూ "రేపీవేళ ఇక్కడే కలుద్దాం." అని అటునుండి కదిలాడు ఆ ఆగంతకుడు. క్షణంలోనే కనిపించకుండా పోయాడు.

ఎటు పోయాడో! ఏమయ్యాడో!! కోడెకాడికి అర్థం కాలేదు.

అంతేకాదు. ఎవరతను? ఇక్కడేం పని? తన ఇంటిదాని సంగతేమిటి? అతని కెట్లా తెలుసు? ఆ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఎట్టిది, అనే ప్రశ్నాపరంపర అతన్ని కలవర పరచింది. అన్నిటికన్నా చిత్రమయింది ఇంగలం. పట్టినా, ముట్టినా కాల్చక పోవడం.

అరచేతిలోని నిప్పును చూస్తుండగా గతంలోని స్మృతులు లీలగా మెదిలాయి.

★ ★ ★ ★ ★ ★ ★

ఆ కోడెకాడి పేరు సిద్దులు.

ఏడాదికి ముందు బంగారమ్మ తారసిల్లింది.

ఆ రోజు ఆదివారం–

పైగా అమావాస్య–

అదీ అర్ధరాత్రి–

అంతా నిశ్శబ్ద నిశీధి. అంతటా నిశ్శబ్దమే నిశ్శబ్దం. కమ్మ కదిలినా వినిపించేలా ఉందా నిశ్శబ్దం. స్మశానంలో లా భయంకర నిశ్శబ్దమది.

సిద్దులు ఎప్పటిలా ఆ మధ్య రాత్రి నిద్ర లేచాడు. లేచి గుడిసె వెనుక వైపుకు వెళ్ళాడు. కాసేపయ్యాక తిరిగి వచ్చి, నులక మంచం మీద మేను వాల్చి, కండ్లు మూసుకున్నాడు.

అంతలో –

ఎవరో వస్తున్న శబ్దం. పూరి గుడిసె వైపే వస్తున్న శబ్దం. ఆ శబ్దం గజ్జెల శబ్దం. అడుగు తీసి, అడుగు వేస్తుంటే అయ్యే శబ్దం. అడుగులు వేస్తున్న విధానంలో ఆమె నిబ్బరం ఎంతో గుండె నిబ్బరం ఉట్టిపడుతుంది. ఆ మువ్వల సవ్వడికి సిద్దులు లేచి కూర్చున్నాడు.

ఎదురుగా ఓ స్త్రీ మూర్తి. వెన్నెల కన్నెలా కన్నులు మిరుమిట్లు గొలిపేలా ప్రత్యక్షమయింది.

తెల్లని చీర. మల్లెల కన్నా తెల్లగా, ఉల్లి పొరకన్నా సన్నగా ఉందా చీర. ఆ చీరలో గులాబీ గుభాళింపును, నునుపును, నిగారింపును, పునికి

దెయ్యాల కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ!

పుచ్చుకున్న పసిమి ఛాయదేహం. ఆ స్త్రీ మూర్తి నిలువుగా ఒక దీపకళికలా వెలుగుతూ నిల్చుంది. ఉలుకూ పలుకూ లేకుండా, కదలక మెదలక, క్రీగంట చూపులతో బంగారు బొమ్మలా ఉంది. అందుకేనేమొ! సిద్ధులు ఆ తరువాత బంగారమ్మ అని పిలుచుకున్నాడు.

సిద్ధులు కిలాంటివి అనుభవంలో లేవనికాదు. ఉన్నాయి.


రెండేళ్ళ క్రితంలో ఆయా వయసుల ఆడవాళ్ళు, చిత్త చాపల్యానికి లోనయి, అదును చూసుకొని, ఆకర్షించడానికి యత్నించారు కొందరు. సిగ్గు యెగ్గు, బుగ్గిలో కలిపి మనసులోని మాటను తెలిపి, ప్రాధేయ పడ్డారు మరికొందరు. అయినా సిద్ధులు ఎవరికీ లొంగిపోలేదు.

కారణం?

కట్టుకున్న పెళ్ళాం తనను కాదని ఎవరితో నో లేచి పోవడం. ఎంతో ప్రేమగా, ఆరాధనగా చూసుకున్నా భార్య మోసానికి గురయ్యాడు. అంత వరకూ ఆడవాళ్ళ పట్ల ఉన్న నమ్మకం పోయింది. బదులుగా అతనిలో విరక్తి విముఖత చోటు చేసుకున్నాయి.

దేవకన్యలాంటి చిన్నది ఎదురుగా కనిపిస్తుంటే ఏమి చేయాలో వెంటనే తోచక సందిగ్ధంలో పడి కొట్టు మిట్టాడ సాగాడు సిద్ధులు. అంటే పునరాలోచనలో పడ్డాడన్న మాట!

అతనిలో ఎలాంటి స్పందన లేక పోవడంతో అటు నుండి వెళ్ళిపోయింది. అలా అని తన యత్నాన్ని మానుకోలేదు.



మూడవ నాటి మధ్య రాత్రి-

“నువ్వెవరో తెలియదు. గుడిసె ముందుకు వచ్చి లోపలికి రావు. ఎందుకని?” అని అడిగాడు సిద్ధులు.

“ఇంటి ముందుకు వచ్చిన దాన్ని లోపలికి రమ్మంది

రానా? సందేహ మెందుకు?" అంది ఆ బంగారు బొమ్మ.

"ఒకసారి మోసపోయాను. మరోసారి మోస పోతానేమో నని భయం. నాతో చచ్చేదాకా ఉండాలని ఉంటేరా." అని రెండు చేతులు ముందుకు చాచి, రెండడుగులు ముందుకేశాడు సిద్ధులు.

ఆ పైడి బొమ్మ ఆనంద పారవశ్యంతో చెంగున ఒక గెంతు గెంతి, సిద్ధులు బాహువుల్లో చేరిపోయి, "నువ్వు మనసు పడ్డంత కాలం నిన్నొదిలి పోను. నీతో నే ఉంటా" తన్మయురాలై అంది.

★ ★ ★ ★ ★ ★ ★

ఆగంతకు డిచ్చిన నిప్పును నడుము కట్టులో పదిల పరచుకొని, గుడిసెకు దారి తీసాడు సిద్ధులు.

గుడిసెలోకి వచ్చినా, తనను గమనించని బంగారమ్మతో "బంగారం! ఏందే చిన్న బోయింది నీ ముఖం?" అని అడిగాడు.

ఆ పలుకరింపుతో బంగారమ్మ ఉలికిపడి లేచింది.

"ఏం లేదు. కడుక్కొని రాండి తిందురు." అంది.

"ఆకలి లేదే. నువ్వు తిను."

"ఏమిటో పగలు తిన్నది తిన్నట్లే ఉంది." అని పక్క పరిచి పసివాణ్ణి పక్కలో వేసుకుంది.

సిద్ధులు ఆమె పక్కనే పండుకొని, కండ్లు మూసుకొని, నిద్రకుపక్రమించినట్లు ఆవలింత తీసాడు.

బంగారమ్మలో దిగులు ఆకాశం నిండా మబ్బులు

గుప్పిట్లో నిప్పులు

క్రమ్ముకున్నట్లయింది. ఎంత ఆలోచించినా ఎటూ తోచని స్థితిలో చిక్కుకుంది. చివరికి ఏమయితే అదే అవుతుందిలే అనే నిర్ణయానికి వచ్చింది. దీపాన్ని ఆర్పేసే ముందు సిద్ధులు వైపు తిరిగి, కుడిచేతిని పై నుండి కిందికి దిగదూడ్చినట్లు ముఖం మీద కదిలించింది. ఆ తరువాత దీపం తట్టు ముఖం తిప్పింది.

బంగారమ్మ కాస్త నోరు తెరిచింది. నోట్లోంచి నాలుక క్రమంగా ముందుకు సాగుతూ పోయి దీపాన్ని ఆర్పేసింది. ఆనక నాలుక యధావిధిగా కుదించుక పోయింది. కండ్లు మూసుకొని నిద్రకుపక్రమించింది.

బంగారమ్మ నిద్రాదేవి కరుణా కటాక్షాలకు లోనయిన తీరుగా ఆమె శరీర పరిమాణం మూడవ వంతు పెరిగింది. పసిమి ఛాయ దేహం పోయి, మసిబారి నట్లయింది. తల వెంట్రుకలు ఎలుగుబంటి బొచ్చులా మారాయి. కనుగ్రుడ్లు పైకి ఉబికి పోయాయి. కోరపండ్లు, చేతి గోళ్ళు అంగుళం మేర ముందు కొచ్చాయి. శ్వాసక్రియ లయబద్ధంగా వినిపిస్తుంది. గుర్రు సంగతి ఏం చెప్పేది?

ఇదంతా ఓ కంట కనిపెట్టిన సిద్ధులు గుండె దడ హెచ్చయి పోయింది. భయంతో ఒంటి నిండా చెమట పట్టింది. చడీ చప్పుడూ గాకుండా గుడిసె లోంచి బయట పడ్డాడు. క్షణం వృథా చేయకుండా ఊళ్ళో పడేదాకా కాళ్ళకు బుద్ధి చెప్పాడు.

★ ★ ★ ★ ★ ★ ★

పొద్దు పొడువక ముందు, ఇంకా మబ్బు మబ్బుగా ఉండగా బంగారమ్మ నిద్రలేచింది. పక్కన సిద్ధులు కనిపించలేదు. నెత్తి మీద పిడుగు పడ్డట్లు తోచింది. తన నిజ రూపం సిద్ధులు కంట బడ్డట్లు గ్రహించింది. తన పట్ల అసహ్యం కలిగి వెళ్ళి పోయి ఉంటాడు. ఇక తాను తప్పుకోక తప్పదనుకుంది.

★ ★ ★ ★ ★ ★ ★

సిద్ధులు ఆగంతకుని రాకకై నిరీక్షిస్తున్నాడు.

అంతలో గజ్జెల శబ్దం సమీపిస్తున్నట్లు వినిపించి అటు చూశాడు.

బంగారమ్మ వస్తోంది. ఒంటరిగా కాదు. జంటగా ఆగంతకునితో కలిసి వస్తోంది.

సిద్ధులు చూపులు ఆశ్చర్య సంకేతాలయ్యాయి!

"ఈయన నా మొగుడు. ఎవతి ఆకర్షణలో నో పడి నన్నొదిలి పోయాడు. మనసు మళ్ళి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. నేను వెళ్ళి పోతున్నాను. నీకు మోసం చేయడం లేదు. ఒక ఏడాది పాటు కలిసి ఉన్నందుకు ఒక పిల్లాడిని కన్నాను. వాణ్ణి కన్నది నేనైనా వాడు నీ కొడుకే. కంటికి రెప్పలా చూసుకో" అని బంగారమ్మ ముందుకు కదిలింది. ఆగంతకుడామె ననుసరించాడు.

సిద్ధులు బాయి గడ్డమీది గుడిసెకేసి పరుగు దీసాడు. ●

ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

జి.వి. రావు- సికింద్రాబాదు

డిప్లొమసీ అంటే ఏమిటి కె.రా. గారూ?

*వైయింగ్ ఇన్ స్టేట్?!

పి. వెంకటేష్, గద్వాల

నేను ప్రేమించిన అమ్మాయి నన్ను ప్రేమించకపోతే ?

* బెడద తప్పిందని వూరుకోవాలి!

ఆర్.పి. వెంకటేశ్వరులు, ప్రొద్దుటూరు

ప్రేమించి పెళ్లి చేసుకుంటే జీవితం సుఖమయమా? లేక తల్లితండ్రులు చేసిన పెళ్లివలన జీవితం సుఖమా?

* ధైర్యం పట్టుదల ఓర్పు లేనివారికి - రెండోదే సుఖం. వికటిస్తే తిట్టుకుని బాధ్యత వాళ్లమీదికి నెట్టవచ్చు. చూడండి- ఏ జీవితం పూర్తిగా సుఖమయంకాదు. వైవాహిక జీవితం ఇలా వుంటుందనిగానీ, ఈ విధంగా వుండాలని గాని ఎవరూ నిర్దేశించి చెప్పలేరు. ఎవరి బాధ వారిదే, ఎవరి సుఖం వారిదే.

వి.ఎల్. దేవి, కాకినాడ

కవిత్వాన్ని మీరెలా నిర్వచిస్తారు?

* ఫైత్ అన్నా అనవచ్చు.

తనకోసం పాడుకుంటున్న భాష అన్నా అనవచ్చు.

ఎవరి పిచ్చి వారి కానందం అన్నా అనవచ్చు. కవితకి నిర్వచనం- అనవసరం.

మర్రి భాస్కర్, మెట్ పల్లి

నేడు వస్తున్న సినిమాలపై మీ అభిప్రాయం? ఆన్సర్ ప్లీజ్.

* ఎస్సార్. (ఎన్నిమార్కుల ప్రశ్నో?!) ప్రేక్షకాభిరుచికి తగినవి వస్తున్నాయి - అనుకుందాం.

మనం ఎవరిని విశ్వసిస్తామో ఎవరిని అభిమానిస్తామో వారిని అనుకరించడం స్వార్థం సంకుచితం అవుతుందా!

* కాదు - అనుకరణకి మించిన పొగడ్త లేదంటారు అందుకే. కాని ఒక్కటి మరిచిపోకూడదు - నిజమైన అభిమానం అలాంటి అనుకరణను దాటి పెరుగుతుంది.

కొంచాడు మల్లేశ్వరరావు, కాశీబుగ్గ

రామలక్ష్మిగారూ నాకు చిరంజీవి అంటే యిష్టం మరి మీకెవరంటే యిష్టం?

* ఎవరన్నా యిష్టమే. ఎవరన్నా యిష్టం లేదు. ఈ పద్ధతి సేఫ్. లేకుంటే వారి అభిమానులో- వీరి అభిమానులో నామీద అనవసరంగా దాడి చేస్తారు. ఎందుకొచ్చిన బెడద ?

కూడంపూడి ప్రభాకరరావు, సత్తుపల్లి

నేడు వస్తున్న నవలలు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి. కె.రా. గారూ?

* చేసుకున్నవాడికి చేసుకున్నంత అంటారు- వాటిని ఉపయోగించుకుంటున్న వాళ్లకవి ఫలితాలనిస్తూనే వున్నాయి కద. ప్రతి నవలా ప్రతి మనిషిని ఒకేలా మంచివాడినో చెడ్డవాడినో చెయ్యదు కద!

మల్లారెడ్డి నాగేంద్రకుమార్, భిలాస్పూరు

నేటి యువత పెద్ద చదువులు చదివి ఉద్యోగం దొరక్క నిరుద్యోగ రక్కసి కోరలకి బలి అవుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వమా? చదివిన చదువులా ?

* కర్ణుడి చావుకిలాగా యువత వైఫల్యానికి కారణాలనేకం? ఏ ఒక్కటీకాదు. చదువు-చదువుకిమించిన అత్యాశ ఉద్యోగం-ఉద్యోగంలో కిందమెట్టు నుంచి ఒక్కసారి పై మెట్టు ఎక్కేయాలని తపన- ఉద్యోగం అంటే- జీవితానికి పని చేయడమేననీ - ఎలాగా జీతం చాలదు కనుక ఆ 'సీటు' వల్ల రాబట్టకల్గినది లాగించేద్దామన్న అడ్డదారి కోరికలు ఎన్నని చెప్పడం?... ఇంకా యిప్పుడిప్పుడు కుర్రాళ్లు కాస్త కళ్లు తెరుస్తున్నారు... వృత్తి విద్యలపట్ల వ్యాపారంపట్ల-ఇతర రంగాలపట్ల కాస్తైనా కుతూహలం కనబరుస్తున్నారు... ఇదీ బాగుపడడానికి - దారి.

మీకు మేం పంపిన ప్రశ్నలకి జవాబులివ్వడం తప్పించి- వేరే పనిలేదా మీకు ?

* ఉంది-అంట్లు తోమడం, బట్టలు ఉతకడం, బూజులు దులపడం, పుస్తకాలని దులిపి మందువేయడం-కుక్కకి టిక్కులు తీసి స్నానం చేయించడం - ఏ వి.ఏ.కె. రంగారావు వంటివారో వచ్చి వాలితే - అరవడం-చాలా పనులు చేస్తాను. కాని వృత్తి-ఒక్కటే-రచన. దాన్లో ప్రశ్నావళి ఒకటే- నాకిష్టమైన పని.

పెద్దింటి సీతారామ్, కోరుకొండ

ఈ మధ్య ఒక డాక్టరుగారు ఆడవాళ్ళకు గుండె జబ్బు రాదు గాని మగవాళ్లు వచ్చేలా చేస్తారని చెప్పారు. నిజమేనంటారా?

*రచయిత డాక్టరేంటి అంత కవి హృదయం ప్రదర్శించారు! మగాళ్లు తెప్పించక పోయినా-ఆడవాళ్లు-ప్రతివిషయంలో అంతర్ముఖులై తమలో తామే ఘర్షణ పడిపోయి- గుండె నొప్పి కాదు-రకరకాల తలనొప్పిలు కొని తెచ్చుకుంటుంటారు. మనస్సులో మధనపడే కంటే-మనసు విప్పి మాట్లాడి-సమస్యలు పరిష్కరించుకోడం అలవాటు చేసుకుంటే పోయి. (చెప్పడం సులభమే- చేయడం కష్టం-'ఆట్టేవాగితే తంతా' నంటారు మా ఆయన అందో యిల్లాలు!)

సి. వెంకట శేషఫణి, ఎమ్మిగనూరు


నేటి విద్యావిధానంపై మీ అభిప్రాయం ఏమిటి?

*అర్థం పర్థం లేని సిలబస్. అంతకంటే అర్థంపర్థం లేని-పాఠ్య భాగాలు- అందుకే పిల్లలు గైడ్లనే నమ్ముకుంటున్నారు!

O



సీరియల్
సూపర్ హీరో



మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

"నమస్కారం. నేను గోపాలరావుని."

కరంచంద్ గాంధీ మెదడు వెంటనే చురుకుగా పని చేయసాగింది.

"గోపాలరావు గారంటే...?"

"నిన్నటి వరకు క్లాస్‌వన్ కాంట్రాక్టర్ని. క్రిష్ణ మీద గోదావరి మీద కట్టిన బ్రిడ్జిలు నావే! ప్రస్తుతం ఎలక్షన్స్‌లో పోటీ చేస్తున్నాను. గెలిస్తే ఎం.పి. నవుతాను."

"అది సరే! మీరు ఫిల్మ్‌స్టార్ విజయేంద్ర తండ్రి కదా!" అన్నాడు గాంధీ కుతూహలంగా.

'అదెప్పుడో ఒన్సపానేటైమ్! ఇప్పుడు వాడికీ నాకూ మధ్య పచ్చగడ్డి కాదు కదా ఫ్రిజ్‌లో నీళ్ళు పోసినా పెట్రోల్లా మండుతుంది." అన్నాడు గోపాలరావు అక్కసుగా.

కరంచంద్ గాంధీ ఓ క్షణం సాలోచనగా పైకి చూసి "మరి పబ్లిసిటీలో మీ అబ్బాయి మీ తరఫున ప్రచారం చేస్తున్నట్టుగా వున్న వాల్ పోస్టర్లు...." అన్నాడు.

"మీరీరోజు పేపర్లు చూడలేదా?" అంటూ ఎదురు ప్రశ్నించేడు గోపాలరావు.

"డీటైల్స్‌గా చదివే తీరిక ఏది? రాత్రి ముఖ్యమంత్రి మీటింగ్‌లో రాళ్ళు వేసేరని ఒకటే రాద్ధాంతం. ఏదొచ్చినా మా పోలీస్ డిపార్టుమెంటుకేగా! ఏవో హెడ్ లైన్స్ చూసి వదిలేసేను."

"అందుకే మీరు గమనించి వుండరు. రెండో పేజీలో ఈ రోజు వచ్చిన అన్ని దినపత్రికల్లో దగ్రేట్ హీరోగారిచ్చిన స్టేట్‌మెంటు వుంది. చదవండి" అన్నాడు గోపాలరావ్ కసిగా.

"అంత తీరిక లేదు. మీరు చెప్పండి. నేను త్వరగా హోమ్ మినిష్టరు గారితో మీటింగ్‌కి ఎటెండ్ కావాలి!" అన్నాడు గాంధీ టైము చూసుకొంటూ.

"నిజమే. మీ కాలం విలువైంది. అందుకే నేనసలు విషయంలోకి వచ్చేస్తున్నాను. నిన్న ప్రెస్ మీట్ పెట్టి తను ఏ పార్టీ మనిషిని కాదని... నాకు, తనకు ఎట్టి సంబంధం లేదని తనని ప్రచారంగా వాడుకొంటున్నందుకు నేను క్షమాపణ చెప్పాలని స్టేట్‌మెంటు ఇచ్చేడు. నిజానికి ఆ విషయమంత పెద్దది కాదు. వాడి వెనుక చేరి ఆడించే మనిషెవరో నాకు తెలుసు. కాకపోతే తమకో విషయం అసలు తెలుసా లేదా, తెలిసే ఉపేక్షిస్తున్నారా అన్నది నా బాధ!"

"ఏంటది?" గాంధీ కంఠస్వరం కరకుగా ధ్వనించింది.

ఓ క్షణం విషయం చెప్పడానికి గోపాలరావు కూడ తటపటాయించేడు.

"మరేం లేదు. ఇలా చెబుతున్నందుకు అన్యథా భావించకండి. తమ చిన్నమ్మాయి గారు చిన్న పిల్ల. అమాయకురాలు. ఆమెగార్ని వీడు వెంట తిప్పుకుంటున్నాడని మొన్న మద్రాసు కూడ వెళ్ళొచ్చేరని తెలిసింది. మీకు తెలిస్తే ఫర్వాలేదు. ఎందుకైనా మంచిదని చెబుతున్నాను. వాడు సినిమానటుడు. పైగా...."

"నాకు మా అమ్మాయి బాగోగులు బాగా తెలుసు. మద్రాసు నేనే పంపించేను. బైదబై నేనొక పోలీసాఫీసర్నని మీరు మరచి పోకండి" అంటూ ఠక్కున ఫోను పెట్టేసేడు గాంధీ.

అతను ఫుల్ యూనీఫామ్‌లో వున్నాడు. మీటింగ్‌కి బయల్దేరడానికి బయట కారు సిద్ధంగా వుంది.

అతనికి కాఫీ స్వయంగా తెచ్చిన సుందరమ్మ అతని మొహం చూసి ఒక్క క్షణం భయపడింది.

అతను భార్య వైపదోలా చూసి "బేబీ ఇంట్లో వుందా?" అనడిగేడు.

ఆమె ఉన్నదన్నట్టు తల పంకించింది.

అతను మరో క్షణంలో మొహం లోని నరాలన్నిటినీ అదుపు లోకి తెచ్చుకొని "ఇంట్లోనే వుంటే పాపం బోర్ కదూ, ఇద్దరూ కలిసి రాజన్నగారింటికి వెళ్ళిరండి" అన్నాడు.

ఆమె సంభ్రమంగా భర్త మొహం లోకి చూసింది.

"నేనెందుకు లెండి. బేబీని పంపిస్తాను. రజనితో కాస్సేపు కాలక్షేపం చేసొస్తుంది" అంది సుందరమ్మ.

"నీ ఇష్టం" అని బయటకి నడుస్తున్న భర్త వైపు ఇంకా అనుమానంగానే చూసింది సుందరమ్మ.

* * * * * * * *

ఎలక్షన్ల తంతు ముగిసింది. రాయుడు కొద్దిపాటి మెజారిటీతో గెలిస్తే గోపాలరావు కొద్దిపాటి మైనారిటీతో ఓడి పోయేడు. తిరిగి పాత ముఖ్యమంత్రే ఆ పదవి నలంకరించేడు. రాయుడికి హోం మినిష్టరు పదవి దక్కడంతో సుధీర్ బ్రహ్మానంద పడి పోయేడు. మద్రాసు నుండి పది మంది మోసుకు రాగల పూలదండ తెప్పించి రాయుడి మెడలో వేసి సాష్టాంగ పడిపోయేడు సుధీర్. ఆ ఫోటో ని అన్ని పత్రికలూ ప్రముఖంగా ప్రచురించేయి.

ఆ ఫోటో చూసి ఏ ఎండకా గొడుగు పట్టగల సమర్థుడని ఇండస్ట్రీ అంతా పరిహాసంగా చెప్పుకొంది.

దమయంతికి తల కొట్టేసినట్లనిపించింది.

సుధీర్ మనస్తత్వం కొంతగా ఆమె గ్రహించి

<u>ఇంతవరకూ సాగినకథ - 12:</u> కాంట్రాక్టరు గోపాలరావుతో వివాహమై మనస్పర్థలు కారణంగా విడిపోయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిఖిలేశ్వరి అనతి కాలంలోనే బిజీ హీరో అయిన తన కొడుకు విజయేంద్ర విజయావకాశాలను చూసి మురిసిపోతుంటుంది. కుటుంబ పోషణాభారం మీదపడి నటిగా మారిన దమయంతి- సుధీర్‌కు సినిమా ఛాన్సు యిప్పిస్తుంది. సుధీర్- దమయంతిల హృదయాలు దగ్గరవుతాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న గోపాలరావు కొడుకు విజయేంద్రను తన తరఫున ప్రచారంచేయమని అడగ్గా అందుకు తిరస్కరిస్తాడు.

నప్పటికీ మరీ ఇంత దిగజారుడుగా కాళ్ళ మీద పడ్తాడని ఆమె ఊహించ లేదు.

వెంటనే సుధీర్‌కి ఫోన్ చేసింది.

సుధీర్ ఆమెకన్నా తెలివైన వాడు. అందుకే వెంటనే రిసీవర్ అందుకొని "హలో డార్లింగ్! నిన్ను చూడటాని కిప్పుడే బయల్దేర బోతున్నాను. అంతలోనే ఫోనొచ్చింది. వారం రోజుల్లో మంచి ముహూర్తా లున్నాయట! పెళ్ళి ఎక్కడ చేసుకోవడానికి నిర్ణయించేవ్! ఇక్కడా, తిరుపతి లోనా! ఎక్కడయినా ఫర్వాలేదు. మన పెళ్ళికి కాబినెట్ అంతా వస్తుంది. రాయుడు మన మనిషి. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తాను. అద్సరే! మంగళ సూత్రాలు రెడి అయ్యాయా?" అంటూ ఆమెని ఊదర గొట్టేసేడు.

రాయుడు కాళ్ళు పట్టుకొన్నందుకు తల వాచేలా తిడదామనుకొన్న దమయంతి ఆ విషయమే మరచి పోయింది.

"అన్నీ రెడీయే! పెళ్ళికొడుకు కోసం మాత్రమే ఎదురు చూస్తున్నాను" అంది నవ్వుతూ.

"ఒక్క క్షణంలో నీ ముందు వాలతాను" అన్నాడు సుధీర్ రిసీవర్ని క్రెడిల్ చేస్తూ.

వెంటనే మళ్ళీ ఫోను మోగింది.

సుధీర్ తిరిగి రిసీవర్ అందుకొన్నాడు.

"హలో! సుధీర్ గారా! నేను హోమ్ మినిస్టరు గారి పి. ఏ. ని మాట్లాడు తున్నాను. వెంటనే మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మంటున్నార్ సార్!" అని ఫోను పెట్టేసేడు పి. ఏ.

సుధీర్ గబగబా తయారయి హోం మినిస్టర్ ఇల్లు చేరుకున్నాడు. తనొచ్చిన విషయం లోనికి కబురు చేయగానే వెంటనే లోనికి రమ్మని కబురొచ్చింది.

అంతసేపు రాయుడితో మాట్లాడుతున్న పోలీసాఫీసర్లందరూ బయటకి నడిచేరు.

సుధీర్ రాయుడి వైపు చూశాడు.

రాయుడి రూపం పూర్తిగా మారి పోయింది.

అతనిలో రాచఠీవి తొంగిచూస్తోంది. కట్టింది ఖద్దరు పంచయినా నవరత్న ఖచిత మైనట్లు భాసిస్తోంది. పదవిలో ఎంత గ్లామరుందో మొదటిసారిగా అర్థమయ్యింది సుధీర్‌కి.

వెంటనే అసంకల్పితంగానే చేతులు జోడించి "పిలిచేరట సర్!" అన్నాడు.

రాయుడు గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాల్లోంచి కళ్ళతోనే నవ్వి "కూర్చో" అన్నాడు.

సుధీర్ కూర్చున్నాడు.

"నీకో పెళ్ళి సంబంధం వచ్చిందోయ్!" అన్నాడు



రాయుడు ఉపోద్ఘాతంగా.

సుధీర్ విద్యుద్ఘాతం తగిలినట్టు బిగుసుకొని "నేను.... నేను.... దమయంతిని చేసుకోవాలని ముందే నిర్ణయించు కున్నాను" అన్నాడు.

బదులుగా రాయుడు పకపకా నవ్వి "దీన్నే రాత రాజ్యాలేలు తానంటే బుద్ధి బురదలో కీర్త్వట మంటారు. స్వయాన నా చెల్లెలి కూతురు నిన్ను ఎలక్షన్స్‌లో నాతో పాటు తిరుగుతుండగా చూసిందట. అప్పటి నుండి నిన్ను తప్ప మరొకణ్ణి మనువాడనని పట్టుబట్టి కూర్చుంది. వంద ఎకరాలకి అది ఏకైక వారసురాలు. సిటీలో రెండు, ఊటీలో ఒకటి, మద్రాసులో మూడు కొంపలున్నాయి దానికి. కొంపలంటే ఏ నాలుగ్గదులో అనుకోగలవు. ఒక్కోటి కొత్వోరంత! బంగారం సంగతి నేనింక చెప్పఖ్ఖర్లేదు. మా బావకి పలుకుబడి కూడ బాగానే వుంది. ఇక ఈ అయిదు సంవత్సరాలూ నీకు ప్రభుత్వంలో పనులు చూడటానికి నేనున్నాను. పిల్లకి ఏ కాలు వంకరా లేదు. కాక పోతే చిన్న తప్పొకటి చేసింది. అది నీ దగ్గర దాచనవసరం లేదు. ఇంట్లో ఒక్కర్తేగా వున్నప్పుడు వయసులో వున్న ఆ డ్రైవర్ వెధవ పురిగొల్పితే తొందర పడింది. వెంటనే అబార్షన్ చేయించేసే మనుకో. దీన్ని నువ్వు తప్పుగా పట్టుకోవనే నేననుకుంటున్నాను. ఏమంటావ్?" అన్నాడు రాయుడు గుక్క తిప్పుకోకుండా.

సుధీర్ అవాక్కయి పోయేడు.

ఏం జవాబు చెప్పడానికి నోరు పెగలని పరిస్థితిలో వున్న సుధీర్ వైపు రాయుడు నవ్వుతూ చూసి "ఏం మాట్లాడవు?" అన్నాడు.

"కాని.... దమయంతికి నేను మాటిచ్చేను సర్! పెళ్ళికి ముహూర్తం కూడ...."

"నీ పిచ్చి కూల! ఎంతసేపూ అదే మాట! సినిమా ఛాన్సుల కోసం మంచాలు మార్చిన ఆ పతివ్రతే నీక్కావాల్సొచ్చిందయ్యా! నా మటుకు నేను చెప్పకూడదు గాని.... అది నా దగ్గరకి కూడ....! ఇంకెందుకులే! పైగా దాన్ని చేసుకొని ఏం

సూపర్ హీరో

బావుకుంటావు! అదొక కొరకరాని కొయ్య! నీ మాట నెగ్గనిస్తుందా! మాటంటావా! వాటికో నిలకడ ఏముందయ్యా! నాలుక అడ్డం తిప్పితే మాటల్లా గీటయి పోతుంది. వెనుక నేనున్నాను కదా కథ నడిపించడానికి!" అన్నాడు రాయుడు భరోసాగా.

సుధీర్ ఆలోచనలో పడ్డాడు. 'ఒక చిన్న తప్పు చేసినా ఇంత ఐశ్వర్యం తనకి జన్మలెత్తినా లభిస్తుందా! మెల్లగా రాయుణ్ణి కాకాపడితే ఏ రాజ్యసభ మెంబరో చేసేస్తాడు. ఒక్కసారిగా తనని పదవి, పలుకుబడి, ఐశ్వర్యం వరిస్తాయి. ఈ విజయేంద్ర ల్లాంటి వాళ్ళందర్నీ హైజంప్ చేసినట్టు దాటేసి పై అంతస్తు ఎక్కేయచ్చు. పైగా శీలానికి గుర్తేముంది నమ్మకం తప్ప! ఈ దమయంతి వేషాలకోసం చెడివుండదన్న నమ్మకం ఎక్కడిది!

'దమయంతికి ఏం చెప్పాలా అని ఆలోచనలో పడుతున్నావు కదూ!' రాయుడు అతని మనసు కనిపెట్టినట్టు అడిగేడు.

"అవున్సార్!" అన్నాడు సుధీర్ వినయంగా. రాయుడు లేచి నిలబడి అతని దగ్గరగా వచ్చేడు.

"అయితే మా వరలక్ష్మితో పెళ్ళికి ఒప్పుకున్నట్టేగా!"

సుధీర్ తల దించుకొని అవునన్నట్టుగా తల పంకించేడు.

రాయుడు ఆనందంగా అతని భుజం చరచి "పథకం నేను తయారు చేస్తాను. దాని ప్రకారం నడపటమే నీ పని!" అన్నాడు.

సుదీర్ అతనికి నమస్కరించి బయటకి వచ్చేడు.

19

"రేపే మన పెళ్ళి!"

కరుణాకర్ ఒడిలో గువ్వలా ఒదిగి పోయి వున్న రజని ఉలిక్కిపడి లేచి "అమ్మో!" అంది భయంగా.

బదులుగా కరుణాకర్ పకపకా నవ్వి "పెళ్ళంటే ఎవరైనా సంబరపడి గంతులేస్తారు కాని ఇలా



గుండెలు బాదుకోరు. ఇంతకీ భయం దేనికి?" అన్నాడు.

అయినా రజని కళ్ళు భయంతో రెపరెప లాడేయి.

"మా నాన్న సంగతి నీకు తెలీదు. ఆయన ఛండశాసనుడు. మనల్ని తుపాకీ పెట్టి పిట్టల్లా కాల్చేస్తాడు" అంది రజని.


"మీ నాన్న సంగతి నీ కన్నా నాకు బాగా తెలుసు. మీ నాన్న ఈ దేశంలో వున్న కోటీశ్వరుల్లో ఒకడు. ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని కమాండ్ చేయగల సమర్థుడు. అయినా నువ్వంటే అతనికి చాల ప్రేమ. నీ కోసం ఏదయినా చేయగలడు. అతను మనల్ని ఛస్తే చంపలేడు."

రజని అతని వైపు వింతగా చూసి "ఈ విషయాలన్నీ ఎలా సేకరించేవు?" అనడిగింది.

"కరుణాకర్ ద గ్రేట్ అంటే నువ్వు చాల తక్కువగా అంచనా వేస్తున్నావు. అయినా అందులో నీ తప్పేం లేదులే! ఎంత మంది జాతకాలో చెప్పగల ఆయన నా గీతల అర్థాలు ఈ రోజుకి కొరుకుడు పడక తల గోక్కుంటున్నాడు. మొత్తానికి నాకు నా భార్య వలన రాజయోగం వున్న మాట నిజమని తెలిసిందాయనకి." అన్నాడు కరుణాకర్ భుజాలెగరేస్తూ.

రజని చిన్నగా నవ్వి "మరి మా నాన్నకి నేనంటే చాల ఇష్ట మయినప్పుడు మనం దొంగ చాటుగా ఎందుకు పెళ్ళి చేసుకోవడం! హాయిగా చెప్పి ఆయన చేతుల మీదనే చేసుకోవచ్చుగా!" అంది.

"అక్కడే నీ ఆలోచనలు దెబ్బతిన్నాయి. మీ నాన్నకి నేనల్లుణ్ణి కావడ మొక్కటే నాకు ముఖ్యం కాదు. మీ నాన్న ఆస్తికి అర్జెంటుగా వారసుణ్ణి కావాలి! సారా కాంట్రాక్టర్ రాజన్న, కింగ్ మేకర్ రాజన్న పేరు కన్నా నా పేరు ప్రసిద్ధం కావాలి!"



పిట్టల వేట!

కీర్తిశేషులు ఎస్. వి. రంగారావు, రేలంగి వెంకట్రామయ్యలు చిత్రసీమలో ప్రవేశించకముందు నుంచి స్నేహితులే. వారిరువురు కాకినాడ "యంగ్ మెన్స్ క్లబ్" సభ్యులు.

"ఒరే" అని ఒకరినొకరు సంబోధించుకునే వారు.

ఒకసారి ఏదో తెలుగు చిత్రం శతదినోత్సవాలకు ఆంధ్రదేశంలో కొన్ని పట్టణాలకు వెళ్ళారు. ఆ సందర్భంలో విశాఖపట్టణం, అనకాపల్లికి కూడా వచ్చారు. ఇక్కడ పాత మిత్రుల ఇళ్ళకు వెళ్ళి కొంత సేపు గడిపాక, అనకాపల్లి దగ్గర 'కొండకర్ల ఆవ' దగ్గరకు రంగారావు, రేలంగి వేటకు వెళ్ళారు. రంగారావు కొట్టే అన్ని తుపాకీ దెబ్బలకు పిట్టలు నేలరాలు తున్నాయి. శ్రీ రేలంగికి గురి తప్పుతుండేవి.

"ఒరే రంగా! నీవు పిట్టల వేటలో ఘనుడివిరా! ఇలా గురిచూస్తే చాలు పిట్ట పడిపోతుంది." అన్నాడు తన సహజ హాస్య ధోరణిలో.

"మరేమనుకున్నావురా! నిన్ను వేటలో నా అంతటి వాణ్ని చేద్దామనేకద్రా తీసుకొచ్చింది" పగలబడి నవ్వుతూ శ్రీ రంగారావు అన్నార ట.

–సేకరణ "ఆరిపాక"



అన్నాడు కరుణాకర్ పట్టుదలగా.

రజని అతని వైపు అర్థం కానట్టు చూసి "ఇదంతా బాగానే వుంది కాని మా అన్నయ్య మాత్రం మంచాడు కాదు. వాడి కోపం వస్తే ఏం చేస్తాడో వాడికే తెలీదు" అంది.

"అంతదాక మీ నాన్న రానివ్వడు కాని రేపు సరిగ్గా ప్రొద్దుట ఏడు గంటలకి నువ్వు నీటుగా తయారయి శ్రీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి గుడికి వచ్చేయి. అన్ని ఏర్పాట్లూ జరిగి వుంటాయి. ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు" అన్నాడు కరుణాకర్.

"నాకు నిజంగా భయంగా వుంది కరుణా!" అంది రజని అతని గుండెలో ఒదిగి పోతూ.

"నేనున్నానుగా డియర్!" అన్నాడతను భరోసాగా.

రజని తల వూపి చీకటి పడటంతో చిన్నగా కదలి వెళ్ళిపోయింది.

* * * * * * * * *

దమయంతికి దిక్కు తోచడం లేదు.

లోలోపల ఏదో కంగారుగా భయంగా వుంది. ఎలక్షన్ కేన్వాసింగ్‌కి వెళ్ళే ముందు సుధీర్ చేసిన తొందరపాటు వలన తను తల్లినవుతానేమోనని ఆమె భయ పడుతూనే వుంది. ఆమె అనుకున్నంతా జరిగింది. ఇప్పుడేం చేయాలి? సుధీర్ ఈ మధ్యన తరచు రావడం తగ్గించేసేడు. ఫోనులో దొరకడం లేదు. మీటింగ్‌లో ఏం మాట్లాడాలన్నా వేయికళ్ళు నిశితంగా గమనిస్తుంటాయి. పైగా తామిద్దరూ కలిసి వున్న పిక్చర్స్ ఎక్కువ లేవు.

'సుధీర్ మారి పోయేడా!' అన్న ఆలోచన రాగానే ఆమె నిలువెల్లా వణికి పోయింది.

వెంటనే ఆమె అతనింటికి రింగ్ చేసింది.

ఆమె అదృష్టం కొద్దీ సుధీరే రిసీవర్ అందుకొని 'హలో!' అన్నాడు.

"సుధీర్! నేను దమయంతిని!" అందామె కంగారుగా.

"వ్వాట్ డార్లింగ్! ఏంటో కంగారుగా వున్నట్టున్నావు!" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

"నీకు నవ్వుగానే వుంటుంది. ఎలక్షన్స్ కాగానే మన పెళ్ళి అని చెప్పి తప్పించుకు తిరుగుతున్నావు. నేనసలే రుడిసి చస్తున్నాను" అంది దమయంతి ఏడుపు గొంతుతో.

సుధీర్ పక పకా నవ్వి "ధనాధన్ దమయంతి రుడుసు కోవడం దేనికి?" అన్నాడు వేళాకోళంగా.

"పరిహాసానికిది సమయం కాదు సుధీర్! నేను ఫోనులో చెప్పే విషయం కాదిది. నువ్వర్జంటుగా మా ఇంటికిరా! సంగతి చెబుతాను. ఇరవై నాలుగ్గంటల్లో మన పెళ్ళి జరిగి పోవాలి!" అంది దమయంతి.

"ఇటీజ్ హైలీ ఇంపాజిబుల్! నాకు డేట్స్ ఖాళీ లేవు."

ఆ మాట విని దమయంతి మండి పడి పోయింది.

"డేట్స్ ఖాళీ లేక పోవడానికిది మీటింగ్ కాదు. పెళ్ళి. మనసుంటే మూడు నిముషాలు చాలు!" అంది ఘాటుగా.

సుధీర్ ఒక నిముషం మౌనం వహించి "ఒక అరగంటాగి ఫోను చేస్తాను వెయిట్ చెయ్యి!" అన్నాడు.

దమయంతి నీరసంగా సోఫాకి జేరబడి కళ్ళు మూసుకొంది. మూసిన కన్నుల నుండి కన్నీళ్ళు ధారాపాతంగా జారి పోతున్నాయి.

తనకి తల్లి లేదు. ఉంటే స్త్రీగా ఆమె తన పరిస్థితిని అర్థం చేసుకొనేది! తన తొందర పాటుని మన్నించ గల్గేది! లాలించి తన కన్నీరు తుడవ గల్గేది. ఈ సినిమా ప్రపంచం ఒక మాయా జాలం! ఆ విష వలయంలో నిజం మాట్లాడటం ఒకతప్పు! నిజాయితీగా బ్రతకడం మరింత తప్పు! మనసు విప్పి మాట్లాడు కొనే స్నేహితులే వుండరు. సుధీర్ తన మీద ఎంత ప్రేమ నటించేడు! ఎంత వెంట బడి తన మనసు గెలుచుకొన్నాడు. తీరా తను అతనిదయ్యేక ఎంత మగబుద్ధి చూపిస్తున్నాడు. స్త్రీ పొందు కోసం మగవాడెంత మహానటుడవుతాడు. ఆ కాస్త తీరిపోయేక ఎంత నీచంగా ప్రవర్తిస్తాడు.

ఆమె ఆలోచనల నుండి ఫోను రింగింగ్ ఆమెను బయట పడేసింది.

ఆమె ఆత్రుతగా రిసీవర్ అందుకొంది.

"డోంట్ వర్రీ డార్లింగ్! మన పెళ్ళికి త్వరగానే ఏర్పాట్లు చేస్తాను. కాస్సేపు నిన్నేడిపించాలని అలా మాట్లాడేను. అద్సరే రేపు సాయింత్రం హోటల్ వినోదితకి రా! అక్కడ మన కోసం రూమ్ నెంబర్ వన్నాట్ వన్ బుక్కయి వుంటుంది. నువ్వు సరాసరి రూమ్‌కొస్తే మనం డీటైల్డ్‌గా అన్ని విషయాలూ మాట్లాడు కోవచ్చు" అన్నాడు సుధీర్.

దమయంతి సందేహంగా "హోటల్‌కి దేనికి సుధీర్! మా ఇంటికి రా లేదా నేను మీ ఇంటి కొస్తాను" అంది.

"నో! నో! ఆ జర్నలిస్టు రాగిణి మన ఇద్దరి మీద పెద్ద నిఘా వేసి వుంచింది. ఇప్పుడిప్పుడే పైకొస్తున్న మనం ఎల్లో మాగజైన్సుకి ఎక్కడం మంచి పనికాదు. మా ఇంట్లో మా బంధువులంతా వున్నారు" అన్నాడు సుధీర్ నచ్చచెబుతున్నట్టుగా.

"నా కెందుకో భయంగా వుంది. మనం కాస్తో కూస్తో జనంలో పేరున్న వాళ్ళం. హోటల్లో కలిస్తే గౌరవంగా ఉండదేమో. ఎవరైనా గుర్తుపడితే...?" అంది దమయంతి భయంగా.

"నీకా సందేహాలేం అక్కర్లేదు. రూమ్ మన ఇద్దరి

పేరునా ఉండదు. చీకటి పడ్డాక మేకప్ లేకుండా సాదా సీదాగా వున్న మనల్ని ఎవరూ గుర్తించరు. అందుకని వర్రీ లేకుండా వచ్చేసేయ్! ఆ పైన నేనున్నానుగా!" అన్నాడు సుధీర్ ప్రేమగా.

ఆ మాట విన్నాక ఆమెకు కొండంత ధైర్యం వచ్చేసింది.

అంతసేపూ సుధీర్ మీద ఏర్పడిన అపనమ్మకం వేడి సోకిన వెన్నలా కరిగి పోయింది.

"సరే! మరచి పోవుగా!" అంటూ రిసీవర్ క్రెడిల్ చేసింది.

* * * * * * *

ఇన్స్పెక్టర్ ముఖేష్ అందించిన డెయిరీ అందు కొన్నాడు గాంధీ.

అతను సాల్యూట్ చేసి "మరి నేను వెళ్ళి రానా సర్!" అన్నాడు.

గాంధీ తల పంకించేడు.

ముఖేష్ వెళ్ళగానే గాంధీ డెయిరీ తెరచి చూసేడు. తేదీలు గంటలు వారీగా పీయూష విజయేంద్రని ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ కలిసింది వివరంగా వ్రాసి వుంది అందులో.

ఆఖరి సారి నిన్న సాయింత్రం పీయూష అతన్ని వాళ్ళింట్లోనే కలుసు కొన్న దన్న విషయాన్ని చూడగానే అతని మనసు భగ్గుమంది. స్టేటంతా పోలీసాఫీసర్గా గజగజలాడించే తనని తన కడుపున చివరిసారిగా పుట్టిన ఒక ఆడపిల్ల ఖాతరు చేయడం లేదన్న విషయం అతను భరించ లేక పోతున్నాడు.

అతను కోపాన్ని దిగమింగు కోవడం కోసమా అన్నట్టు కొంత తడవు కళ్ళు మూసుకున్నాడు.

అయిదు నిముషాల తర్వాత అతను అతి

సూపర్ హీరో

శాంతంగా 'సుందరమ్మా!' అని పిలిచేరు భార్యని.

భర్త తనని అంత నెమ్మదిగా పిలవడం ఆమెకి క్రొత్తగా తోచింది. కొద్దిగా భయం కూడ వేసింది.

మెల్లిగా వచ్చి అతని పక్కనే వచ్చి నిలబడి "పిలిచేరా?" అంది వినయంగా.

"ఈ డెయిరీ చూడు!" అతను చేతిలోని పుస్తకం భార్యకి అందించేడు.

సుందరమ్మ వణుకుతున్న చేతులతో ఆ పుస్తకాన్ని అందుకొని "ఏంటిది, మీరే చెప్పండి!" అంది భయంగా.

"ఈ మధ్య నే నిచ్చిన స్వేచ్ఛని నీ కూతురెంత బాగా వినియోగించుకొందో పోలీసు వాళ్ళు సేకరించి తెచ్చిన సమాచారం!" అన్నాడతను సాధ్యమైనంత నెమ్మదిగానే. అయినా ఆ కంఠంలో అదుపు తప్పుతోన్న బాధ గమనించ గల్గింది సుందరమ్మ.

దండించడమే కాని బాధ పడటం ఎరుగని భర్తని చూస్తే ఆమెకు కొద్దిగా జాలికూడ వేసింది.

అయినా ఆమెకు భర్తని సముదాయించే స్థైర్యం కూడ లేదు. అందుకే మాటలు రాని బొమ్మలా నిలబడిపోయింది.

"నేను బేబీపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాను. భయపెట్టయినా దారికి తెచ్చుకోవాలనుకొన్నాను. చివరికి అదిలా నన్ను ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా ఆ సినిమా వాడితో...."

"డేడీ!"

ఆ పిలుపు విని గాంధీ ఆశ్చర్యంగా వెనుతిరిగి చూశారు. పీయూష నిలబడి వుందక్కడ.

ఆమె మొహంలో పూర్వపు భయం, తొట్రుపాటూ ఏమీ మచ్చుకైనా లేవు.

గాంధీ నిశ్చలంగా వున్న కూతుర్ని చూసి నిశ్చేష్టుడయ్యేడు.

"మీకు నన్ను విజయేంద్ర కిచ్చి వివాహం చెయ్యడం ఏ మాత్రం ఇష్టం లేదన్న నిజాన్ని నేను గ్రహించేను. నాకు కూడ అతన్ని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం ఏమాత్రమూ లేదన్న సంగతి కూడ మీరు తెలుసుకోవడం చాల మంచిది. మీరు మామా నాన్న మమ్మల్నివదిలేస్తే మా పెళ్ళి మేమే చేసుకుంటాం! తిరిగి మీకు కన్పించం!" అంది.

గాంధీ కళ్ళు పెద్దవయ్యేయి కూతురు మాటలకి. క్రమక్రమంగా ఆ కళ్ళనిండా ఎర్రటి జీరలు అలముకొన్నాయి.

సుందరమ్మ భయంగా భర్తవైపే చూస్తోంది.

గాంధీ గోడ దగ్గరగా వెళ్ళి అక్కడ తగిలించిన హంటర్ని అందుకొన్నాడు.

జరగ బోతున్న దేమిటో తెలిసినా ఏం చేయలేని నిస్సహాయురాలైన తల్లి, తెలిసినా తెగించి మొండి కేసిన కూతురు.... అలానే నిలబడి వున్నారు.

ఫలితంగా కొన్ని క్షణాల్లో అతని చేతిలోని హంటర్ పీయూష శరీరం మీద విలయతాండవం చేసింది.

కాస్సేపటికి పీయూష స్పృహ తప్పి నేల మీదకి జారిపోయింది.

గాంధీ చేతిలోని హంటర్ రెండు ముక్కలై క్రింద పడిపోయింది.

(ఇంకా వుంది)


మీనాక్షి పౌరాణిక దృష్టి

చిత్రాలు ఫ్లాప్ అవుతుంటే ఎవరికైనా వైరాగ్యం రావటం సహజమే. కాని



మీనాక్షిశేషాద్రిలో మాత్రం వైరాగ్యం మాటేమోగాని పౌరాణిక దృష్టి ఎక్కువయిందట, విశ్వామిత్ర చిత్రంలో నటించినప్పటి నుంచి. మేనకను ఎన్. టి. ఆర్. తన చిత్రంలో ఏ విధంగా ఎంపిక చేసుకున్నాడన్న విషయం అందరికీ తెలిసిందే.

'నాచే నాగిన్ గలీగలీ' అనే చిత్రంలో నితేష్ భరద్వాజ్ సరసన మీనాక్షి నటిస్తోందట. మే 28న విడుదల కాబోతున్న 'విశ్వామిత్ర' చిత్రాన్ని దాసరి నారాయణరావు నిర్మించిన 'విశ్వామిత్ర' సీరియల్తో పోల్చి చూసుకుంటున్నారు జనం. మరి ఆ సీరియల్లో నటించిన మేనక పాత్రధారి భానుప్రియను తలదన్నేలా మీనాక్షిశేషాద్రి నటించిం దేమోనని జనాలు చాలా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారట.



వేసవి విడిదిగా మారిన సూర్యదేవాలయం !

పూర్వ రాజులు వారి మతాభిమానానికి, దైవభక్తికి నిదర్శనంగా అద్భుతమైన శిల్పకళా సంపదతో అనేక సుందర దేవాలయాలు నిర్మించారు. అయితే, ఆ తర్వాత వచ్చిన ముస్లిం పాలకులు ఆ దేవాలయాలను కూలదోసి, వాటి శిథిలాలపై భవనాలను నిర్మించుకొని, ఆ భవనాలను విశ్రాంతి గృహాలుగా వాడుకున్న సంఘటనలు కూడా చరిత్రలో లేకపోలేదు. ఈ కోవకు చెందినదే మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ పట్టణానికి ఉత్తర దిశగా 9కిలోమీటర్ల దూరంలో షిప్రానది మధ్యలో గల ద్వీపంమీద నిర్మించబడిన కాలిదా భవనం.

క్రీస్తుశకం 1500 ప్రాంతంలో మాళ్వా ఖిల్జీ సుల్తానులలో మూడవవాడైన నజీర్‌షా ఇక్కడవున్న సూర్యదేవాలయాన్ని పడగొట్టి, దాని శిథిలాలపై కాలిదా భవనాన్ని నిర్మింపజేశాడు. సమశీతలీకరణ (ఎయిర్‌కండిషన్డ్) భవనంవలే ఎల్లప్పుడూ చల్లగా ఉండడం ఈ భవనం ప్రత్యేకత.

కాలిదా భవనం నిర్మాణంలో విశిష్టత ఏమిటంటే నదిలోని నీరు గొట్టాల ద్వారా వచ్చి భవనం క్రింది భాగాన ఉన్న నీటితొట్లలో పడి, అక్కడి నుండి 20 అడుగుల ఎత్తుగల రాతి పలకలమీదుగా ప్రవహించి తిరిగి నదిలో కలుస్తాయి. ఆ విధంగా నీరు ప్రవహించడంచేత నీటితో చల్లబడిన గాలి కెరటాలు ప్రక్క గదులలోకి వస్తాయి. గాలి కెరటాల ప్రవాహంవల్ల ఆ గదులు ఎయిర్ కూలర్ అమర్చిన గదులవలె చల్లగా ఉంటాయి.

మొగల్ పాదుషా అయిన అక్బర్ క్రీస్తుశకం 1599 జనవరి నెలలో ఈ భవనంలో కొంతకాలంపాటు విశ్రాంతి తీసుకున్నాడు. అటుపిమ్మట జహంగీర్ చక్రవర్తి గుజరాత్‌పై విజయం సాధించిన తర్వాత ఇక్కడికి వచ్చి ఈ భవనంలో కొన్ని నెలలు గడిపాడు.

మన దేశంతో వర్తక సంబంధాలను ఏర్పరచుకోడానికి ఇంగ్లాండు నుంచి వచ్చిన రాయబారి అయిన సర్ థామస్‌రో చల్లటి గాలి, ప్రశాంతమైన వాతావరణం కలిగిన ఈ భవనంలో 1617వ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ దాకా ఉండి ఈ భవనాన్ని గురించి వేనోళ్ల కొనియాడాడు. వేసవి కాలంలో ఖిల్జీసుల్తానులు ఈ భవనంలోనే చల్లటి గాలితో హాయిగా కాలం గడిపేవారు.

19వ శతాబ్దంలో పిండారీలు అనే దారిదోపిడి దొంగలు ఈ భవనాన్ని కొల్లగొట్టారు. 1920లో మహారాజ మాధవరావ్ సింధియా దీనికి మరమ్మత్తులు చేశారు. - డాక్టర్ వి.వి.సుబ్బారెడ్డి

మరుభూమి

నందమూరి తారక రామారావు

భిక్షపతి వచ్చేసరికి కరణం అప్పారావు ఆరుబయట వేపచెట్టు నీడన మంచంలో పడుకుని ఉన్నాడు.

"ఏంది కరణంగారూ ఇంకా పడుకున్నారూ ? వంట్లో గాని బాగోలేదా ఏంది ?" అన్నాడు భిక్షపతి అరుగుమీద చతికిలబడి.

కరణీకం, ఖరారావుడీ అయ్యాక కరణం అప్పారావుకు ఆదాయం పోయింది. పలుకుబడి పోయింది. బద్ధకం ఎక్కువైంది. నడుంనొప్పి, కాళ్లు నమిలినట్లు ఉండటం, పళ్లు సలపరింత, నిద్ర పట్టకపోవటం ఇలా ఒకదాని వెంట మరోటి రోగాలు పుంజుకుని, కరణాన్ని బందీని చేశాయి.

భిక్షపతి పిలుపుకు కళ్లు తెర్చి, "ఈడెందుకొచ్చాడు ? దొంగముండాకొడుక్కి నాతో పనిలేంది రాడే" అని అనుకుని, లేచి కూర్చుని, పెరుగుతున్న గడ్డాన్ని నివురుకుని, "ఊరక రారు మహాత్ములు" అన్నాడు నవ్వుతూనే.

భిక్షపతికి కరణం సంగతి తెలుసు. వేలు అందిస్తే, నడుమును ఉడుంలా పట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడనీ, వచ్చిన పని చెబితే కొండెక్కి బిగదీసుక్కుంటాడని.

భిక్షపతి ప్రభుత్వాన్ని తిట్టాడు.

"పీళ్లెమ్మ నాయాళ్లకు రాజకీయం తెలియదండీ ! ఎంతసేపటికీ ఉన్నవి ఊడబీకటం తప్ప. రద్దుల గవర్నమెంటండీ పంతులుగారూ ! ఏదీ ఈ పని మేం చేశామని గట్టిగా చెప్పమనండి ! అబ్బే, పైవాళ్లు ఇదో పథకం అంటే, దానికిపసుపు రంగు చొక్కా తొడిగి, ఇది మాదీ అంటారు. ఫీ దీనెమ్మ ప్రభుత్వం ! లాభం లేదండీ పంతులుగారూ ! నిజాయితీగా బ్రతికే నాబోటి వాళ్లకు, ఈ రాజకీయాలు కుదరవండీ ! అందుకే ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా ఇచ్చి, మీలాగా కృష్ణా రామా అంటూ వుందామనుకుంటున్నా" అని ఉపోద్ఘాతం చెప్పేశాడు భిక్షపతి.

కరణం అప్పారావు "అమ్మ భిక్షపతీ ! అధికార పార్టీని తిడుతున్నావంటే ఏదో పెద్ద ప్లానులోనే వున్నావన్నమాట !" అని అనుకుని "రాకరాక వచ్చావు ! ఏంటో సంగతి" అని అడిగాడు.

భిక్షపతి నవ్వాడు. అలా నవ్వాడంటే తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్న మాట. ఆ సంగతి కరణం కనిపెట్టాడు.

"ఏంది కరణంగారూ ! పనిలేంది మీకాడకు రాగూడదా ఏం? శానారోజులైంది, చూసిపోదామని వచ్చా ! అంతే !" భిక్షపతి చుట్టలు తీసి, కరణంగారికోటిచ్చి "లంకాకులెండి ! కాల్చండి !" అని తనోటి అంటించుకుని "ఏందోలే కరణంబాబూ ! రోజులు బాగోలేవు ! మనలాంటి పాతకాలం వాళ్లకు, అబ్బే గడ్డురోజులొచ్చాయి !" అన్నాడు.

కరణం చుట్ట కాల్చాడు. కాలుస్తూ ఆలోచన చేశాడు. భిక్షపతికి తనతో పనేమిటో ? అని.

భిక్షపతి చదివింది ఐదో తరగతే అయినా, మొదట్నుంచీ వ్యవహారాలు, డబ్బు సంపాదన, అది వీలుగాకపోతే, పలుకుబడి, పదవి వీటిపై శ్రద్ధ ఎక్కువ !

మతం పుచ్చుకుంటే కాలేజీలో, హాస్టల్లో సీటు ఉచితం అని కొడుకుల్ని మతంలో చేర్చాడు. వాళ్ల చదువులు అయి, ఉద్యోగాలకు మతం అడ్డొస్తుందని తెలుసుకొని, అబ్బె మతానికి నీళ్లొదిలి, హరిజన కోటాలో పిల్లలకు ఉద్యోగాలు అమర్చాడు.

కొన్నాళ్లు స్కూలు నడిపాడు. బీద విద్యార్థులకు హాస్టల్ నడిపాడు. రాజకీయాల్లో తిరిగి, కులపోళ్ల వోట్లేయిస్తానని పార్టీల దగ్గర డబ్బుచ్చుకుని, గెలిస్తే నా గొప్ప, ఓడితే "దొంగనాకొడుకులు ! తెలివి మీరారు. డబ్బు తీసుకుని ఓటెయ్యకుండా తిరుగుతున్నారు" అని చెప్పకు తిరిగేవాడు.

ఇలా భిక్షపతి గతాన్ని నెమరువేసుకుంటున్న కరణం అప్పారావు ఆలోచనకు భిక్షపతి, పిలుపు అంతరాయం కలిగించింది.

"ఏంది కరణంగారూ ! అమ్మాయి కాన్పుకొచ్చింది. పాలిచ్చే గేద ఎండిపోయింది. పాలకూ, మజ్జిగకూ ప్రాణంమీది కొచ్చిందని నాకు చెప్పకనేపోతిరే !"

"చెబితే ఏం లాభమయ్యా ! ఊరంతా పాలు అమ్ముకుంటున్నారు డైరి ఫారానికి ! నేనా డబ్బిచ్చి కొనలేను. పన్నేం చావమంటావు ?" అప్పారావు చుట్ట విసిరేసి, కాండ్రించి ఉమ్మాడు నిస్సహాయంగా.

భిక్షపతి నొచ్చుకున్నాడు "అరెరె ! అరెరె ! పంతులుగారూ నాకు హైదరాబాదు చుట్టూ తిరగటంతోటి తీరిక లేదండీ. ఊళ్లో కొచ్చినా అర్ధరాత్రి రావటం, కోడికూసేసరికి మళ్లీ తిరుగు ప్రయాణం చేయడం !" భిక్షపతికి ఆవేశం వచ్చింది. ఇంటి గుమ్మంకాడికి వెళ్లి -

"అమ్మగారూ ! ఆ తప్పేలా ఇలా ఇవ్వండి ! మాకు పాడిగేదెలు రెండున్నాయి, నాకేమో పాలమ్ముకోవటం అస్సలు గిట్టదండీ. ఊరికే పెరుగు, పాలు కుక్కలకూ, నక్కలకూ పోస్తున్నాం. ఇలా ఇవ్వండి గిన్నె ! క్షణంలో లగెత్తుకెళ్లి తెస్తా !"

భిక్షపతి వెళ్లాడు.

"ఏంటి ! ఈయనగారికింత ప్రేమొచ్చింది మనమీద ?" కాంతమ్మ అడిగింది అప్పారావును.

"పనేమిటో చెప్పలా"

"దొంగసచ్చినోడ్ని బాగా పిండండి"

అప్పారావు, మాజీ కరణం నవ్వాడు. అలా కరణీకం వున్న రోజుల్లో నవ్వితే, ఏనుగంత ఆసామీ, నిలువునా గడగడలాడేవాడు. పంటల కాలంలో వడ్లు, జొన్నలు, కందులు, పెసలు, మిరపకాయలు, కూరలు, పాలు, పెరుగు, జున్ను ఒకటేమిటి ఊరి కంతంలో పండింది మొదట కరణంగారి గుమ్మంలో ఉండాల్సిందే !

లేదూ ఆసామీ పొలంపై శిస్తు పెరుగుతుంది. బాడవలు, పంటభూములయ్యేవి. మెరక పొలం మాగాణి అయ్యేది. నీటి తీరువా

పెరిగేది. పొలం జానెడైతే మూరకు శిస్తు పడేది.

అలా అప్పారావు కరణీకం వున్న రోజుల్లో మకుటం లేని మహారాజులా, మతాబులా వెలిగాడు.

కరణీకం పోవడంతో, జీవితం కుదేలైంది. ఊటబావి ఎండిపోయినట్లు ఆదాయం తగ్గి, ఖర్చు మాత్రం వెధవ ముండకు వేవిళ్లు తప్పనట్లు, పెరుగుతూనే ఉంది.

ఉన్న కొడుకు చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం చూసుకోక, పేకాటకు, ముండలకు దాసుడైనాడు. కూతురు కాపురానికి వెళ్లి, ప్రతిసారీ కడుపుతో తిరిగి వచ్చేది. సంవత్సరానికి ఆరునెల్లు చూలింత, మిగతా ఆర్నెల్లు బాలింత ! ఆమె పిల్లలు తండ్రి దగ్గరకంటే తాత దగ్గరే మాలిమి ఎక్కువై, ఇక్కడే మకాం పెట్టేవారు. ఇవన్నీ చాలవన్నట్లు, అప్పారావుకు మళ్లీ బారసాల పీటల మీద కూర్చునే యోగం పట్టి, కరణీకం ఊడేనాటికి మరో పిల్లకు తండ్రయినాడు.

వయస్సు అరవయ్యోపడిలో కొచ్చేసరికి, సంసారం చతికిలబడ్డది.

ఇలా ఒక్కసారి గతం జ్ఞాపకం వచ్చి, భవిష్యత్తు భయం కలిగించే సరికి అప్పారావు మరీ కృంగిపోయాడు.

అంతలోనే భిక్షపతి ఓ గిన్నెలో పాలు, మరో గిన్నెలో పెరుగు పట్టుకుని, హనుమంతుడు సంజీవ పర్వతం తెచ్చినట్లు వచ్చాడు. వచ్చి -

"కరణంగారూ, నింపాదిగా భోజనం కానివ్వండి. విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం ఎండ జారాక వస్తా. అట్లా పొలాల గట్ల వెంట కాసేపు తిరిగొద్దాం ! అబ్బే ఊరికినే ! అట్లా చెరువుగట్టుమీద కూకుని, కబుర్లు చెప్పుకుందాం !" అని గ్రుక్క త్రిప్పుకోకుండా చెప్పేసి వెళ్లాడు.

కరణం అప్పారావు "ఏదో పెద్దచేపకే ఎసరు పెట్టాడు. రానియ్యి పాతబాకీతో సహా గుంజాలి" అని నిర్ణయించుకున్నాడు.

* * * *

అప్పారావు, భిక్షపతిని తడిగుడ్డను పిండినట్లు, పిండేద్దామనుకున్నాడు గానీ, అది



సాధ్యం కాలేదు.

భిక్షపతి కొండమీదినుంచి క్రిందపడ్డా, వంటికి దెబ్బ తగలకుండా లేచిరాగల అసహాయశూరుడు. పులి ఎదురైతే, దానికి నామాలు పెట్టి రాగల నేర్పరి. మొసలి పట్టుకున్నా తప్పించుకురాగల శూరుడు.

కరణం అప్పారావు వెంట పొలాలన్నీ తిరిగాడు. బంజరులన్నీ చూసి వచ్చాడు. కానీ కరణం నోరు విప్పలేదు. ఆకు కందకుండా, పోక కందకుండా భిక్షపతి ప్రశ్నలకు సమాధానం చెప్పాడు.

"కరణంగోరూ ఈ పంపు ఏ సర్వేనెంబరులోదండీ" అని భిక్షపతి అడిగితే -

"ఇది... సర్వే నెంబర్లు ఆ మధ్య మార్చార్రోయ్ ! వెధవది ఉద్యోగం లేదూ ! పైగా కదిలి కట్టె అంతా తీసుకున్నారుగా దొరలు ! గుర్తురావడం లేదు" అనేశాడు కరణం.

"బుల్లాయికి, మాజీ సైనికుడి కోటాలో సర్వేనెంబరు పంథొమ్మిదిలో ఐదెకరాలు ప్రభుత్వం కేటాయించింది కరణంగారూ ! అప్పుడు మీరే ఆ పంపు సర్వేచేసి రాళ్లు పాతించారు గదా !

"అబ్బో చాలాకాలమైంది !"

"దాని పక్క పంపు దాంట్లోనే ఉండాలిగా ?"

"నీవన్నది కరెక్టేనోయ్ ! కానీ ఆమధ్య జిల్లా సర్వేయరు వచ్చాడుగా ! వాడో తిక్క వెధవ ! వాడు గ్రామ కంఠంలోని సర్వేనెంబర్లు మార్చేశాడు వెధవ !"

ఇలా భిక్షపతి, కరణం అప్పారావు ఓ మూడురోజులు మూగయుద్ధం చేశారు.

భిక్షపతికి ఫలితం కనపడలా ! కన పడుతుందని ఆశామిగల్లేదు. రోజూ పాలు, పెరుగు ఇవ్వటం మాత్రం జరుగుతోంది.

ఇక ఇలా కాలయాపన చేస్తే అసలుకు మోసం వస్తుందని గ్రహించాడు. పైగా మంత్రి గారు ఏమన్నారూ ?

"భిక్షపతి! సర్వేనెంబరు తీసుకురా! నా పదవి ఎంతకాలం ఉంటుందో తెలియదు. నా శాఖ మారొచ్చు! కనుక త్వరగా వెళ్లి ఓ బంజరు భూమి సర్వేనెంబరు తెస్తివా, ఆ భూమి నీకు, భూమిలేని పేదరైతు క్రింద ఇచ్చేలా చూస్తా."

భిక్షపతి ఏనుగెక్కినంత సంబరపడి, "అదెంతపని అయ్య! చిటికలో తెస్తా" అని పరిగెత్తుకు వచ్చాడు.

వస్తే, కరణీకాలు పోయాక కదిలి కట్టె స్వాధీన పరచుకున్నా గుమాస్తా "భిక్ష పతీ" ఈ కాగితాల్లో భూమివుందో పాములున్నాయొ, బూడిదవుందో నాకు తెలియదు! చూసినా నాకు అర్థంగావడంలేదు. నీవు చూసుకో! నీ కర్మమైతే "నీ తంటాలు నీవుపడు" అని చేతులెత్తేశాడు.

హెడ్ గుమాస్తాను కలిస్తే, "అయ్యా, మూడేళ్ళబట్టీ ఈ ప్రాంతమంతా కరువు ప్రదేశమని భూమి శిస్తు మాఫీ చేశారు! అందువల్ల ఆ రికార్డు చూశే దిక్కులేదు. సేద్యపు భూమి ఎంత? బంజరెంత? 'బి' ఫారాలెన్ని! బాడవ లెన్ని? ఎవరికీ తెలియవు. పైగా నేను గోదావరి జిల్లావాడ్ని! ఈ మెరక పొలాలగోల తెలియదు. మహానుభావా! నీకో దణ్ణం! వెళ్ళిరా!" అన్నాడు.

భిక్షపతికి దిక్కుతోచలా! రోజులు గడుస్తున్నాయి. వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్లు, వచ్చి మాజీ కరణాన్ని పట్టుకున్నాడు.

పట్టుకుంటే, ఫలితం ఇదీ?

ఇలా లాభం లేదనుకుని, ఓ రోజు కరణం అప్పారావు ముందు-

"అయ్యా కరణంగోరూ! మంత్రి మావాడు. పొలం ఇప్పిస్తానని ఆశ పెట్టాడు. బంజరు భూమి సర్వేనెంబరు తెమ్మన్నాడు! మీరు దయతల్చాలి! మీ పేరు సెప్పకుంటా" అని 'దాసోహం' అన్నాడు.

అప్పారావు నవ్వాడు.

"నామాట చెప్పు!" అన్నాడు.

"నా దగ్గరేముంది కరణంగారూ! అంట రాని యధవని! సాహెబు సంపాదన బూబు కుట్టపోగులకు సరని, యావ ఎక్కువ జావ తక్కువ నా బ్రతుక్కు! మీరైతే ముందు నెంబరివ్వండి. ఆర్డరొచ్చి భూమి స్వాధీనమైతే మీ ఋణం వుంచుకోను!"

"ఇస్తా, ఇస్తానని చెప్పేమాట నమ్మనయ్యా!"

"నన్ను వేలం వేసినా కొనేవాడు లేడు! నా దగ్గరేముంది" అన్నాడు.

కరణం అప్పారావు ఆలోచించాడు. బిగదీస్తే మిగిలేది పుల్లిస్తరాకు! చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే చాలు! అని అనుకొని,

"భిక్షపతీ! ఇంట్లోని పిల్లా జెల్లా చూశావుగా! పైగా వచ్చేది ఎండాకాలం పాలు, పెరుగు లేంది పూట గడవదు. కనుక నీ దగ్గర రెండు పాడి గేదెలున్నాయన్నావుగా! ఓ దాన్ని మా ఇంటికితోలు" అన్నాడు అప్పారావు.

భిక్షపతి గుండెగుభేలుమంది. పాడిగేదంటె, వెయ్యికి పైనమాట! పైగా తన దగ్గర పాడి గేదె లేవీ?

భిక్షపతి నవ్వాడు "పంతులుగారూ! మీ రడక్కుండానే పాడిగేదెను తోలుదామనుకున్నా. మీరు దాన్నెడ పోషించగలరు? మేతా, తవుడు మీరేడ తేగలరని ఊరుకున్నా. అదెంత భాగ్యం, రేపు ప్రొద్దున మీ ఇంటి ముందు గేదె, దూడ కట్టేస్తాను! సరా!" అన్నాడు.

"ఈ రాత్రికి పాత కదిలె తీసి వెతుకుతా! ఏదన్నా సర్వే నెంబరు దొరుకుతుందేమో. రేపెలాగూ గేదెను తోలుకొస్తావుగా! అప్పుడు కాగితంమీద రాసిస్తాలే!" అన్నాడు

ఛత్రపతి శివాజి

మధుర మంజుల భరతధాత్రిని
మహారాష్ట్ర ప్రదేశమ్మున
జన్మమొందిన వీరవరేణ్యు
ఛత్రపతి నెద దలంతున్.

నిన్నుబోలు పౌరుషవంతుడు
నిన్నుబోలు వివేకధనుండు
నిన్నుబోలు దేశసేవకుడు
నేడొకండు గానరాడు!

ఆదిశక్తి భవాని దుర్గను
స్వాదుభక్తి నను దినంబును
సేవనమ్మొనర్చిన ఘనుండు
ధీవరుండు శివాజి!

స్వతంత్ర భారత దేశమ్మును
స్వార్థపరులయ్యి పీడించేడు
నేతృ జనముల యుక్కడంపుము
నీ యాత్మ శక్తితో దన్.

న్యాయశీలము, ధర్మవర్తన
మలఘుత్యాగ గుణమ్ము గలిగి
శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ
చేసిన ప్రభువరేణ్య!

ఛత్రపతి శివాజీ! భవదీయ
జయంతి వేళను, నినుదలంచి
అంజలించెదు భారతీయుల
నాదరింపుము ప్రీతియై!

(ఏప్రిల్ 26 శివాజీ జయంతి)

– జ్యోత్స్న

షైనీ బంగారు పతకం



గత ఏడు ఢిల్లీలో జరిగిన 8వ ఆశియా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్‌లో షైనీ అబ్రహంకు 800 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం లభించింది. పోటీలు ముగిసిన నాలుగు రోజుల తర్వాత ఈ పతకం అందటం విశేషం. గతయేడు నవంబరులో నెహ్రూ శతాబ్ది ఉత్సవాల సందర్భమున మనం నిర్వహించిన 8వ ఆసియా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్‌లో మహిళల 800 మీటర్ల పరుగులో చైనా మహిళ సన్‌సుమ్మి ప్రథమస్థానం, ద్వితీయ, తృతీయ స్థానాలు మన షైనీ అబ్రహం, (యిప్పుడు షైని చెరియన్)కు, రోసాకుట్టికు దక్కాయి. కాని చైనా అథలెట్ సన్‌సుమ్మి మాదక ద్రవ్యాలు పోటీ సమయంలో ఉపయోగించినట్లు నిరూపణ జరుగుట వలన ఆమెను రెండు సంవత్సరాలు అంతర్జాతీయ సమాఖ్య బహిష్కరించింది. మనదేశంలో కాని పొరుగునగాని 'డ్రగ్స్' పరీక్షా కేంద్రాలు లేకపోవుటవలన నిర్ణయమునకు ఆలస్యము జరిగినది.

షైనీ అబ్రహం (02.04.76) బంగారు, రోసాకుట్టి (02.97.75) రజిత (యిద్దరూ ఇండియా), హూరొక్కొ హిషిమొట్టో (జపాన్) కాంస్య పతకములు లభించాయి.

షైనీ అబ్రహం బంగారు పతకం సాధించాలనే కోరిక యీ విధంగా తీరింది.

-ముకరమ్

కరణం.

అన్నమాట ప్రకారం భిక్షపతి గేదెను, గడ్డి దూడను తెచ్చి ఆరాత్రే కరణం దొడ్లో కట్టేశాడు.

కరణం సర్వేనెంబరు వేసిన కాగితం ఇచ్చాడు.

భిక్షపతి ఆఘమేఘాలమీద రాజధాని వెళ్ళాడు.

* * * * *

భిక్షపతికి ఐదెకరాల బంజరు భూమి దాఖలు పరుస్తూ, ప్రభుత్వ ఉత్తర్వు వచ్చింది.

అయితే, ఆ ఉత్తర్వు రావటానికి కొంచెం ఆలశ్యమైంది. కరణం వ్రాసిచ్చిన సర్వే నెంబరు పదమూడా? పంధొమ్మిదా అన్నది తేలలా! ఆ కాగితం చూసి కొందరు పదమూడంటె, కొదరు ఖాయంగా పంథొమ్మిదని నిర్ధారణ చేశారు.

చివరకు పదమూడవ నెంబరు ఖాయం చేసి ఆ సర్వే నెంబరులోని ఐదెకరాలు, భిక్షపతి కివ్వమని ఉత్తర్వు ఇచ్చారు.

భిక్షపతి స్వయంగా కాగితం వెంట కలెక్టరు ఆఫీసుకు, ఆతర్వాత మండలాధికారి దగ్గరకు వెళ్ళి, మంది మార్బలంతో ఊళ్ళోకి వచ్చాడు. ఆరోజు కోళ్ళు తెగాయి. మందు సీసాలు ఖాళీ అయ్యాయి.

ప్రొద్దున్నే అధికారులను వెంటబెట్టుకుని భిక్షపతి పదమూడవ సర్వే నెంబరు దగ్గరకు వెళ్ళాడు.

గ్రామ ప్లాను తీసి చూశారు.

అది "మరుభూమి".

అధికార్లు ప్లానంతా వెతికారు పదమూడో సర్వే నెంబరు భూమి శ్మశానం. అందునా సాహెబులది.

పంధొమ్మిది చూశారు. అది ట్రంకు రోడ్డు.

ఎవరో జనంలోంచి సలహా యిచ్చారు. మాజీ కరణాన్ని పిలవండని!

"ఆ దొంగనాకొడుకే, నాకీ నెంబరిచ్చింది!" భిక్షపతి అన్నాడు.

"వారి కేమన్నా ఇచ్చావా?"

భిక్షపతి మాట్లాడలేదు.

మండలాధికారి మళ్లీ రెట్టించి అడిగాడు. "ఏమయ్యా భిక్షపతీ! ఇంత కష్టపడి ఉత్తర్వు తెచ్చుకున్నావు. ఫలితం లేకపోయే!"

భిక్షపతికి ఏం చెయ్యాలో తోచలేదు. కానిస్టేబుల్ ఉద్యోగానికి పోయి, కటకటాల వెనక కూర్చున్నట్లయింది.

మళ్లీ మంత్రి దగ్గరికి పోతే మొహం వాచేలా చివాట్లు పెడతాడు. పెడదామంటె, సర్వే నెంబరేది?

ఆ రాత్రికి ఇద్దరు పెద్దల్ని తీసుకుని కరణం అప్పారావు ఇంటికెళ్లాడు భిక్షపతి!

కరణం అరుగుమీద కూర్చుని మనవరాలితోనూ, కడగొట్టు కూతురుతోను ఆడుకుంటున్నాడు.

పెద్దలు "కరణం! నీ బుద్ధి పోనిచ్చుకున్నావుగాదు. అందుకే మీ ఉద్యోగం అటకెక్కింది. ఏదో బీదోడు పొలం సంపాయించుకుందామని నీకాడకొస్తే, శ్మశానం నెంబరేసి, భిక్షపతి నోట్లో మట్టిగొట్టావు! ఇలా అరాచకాలు చేస్తే, నువ్వు చచ్చిన్నాడు అయ్యో అనేవాళ్ళుండరయ్యా" అని అన్నారు.

కరణం అప్పారావు నవ్వాడు.

"మీరు చెప్పడం అయిందా?" అన్నాడు. వాళ్ళు అయ్యిందంటే, "కూర్చోండి" అని వాళ్ళు కూర్చున్నాక "భిక్షపతి కూర్చోడులెండి, ఆవేశంలో వున్నాడు. నే చెప్పేదంతా విన్నాక ఆయనే కూర్చుంటాడు" అన్నాడు.

"ఉద్యోగం లేదు మీకు తెలుసుగదా! ఈ వైధవ్యం రాకముందు, నాతో పనివున్నా లేకపోయినా ఊళ్ళోవాళ్ళు మా యింటి అవసరాలకు అన్నీ సప్లయి చేసేవారు. నేనూ నా కుటుంబం బ్రతికాం!

మరి ఇప్పుడో?

నే నోరు తెర్చి, పాడ గేదెకావాలన్నా! భిక్షపతి సరేనన్నాడు. సర్వేనెంబరిచ్చా! సరికి సరి! అవ్వాలి! కాలేదు. ఎందుకని?"

కరణం అక్కడున్న వాళ్ళ మొహాలు చూశాడు.

"భిక్షపతి గేదెనివ్వలేదా?"

కరణం నవ్వాడు.

"ఇచ్చాడు".

"మరింకేం?"

"నే సర్వేనెంబరిచ్చాగా!"

"అది శ్మశానం" భిక్షపతి గావుకేక పెట్టినట్లు అరిచాడు.

"కరణం ఇది ఘోరమయ్యా!" అన్నారు పెద్దలు.

కరణం నవ్వాడు "ఇప్పుడేవస్తా! ఉండండి అని లోపలకు వెళ్లాడు.

వస్తూ, వస్తూ, గడ్డి దూడనుతెచ్చి పెద్దలముందు నిలబెట్టాడు.


"భిక్షపతి, నా కిచ్చిన గేదె, దూడల్లో, గేదెను దాని యజమాని మర్రోజు ప్రొద్దున్నే వచ్చి, నాలుగు తిట్టినన్ను, తోలుకెళ్లాడు! ఇక మిగిలింది దూడ! ఇదిగో".

పెద్దలు, నోరెళ్ళబెట్టారు! ఆశ్చర్యం తగ్గాక, పెద్దలు "ఏంది భిక్షపతీ కరణానికి టోపీ ఏద్దామనుకున్నావా?" అని అడగాలనుకుంటే

ఏడీ భిక్షపతి?!

న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు





అడ్వొకేట్: **బి.భాస్కరరావు** ఎం.ఎ.,ఎల్.ఎల్.బి.

పి. విజయ్, గుంటూరు.

ప్రశ్న : మా తండ్రిగారి తాతగారికి ఒక ఇల్లు ఉన్నది. దానిపై మా తండ్రిగారికి హక్కు లేదని మా తండ్రిగారి పెదనాన్న కుమారులు అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. తాత ఆస్తిపై మనవడికి హక్కు ఉన్నది కనుక కోర్టు ద్వారా వాటా సంపాదించుకొనవచ్చునా? తెలుపవలెను.

జవాబు : మీ పూర్తి ఎడ్రస్ వ్రాయలేదు. తాత ఆస్తిపై మనవడికి హక్కు ఉన్నది. కాబట్టి కోర్టులో దావా వెయ్యవచ్చును.

ఏ. శ్రీరాములు, కర్నూలు.

ప్రశ్న:- నాకు 70 సంవత్సరములు దాటింది. ఇంకా ఎక్కువ కాలం వుంటానన్న నమ్మకం లేదు. నాకు 4గురు కుమారులు, 5గురు కుమార్తెలు. అందరికి పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకులు అందరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నా భార్యకు 62 సంవత్సరాలు. నా సంపాదనతో 2 ప్లాట్లు, కేష్, బంగారం వున్నది. నేను నా భార్య పేరున వీలునామా వ్రాసి వుంచాను. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చెయ్యించాలా?

జవాబు :- మీరు వీలునామా రిజిస్ట్రేషన్ చెయ్యించండి.

ఏ. వి. ఎస్. కమల, కాకినాడ.

ప్రశ్న: మా తండ్రి ఏ. పి. ఎస్. ఎలక్ట్రిసిటీ బోర్డులో వైర్‌మేన్‌గా పనిచేశారు. 1984లో ఆగస్టు 5 తేదీన ఏక్సిడెంట్‌లో మరణించారు. అప్పటికి నేను పదో తరగతి చదువుతున్నాను. నాకు అన్నయ్యలు లేనందున ఆ జాబ్ నాకు ఇవ్వవలెనని మా యూనియన్ ప్రెసిడెంట్ ద్వారా దరఖాస్తు పెట్టాను. కాని అది ఆయన హెడ్ ఆఫీసుకు పంపించారో లేదో తెలియదు. కొన్ని నెలల తర్వాత ఆయన కూడా మరణించారు. ఉద్యోగం వస్తుంది అనుకున్నాము. ఈ లోపల ఒక ఏడాది గడిచిపోయింది. మాకు ఆఫీసు రూల్సు తెలియవు. మా ఆఫీసువారు మరల దరఖాస్తు పెట్టమనగా పెట్టాను. 5 సంవత్సరములు గడచిపోయినవి. ఎస్. ఇ. ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నాము. చివరకు ఏడాది దాటిపోయినది. ఉద్యోగం ఇవ్వడానికి వీలులేదు. అని చెప్పారు. మీరు సలహా ఇవ్వవలెనని కోరుచున్నాను.

జవాబు: మీ యూనియన్ ప్రెసిడెంట్ మీ దరఖాస్తు రిజిస్టర్డ్ పోస్టులో పంపి వుంటే మీకు ఉద్యోగం వచ్చి ఉండేది. మీరు కూడా అశ్రద్ధ చేశారు. మీ దరఖాస్తు ఏమైనదీ విచారించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి మరణించిన ఏడాది లోపల ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాలి. అదే విధంగా ఎలక్ట్రిసిటీ బోర్డువారు కూడా నిబంధనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 3 అక్టోబర్ 1977 తేదీగల 687 జి. ఓ. లో ప్రభుత్వ ఉద్యోగి మరణించిన సంవత్సరం లోపల అతని భార్య గాని, పిల్లలు గాని ఉద్యోగానికి దరఖాస్తు చెయ్యాలని, సంవత్సరం లోపల పెట్టుకున్న దరఖాస్తులు మాత్రం స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కలక్టర్లు వివరణ కోరిన తర్వాత 1977 డిశెంబర్‌లో ప్రభుత్వం కొన్ని వివరణలు ఇచ్చారు. మైనర్‌నకు ఉద్యోగం ఇవ్వరాదని, మరణించిన ఉద్యోగి భార్య ఉద్యోగమునకు దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. మైనర్‌కు విద్య పూర్తి కానప్పుడు రెండు సంవత్సరముల తర్వాత ఉద్యోగం ఇవ్వవచ్చును అని వివరించారు. అటువంటి సందర్భాలు ప్రభుత్వమునకు తెలియపర్చవలెనని వివరణ ఇచ్చారు. 12 జూన్ 1984 తేదీగల 349 జి. ఓ. లో 16 సంవత్సరములు వచ్చిన వారికి కూడా ఉద్యోగం ఇవ్వవచ్చునని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. సాంఘిక భద్రత కొరకు ఈ ఆదేశాలు ఇచ్చినవి గనుక ఒక మరణించిన ఉద్యోగి కుటుంబము మీద బాధ్యత వెయ్యడం న్యాయంకాదు. ప్రభుత్వ ఉత్తర్వులు అందరికి తెలియవు. కనుక ఆ బాధ్యత ప్రభుత్వ అధికారులకు కూడా ఉన్నది. మరణించిన ఉద్యోగి కుటుంబము నుంచి దరఖాస్తు స్వీకరించి ఉద్యోగం ఇవ్వవలసిన బాధ్యత కూడా కలక్టర్ మీద వున్నదని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి అప్పుడే ప్రభుత్వోద్యోగుల కుటుంబాలకు భద్రత కలుగుతుంది. పనిచేసే హక్కు రాజ్యాంగములో కల్పిస్తున్నారు. ముందుగా మరణించిన ప్రభుత్వోద్యోగుల కుటుంబాల గురించి ఆలోచించడం న్యాయం. మీరు ఎలక్ట్రిసిటీ బోర్డు చైర్మన్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు, కలక్టర్‌కు ఉద్యోగం కొరకు రిజిస్టర్డ్ పోస్టులో దరఖాస్తు పంపండి. రెండు నెలలు ఆగి మరొక దరఖాస్తు పంపండి. మీకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించినప్పుడు హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వున్న స్టేట్ లీగల్ ఎయిడ్ మరియు సలహా బోర్డునకు న్యాయం కొరకు పిటిషన్ పెట్టండి. ○

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....


పూర్తి చిరునామా: ....

....

పాఠకులు సెక్సు కథలు తప్ప ఇంకేమీ చదవరా?

తప్పు

ఈ ప్రశ్న మనస్సులో, ఊహలలో కూడ ఉద్భవించరాదు. ఎందుకంటే జిహ్వాకో రుచిలాగ ప్రతి పాఠకునికి ఒక రకమైన అంటే అభ్యుదయ, హాస్య, కుటుంబ, కరుణ రసాలతో కూడిన రచనలు ఆదరిస్తారని ఎందుకు భావించకూడదు. ఒక్క సెక్సు కథలే చదువుతారని ఎందుకు భావించి ప్రశ్నించుకోవాలి. అసలు ఒక సెక్సు కథలే పాఠకులను సంతోషపరచలేవు. నేటి పాఠకలోకంలో 'స్త్రీలు' కూడ ఉన్నారు. వారికి కావలసినవి మంచి



భావముతో, అభ్యుదయముతో, హాస్యముతో, కుటుంబ కథలు కావాలి. అటువంటి కథలే పాఠకులు ఆదరిస్తారు. ఆకర్షణకు లోనవుతారు. భారతీయ సంస్కృతి, సభ్యతలను కాపాడే రచనలు కావాలి. కాని పాఠకులు "ఒక్క సెక్సు కథలు తప్ప యింకేమీ చదవరు" అని ప్రశ్నించుకోవడం మన హృదయాంతరాలలోకి ప్రవేశించకూడదు.

- జి. భూపాల్‌రెడ్డి (కల్వకుర్తి)

పాఠకుల చిక్కులు

మాటలలో చెబితే శృంగారము, చేతలలో చూపిస్తే సరసం అవుతుంది. పాఠకులు సెక్స్ వల్గారిటీ వ్రాసే పత్రికలే చదువుతున్నారంటే పొరపాటు. నవరసాలలో శృంగారము ఒకటి. ఈ మధ్య కాలంలో పోటీని తట్టుకోవడానికి, పాఠకుల్లో కొందరి అభిరుచి కోసం కొన్ని పత్రికలు- ఒక పేజీ లేక శీర్షిక కేటాయిస్తున్నాయి శృంగారం కోసం. మిగతా శీర్షికలు బావుంటే- పత్రిక కొనుక్కోకుండా ఎలా వుంటాం? అయితే కొన్ని పత్రికలు- విదేశీ మొఖాలతో- అసభ్య చిత్రాలతో సెక్స్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తూ- యువతరాన్ని పెడతోవ పట్టిస్తున్నాయి. తెలివిగా సంపాదకులు ఇలా యువతను పాడుచేయడం గర్హనీయం. దాదాపు దశాబ్దిలో అడుగిడే ఆంధ్రపత్రిక నిండు సోయగాలు, యువ, ప్రభలాంటి నీట్‌గా వుండే పత్రికలు చిరకాలం తమ స్థాయి నిలుపుకోడానికి కారణం- వింత పోకడలతో శృంగారం పేరిట అసభ్య విన్యాసాలు ప్రచురించక పోవడమే- మరి వీటిని ఆదరించిన పాఠకుల అభిరుచిలో స్థాయిలో తక్కువ ఏమీ లేదని అంటాను. -యం. పి. శకుంతలాకళ్యాణి, విశాఖపట్నం

ఈ అభిప్రాయం సమంజసంకాదు!

ఎందువలనంటే ప్రతి పాఠకునికి యేదో ఒక శీర్షికమీద ఎక్కువ అభిమానం వుండటం సహజం. అయితే ఎవరికి యే శీర్షిక ఎక్కువ ఇష్టమో దానిని అన్నిటికన్న ముందు చదువుతారు. ఒకరికి డిటెక్టివ్ కథలు నచ్చుతాయి. మరొకరికి హాస్య పూరితమైన కథలు, వేరొకరికి సినిమా సాహిత్యం, అలాగే కొందరికి 'సెక్సు' కథలంటే ఎక్కువ యిష్టం వుండవచ్చు. అంతేకాని కేవలం 'సెక్సు' కథలు మాత్రమే చదివి మిగిలిన శీర్షికలను చదవకుండ వుండలేరు.

ఈమధ్య వస్తున్న పత్రికలలో 'సెక్సు'కు సంబంధించిన కథ ఒకటి, వివిధ నామాంతరాలలో తప్పనిసరిగా ప్రచురించటం జరుగుతోంది. అన్ని రసాలతో పాటు 'శృంగార రసం' కూడ ఈమధ్య పత్రికలలో చోటు చేసుకుంటున్నది. పత్రిక కొని చదివే ప్రతి వ్యక్తి 'సెక్సు' కథలతో పాటు మిగిలిన శీర్షికలను కూడ చూద్దామన్న వుద్దేశ్యంతో చదువుతాడే తప్ప కేవలం సెక్సు కథలకే పత్రికను కొనరు.

పెళ్ళికానివారు, యువకులు, సెక్సు కథలలో యేదో బూతు సాహిత్యం వుంటుందన్న భ్రమలో అటువంటి కథలకు ఆకర్షితులౌతున్నారు.

-పి. శివరావ్, ధవళేశ్వరం

తప్పు తప్పు...!

పాఠకులు సెక్స్ కథలు తప్ప ఇంకేమి చదవరు అనడం శుద్ధ తప్పు! కానీ– సెక్స్ మిక్స్ చేసిన క్రైమ్, హర్రర్, థ్రిల్లర్ కథల్ని అవలీలగా, హాయిగా, ఆబగా చదివేస్తారు. సెక్స్‌ని మిళితం చేసిన కమనీయ కుటుంబగాథల్ని మళ్ళీ మళ్ళీ చదువుతారు సుమండీ...! అయితే యింతకీ 'సెక్స్' అంటే ఏమిటి? ఈ పదానికి ఒక్కొక్కరు ఒక్కో అర్థం చెప్పుకుంటారు. 'శృంగారం,', 'రతి' 'ప్రేమ' వగైరాలన్నమాట! వీటిలో ఏ కథైనా సెక్స్ కథే అవుతుంది. అయితే– ప్రాచీన సాహిత్యంలోనూ అంతర్లీనంగా 'సెక్స్' గుబాళిస్తూనే వుంది. కానీ ఒకటి– పాఠకులను తప్పుదోవ పట్టించకుండా ఆహ్లాదంగా, అద్భుతంగా, రసవత్తరంగా, రమణీయంగా అభివర్ణించే ఏ కథనైనా పాఠకులు హర్షిస్తారు. ఆమోదిస్తారు, ఆహ్వానిస్తారు–


–ఉజ్వల ప్రసాద్ (రామవరం)

హద్దు వుంది

సెక్సు జీవితంలో ఒక భాగం. కాని జీవితమంతా సెక్సుతో కూడి ఉండదు.

ప్రచురణకర్తలు యీ పేరు మీద డబ్బు గుంజుతున్నారని వినికిడి. కాని ఇది ఎంతవరకూ సమంజసం కాదు.

సెక్స్ కథలు ఎక్కువగా ప్రచురించడం వల్ల అసలైన సాహిత్యం లోపిస్తుంది. అలా అని



ప్రచురించకుండా ఉండకూడదు. కానీ వీటికి ఒక హద్దంటూ ఉంది. వారపత్రికలు కుటుంబ సభ్యులందరూ చదివే విధంగా ఉండాలి. సెక్సు మానవాళి జీవితంపై ముఖ్యంగా యువతరంపై ఎక్కువగా ప్రభావాన్ని చూపుతుంది.

-ఏ. సత్యనారాయణ (కాగజ్‌నగర్)

పాఠకులు సెక్సు కథలు ఇష్టపడతారు?

ఆ ఆరోపణకు నేను బద్ధ వ్యతిరేకిని.
నిజమైన పాఠక ప్రియుడంటే
నేటి వ్యవస్థ గురించి
వ్యవస్థ నిర్మూలన గురించి ఆలోచించేవాడు.



స్త్రీలను గౌరవించని వాడూ,
సెక్సు 'సాహిత్యం' పట్ల ఆసక్తి ఉన్నవాడు కాదు
అని నా అవగాహన.
'ఆడది నగ్నంగా నిలబడి ఉంద'ని రాస్తారు కథల్లో.
అది చదివి ఉద్రేకంతో ప్రక్కనున్న అమ్మాయిలను
-చూసేవాడు మూర్ఖుడని నా అభిప్రాయము.

- మహమ్మద్ ఖాదర్‌ఖాన్
(గణపవరం)

ఆదివారం.
నేను మహిళా మండలి సమావేశానికి వెళ్లే తొందరలో వున్నాను. నా హడావుడికి వేగ నిరోధకం లాగా మావారు స్త్రీల గురించి అంత ర్జాతీయ స్థాయి ఉపన్యాసం అలుపు లేకుండా దంచేస్తున్నారు.

'ఈ ప్రపంచ జనాభాలో సగంమంది మీరే. కానీ మానవ పరిణామక్రమంలో వ్యవస్థలెన్ని మారినా, స్త్రీల అవస్థలు మాత్రం తీరలేదు.

ఒక దశలో ఎక్కువ సృజనాత్మక రచనలు స్త్రీలు చేశారు. అన్ని భాషల్లోనూ ఎన్నో మహిళా పత్రికలు వెలువడసాగాయి.

ఎవరెంతగా ప్రోత్సహించినా, పత్రికలెంతగా కృషిచేసినా మీరు మాత్రం ముగ్గులపోటీలు, కుట్లు, అల్లికలు, గృహాలంకరణలు అంటూ ఉన్నచోటనే వుంటామంటున్నారు. వస్త్రధారణ, వేషభాషల్లో వస్తున్న మార్పుల్ని ఎంత త్వరగా అంగీకరించి ఆచరిస్తున్నారో యితర రంగాల మార్పుల్ని అంతయిదిగా దూరంగా వుంచుతున్నారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం రావాలన్న అభిలాష పెంపొందిందని గ్రహించిందే తరువాయి మోడలింగ్ వృత్తి మీ జాతి మస్తిష్కాల్ని బాగా లోబరచుకుంది. అందం తప్ప మరో పెట్టుబడి అవసరంలేని మోడల్ వృత్తిని ఒక వర్గం స్త్రీలు ధనార్జనావకాశంగా స్వీకరించారు."

శ్రీవారి ఉపన్యాసం ధారావాహికంగా సాగిపోతోంది. ఆయన మాటల్లో కాదనాల్సిందేమన్నావుందో లేదో నేనేనాడూ ఆలోచించలేదు. ఎందుకంటే ఔనంటే రెట్టింపు ఉత్సాహంతోనూ, కాదంటే రెట్టింపు పట్టుదలతోనూ తన ఉపన్యాసం కొనసాగిస్తారని నా భయం!

"స్త్రీని ఆదిశక్తిగా అభివర్ణించిన ఈ పుణ్యభూమిలో ...ఆడదాని అందం మగాడి ఆనందానికేనన్న భావం కళాసాహిత్య సాంస్కృతిక రంగాల్లో రోజురోజుకీ పెరిగిపోతుంటే మీరేం చెయ్యగలుగుతున్నారు. అందాలభామ పోటీ, మంగళహారతుల పోటీలతో యథాశక్తి ప్రజాసేవలో భాగంగా స్త్రీ సేవచేస్తున్నాయి. సేవకన్నా ప్రచారమే ఎక్కువగా వుంటోందని ఎవరన్నా అంటే... వాళ్లు గిట్టని వాళ్లేనని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు..."

ఇక ఉండబట్టలేక "ఇంత అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఎన్నికల ఉపన్యాసాలు 'హాబీ' గా స్వీకరించరాదూ! మీమోజు తీరుతుంది. భారీగా ఆదాయమూ వుంటుంది" అన్నాను విసుగ్గా.

లేకపోతే ఏమిటి? ఇప్పటికి మూడువారాలుగా మా మహిళా మండలి సమావేశాలు 'మిస్' అవుతూన్నాను. ప్రతివారం ఏదో ఒక రకంగా ఉపన్యాసం ప్రారంభించటం...నన్నా ఆ ధోరణిలోకి లాగి, మిస్సయ్యేట్లు చేస్తూనే వున్నారు. ఈ వారం ఎట్టిపరిస్థితుల్లోనూ మిస్ కాదల్చుకోలేదు నేను. త్వరలో మా మహిళా మండలి తృతీయ వార్షికోత్సవం జరగబోతోంది. ఆ సందర్భంగా ఎన్నో పోటీలు జరుగుతాయి ఈరోజునించీ!

అసలే "మహిళల్లో 'చైతన్యం' తగ్గిపోతోంది" అని మా కార్యదర్శి మిసెస్ కృష్ణమోహన్ మండిపడుతోంది. పైగా ఈ రోజు విజయన



నవ్వుల నదిలో...

హాస్యనవలిక ప్రారంభం!

గరం నుండి వస్తున్న మిసెస్ వెంకట్‌గారు ఏదో కొత్త వంటకం 'రుచి' చూపిస్తారట! పేకాట, ముగ్గులు, మ్యూజికల్ ఛెయిర్స్ పోటీలున్నాయి. ఎప్పుడూ పేకాటలో గెలిచే నేను ఈ రోజు వెళ్లకపోతే ప్రథమ బహుమతి చేతులారా పోగొట్టుకున్నట్టుగాదూ!


మాగౌరవ అధ్యక్షురాలు అయిన జిల్లా కలెక్టరు భార్య నుండీ బహుమతి అందుకునే ఛాన్స్ పోగొట్టుకోవటం నాకేమాత్రం ఇష్టం లేదు. అన్నట్లు, ఉగాది పండుగ వస్తోంది. ఎవరికీ లేని లేటెస్ట్ డిజైన్ చీర కొనాలంటే... మా సభ్యులందరి దగ్గరున్న చీరల వివరాలూ తెలుసుకోకుండా ...అంతకంటే గొప్ప చీర కొనటం సాధ్యం కాదుగదా!

అందుకే ఈరోజు వెళ్లి తీరాలి.

మావారి ఉపన్యాసం సాగిపోతూనే వుంది. ఇంట్లో నేనెటు వెళ్లినా వినిపించేలా స్వరాన్ని పెంచుతూ తగ్గిస్తూ మాట్లాడుతునే వున్నారు. మా ఆయనలో ఓ ప్రత్యేకత వుంది. తను చెప్పదలచుకుంది పూర్తిచేసే వరకూ చెప్పటం ఆపరు. ఆ విషయంలో ఆయన అపర విక్రమార్కుడే!

ఎప్పటికైనా నేను అర్థంచేసుకుని మారతానన్న ఆశతోనే ఆయన ప్రయత్నాలు కాబోలు!

మార్పు నీ యింటి నుండే ప్రారంభించమన్న సూక్తి పూర్తిగా జీర్ణించుకున్నట్లున్నారు...ఈ రోజు నుంచే గట్టిగా ఆచరించాలని కూడా నిర్ణయించుకున్నారేమో! ఆయన వాక్ప్రవాహం వరద గోదారిలా వుంది.



డా॥ శాంతికుమార్

అప్పటికి నా సహనమూ చివరి దశకు చేరుకుంది. "ఇంకాపండిబాబూ మీకు పుణ్యముంటుంది. ఆ దేవుడు మిమ్మల్ని మారిస్తే బావుండు. అయినా.. వారమంతా ఈ నాలుగ్గోడల మధ్యా ఇంటెడు చాకిరీ చేసుకుంటూ పడుంటున్నాను కదా! వారానికొక్కసారి అలా వెళ్లొస్తుంటే మీసొమ్మేంపోయింది?" అన్నాను నిష్ఠూరంగా.

నామాటలతో ఆయన ఆపకపోగా మరింతగా విజృంభించారు. 'మారండోయ్ మహిళలూ!' అని ఓ మినీ నినాదం ఇచ్చి ఉపన్యాసం కొనసాగించారు.

"అదేనోయ్ నేనసేదీమా! వారానికోసారి కలుసుకునే మీ సభ్యులు నాలుగు గోడల రొటీన్ వాతావరణం నించీ మార్పుకోసం చేస్తున్నదేమిటి? కొత్త వంటకాల తయారీ, చీరలపై జాతీయ సదస్సులు, పిచ్చా పాటీ కబుర్లూ, పేకాటలూ! ఎప్పుడో ఒకసారి... మీరుంటున్నది ఈ సమాజంలోనే అనిగుర్తొచ్చినప్పుడు పేద పిల్లలకు పలకల పంపిణీలూ, కుటుంబనియంత్రణ ప్రచారమూ!.. అంతేగా! మీ ఆనంద కార్యక్రమాలు ఇచ్చేది తాత్కాలికానందమే. మీసేవా కార్యక్రమాలు కన్నీటి తుడుపు లాంటివే. పలకలు పంచితే వాళ్ల పేదరికం తీరి అందరూ బ్రహ్మాండంగా చదువుకోగలుగుతున్నారా?"

"అందుకని పేదలకు పలకలు కూడా ఇవ్వకుండా చెయ్యాలనా మీ ఉద్దేశం?"

"పలకల పంపిణీ ఆపమని కాదు. పలకకి కూడా గతిలేనివాళ్ల పేదరికానికి కారణాలేమిటో ఆలోచించమంటున్నా. కేవలం పలక, బలపం లేనందువల్లే చదువుకోలేకపోతున్నారనీ...అవి వుంటే కలెక్టర్లు కాగలరనీ అపోహపడి కలలు కనవద్దంటున్నా. అసలు బడికెళ్లి చదువుకునే అవకాశం వాళ్లకి ఉంటేగా మీరిచ్చిన పలకలు పనికొచ్చేది? అయినా 'సేవ' దయతో చెయ్యాల్సిందికాదు, అదొక బాధ్యతగా గుర్తించండి"

"అందుకే కదా 'కుటుంబనియంత్రణ'

కూడా ప్రచారం చేస్తున్నాం" ఒకింత గర్వంగానే అన్నాను.

"ప్రభుత్వ ప్రచారానికి వత్తాసుగానా? దేశంలో సమస్య లన్నింటికీ అదొక్కటే కారణమయినట్లూ, అది అమలు జరిగితే దేశంలోని పేదరికమంతా రాత్రికి రాత్రే తొలగిపోయినట్లూ! పుట్టే ప్రతి మనిషీ నోరూ, కడుపుతోనే పుడుతున్నాడా? ఆలోచించే మెదడూ, శ్రమించే చేతులూ శరీరమూ లేవా? వాటిని సక్రమంగా ఉపయోగించుకోలేని అసమర్థత ఎవరిదో ఒక్కక్షణమన్నా ఆలోచించారా?"

ఇక ఆయన ఉపన్యాసం క్లైమాక్స్‌కి చేరబోతుందన్న మాట! సమాజం యొక్క విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిపడి వుందనీ, స్త్రీకి నిజమైన గౌరవం, స్వేచ్ఛ అప్పుడు మాత్రమే ఉంటాయనీ అందుకోసం స్త్రీ కూడా పోరాడాలనీ'... అంటారు. అంతేగా?

"మీ మెంబర్లంతా వయస్సు తక్కువ కనిపించేలా అలంకరించుకుని వచ్చేసరికి పదకొండు గంటలు దాటుతుందిగానీ, నేను చెప్పిందాన్ని గురించి కొంచెం ఆలోచించటం మొదలెట్టు" అన్నారాయన వ్యంగ్యంగా, ఎప్పుడో మా ఇంటికొచ్చిన మా మహిళా మండలి సెక్రటరీ మిసెస్ జయామోహన్ గుర్తొచ్చింది కాబోలు!

మావారన్నదానికి తగినట్లే ఆవిడకూడా అక్కడక్కడా తెల్లబడుతున్న శిరోజాలు కనిపించకుండా రంగు వేసుకోడం, లిప్‌స్టిక్, ఇంపోర్టెడ్ సెంట్స్ లాంటివి వాడే అలవాటు ప్రదర్శిస్తుంటుంది! ఒకసారి మిసెస్ రామ్ కూడా ఆవిడనుద్దేశించే 'భర్త ఒప్పుకుంటే... ఆవిడ ముఖానపడుతున్న వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునేది' అంది.

మిసెస్ జయా మోహన్‌గారొచ్చాక.... ఎవరో ఈ విషయం ఆవిడ చెవిలో ఊదటం... ఆపై యిద్దరిమధ్యా భారీ వాగ్యుద్ధ పోటీ జరిగి ఇద్దరి బలహీనతలూ పదిమందికీ తెలిసిపోవటం... పర్యవసానంగా చిన్నసైజు మల్లయుద్ధ పోటీగా ఆ గొడవ రూపాంతరం చెందటం కళ్ళముందు మెదిలి, తన్నుకొస్తున్న నవ్వాపుకుంటూ శ్రీవారితో అన్నాను.

"మేమేమన్నా దేవతలమా? గంధర్వులమా? వయసు పెరగకుండా వుండటానికీ, వయసు తెచ్చే మార్పులు రాకుండా ఉండటానికి?"


"వయసు తెచ్చే మార్పులు రావటం తప్పకాదు. వాటిని కప్పిపుచ్చుకునేందుకు గంటలకొద్దీ విలువైన కాలం వ్యర్థం చెయ్యటమే తప్పంటున్నానోయ్. అసలు అందమంటే ఏమిటి? ఆరుకళ్లు, పదిచెక్కిళ్ళూ

నవ్వుల నదిలో...

వుంటాయా? ఈ అలవాట్లన్నీ మీ అందాల పోటీల సంస్కృతి నేర్పిన పైత్యం కాకపోతే? అయినా ఆ సహజపరిణామాలు రాకుండా వుంటాయని మీరనుకుంటున్న దేవతలయిన మిసెస్ శివ, మిసెస్ చతుర్ముఖ, మిసెస్ విష్ణు మాత్రం సుఖంగా ఉన్నారనుకుంటున్నావా? వాళ్లకెన్ని సమస్యలో! మీ మహిళా మండలి తరపున ఓ నిజనిర్ధారణ కమిటీ వెళ్లి పరిశోధించరాదూ?" విలాసంగా నవ్వుతూ అన్నారు శ్రీవారు.

నన్నుడికించాలని ఆయన నవ్వే ఆ కొంటెనవ్వే నాకు మరీ చిరాకు తెప్పించింది. "మా మెంబర్స్‌లో ఆ పేర్లుగల వాళ్లెవరూ లేరే! వాళ్ల నెక్కడినించీ తెచ్చారు?" అన్నాను బయటకు నడుస్తున్నదాన్ని ఠక్కున ఆగిపోయి.

"మహాభక్తురాలివి! ఆమాత్రం తెలియదా?"



డా. చావలి శాంతికుమార్ పరిచయం

ఆంధ్రసచిత్ర వారపత్రికలో హాస్య నవలికల పోటీలో సాధారణ ప్రచురణకి స్వీకరించబడిన హాస్య నవలిక "నవ్వుల నదిలో ...." రచయిత డా. చావలి శాంతికుమార్ హోమియో వైద్యులు. రచనాశక్తి వీరి తండ్రి సమతారావు నుంచి వారసత్వంగా వీరికి అబ్బింది. వీరి కథలు, కవితలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వీరి "జనవిజయం" దాదాపు వంద ప్రదర్శనలు జరిపించుకుంది.

అప్పటికి వెలిగింది నా ట్యూబ్‌లైటులాంటి మెదడు! త్రిమూర్తుల భార్యల నుద్దేశించి అన్నారన్నమాట. దేవతలంటే ఏమాత్రం లక్ష్యం లేదీ మనిషికి! మొన్నటికి మొన్న వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లు చేసుకుంటుంటే -

"ఇరవైయ్యొకటో శతాబ్దిలోకి వెళ్లబోతూ కూడా ఆ వరలక్ష్మమ్మకి ముక్కుపుడకలూ, పట్టుచీరెలూ ఏమిటి వికారంగా! జీన్స్ తగిలించి, నల్లకళ్లద్దాలు పెడితే మోడ్రన్‌గా వుంటుంది కదా!" అన్నారు.

'ఆయనింతే! ఈ జన్మలో మారరు' మనసులో అనుకుంటూ, "వాళ్లకి లక్షణంగా ముచ్చటైన పేర్లుండగా ఈ 'మిసెస్'లూ, గట్రా ఎందుకు తగిలించటం?" అన్నాను. ఒళ్లు మండిపోతోంది మరి!

"ఓహో! మీకెవ్వరికీ 'లక్షణమైన, ముచ్చటైన' పేర్లు లేకనా, మిసెస్ రావ్ అనీ, మిసెస్ రామ్ అనీ పిలుచుకుంటారు?" అని చురకవేస్తూ "వెళ్లిరా! పాపం! ఇప్పటికే ఆలస్యమైనట్లుంది." అని వదిలేశారు.

"దేవతల్ని ఎగతాళిచేస్తే మీ జుట్టు పండిపోతుంది" అంటూ బయటకు నడిచాను.

2

మా మహిళా మండలినుంచి ఇంటికి చేరేసరికి రాత్రి ఏడుగంటలైంది. పిల్లలు టీవీలో హిందీ సినిమా చూస్తున్నారు. శ్రీవారు ఎవరో స్నేహితులతో ఆరుబయట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఫ్లాస్క్‌లో కాఫీ వుంది. త్రాగు! వంట కూడా చేశాను, నువ్వు రెస్ట్ తీసుకో!" అన్నారాయన అక్కడ్నించే.

"పెద్దగొప్ప! తన స్నేహితులు... 'నేను రోజూ వంట చేయిస్తున్నాననుకునేందుక్కాకపోతే" ఆ మాటేదో అలా లోపలికొచ్చి చెప్పిపోకూడదూ?

రేపటి కార్యక్రమాల గురించి ఆలోచిస్తూ సోఫాలో కూర్చున్నాను.

మిత్రుల్ని సాగనంపి, పది నిమిషాల తరువాత లోపలికొచ్చారు

"ఫస్ట్ ప్రయిజ్‌లన్నీ నీవేనా?" అంటూ.

"పేకాటలో నేనే ఫస్ట్! ముగ్గులపోటీలో సెంకడ్. మ్యూజికల్ ఛెయిర్స్‌లో కూడా ఫస్టొచ్చుండాల్సింది, మిసెస్ ఉమాకాంత్ 'అడరాడే'లా నన్ను నెట్టి మరీ కుర్చీలో కూర్చుండిపోయింది. లేకపోతేనా" అన్నాను అసంతృప్తిగా.

"కంగ్రాట్స్! దెబ్బలేం తగల్లేదు కదా! నీక్కాదు ఆవిడకి"

"ఆవిడకి దెబ్బలా? ఆవిడ నామీద పడుంటే ఏ కాలో చెయ్యో విరిగి ఉండేది! అంతవరకూ అదృష్టవంతురాల్ని!" అన్నాను.

శ్రీవారి చిలిపి ముఖం చూస్తూ, ఆయన అభినందనకి మురిసిపోతున్నాను. ఉదయం నుండీ భరించిన 'వియోగం' వల్ల కాబోలు! ఆయనా నన్ను రెప్పవెయ్యకుండా చూస్తున్నారు. రెండు నిమిషాల తరువాత నెమ్మదిగా దగ్గరకొచ్చి

"రాధా! నువ్వెంత అదృష్టవంతురాలివోయ్!" అన్నారు గంభీరంగా.

"ఏమిటో అంత అదృష్టం?"

'అబ్బ! నీకెంత మంచి మొగుడో!" అన్నారు.

"చాల్లెండి! మీ సొంత డబ్బా! రేపటి పోటీల గురించి నేను బుర్ర వేడెక్కేలా ఆలోచిస్తుంటే" అన్నాను చిరాగ్గా, మనసులో మాత్రం మా ఆయన మంచితనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

"ఏమిటో అంత . గొప్ప ఆలోచన?" అన్నారు.

"అదేనండీ! రేపు వంటల పోటీవుంది. ఫస్ట్ ప్రయిజు కొట్టేసే వంటకం చెయ్యగలిగితే... ఛాంపియన్‌షిప్ నాదే! కొత్త వెరైటీ వంటకంకోసం పాతపుస్తకాలెన్ని తిరగేసినా మంచిది దొరకలేదు.' అంటూ అసలు విషయం చెప్పాను.

ఆయన సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు పోజుపెట్టి అయిదు నిమిషాలలాగే నిల్చుండిపోయి, హఠాత్తుగా.

"యురేకా!" అని అరిచారు.

"నేను ఉలిక్కిపడ్డాను. ఏమిటండీ" అన్నాను.

"నేను చెప్పిన వంటకం చేశావంటే... నీకు ప్రథమ బహుమతి ఖాయం." అన్నారు ఊరిస్తూ.

"నిజంగానా? ఏమిటిది?" కుదుపుతూ అడిగాను.

"అంత తేలిగ్గా చెప్తానేంటి? కాసేపు బ్రతిమలాడాలి బెట్టు చేస్తున్నారన్న మాట.

'చెప్పకపోతే మానెయ్యండి' అని నేను బెట్టు చెయ్యగలిగితే... పంతం వదిలి నన్ను బ్రతిమాలి మరీ ప్రసన్నం చేసుకుని... ఆ వంటకమేదో చెప్తారుగానీ... నా ఆతృత ఆ క్షణంలో నాకంతటి సహనాన్ని అనుమతించలేదు.

'ముచ్చటపడుతున్నారు కదా' అని ఓ చిటికెడు బ్రతిమాలి, "చెప్పండీ!" అన్నాను గడ్డం పుచ్చుకుని.

"ఓ.కె! చెప్పేస్తున్నా!" అంటూ ఆగారు.

నేను మరింత ఆతృతగా ఎదురుచూస్తున్నాను!

"డి బ్రోటీ కరోటీ" అన్నారు ఉత్సాహంగా.

"నన్ను ఆటపట్టిస్తున్నారు!" అన్నాను మూతి బిగించి.

నా బుంగమూతి చూసి, బుచ్చిబాబులా బోల్డు బెంగపడి... అభినయపూర్వకంగా ఆ కొత్త వంటకం ఫార్ములా ప్రత్యక్ష పురాణంలా సెలవిచ్చారు శ్రీవారు.

అదేమిటనుకుంటున్నారు? మా అమ్మమ్మమ్మ కాలంనాటి దిబ్బరొట్టె!

నా ఆశాభంగం చూసి... ధైర్యం చెప్తున్నట్లు 'అభయ హస్తం' పోజులో నిలబడి, గొంతు సవరించుకుని.

"ఏమిటోయ్! దిబ్బరొట్టె అంటే నీకూ అంతతేలిగ్గా వుందా? ఈమధ్యే పేపర్లో చూశాను, అమెరికాలో ఉన్న ఆంధ్రా హోటల్లో దీనికున్నంత డిమాండు మరే ఇతర వంటకానికి లేదట. 'బ్లాకు'లో పది డాలర్లు రేటున్నా వేడి వేడి పకోడీల్లా అయిపోతున్నాయట, వైద్యరంగంలో దిబ్బరొట్టె ప్రాముఖ్యత గురించి పరిశోధనలు యుద్ధ ప్రాతిపదికలో జరుగుతున్నాయంటే అర్థంచేసుకో దాని ప్రత్యేకతేమిటో!

పైగా, మీ పోటీల నిర్వహణ తీరు నాకు తెలియని విషయమా! ఏ రంగంలో పోటీ అయితే ఆ రంగంలో పిసమంతైనా అనుభవంలేని వాళ్లనే కదా న్యాయ నిర్ణేతలుగా నియమిస్తారు. అంటే... వంటల పోటీ నిర్ణేతలు... పుట్టాక ఒక్కసారన్నా వంటగది ముఖం చూడని వాళ్లేవుండి తీరుతారు.

మరో ముఖ్యమయిన రహస్యమేమిటంటే... డీ బ్రోటీ కరోటీ' అని వెస్టర్న్ [illegible]ల్లో పేరు పెట్టాక... దాన్ని సింపుల్‌గా 'దిబ్బరొట్టే కదా!' అని ఉపేక్షించగల ధైర్యం, సాహసం గలవాళ్లెవరట మీ సభ్యుల్లో? రాజుగారి దేవతా వస్త్రాల కథలాగా ఏకగ్రీవంగా 'దిబ్బరొట్టె'ని ఎంపికచేసి తీరాల్సిందే! కనుక, మదీయ శ్రీమతి! ప్రొసీడ్! ధైర్యే సాహసే బహుమతి!" అంటూ భుజం తట్టారు.

ఆ ప్రోత్సాహం వెనుక సీరియస్‌నెస్ వుందో, వేళాకోళం వుందో స్పష్టంగా అర్థం కావటం లేదు.

ఏమైతేనేం? మరో గంట ఆలోచించినా, మరో వంటకమేది తోచక... వంటల పోటీలకు దిబ్బరొట్టెమీదే నా బహుమతి ఆశలన్నీ పెట్టుకుని, మినప్పప్పు నానబోశాను.

భోజనాలు ముగించి పడుకున్నాం..

నా మనసు మరునాడు దిబ్బరొట్టెకు ప్రథమ బహుమతి ప్రకటించే దృశ్యాన్ని ఊహిస్తోంది!

(ఇంకా వుంది)

మీ జి. కె. ఎంత?

1. ఏ ప్రాజెక్ట్ నిర్మాణం వలన 'వాతావరణ తులనాత్మకత' దెబ్బతింటుందని శ్రీ సుందర్‌లాల్ బహుగుణ ఉద్యమం ప్రారంభించారు?
2. మొట్టమొదటి 'పోస్టేజి స్టాంపు' ఏ దేశంలో, ఏ సంవత్సరంలో వాడబడింది?
3. అమెరికా, రష్యాలు కాకుండా 'అవాక్స్' తయారు చేసిన మూడవ దేశం పేరేమిటి?
4. 'జలియన్‌వాలాబాగ్' దురంతానికి కారకుడైన 'మైఖేల్ ఒడయ్యార్'ను హత్య చేసిన భారతీయుడెవరు?
5. మొట్టమొదటిసారి వరల్డ్ ఫుడ్ ప్రైజ్ పొందిన వ్యక్తి ఎవరు?
6. ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు 'అశోకచక్ర', మానవత్వ విలువలకు సూచకంగా యిచ్చే పాకిస్తాన్‌కు చెందిన 'నిషాన్-ఇ- ఇన్సానియత్' పొందిన ఏకైక మహిళ ఎవరు?
7. ఒక సినిమాలోని హీరో మరియు హీరోయిన్ పాత్రలను పోషించిన వ్యక్తి ఎవరు?
8. ప్రపంచంలో కెల్లా అత్యధిక సంఖ్యలో 'బ్రాంచ్'లు కలిగిన బ్యాంకు పేరేమిటి?
9. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఐ. పి. ఎస్. ఆఫీసర్ ఎవరు?
10. ఎఫ్. ఆర్. ఇ. ఆర్. ఎ. (ఫెరా) విస్తరణ యేమిటి?

\- జైకిరణ్

(జవాబులు ఈ సంచికలో నే)

అక్షరజ్ఞానుల సంఖ్య పెంచండి!

నిరక్ష రాస్యులైనవారు సులువుగా మోసానికి గురికావచ్చు. అదే అక్షరజ్ఞానం వున్నవారు మోసగింప బడటానికి తావుండదు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలనే తలంపుతోనే 1990వ సంవత్సరాన్ని "అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరం"గా ప్రకటించారు. ఇందుకోసం ప్రపంచమంతటా అనేక కార్యక్రమాలను చేపట్టారు.

ఇప్పుడు నిరక్షరాస్యత అనేది ప్రపంచ సమస్య అయి కూర్చుంది. ఇది ప్రపంచంలోని 889 మిలియన్‌ల వయోజనులమీద ప్రభావం చూపుతోంది. అంతేకాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాలలో 6 నుంచి 11 సంవత్సరాల మధ్య వయస్సున్న వెయ్యి మిలియన్‌లకు పైగా పిల్లలు పాఠశాలలకు పోవటం లేదు. నేటి బాలలే రేపటి పౌరుల మాదిరిగా... ఈ పిల్లలే రేపు నిరక్షరాస్యులైన వయోజనుల జాబితాలోకి చేరుతున్నారు.

వయోజనుల జనాభాలో నిరక్షరాస్యులైనవారిశాతం క్రమేపీ తగ్గుతున్నప్పటికీ జనాభా అభివృద్ధి రేటుమాత్రం పెరిగిపోతోంది.

వయోజనులైన నిరక్ష రాస్యులలో 60 శాతం మంది మహిళలే వున్నారు. ప్రపంచంలో నిరక్షరాస్యులైన వయోజనులలో 98 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే వున్నారంటే దారిద్ర్యం ప్రధాన కారణంగా పేర్కొనబడుతోంది.

ప్రాథమిక విద్యాస్థాయి పూర్తిచేసిన మహిళా కుటుంబాలలో శిశుమరణాల సంఖ్య తక్కువగా వున్నట్లు విదితమైంది. మిగిలినవారితో పోలిస్తే కొంతవరకు చదువుకున్న పేదరైతులు వ్యవసాయ ఉత్పత్తిలో ముందున్నట్లు తెలుస్తోంది.



ఆర్థికాభివృద్ధి

కొరియా రిపబ్లిక్‌వంటి దేశాలలో 1960 ప్రాంతంలో ప్రాథమిక విద్యపై ఎక్కువ పెట్టుబడి పెట్టినందువల్ల ఆర్థికాభివృద్ధి చెప్పుకో తగినట్లుగా వున్నదని ఐక్యరాజ్యసమితి పిల్లలనిధి (యునిసెఫ్) నివేదిక తెలియజేసింది.

1960, 1970 ప్రాంతాలలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు ప్రాథమిక విద్యను విస్తరించేందుకు కృషి చేశాయి.

విదేశీ రుణబాధలు, యితర ఆర్థిక సమస్యలు అనేక ప్రభుత్వాలు విద్యపై పెట్టే వ్యయాన్ని తగ్గించేందుకు కారణమయ్యాయి. 1980లో అభివృద్ధి చెందుతున్న దేశాలలోని సగం దేశాలలో విద్యార్థులపై పెట్టే వ్యయం తగ్గిపోయింది.

గుయానా, టాంజానియా, ట్రినిడాడ్, టొబాగో దేశాలలో 90 శాతం మంది వయోజనులు వ్రాయటం, చదవటం చేయగల్గుతున్నారు. కాని బర్కినాఫాసో, నైజర్, సోమాలియా, యెమెన్ దేశాలలో 20 శాతం మంది వయోజనులు అక్షరాస్యులుగా పేర్కొనబడుతున్నారు.

ఈ నిరక్షరాస్యత పారిశ్రామిక దేశాలలో కూడా మిక్కుటంగా వుంది. ఈ దేశాలలో అనేక మిలియన్‌లమంది స్కూలుకి వెళ్తున్నవారేకాని చదవటం, వ్రాయటంలో తీవ్ర యిబ్బందులకు గురవుతున్నారు. ఫ్రాన్సులో యిటువంటి నిరక్షరాస్యులు వయోజనుల్లో 15 శాతం వున్నారు. జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్‌లో వీరిసంఖ్య 5 లక్షలనుంచి 30 లక్షల వరకు వుండగా, అమెరికాలో 130 లక్షలమంది వున్నారు. సమాజంలోని అన్ని రంగాలపైన ఈ నిరక్షరాస్యత ప్రభావం కనబడుతోంది.

1987 అధ్యయనం ప్రకారం కెనడాలో సంవత్సరానికి 300 కోట్లకుపైగా ప్రత్యక్షంగా ఈ నిరక్షరాస్యుల వల్ల వ్యయమవుతుండగా, ప్రమాదాలు, ఉత్పాదకత తగ్గుదల, శిక్షణావసరాలకు సంవత్సరానికి 700 కోట్లకు పైగా పరోక్షంగా వ్యయమవుతోంది.

ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ నిరక్షరాస్యత సమస్యను దృష్టిలో వుంచుకొని ఐక్యరాజ్యసమితి సాధారణసభ 1990 సంవత్సరాన్ని "అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరం"గా ప్రకటించింది.

ఈ సమస్యపై ప్రపంచ దృష్టిని కేంద్రీ



కరింప చేయటం, విద్యావ్యాప్తికి అవసరమైన చర్యలను తీవ్రతరం చేయటమే అక్షరాస్యతా సంవత్సర ముఖ్యోద్దేశ్యము.

ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ఏజెంటుగా పనిచేసేందుకు పారిస్‌లోని ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతికసంస్థ (యునెస్కో)ను నియమించారు.

1946లో ఈ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి నిరక్షరాస్యతపై పోరుసల్పుతూనే వుంది. ప్రపంచ వ్యాప్తంగా నిరక్షరాస్యతను పారద్రోలేందుకు చేసే పదేళ్ల కృషిలో ఈ ఏడాది ప్రారంభ సూచనగా వుంటుంది.

ప్రాథమిక అధ్యయనావసరాలను తీర్చుకునేందుకు విద్యకు సంబంధించి ఏర్పాటయ్యే ప్రపంచసదస్సు ఈ అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరానికి నాంది పలుకుతుంది.

యునెస్కో, యునిసెఫ్, ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాల సహకారంతో ఈ సదస్సు థాయ్‌లాండ్‌లో మార్చి 5 నుంచి 9 వరకు జరిగింది.

ఇప్పటికే కొన్ని ప్రభుత్వాలు ప్రతిస్పందించి అక్షరాస్యతా కార్యక్రమాలను భారీయెత్తున చేపట్టాయి.

1995 నాటికి 800 లక్షలమంది వయోజనులను అక్షరాస్యులను చేసేందుకు 200 కోట్ల రూపాయలను భారతదేశం ప్రకటించగా 800 లక్షల మంది నిరక్షరాస్యులకు విద్యాబోధన కలుగజేసేందుకు ఐదుసంవత్సరాల విస్తృత కార్యక్రమానికి ప్రణాళికలను చైనా ప్రకటించింది.

యునెస్కో సిఫార్సు మేరకు 40 దేశాలకుపైగా ఈ ఏడాది అక్షరాస్యతా కార్యక్రమాలను చేపట్టేందుకు జాతీయ కమిటీలను ఏర్పాటు చేశాయి.

2 వేల సంవత్సరంనాటికి నిరక్షరాస్యతను రూపుమాపే ఉద్దేశ్యంతో సభ్యదేశాలకు సహకరించే లక్ష్యంతో యునెస్కో తన స్వంత కార్యాచరణ ప్రణాళికను ప్రారంభిస్తోంది.

లాటిన్ అమెరికా, కరిబియన్, ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్, అరబ్ రాజ్యాలలో ప్రస్తుతం వున్న ప్రాంతీయ కార్యక్రమాలను ఆధారం చేసుకొని ఈ ప్రణాళిక రూపొందించ బడుతుంది.


ఈ నిరక్షరాస్యత తొలగింప బడనట్లయితే లక్షలాదిమంది అభివృద్ధి స్రవంతిలో పాల్గొనే అవకాశం లేకుండా తమ జీవనాన్ని కొనసాగించవలసి వస్తుందని న్యూయార్క్‌లోని యునెస్కో కార్యాలయం అధిపతి ఆండ్రి ఇసాక్‌సన్ అన్నారు. మహిళలకు, బాలికలకు విద్య అవసరంలేని సంప్రదాయాలున్న దేశాలలో ఈ సంప్రదాయాలే అక్షరాస్యతకు ప్రతిబంధకాలు అవుతున్నాయని ఆయన విచారం వ్యక్తపరిచారు. కాని మహిళలను, బాలికలను విజ్ఞానవంతుల్ని చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ఇసాక్‌సన్ పేర్కొంటూ ఒక పురుషుడిని విజ్ఞానవంతుడ్ని చేసినట్లయితే ఆ ఒక్క వ్యక్తినే అక్షరాస్యుడిని చేసినట్లవుతుందని కాని ఒక మహిళను విద్యావంతురాల్ని చేస్తే మొత్తం కుటుంబం లాభిస్తుందని ఆయన వివరించారు.

ప్రపంచంలోవున్న నిరక్ష రాస్యులకు అందే ఏ చర్యనయినా ఈ అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరం సమర్థిస్తుంది.


"నేను మరణించేలోగా దేవుళ్ల పేర్లను చదవగల సామర్థ్యాన్ని పొందాలన్న కోరిక నాకుంది" అని నేపాల్‌లోని అక్షరాస్యతా తరగతికి హాజరైన విద్యార్థి ఒకరన్నారంటే నిరక్షరాస్యత నుంచి బయటపడాలనుకున్న అతని తాపత్రయం ఎటువంటిదో మనకు అవగతమవుతుంది.

అటువంటి లక్షలాదిమంది నిరక్షరాస్యులకు ఈ అక్షరాస్యతా సంవత్సరం అక్షర జ్ఞానాన్ని అందించి విజయం సాధించగలదని ఆశిద్దాం!

-తిలక్



లవ్ గేమ్



చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగినకథ 11: కొత్తగా పెళ్లయిన స్వాగత్‌కు భార్య నవ్య నుంచి ఊహించని వ్యతిరేకత ఎదురౌతుంది. తన స్నేహితురాలు శ్రీమతి సహాయంతో స్వాగత్‌ను ఏడిపించాలనుకుంటుంది నవ్య. నవ్య బావ మన్మధరావుకు శ్రీమతి దేహశుద్ధి చేస్తుంది. శైలజతో స్వాగత్‌కు సంబంధం లేదని నవ్య తెలుసుకుంటుంది. శ్రీమతితో నవ్య తమ్ముడు సూర్యం చనువుగా వుంటుంటాడు. పార్టీకి వచ్చిన ఆఫీసు స్టాఫ్ ముందు భర్తను అవమానపరచాలనుకుంటుంది నవ్య.

అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు.

బహుమతి లాంటిది ఆమె చేతిలో ఏమీ లేదు.

నవ్య భర్త కివ్వబోయే ఆ అపూర్వ బహుమానం ఏమిటోనని అంతా ఉత్సుకతతో నిరీక్షిస్తున్నారు.

నవ్య వంగి చెప్పు తీయడం గమనించిన స్వాగత్‌కి అక్కడి నుంచి ఒక్క పరుగుతో బయటకు పారిపోవాలనిపించింది.

కానీ కాళ్ళు కదలలేదు. అచేతనుడై నిలబడి పోయాడు.

నవ్య చెప్పు తీసి చేత్తో పట్టుకుంది.

స్వాగత్ కళ్ళు మూసుకుని క్షణాలు లెక్క వేస్తున్నాడు.

శ్రీమతి చూయింగమ్ కసిగా నములుతోంది.

నవ్యా తలెత్తి స్వాగత్ ముఖంలోకి చూసింది.

తెల్లగా పాలిపోయి– కళ్ళు మూసుకుని– ఊపిరి బిగబట్టిన అతన్ని చూస్తుంటే– తానింత సేపూ పార్టీ పేరు మీద అనుభవించిన చిత్రవధ గుర్తొచ్చి కసిగా నవ్వుకుంది నవ్య.

చెప్పు పట్టుకున్న చేతిని పైకి ఎత్తబోయేంతలో –

"హలో .... గుడీవినింగ్ ఎవ్రీబడీ...."

అన్న గంభీరమైన కంఠ స్వరానికి నవ్వతో పాటు అంతా అటు చూశారు భాగ్యరాజ్ – భార్గవి!!

నవ్య చేతిలోని చెప్పు అప్రయత్నంగా జారి కిందపడింది.

స్వాగత్ కళ్ళు తెరిచాడు.

ఆ నాడు నిండు కొలువులో – ద్రౌపదిని ఆదుకున్న శ్రీకృష్ణుడిలా ఈ నాడు తనను రక్షించడానికి వచ్చిన మేనమామను చూసి–

"మావయ్యా...." సంబ్రమంగా అరిచాడు స్వాగత్.

నవ్య శ్రీమతిని చూసింది.

శ్రీమతి మరో చూయింగమ్ నోట్లో వేసుకుని ఎవరని' కళ్ళతోటే అడిగింది.

నవ్య చెప్పింది.

భాగ్యరాజ్ స్టాఫ్ అందర్నీ పేరు పేరున పలకరిస్తూ అందరితో కలిసి పోయాడు.

"వీళ్ళంతా ఆయన కెలా తెలుసు?" అడిగింది శ్రీమతి.

"స్వాగత్ ఫారిన్ వెళ్ళినప్పుడు – బిజినెస్ వ్యవహారాలన్నీ భాగ్యరాజ్ గారే చూశారట. ఓ విధంగా స్వాగత్ దగ్గరకంటే భాగ్యరాజ్ దగ్గరే స్టాఫ్‌కి చనువెక్కువ...." అంది నవ్య.

"షిట్! ఎవరైతేనేం? మన ప్లానంతా నాశనం చేశాడు" కోపంగా అంది.

"ఏమ్మా– మేము లేకుండానే పార్టీ ఇస్తున్నావా?"

భాగ్యరాజ్ నవ్య దగ్గరకొచ్చి అడిగాడు.

నవ్య నవ్వింది.

"ఏమ్మా– ఎలా ఉన్నావ్?" నవ్య భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా అడిగింది భార్గవి.

"ఈమె నా ఫ్రెండ్ శ్రీమతి–" అంది నవ్య.

అప్పటి వరకూ వాళ్ళిద్దర్నీ కసిగా చూస్తున్న శ్రీమతి బలవంతాన నవ్వుతూ చేతులు జోడించింది.

"నమస్తే బేబీ! అయాం భాగ్యరాజ్ అండ్ షి ఈజ్ మిసెస్ భాగ్యరాజ్"– అన్నాడతను.

"మిసెస్ భాగ్యరాజ్ అనకపోతే నాకూ పేరుందిగా! నా పేరు చెప్పకుండా మీ భార్యగా మాత్రమే పరిచయం చేసి – స్త్రీకి కనీసం తన పేరును కూడా భర్త పేరుగానే చెప్పుకోవలసిన పరిస్థితుల్ని సృష్టించే మీ మగవారిని ఏం చేసినా పాపం లేదు–"

ఆవేశంగా అంటున్న భార్గవిని చూసి ఆనందంగా చప్పట్లు కొట్టింది శ్రీమతి.

"వెల్ ఆంటీ! చాలా బాగా చెప్పారు. అవును– మిసెస్ భాగ్యరాజ్‌గా మిమ్మల్ని అంకుల్ పరిచయం చేసినప్పుడు– మీరు అంకుల్‌ని మిస్టర్ భార్గవిగా పరిచయం చేయండి–" అంది శ్రీమతి.

పెద్దగా నవ్వాడు భాగ్యరాజ్.

"రేయ్ స్వాగత్– మన మగవాళ్ళని అంత దారుణంగా మాట్లాడుతుంటే అలా చూస్తూ నిలబడ్డావేం– మాట్లాడు–" అన్నాడు భాగ్యరాజ్.

"కొట్టబోతే కడుపుతో వుంది. తిట్టబోతే అక్కకూతు రన్నట్టుంది మావయ్యా నా పరిస్థితి. ఏం మాట్లాడను?" అన్నాడు నవ్వుతూ.

పెళపెళ నవ్వాడు భాగ్యరాజ్.

"ఎక్స్‌క్యూజ్‌మి...." అంతా అటు చూశారు.

శైలజ నిలబడుంది.

"వాట్ శైలూ- వాట్స్ ద మేటర్?" అన్నాడు భాగ్యరాజ్.

"ఏం లేద్సార్! మీరు వచ్చేముందు మేడమ్ స్వాగత్‌గారి కేదో అపురూపమైన బహుమానం ఇస్తానని ఎనౌన్స్ చేశారు. అదేమిటో చూడాలని మా కెంతో ఉత్సాహంగా ఉంది..." అంది శైలజ.

నవ్య శ్రీమతిని చూసింది.

శ్రీమతి ఆకాశాన్ని చూసింది.

స్వాగత్ ఇద్దర్నీ అల్లరిగా చూస్తున్నాడు.

"నిజమే శైలూ– నేను మర్చి పోయాను. అవును నవ్యా డాళింగ్– ఏవిటా అపురూప మైన బహుమతి?"


చనువుగా ఆమె భుజం మీద చెయ్యేసి అడిగాడు స్వాగత్.

నవ్యకేం చేయాలో పాలు పోలేదు.

బిక్క ముఖంతో దిక్కులు చూడసాగింది.

"ఏమిటమ్మా అది?" భార్గవి అడిగింది.

తల దించుకుంది నవ్య.



"నేను చెప్పనా మేడమ్?" అంది శైలజ నవ్వుతూ

అంతా ఆమెనే చూస్తున్నారు.

శైలజ అందరి మధ్యకొచ్చి అంది.

"ఫ్రెండ్స్- మేడమ్ నవ్య- ఆ బహుమానం ఏమిటో చెప్పడానికి సిగ్గు పడుతున్నారు. అదేమిటో నేనే చెప్తాను-"

అంతా ఉత్సాహంగా చూస్తున్నారు.

"మన బాస్ స్వాగత్ గారికి - నవ్యగారు మరో జూనియర్ స్వాగత్‌ని ఓ తొమ్మిది నెలల్లో ప్రజెంట్ చేయబోతున్నారు-"

ఒక్క క్షణం నిశబ్దం తర్వాత-

చప్పట్లతో ఆ ఆవరణ ప్రతిధ్వనించింది.

కాళ్ళ కింద భూమి కుంగి పోతుంటే శక్తి సన్నగిల్లి తూలి పడుతున్నట్టు నవ్య పక్కనే ఉన్న టేబుల్ పట్టుకుని నిలబడింది.

అవమానం- సిగ్గు- రోషంతో ఆమె వణికిపోతోంది.

"నో...." అని అరిచి అందరికీ అసలు విషయం చెప్పాలనుకుంది.

అయితే- అప్పటికే అంతా వచ్చి స్వాగత్‌ను అభినందిస్తున్నారు. స్వాగత్ అల్లరిగా ఆనందంగా- నవ్యను, శ్రీమతిని చూస్తున్నాడు. విజయవంతం కాబోతున్న తమ పథకం ఆఖరి క్షణంలో బెడిసికొట్టి, తాము ఊహించని రీతిలో తమకే తగలడంతో అవమానంతో క్రుంగిపోతూ నిలబడ్డారు నవ్య,శ్రీమతి.

భార్గవి భాగ్యరాజ్‌ని చూసింది.

భాగ్యరాజ్ చిన్నగా నవ్వాడు.

* * * * * * *

"ఆడది నీడలాంటిది. వెంటబడితే పారిపోతుంది. పారిపోతే వెంటబడుతుంది" పైప్ వెలిగించి అన్నాడు భాగ్యరాజ్. స్వాగత్ మాట్లాడలేదు.

చీకట్లో దూరంగా మెరుస్తున్న లైట్లను చూస్తున్నాడు.

"నేను చెప్పింది అర్థమైందా?" అడిగాడు భాగ్యరాజ్.

"తెలుగులోనే కదా నువ్వు చెప్పింది?" అడిగాడు స్వాగత్.

పెళ్ళున నవ్వాడు భాగ్యరాజ్.

పార్టీ అయిపోయి- అంతా వెళ్ళిపోయాక- స్వాగత్‌ని తీసుకుని పైన మేడమీదికి వెళ్ళాడు భాగ్యరాజ్.

తననంత అర్జెంట్‌గా రమ్మన్నదెందుకో అడిగాడు.

స్వాగత్ తన సమస్యలన్నీ చెప్పాడు. నవ్య మనస్సు ఎలా మార్చాలో చెప్పమన్నాడు.

అంతా శ్రద్ధగా విన్న ఆయన ఏదైనా మంచి సలహా ఇస్తాడనుకుంటే- ఆడది- నీడ- అంటూ వేదాంతం చెప్తున్న మేనమామ మీద గొంతువరకూ వచ్చింది

దేవతా వస్త్రాలంటే అంత యిష్టమా?

మన దేశంలో ఒంటిమీద నూలుపోగు లేకపోతే ఎంత గందరగోళ మవుతుందో తెలియందికాదు. కాని ఫ్రాన్సులో మాత్రం వస్త్రధారణకు వ్యతిరేకంగా స్వాభావిక వాదులు కొంత మంది పోరాటం జరుపుతున్నారు. వీళ్లకు ప్రత్యేక విహార స్థలాలున్నాయి. అక్కడికివచ్చే వారికి కొన్ని నిబంధనలున్నాయి.

ఆ నిబంధనలలో ముఖ్యమైనది వస్త్రాలు ధరించకుండా రావటమేనట. అలా రాకపోతే ఆ విహార స్థలాల్లోకి అనుమతించరు. ఇటీవల ఈ స్వాభావిక వాదుల పోరాటానికి బ్రేకులు పడుతున్నాయట. కారణం వస్త్రాలు ధరించినవారు అనేకమంది ఈ విహారస్థలాలకి రావటమే! ఇలా తమ సంప్రదాయాన్ని మంటగలుపుతున్న వారిపై చర్య తీసుకోవాలని స్వాభావిక వాదుల ఫెడరేషన్ యోచిస్తోంది.

చలికాలంలో ఈ సంప్రదాయానికి కొంత సడలింపు వుంటుంది. బెల్జియంలో ఈ సంప్రదాయాన్ని (అంటే వస్త్రాలు ధరించకుండా) తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు.

ఫ్రాన్సులోని ఈ విహార స్థలాలను ఏటా సందర్శించే రెండు లక్షలమంది జర్మన్‌లు ఎప్పుడూ వస్త్రాలు ధరించరట!

కోపం అతనికి.

"అంచేత ఆడదాని మనస్సు గెలవాలనుకున్నప్పుడు... చీప్‌ట్రిక్స్ ఉపయోగించ కూడదు" అన్నాడు.

విసుగ్గా చూసి అన్నాడు స్వాగత్.

"నా ప్రయత్నాలేవో నేను చేశాను. ఫలితం లేదనేగదా నిన్ను పిలిపించింది? నవ్య మనస్సు మార్చడానికి ఏదైనా సలహా ఇవ్వగలిగితే ఇవ్వు దట్సాల్!"

"అదేమన్నా నువ్వేసుకున్న షర్ట్ ఏమిట్రా- ఇష్టమొచ్చినప్పుడు మార్చడానికి? మనస్సు- తెలుసా?"

"తెలుసు- అందుకే ఈ మెలో డ్రామా డైలాగులు మాని విషయం చెప్పు" చిరాగ్గా అంటున్న మేనల్లుణ్ణి చూసి గుబురు మీసాల చాటున నవ్వుకున్నాడు భాగ్యరాజ్.

"అందుకే చెప్పాను. ఆడది నీడ లాంటిదని..."

"మావయ్యా.... ప్లీజ్... డైలాగు లొద్దు" అరిచాడు స్వాగత్.

"అదికాదురా స్వాగత్! నేను చెప్పేది కూడా అర్థం చేసుకో. ఇంత కాలం ఆమె వెంట నువ్వు పడ్డావ్- ఆమె అందకుండా పరుగెత్తింది. అందుకే ఇప్పుడు నువ్వు పరుగెత్తు. ఆమె వెంటబడుతుంది."

ఆశ్చర్యంగా చూశాడు స్వాగత్.

"అవున్రా- అసలామెను పట్టించుకోకుండా- నీ వ్యవహారాలేవో నువ్వు చూసుకుంటూ వుండు. ఆమెని మార్చాలని నువ్వు ప్రయత్నిస్తున్నట్టు గానీ- పందెం గెలవాలని నువ్వు తాపత్రయ పడుతున్నట్టు గానీ - ఆమెకు కొంచెం కూడా అనుమానం రానివ్వకు"- తాపీగా గంభీరంగా చెప్తోన్న భాగ్యరాజ్‌ని తన్మయంగా చూస్తుండిపోయాడు స్వాగత్.

"అలా చేస్తే నవ్య మారుతుందంటావా?" ఆశగా అడిగాడు.

"తప్పకుండా మారుతుంది. ఆడవాళ్ళ సైకాలజీ నీకు తెలీదు. అందుకే అన్నారు మేధావులు... ఆడది నీడ లాంటిది... పరిగెత్తితే...."

"ఇప్పటికి వందసార్లు చెప్పావామాట. అది వదిలేసి నేనేం చేయాలో చెప్పు..."

"చెప్పాగా? రేపట్నుంచీ నీ ప్రవర్తనలో విపరీతమైన మార్పు రావాలి. అసలు నీ భార్యంటూ ఒకామె ఈ ఇంట్లో ఉందన్న విషయం కూడా నువ్వు మర్చిపోయినట్టు ప్రవర్తించాలి."

"అంతకన్నా ఆమెకు కావల్సిం దేముంది. ఆమె కోరుకుంటోంది కూడా అదే... అలాంటప్పుడు నేను పందెం గెలిచేదెలా?"

పెద్దగా నవ్వాడు భాగ్యరాజ్.

"పిచ్చివాడా! నీ కింకా అనుభవం లేదు గనుక ఇలా మాట్లాడు తున్నావ్. ఆడవారి బలహీన తేమిటో తెలుసా? తమనేమాత్రం పట్టించుకోని వారి పట్ల ఆకర్షితు లౌతారు. ఓ అమ్మాయిని వరసగా వారం రోజులు బాడీగార్డులా వెంబడించు. హఠాత్తుగా ఓ రోజు- ఆమె వెనక పడ్డం మాని- చాటు నుంచి గమనించు. నువ్వు వెంటబడు తున్నప్పుడు ఒక్కసారి కూడా వెనక్కి తిరగని ఆ అమ్మాయి- నువ్వు లేనప్పుడు అడుక్కోసారి నీ కోసం వెనక్కి తిరిగి చూస్తుంది. ఆ అమ్మాయి ముఖంలో నిరాశ స్పష్టంగా కనిపిస్తుంది. అలా మూడు రోజులు మాని నాలుగో రోజు మళ్ళీ ఆ అమ్మాయిని వెంబడించు- అప్పుడామె నడకలో ఇదివరకటి వేగం ఉండదు. తెచ్చి పెట్టుకున్న కోపం- విసుగు ఉండవు. ప్రతి అయిదడుగులకోసారి ఓరగా నిన్ను చూస్తూ నడుస్తుంది. అంటే- ఇక పరిచయానికి సిద్ధమన్న మాట-"

ఆశ్చర్యంగా వింటున్నాడు స్వాగత్.

నలభై అయిదేళ్ళ వయసులో తనకి ప్రేమ పాఠాలు చెప్తోన్న మేనమామను భక్తిగా చూస్తున్నాడు స్వాగత్.

"అంచేత నేను చెప్పినట్టు చెయ్యి. పిచ్చి పిచ్చి అనుమానాలు పెట్టుకోకు"- అన్నాడతను.

"అలా అయితే- ఆమె మనస్సు మారుతుందంటావా?" అనుమానంగా అడిగాడు.

"మారక పోవడానికి అదేమైనా రాయా?మనస్సురా! పవిత్రమైన కన్నె మనస్సు!" గంభీరంగా అన్నాడు భాగ్యరాజ్.

తలదించుకుని ఆలోచిస్తున్న స్వాగత్‌ని చూసి చిన్నగా నవ్వుతూ-

"రేపట్నుంచే నీ ప్రయత్నాలు ప్రారంభించు. అప్పుడు విజయానికి నువ్వెంతో దూరంలో ఉండవు."

భుజం తట్టి అన్నాడు భాగ్యరాజ్.

తలదించుకునే తల ఊపాడు స్వాగత్.

సరిగ్గా అదే సమయంలో -

కింద బెడ్‌రూంలో అప్పటి వరకూ భార్గవి చెప్పిన మాటలు విని నవ్వుతూ తలూపింది నవ్య.

* * * * * *

"దుర్గా- కాఫీ"

ఉలిక్కిపడింది నవ్య.

ఎప్పుడూ కాఫీ కోసం తనని పిలిచే స్వాగత్- ఈ రోజు దుర్గను పిలుస్తున్నాడు. తనను పిలిచినా- తాను కాఫీ కలిపి- దుర్గ చేతికిచ్చి పంపిస్తుంది. కానీ ఈ రోజు భార్గవి బలవంతం మీద కాఫీ కప్పుతో అతని ఆఫీస్ గదిలోకి రాబోతుండగా- అతని కేక విని- అలాగే నిలబడింది.

హాల్లో కూర్చుని ఇదంతా గమనిస్తున్న భాగ్యరాజ్ ముఖానికి పేపర్ అడ్డు పెట్టుకుని నవ్వుకున్నాడు.

భార్గవి నవ్యకు వెళ్ళమని సైగ చేసింది.

ఆ కాఫీ కప్పును అక్కడే నేలకేసి పగల కొట్టి వెళ్ళిపోదామనుకుంది నవ్య. కానీ అవతల ఆ పెద్ద మనుషుల ముందు సీన్‌క్రియేట్ చేయడం ఇష్టం లేక గదిలోకి అడుగు పెట్టింది.

ఏదో ఫైలు తిరగేస్తూ- సిగరెట్ కాల్చుకుంటున్నాడు స్వాగత్.

కాఫీ కప్ టేబుల్ మిద పెట్టింది నవ్య.

తలెత్తి ఆమెను చూసి- ఆశ్చర్యాన్ని కనిపించనీయకుండా- వెంటనే తల దించుకుని ఫైల్లో పేజీలు తిరగేస్తున్నాడు.

"థాంక్స్- అదేవిటి నువ్వు తెచ్చావ్? దుర్గ లేదా?' అంటాడనుకున్న అతను నిశ్శబ్దంగా, కనీసం థాంక్స్ కూడా చెప్పకుండా ఫైలు చూస్తుంటే- అవమానంతో రగిలిపోతూ విసురుగా బయటికొచ్చింది నవ్య.

లాభం లేదు.

ఈ నటన తన వల్లకాదు. వారే మనుకున్నా నష్టం లేదు కానీ- ఇలా అణకువైన ఇల్లాలిలా అతనికి సపర్యలు చేస్తూ కాఫీ లందిస్తూ తిరగడం తన వల్ల కాదు.

"ఏవిటమ్మా- ఆఫీస్‌కి వెళ్తాడటా వాడు?" భాగ్యరాజ్ అడిగాడు.

"వె... వెళ్తారట..." తడబడుతూ చెప్పింది.

"మరి స్నానానికి నీళ్ళు పెట్టించావా?" అడిగింది భార్గవి.

"నేను పెట్టించను- దుర్గకు తెలుసు. ఆమె పెడుతుంది...." అందా మనుకుని-

"పెట్టిస్తాను-" అంటూ వెళ్ళిపోతున్న ఆమెను చూసి భార్గవి భాగ్యరాజ్‌ను చూసింది.

భాగ్యరాజ్ కుడి చేతి బొటనవేలు పైకెత్తాడు.

"స్నానానికి నీళ్ళు పెట్టాను-"

తలెత్తి చూశాడు స్వాగత్.

తల దించుకుని ఉంది నవ్య. మేనమామ ఆమె చేత చేయిస్తున్న సర్కస్‌కు అతనికి నవ్వొచ్చింది. ఫైల్ మూసి- బాత్‌రూం వేపు నడిచాడు. బయటి కొస్తే మళ్ళీ ఏ పని పురమాయిస్తారో నని అలాగే అతని గదిలో నిలబడింది నవ్య.

ఆమె విపరీతమైన ఆవేశంతో వణికి పోతోంది.

వాళ్ళు అలా పనులు చెప్తున్న దానికంటే- స్వాగత్ ముభావం ఆమెను బాధపెట్ట సాగింది. వీళ్ళు రాకముందు తాను కాఫీ అందిస్తే- ఆ రోజు ఆఫీస్‌కి కూడా వెళ్ళకుండా ఎక్సయిట్ఐ ఏదేదో పిచ్చి వాగుడు వాగే అతను- ఈ రోజు కనీసం థాంక్స్ కూడా చెప్పకుండా పోజ్ కొడుతున్నాడంటే-

"అమ్మాయ్ నవ్యా-"

ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న ఆవేశాన్ని అతి కష్టం మీద నిగ్రహించుకుంటూ బయటి కొచ్చింది నవ్య.

"అబ్బాయికి భోజనం వడ్డించు. ఆఫీస్‌కి ఆలస్యమై పోతుందేమో-" అంది భార్గవి.

"అందరం కలిసే చేద్దాం. రండి-" అంది నవ్య.

అలాగయినా అందరితో పాటు అతనికీ ఓ ముద్ద పడేయొచ్చన్న ఉద్దేశంతో.

"మనకి తొందరేముందమ్మా- ముందు వాడికి వడ్డించు. తర్వాత భోంచేద్దాం మనం-" అన్నాడు భాగ్యరాజ్.

భగవంతుడా- నన్ను రక్షించు.

బాధగా మూలిగిందామె మనస్సు. మౌనంగా డైనింగ్ హాల్లోకి నడిచింది నవ్య.

★ ★ ★ ★ ★ ★ ★

"వాట్- అంత దారుణం చేయించాడా నీ చేత?" ఆశ్చర్యంతో అరిచింది శ్రీమతి.

లవ్ గేమ్

"అవును. ఇంక ఈ ఇంట్లో క్షణం కూడా ఉండలేను నేను" ఆవేశంతో అంది నవ్య.

స్వాగత్ ఆఫీస్‌కి వెళ్ళాక- భోజనాలు చేసి- భాగ్యరాజ్ భార్గవిలు నిద్రపోతున్న సమయంలో- శ్రీమతి ఆఫీస్‌కి ఫోన్ చేసి- ఆమెను అర్జంట్‌గా పిలిపించి విషయం చెప్పింది నవ్య.

"వద్దు. అంత పని చేయకు. ఈ ఇంట్లోంచి నువ్వెళ్ళిపోతే- అతనికి భయపడి నువ్వు పారిపోయినట్టవుతుంది". అంది ఆలోచిస్తూ శ్రీమతి.

"ఏమైనా కానీ- ఇంక అతనికి సేవలు చేస్తూ- దాసిలా బ్రతకడం నా వల్ల కాదంటే కాదు"- స్థిరంగా అంది.

"నీకు ఆవేశమెక్కువ. ఆలోచన తక్కువ. ఇలాంటి సమయాల్లోనే మనం బాగా ఆలోచించి అతన్ని దెబ్బ తీయాలి"- అంది శ్రీమతి.

"అయితే అదేదో ఇప్పుడే చేద్దాం. ప్లీజ్-" ఆమె చేతులు పట్టుకుని అంది నవ్య.

ఓ అయిదు నిముషాలు మౌనంగా ఆలోచించింది శ్రీమతి. ఆమెనే రెప్పార్పకుండా చూస్తోంది నవ్య.

"ఐడియా-" చిటిక వేసి అంది శ్రీమతి.

"ఏంలేదు. ఈ దెబ్బతో అతని పీడ నీకు శాశ్వతంగా విరగడవుతుంది."

"ఎలా?" ఆశ్చర్యానందాలతో అడిగింది నవ్య.

"నీ మొగుడికి వేరే ఆడవాళ్ళతో కాంటాక్ట్స్ ఉన్నాయని నిరూపిస్తే నీకు విడాకులు దొరుకుతాయి గదా"

"యస్సెస్... అవునవును...." ఉత్సాహంగా అంది నవ్య.

"అలాంటప్పుడు అతనికెంతమంది అమ్మాయిల్తో అలాంటి సంబంధాలున్నాయో తెలుసుకోవడం మన వల్ల కాదు. అవునా?"

"అందుకని..." ఆతృతగా అంది.

"కంగారుపడకు. అందుకని మనం ఓ డిటెక్టివ్‌ని అపాయింట్ చేసి నీ మొగుడి..."

"ప్లీజ్ అలా అనొద్దని చాలాసార్లు చెప్పాను నీకు".

"సారీ- అతను వేసే ప్రతి అడుగునూ జాగ్రత్తగా పరిశీలించి ఆ అమ్మాయిల అడ్రెస్‌లు- అతని కార్యకలాపాలు మొత్తం ఆ డిటెక్టివ్ మనకు అందజేస్తాడన్న మాట..."

సాలోచనగా తలపంకించింది నవ్య.

డిటెక్టివ్‌లను సినిమాల్లో చూసింది. నవలల్లో చదివింది. నిజ జీవితంలో కూడా డిటెక్టివ్స్ ఉంటారనీ- వాళ్ళు ఇలాంటి కేసులు చేస్తారనీ తెలీదు తనకు.

"ఏవిటాలోచిస్తున్నావ్?" అడిగింది శ్రీమతి.

"ఏం లేదు. కనీసం ఈసారన్నా సక్సెస్ అవుతామంటావా?"

"తప్పకుండా. ఇంకా చెప్పాలంటే ఖచ్చితంగా! ఎందుకంటే అతనికి తప్పకుండా వేరే ఆడవాళ్ళతో పరిచయాలుండి వుంటాయి. డిటెక్టివ్ ద్వారా సాక్ష్యాలతో సహా సేకరించి కోర్టులో ప్రొడ్యూస్ చేస్తే- నీకు విడాకులు గ్యారంటీ"- అంది శ్రీమతి నవ్వుతూ.

"అయితే ఇంకాలస్యం దేనికి? వెళ్దాం పద"- అంది లేచి నిలబడుతూ.

"ఆ తొందరే పనికిరాదు. ఇంట్లో ఈ పెద్ద దిక్కుంది గదా- వీళ్ళకు తెలీకుండా వెళ్ళాలి మనం. పొరపాటున తెలిసిందంటే- ఆ తర్వాత మనిద్దరం కలుసుకోవడం ఇదే ఆఖరుసారవుతుంది" అంది శ్రీమతి.

నీరసంగా కూలబడింది నవ్య.

"రేపు సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకు మా ఆఫీస్‌కొచ్చేయ్. అక్కడ్నుంచి ఇద్దరం కలిసి వెళ్దాం-" అంది శ్రీమతి.

"అలాగే- నువ్వేదో షాపింగ్ వుందని ఫోన్ చేసి పిలువు. వచ్చేస్తాను" అంది నవ్య.

"వెరీ గుడ్- ఇక నేను వెళ్ళొస్తాను. బై ది బై ఈ రాత్రి జాగ్రత్త. ఈ పెద్దవాళ్ళ వ్యవహారం చూస్తుంటే- నీకీ రాత్రి శోభనం బాధ తప్పదని నా డౌట్"- అంది నెమ్మదిగా శ్రీమతి.

నవ్యకు చెమటలు పట్టాయి. నిజమే! తనంత దూరం ఆలోచించలేదు. పట్టుబట్టి తన చేత ఇన్ని పనులు చేయిస్తున్న వీళ్ళు రాత్రికి ఆ పని మాత్రం

చేయించరని గ్యారంటీ ఏమిటి?

"ఏం చేయమంటావ్?" భయంగా అంది నవ్య.

"ప్రతి విషయం నాతో చర్చించి- నా ఆలోచన ప్రకారం నడవాలంటే కుదరదు. కొంత నీ బుర్ర కూడా ఉపయోగించు".

మౌనంగా తలూపింది నవ్య.

* * * *

ఆ గదిలోకి అడుగు పెట్టిన స్వాగత్ ఆశ్చర్యపోయాడు. మంచం చుట్టూ మల్లెపూల తోరణాలు- పాలు- పళ్ళు- అగరవొత్తులూ.... శోభనంనాటి రాత్రి గుర్తొచ్చి- అతని మనసు బాధతో విలవిలలాడింది.

ఆ గదిలో రెండు సింగిల్ మంచాలు తీసేసి- ఒకే డబుల్ కాట్‌ను అలంకరించారు.

సిగరెట్ తీసి వెలిగించాడు స్వాగత్.

ఆ అలంకరణకు నవ్య రెస్పాన్స్ ఎలా ఉంటుందో ఊహించ లేకపోతున్నాడతను. ఒక్క క్షణం ఎందుకో అతనికి.... ఈ రాత్రి తన జీవితంలో వసంత రాత్రిగా మిగిలిపోతుందన్న భావం మెదిలి-

వెంటనే అసహనంగా తల విదిలించాడు.

కోరికలకైనా- ఆశలకైనా హద్దుండాలి. పూట గడవని సామాన్యుడు రాత్రికి రాత్రి కోటీశ్వరుడు అవడం ఎంత ఫిక్షనో- తానీ విధంగా ఆలోచించడం కూడా అంతే అవుతుంది.

అంతలోనే అతని మనస్సు ఎదురు తిరిగింది.

లవ్ గేమ్

అవును. ఈ రాత్రి తానామెను లొంగదీసుకోవడానికి బ్రహ్మాండమైన అవకాశం. పరిస్థితులు తనకి అవకాశాన్ని కల్పించాయి. అలాంటప్పుడు తాను తన పందెంలో విజయం సాధించడానికంతకన్నా అపురూపమైన అవకాశం ఏముంటుంది? అరిచి గొడవ చేసే అవకాశం ఆమెకిప్పుడు లేదు. అలాంటి పరిస్థితే ఆమెకుంటే- తను కాఫీ టీ- భోజనాలకీ అటెండ్ అయ్యేదికాదు.

అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

అవును.

అంతమందిలో- తన స్టాఫ్ ముందు తనను చెప్పు తీసుకుని కొట్టడానికి సిద్ధపడిన ఆడది- ఇప్పుడు ఈ రాత్రి తనీ అవకాశాన్ని వినియోగపర్చుకుంటే ఏం చేస్తుంది? ఎవరాపగలరు తనని? క్రమంగా అతనిలో పట్టుదల పెరిగి- పంతం హెచ్చింది. ఇంట్లో మనుషులు- వాతావరణం- పరిస్థితులు- అన్నీ తనకి అనుకూలంగా ఉన్నాయి.

వాచీ చూసుకున్నాడు.

పది దాటి ఐదు నిమిషాలు.

భార్గవత్తయ్య బహుశా నవ్యను ముస్తాబు చేస్తుందేమో- చేయనీ- తాను ప్రతిసారీ మానవత్వం- మనస్సు- వగైరాలను గూర్చి ఆలోచిస్తూ పట్టనట్టు పోతుంటే- ఆవిడ తనను చెప్పు తీసుకుని కొట్టడానిక్కూడా సిద్ధపడినప్పుడు- తానెందుకు ఉదాసీనంగా ఉండాలి? అది తన మంచితనం అనుకోకుండా- తన అసమర్థతగా ఆమె గుర్తిస్తున్నప్పుడు- తానెందుకు అడుగు ముందుకేయకూడదు?

మరో సిగరెట్ వెలిగించాడు.

యస్! మర్యాదగా లొంగడం ఆమె తత్వం కాదు. బ్రతిమాలి- ప్రాధేయపడి- సమయాన్ని వృథా చేసుకోకూడదు. అవసరమైతే- బలవంతంగానైనా ఆమెను లొంగదీసుకోవాలి. అతని పెదవుల మీద చిన్నగా మొదలైన ఆ నవ్వు- పెద్దగా మారి సిగరెట్ పొగతో పాలమారింది.

రేప్!!

స్వయాన తాళి కట్టిన భార్యను తానీ రోజు రేప్ చేయబోతున్నాడు. ఏ న్యాయశాస్త్రం తనకి శిక్ష విధిస్తుందో చూడాలి.

తనను రేప్ చేశాడని కోర్టులో చెప్పి విడాకులు తీసుకుని- ఆమె ఈ సమాజంలో ఏమాత్రం గౌరవంగా బ్రతగ్గలదో తనూ చూస్తాడు. ఓ ఆడది తన జీవితంలో ఇంత అగాథాన్ని ఏర్పరచినప్పుడు- తాను చేతకాని వాడిలా ఆమెను వదిలేయడం తన మగతనానికి సిగ్గుచేటు.

ఏ చేత్తో చెప్పు తీసుకుని తనను అవమానించాలని చూసిందో అదే చేత్తో ఆమె తన కాళ్ళు పట్టుకుని బ్రతిమిలాడాలి.

గుమ్మం దగ్గర గాజుల చప్పుడయింది.

యువతా! కవితా!!

"అ"నాది....

అనాదిగా
బలి అవుతున్న
అనాథలం
"అ"అంటే...
అర్థం తెలియక
"నా" అనే
నావారు లేక
"ది" అంటే...
దిగజారుతున్న
అనాథలం!

-కె. సత్యవల్లి

నిన్న-నేడు

చిన్నప్పుడు నాతో-
"ఇరవై నాలుగ్గంటలూ
ఆటలాటలని చస్తావేరా పీనుగా...
ఆటలు తిండెట్టవ్
పుస్తకం తెరిచి చదువు"
అనే వాడు మానాన్న!
ఇప్పుడు నా కొడుకుతో-
"చదువులు భుక్తి చూపించవు రా కన్నా!
బంతీ బ్యాటూ పుచ్చుకొని
మైదానంలో ప్రాక్టీసు చెయ్యి.
కనీసం ఇంటర్ యూనివర్శిటీ స్థాయి
పోటీల్లో ఆడినా
ఉద్యోగం గ్యారంటీ"
అంటున్నాడు మానాన్నే.

-భూస అప్పలరెడ్డి

ఈ వ్యవస్థలో...

కులం నీతి-
మతం ఖ్యాతి-
నిజం మృతి!
బ్రతుకు రుణం-
భవిత వ్రణం
శ్రమ మరణం!!
క్షుద్ర భక్తి-
స్వార్థభుక్తి-
పదవిరక్తి!!!

-రాపోలు పరమేశ్వరరావు

నిజమైన ప్రేమ

ప్రేమను ప్రేమించు
ప్రేమించుటకు!
ప్రేమించుటకు ప్రేమను
సృష్టించకు!
మనసున మొలచిన ప్రేమ
కలకాలం...
సృష్టించుట వలన పుట్టిన ప్రేమ
అనతికాలం!
ఇది తెలుసుకున్న ప్రతివారికి
లభిస్తుంది
నిజమైన ప్రేమ!

-వై. శ్రీనివాస్

జబ్బు-డబ్బు

మనం మనం ఒకటే
కులం మతం ప్రాంతం వగైరా...
ఇది సర్వజనావళికివ్యాపించినజబ్బు!
కులం కాని పిల్లయితే నేంరా
కాసులమూట తెస్తోందిగా ఓ.కె.
ఇది సర్వరోగ నివారిణి డబ్బు!!

-వల్లమూడి దుర్గాంబ

డిక్టేషన్

హద్దూ, పద్దూ లేని
నవ నాగరికుల ఫ్యాషన్
పాలు, చక్కెర లేని
కషాయంవంటి డికాషన్!
ఊరికే అవుతారు
త మాషాగా ఎమోషన్
మాస్టారు చెపితే
రాయలేరు పాపం-
తెలుగు డిక్టేషన్!

కె.సి. బాబు

మతం-కమతం

మూఢుల్ని
చెయ్యి గలదు
మతం
కొందరినయినా!
మృష్టాన్నం
పెట్టగలదు
కమతం
ఎందరి కయినా!
అందుకే నేస్తం
మతాన్ని
దూరముంచు...
కమతంలో
కష్టించు!

-వాసాల నరసయ్య

వెనక్కి తిరిగి చూశాడు.

నవ్య!!

కొత్త అలంకరణతో- సరికొత్త ముస్తాబుతో అపురూపంగా వెలిగిపోతోంది.

ఆమె రెండడుగులు లోపలికి వేసింది.

ఆమె వెనుక తలుపులు మూసుకుని- బయట గడ వేసిన శబ్దం!

ఆమె తల దించుకుని నిల్చుంది.

అతను సిగరెట్ పారేసి- ఆమెని చూశాడు.

అతను నెమ్మదిగా నడుస్తూ ఆమెని సమీపిస్తున్నాడు. ఆమె తలెత్తలేదు. అలాగే తల దించుకుని బొటన వేలితో నేలమీద రాస్తూ- పాల నురగలాంటి పట్టుచీరెను వేళ్ళ మధ్య నలుపుతూ-

"ఇప్పుడేమంటావ్?"

తలెత్తి చూసింది నవ్య.

అతని ముఖంలో తనెప్పుడూ చూసే చిరునవ్వు లేదు. అల్లరి లేదు. చాలా కఠినంగా' క్రూరంగా- కర్కశంగా ఉందతని ముఖం.

ఆమె ఒళ్ళు జలదరించింది.

ఉదయం అతని ప్రవర్తన- ఇలాంటి సన్నివేశాల్లో అతని మంచితనం- ఆమెకీ రాత్రి తనను తాను రక్షించుకోగలనన్న విశ్వాసాన్ని ఏర్పరిచాయి.

కానీ ఇప్పుడు అతన్ని చూస్తుంటే- అతని కంఠస్వరం వింటే- అతనీరాత్రి తనను ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాడనిపిస్తోంది.

"మాట్లాడవేం? పదిమంది ముందు చెప్పు తీసి కొట్టి- నన్ను అవమానించాలనుకున్నావ్ కదూ- ఇప్పుడు ఆ పదిమంది కాదు- ఏ దేవుడు నిన్ను రక్షిస్తాడో చూస్తాను"-

ఆమె భుజం మీద చేయి వేశాడతను.

ఆమె తలెత్తి చూసింది.

ఆమె కళ్ళలో కనిపిస్తున్న భయం చూసి తృప్తిగా నవ్వుకున్నాడు స్వాగత్. పట్టుదల-కోపం-ఆవేశంలాంటివి ఉంటే ఆమె ఎదురు తిరిగే అవకాశం ఉంది.

భయం-

అదుంటే చాలు. ఆమెను చాలా తేలిగ్గా లొంగదీసుకోగలడు.

ఆమె రెండు భుజాల మీద చేతులు వేసి నవ్వుతూ అన్నాడు స్వాగత్.

"ఈ రాత్రి నా నుంచి నిన్ను ఎవరూ తప్పించలేరు మిస్ నవ్యా!!"

(ఇంకా వుంది)

జ్ఞానదంతాలు రాలేదు...ఎందుచేత?

హలో! డాక్టర్ నేనేం చెయ్యాలి?



డా. కొత్త రవీంద్రబాబు

కింకా జ్ఞానదంతాలు రాలేదు.

మిరు రాక్సిన్ బిళ్ళలు వాడవచ్చు గాని పెద్దగా ప్రయోజనం వుండదు. కొద్దిగా పొడుగు పెరిగే అవకాశం యింకా వుంది. జ్ఞాన దంతాలు రాలేదని బాధపడ నవసరం లేదు. తర్వాత వస్తాయి. జ్ఞాన దంతాల వలన జ్ఞానం వస్తుందనుకోకండి!

సతీష్‌బాబు, మదనపల్లె.

అంగం చుట్టు వున్న వెంట్రుకలలో పేలు చర్మానికి అతుక్కుని వున్నాయి. వయసు 20 సంవత్సరాలు.

రెగ్యులర్‌గా షేవ్ చేసుకుంటూ రోజూ రెండు మార్లు స్నానం చేసి అండర్‌వేర్ స్నానం చేసినప్పుడు మార్చుకుంటూ వుండండి. నేకెడ్ బాత్ తీసుకోండి. వ్యక్తిగత పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వండి.

పోలోజు వెంకటాచారి, బోడుప్పల్.

చుండ్రు పోవడంలేదు. ఆహారం లేటయితే కళ్ళు తిరుగుతున్నయ్. నడుం నొప్పి.

పది రోజులపాటు బెట్నిసాల్ స్కాల్ప్ ఏప్లికేడర్ పుర్రె చర్మానికి రాత్రి పడుకోబోయే ముందు రాసుకోండి. మధుమేహం వుందేమో పరీక్ష చేయించుకుని లేకుంటే మాంసకృత్తులు ఎక్కువవున్న ఆహారం, పప్పు,పాలు తీసుకోండి.

బ్రుఫోర్ట్ రోజు ఉదయం సాయంత్రం వేసుకోండి పదిరోజులపాటు.

రామలింగేశ్వరరావు, చోడవరం.

వృషణములు సాగి వున్నవి. ఆపరేషన్ చేయించుకోవచ్చా?

ఆపరేషన్ అనవసరం! ఒకవేళ మీ మనసులో నుండి ఆ ఆలోచన ఎంతకూ పోకపోతే ఏ సర్జన్ దగ్గరకు వెళ్ళినా ఆపరేషన్ చేస్తారు. వ్యక్తిగతంగా సంప్రతించాలనుకుంటే తెనాలి రండి.

యు. సింహాచలం, కలకత్తా.

24 సంవత్సరములు. బక్కగా వున్నాను. మీసం గడ్డం సరిగా లేదు. వెంట్రుకలు రాగి రంగులో వుంటాయి.

పండ్లు పాలు గుడ్లు ఆకుకూరలు విరివి గా తీసుకోండి. తగుపాటి వ్యాయామం చేయండి లేదా ఆటలు ఆడండి. హెమ్ సినిరెల్ గొట్టాలు ఉదయం సాయంత్రం మూడు నెలలు వాడి చూడండి.

అనామక, రాజమండ్రి.

నా వయసు 15 సంవత్సరములు ఎత్తు 4 అడుగుల ఎనిమిది అంగుళాలు. ఎత్తు పెరగాలి. రాక్సిన్ బిళ్ళలు వాడవచ్చా? ప్రమాదం ఏం వుండదా?

వాడవచ్చు ప్రమాదం ఏం వుండదు. కాని అవి మీకనవసరం. సహజంగానే యింకా పొడుగు పెరిగే వీలున్న వయసు మీది.

బి. శ్రీరామకృష్ణ, గుంటూరు.


మీ శీర్షిక నన్నాకర్షించింది. నా వయసు 16 సంవత్సరములు ఎక్కిళ్ళు వస్తాయి. మా చెల్లికి 8 సంవత్సరములు. పళ్ళు పుచ్చిపోతున్నాయి.

ఆహారంలో కొవ్వు పదార్థాలు అంటే వేపుడు కూరలూ అవీ తగ్గించండి. నిదానంగా ఆహారం తీసుకోండి. మధ్య మధ్య ఎక్కువగా మంచినీళ్ళు తాగుతుండండి. స్టెలాబిడ్ బిళ్ళలు ఉదయం సాయంత్రం భోజనానికి అరగంట ముందు వాడండి– పది రోజుల పాటు.

మీ చెల్లిని చాక్‌లెట్లు స్వీట్సు తినవద్దని చెప్పండి. పుచ్చిన పళ్ళు పీకివేస్తే మంచి పళ్ళు రావచ్చు. పాలు,గుడ్లు యివ్వండి.

కె. సూరిబాబు, రామచంద్రపురం.

వయసు 20 సంవత్సరాలు ఎత్తు అయిదడుగుల మూడంగుళాలు. ఇంకా ఎత్తు పెరగాలి రాక్సిన్ వాడవచ్చా? నా



ఎత్తైన అగ్ని పర్వతం

ప్రపంచంలోని అతి ఎత్తైన అగ్ని పర్వతం చిలీ – అర్జెంటీనా దేశాల సరిహద్దులో వుందట.

ఫొటోలో మనకు కనిపించే ఓజోస్ డెల్‌శాలడో అనే పేరు గల ఈ అగ్ని పర్వతం ఎత్తు 22588 అడుగులు. ప్రపంచం మొత్తంలోని 850 అగ్ని పర్వతాలలో ఎక్కువ శాతం ఇండోనేషియాలోనే వున్నాయి. అక్కడ వున్న 467 అగ్ని పర్వతాలలో 77 పర్వతాలు బ్రద్దలయ్యాయి.

ఐ. విజయ్, విజయవాడ.

వయసు 19 సంవత్సరములు. సెక్సు కోరిక లెక్కువై స్వరతి కలవడి యిప్పుడు మాని వేసాను. సినిమాహాలులో టాయిలెట్‌కు వెళ్ళాలన్నా బిడియం. భార్యను తృప్తి పరచలేనేమో నని భయం. అంగం ఎదుగుటకు మందులు చెప్పండి.

మీలో ఏ లోపం లేదు. వివాహానంతరం కూడా ఇదే సమస్య వుంటే అప్పుడు సంప్రదించండి.

ఇప్పుడు మీకు మందు లనవసరం. – అనర్థకం కూడా.

కె. కృష్ణారెడ్డి, విజయవాడ.

ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకో లేక మానసికంగా కృంగి పోతున్నాను.

ఆ అమ్మాయికి వివాహం అయింది గనుక మీరు త్వరగా ఆమెను మరచి పోవడం ఉభయులకు మంచిది. కొంతకాలం పాటు దేశంలో చూడవలసిన మంచి ప్రదేశాలు చూచి రండి. కాలమే అన్ని గాయాలను మాన్పుతుంది.

నిద్ర పట్టక పోతే రిడజిన్ 10 మిల్లీ గ్రాముల బిళ్ళ రాత్రిళ్ళు వేసుకోండి నెలపాటు.

○

ఐ. పద్మావతి, గణపవరం.

లావు తగ్గాలి.

పాండో రాక్స్ రోజు వుదయం సాయంత్రం మూడు నెలల పాటు వాడండి. ఆహారంలో పిండి పదార్థాలు కొవ్వు పదార్థాలు తగ్గించండి. పెరుగు బదులు మజ్జిగ వాడండి. నెయ్యి వాడవద్దు. ఆకుకూరలు కాయగూరలు ఎక్కువ, అన్నం తక్కువగా తినండి. కమలా, బత్తాయి పళ్ళు విరివిగా తినండి.

ఆకలి ఎక్కువగా వుంటే పల్చని మజ్జిగ తాగండి. పద్ధతి ప్రకారం ప్రయత్నిస్తే ఫలితం వుంటుంది.

టిట్ ఫర్ టాట్

మా పాఠకులందరికీ నచ్చిన శీర్షిక "టిట్ ఫర్ టాట్" ఏడాదైపోయింది– వరుసగా 50– చమత్కారాలకు ప్రతి వ్యంగ్యోక్తులు అసంఖ్యాకంగా పాఠకులు ప్రేల్చారు! సంతోషం! కాని యింకా హాస్యరస స్ఫోరకంగా యీ శీర్షిక వుండవచ్చును. ఉదాహరణకి యీ వారం "ముద్దు" మీద రిపార్టీలో కొన్ని వేల మంది ఆలోచన "ఎయిడ్స్" మీదకే పోయింది– నేరుగా "ఎయిడ్స్ భయం" బాబోయ్! అంటే అన్న రిపార్టీ యింక జోక్ లేదుగా! కొందరు మాత్రం "అమెరికా రిటన్స్ కదా మన్నవ్" అన్న రిపార్టీ ప్రయోగాత్మకంగా వేసి యిచ్చారు. యిది బెటర్!

మీరు యీ చమత్కార బాణాన్ని మీ ఫ్రెండ్సు మీద ప్రయోగాత్మకంగా వేసి రిపార్టీలు రాబట్టండి– అదో సరదా– దాన్నుంచి మీకింకా "షార్ప్" రిపార్టీలు రావచ్చును. అడిగింది "ముద్దు"ను కొని యిన్నే వద్దంటావేం?– "నేనడిగింది ఆకలికి "ముద్ద"యితే నువ్వే ముద్దా? యిస్తావ్" అన్న ధోరణిలో ఆలోచించిన పాఠకునికి సహజంగా వెరైటీ వుంది కనుక బహుమతి లభించింది!

తాతామనుమరాండ్ర హాస్యం మన సంప్రదాయంలో కొంత వచ్చిగా వుంటుంది– దాన్నుటంకించినందుకే యీసారి ఫస్ట్ ప్రయిజ్ లభించింది.

అయితే– మీ నుంచి ఏ "స్మాక్ రిపార్టీ" ఆశించి వ్యంగ్యోక్తి వినురుతున్నామో ఆ స్మాక్ ఆన్సర్ చాలా మంది రాస్తున్నారు. తెలుగువారు గొప్ప హాస్యప్రియులు– చమత్కారులు కదా! ఈ శీర్షికలో మీ ఫ్రెండ్సు కూడా పాల్గొనేలా చేయండి! –సం.



టిట్ ఫర్ టాట్ -48 ఫలితాలు

"ముద్దిస్తానంటే వద్దంటావేం?"

*** రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:**

"ఛీ నోరు ముట్టుకుంపు తాతా!"

–వై. లక్ష్మి (మార్కాపురం)

*** రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:**

"అమ్మా! ఒక్క ముద్దెయ్యమ్మా అన్నా నేను!"

–అరుణ్ కుమార్ (ఇచ్ఛాపురం)

మరి కొన్ని వాగ్బాణాలు

"అమెరికా వెళ్లొచ్చావ్ గదా! అందుకని!!"

–మహమ్మద్ రఫీ (శ్రీకాకుళం)

"టూత్ పేస్ట్ అయిపోయి మూడురోజులైందన్నావుగా!"

–వి.కె. విశ్వనాథ్ (వరంగల్)

"ముద్దిస్తే వంకపెట్టుతావేమో అని భయం!"

–జి.వి. రాఘవేంద్రరావు (మచిలీపట్నం)

"అబ్బ! మీసం గుచ్చుకుంటుంది బాబూ!"

–యం.ఎల్. నిత్యం (వైజాగ్)

"వద్దనక మరేం చేయను తల్లీ! మొన్నిచ్చిన ముద్దుకే 'మీసాలు' కాలాయి మరి!"

–కె. ఎన్నార్ నమ్మి (పెనుగొండ)

లక్కీ పేర్లు

వై. శ్రీనివాసరావు (పాలకొల్లు), ఎ. సులోచన (నూజివీడు పేట), పి. రామకృష్ణ (మద్రాసు), పి. కరింఖాన్ (చిన్నలిప్ప సముద్రం), బి. బదరీనాథ్ (గుంటూరు), ఎం. సురేంద్రరెడ్డి (కొంకుదురు), మహమ్మద్ ఖాసిం (చిన ఓగిరాల), పి. ప్రహ్లాద రావు (సోమరాజుపల్లి), పి. లక్ష్మణమూర్తి (పార్వతీపురం), జి. ఖాషిఫ్ (బరూచ్).

→ (52 వ పేజీ చూడండి)

మోహాల లోగిలి

పార్వతమ్మ మనసు పరుగులు పెడుతున్నది. ఇన్నాళ్ళకు తన కోరికతీరబోతున్నది. తన పిల్లల చిన్నతనంలో వాళ్ళ ముద్దు మురిపాలు చూడటానికి,చూసి ఆనందించటానికి టైం వుండేదేకాదు.

అత్తగారి ఆలనా, పాలనా, ఆడపడుచుల రాకపోకలు, వచ్చిపోయే చుట్టు, పక్కాలు, స్నేహితులు అబ్బబ్బ....ఒకటేమిటి, నిత్యకల్యాణం, పచ్చతోరణం అన్నట్లుండేది ఇల్లు. అత్తగారు పోయాక కూతురు సీత పెళ్ళి చేశారు. అల్లుడు ఎక్కడో డెహ్రాడూన్‌లో పెద్ద ఆఫీసరు. వియ్యాలవారి రాకపోకలు, మంచి మర్యాదలు జరుగుతుండగానే కొడుకు శేఖర్ బి. యి. ప్యాసై పై చదువులకు అమెరికా వెళ్ళాడు. అక్కడ చదువు పూర్తి చేసి, ఉద్యోగం సంపాయించుకుని, అమెరికాలో పెరిగిన ఆంధ్రుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు, ఆమధ్య ఇండియా వచ్చినప్పుడు.

"అమ్మా! ఇదే ఆఖరు నేను ఇక్కడికి రావటం. మరో ఆర్నెల్లల్లో నువ్వు బామ్మవి కాబోతున్నావు. అందుచేత నాన్నగారు, నువ్వు అక్కడికి వచ్చి మనవడి మంచి చెడ్డలు చూడాలి" అన్నాడు. పిచ్చి సన్యాసి, వాడు ఆ మాట అని కూడా ఆరేళ్ళయింది. పుట్టిన మనవడు పెద్దవాడయి, వచ్చీరాని మాటల్తో "బామ్మా ఎప్పుడు వత్తావో?" అంటూ ఫోన్లో మాట్లాడాడు.

"ఏమిటి పార్వతమ్మా! అంత దీర్ఘాలోచన" అంటూ కళ్ళజోడు సవరించుకుని భార్య దగ్గరగా రాబోయారు రావుగారు.

"చాల్లెండి. రేపు మనవలముందు, మన వరాళ్ళముందు ఈ పరాచికాలు, చిలిపి చేష్టలు తగ్గించండి. చిన్న పిల్లాడిలా ఏమిటిది."

"చిన్న పిల్లాడినే! రేపటినుంచి అమ్మగారు పెట్టిన అన్నం తిని బుద్ధిగా...." నాలిక్కరుచుకున్నారు రావుగారు.

"ఏమిటండోయ్! ఏదో కొత్త ప్లాను వెస్తున్నట్లున్నారు. ఇహ ఆ పప్పులేం వుడకవ్ నాదగ్గర. ఇదిగో సామాను, రెండు ట్రంకు పెట్టెలు, ఈ పెద్ద బెడ్డింగు ఆ నాలుగు వి. ఐ. పి. సూట్ కేసులు, రెండు బ్యాగులు, మూడు బుట్టలు, నా హ్యాండు బ్యాగు, మరచెంబు, ఇంతవరకు సర్దాను....మిగిలినవి రేపు సర్దుతాను. రేపు మంచిరోజయితే ఎంత బాగుండేది. తీరా చవితి అయింది. ఏమిటో....పిల్లల్ని చూడకుండా ఇన్నాళ్ళు ఎట్లా వున్నానో....ఇహ నావల్లకాదు బాబూ!"

నిట్టూర్చింది పార్వతమ్మ. నిజమే! పిల్లల్ని చూడాలని ఏ తల్లి మనసు తహతహలాడదు గనుక!

"ఇవిగోనోయ్! మన పిల్లలదగ్గర్నుంచి ఉత్తరాలు వచ్చినయ్ అమ్మాయిఏం రాసిందంటే అల్లుడు రష్యా వెళుతున్నాట్ట. చూసి రావటానికి తనూ వెళుతున్నదట. అందుచేత తిరిగి రాగానే మళ్ళీ ఉత్తరం రాస్తాను" అని రాసింది. "ఇహపోతే...."

"అబ్బా ఏం రాశాడండీ!?" ఆత్రుతగా అడిగింది.

"వుండు....వుండు....వస్తున్నా, అక్కడికే వస్తున్నా...."

"ఏమిటండీ! మీరు మరీను. ఆ వుత్తరంలో ముక్క నా చెవున పడెయ్యటానికి ఇంతహంగామా చేస్తున్నారు" విసుగ్గా అన్నది పార్వతమ్మ.

"హంగామా కాదు. సంగతి పెద్దది. వివరంగా చెప్పాలికదా?"

"ఆ! చాల్లెండి సంబడం. ఏమిటా వూరింపు."

"వూరింపుకాదే, వున్నమాట. అబ్బాయి ఏం రాశాడంటే-"

"తనే ఓ ఆరు నెలల్లో ఇక్కడికి వచ్చి ఇల్లు, వాకిలి, పొలం పుట్రా అమ్మేసి, అంతా అమెరికన్ కరెన్సీ చేసి, అప్పుడు మనిద్దర్నీ తీసుకు వెళతాట్ట."

"అంటే....అంటే...."

"అదేనే! అబ్బాయి వుద్దేశ్యం మనమే వాళ్ళ దగ్గరవున్నప్పుడు మన కంటూ ఇంకా ఏమీ అక్కర్లేదని." దీర్ఘం తీశారు రావుగారు.


పార్వతమ్మ మనసు చివుక్కుమన్నది. "ఏమిటో ఇల్లూ, పొలం అమ్మేస్తాడా? ఇప్పుడంత అవసరం ఏమొచ్చిందండీ!"

"పిచ్చి పార్వతీ! ఈ ఇల్లు, నేల, గాలి మన జీవితాలతోటి, మన మంచి చెడ్డల తోటి పెనవేసుకున్న బంధాలు. పిల్లలు వాళ్ళ మనుగడను, వ్యక్తిత్వాన్ని అక్కడ పెంచుకున్నారే!"

పార్వతమ్మకు రావుగారి మాటలు అర్థం కానూ లేదు. రుచించనూలేదు. అందుకే ఆ సంభాషణ పొడిగించటం ఇష్టం లేక డైనింగు టేబులువైపు నడిచింది.

అన్నిరోజుల్లాగా ఆ రోజూ అన్నాలు తిని పడుకున్నా ఎవరి ఆలోచన్లు వాళ్ళను నిద్రకు దూరం చేసినయ్!

పార్వతమ్మ మనసు బాల్యంలోకి తొంగి చూస్తే, రావుగారి ఊహలు భవిష్యత్తు వైపు



కొండముది రుక్మిణీదేవి



పరుగులు తీసినయ్!

తను పుట్టి పెరిగింది చిన్న పల్లెటూరు. ఊహలు, ఆలోచన్లు, కోరికలు లేకుండానే, అంటే పదహారేళ్ళు నిండకుండానే ఈ ఇంటి కోడలయింది. మరో రెండేళ్ళకు కాపరానికి రావటం, ఉద్యోగరీత్యా అనేక వూళ్ళు తిరుగుతుంటే కొంతమంది పరిచయస్తులుగానూ, కొంతమంది స్నేహితులుగాను చాలా కొద్ది మంది ఆత్మీయులుగానూ మిగిలారు. అలాగే రావుగారు అంచెలంచెలుగా పైకివచ్చి, ఆస్తి, అంతస్థు, నలుగుర్లోనూ మంచితనం పెంచుకున్నారు. గడచిన కాలంలో కొన్నాళ్ళు పెద్దవాళ్ళను గురించి, అంటేరావుగారి తల్లి దండ్రుల్ని గురించి, తన తల్లిని గురించి ఆలోచించి వాళ్ళ పద్ధతులకు అనుగుణంగా, తాము సర్దుకున్నారు. ఆ తరువాత, పిల్లలు పెద్దవాళ్ళవుతుంటే వాళ్ళ అభిమతానికీ, అనుగుణంగా, తమ ఆలోచన్లు, కోర్కెలు మలుచుకుని వాళ్ళ భవిష్యత్తుకు బాటలు వేశారు. ఇహ....ఇహ....ఇప్పుడు కొడుకురాసిన ఉత్తరం మనసులో మెదిలే సరికి, ఒక్క క్షణం అనుభవరాహిత్యంగానూ, ఆలోచనా శూన్యంగామా తోచింది పార్వతమ్మకు.


రావుగారి మస్తిష్కం మబ్బు విడిచిన వెన్నెలలాగ, విరబూచిన మల్లెపొదలాగా, అంబరావ సంధించినట్లున్న హరివిల్లులాగా, అవును అలాగావుంది.

తమది మధ్యతరగతి కుటుంబం తండ్రి తనను కష్టపడి చదివించాడు. ఏడాదికి ఒకసారి చేతికొచ్చేపంట డబ్బు మినహా పై సంపాదనంటూ ఏమీవుండేదికాదు. అందులోనే అన్నయ్య, తను, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు చదువులు, నిత్యకృత్యాలు, బంధువులరాకపోకలు ఒకటేమిటి? ఒక్కొక్క సంవత్సరం ప్రకృతి కరుణించకపోతే, ఆ వచ్చే ఆదాయం కాస్తకూడా రాకపోతే, అప్పులు చెయ్యటం. అవి తీరేసరికి మరొక ఖర్చు! ఇలాంటి పరిస్థితిలో తన కోరికల్నిగాని, అభిరుచుల్నిగాని, తండ్రి దగ్గర చెప్పటానికి జంకుగానే వుండేది.

ఒకసారి మనసు నిలుపుకోలేక తన దగ్గరున్న పెన్సిలుతోనే రాధాకృష్ణ బొమ్మగీసి, డ్రాయింగు టీచరుకు చూపిస్తే ఆయన ఎంతగానో మెచ్చుకుని, మర్నాడు కనబడ్డ తన తండ్రితో అంటే.

"వాడ్ని ఓ అక్షరం ముక్క చదువుకోనివ్వండి. ఈ బొమ్మలు బొరుసులు అన్నం పెడతయ్యా! దయచేసి వాడ్ని ప్రోత్సహించకండి" అన్నారుట.

తరవాత ఎప్పుడో తనకా విషయం తెలిసింది. అయినా తండ్రి తత్వమూ, ఇంట్లో పరిస్థితులు తెలునుగనక చదువు మీదే శ్రద్ధ చూపాడు. ఉద్యోగంలో చేరిన కొత్తలో



కుంచె, రంగులు కొనుక్కొచ్చి, స్టాండుమీద కాన్వాసు అమరుస్తుండగా రెండేళ్ళ కూతురు సీతవచ్చి ఆరంగులన్నీ ఇంటి నిండా పారబోసి, వంటినిండా చేసుకున్నది. అప్పుడే అక్కడకువచ్చిన పార్వతి "అసలే పనికాక ఛస్తుంటే ఈరంగులేమిటి?! అయినా నిన్నని ఏం లాభం. ఇన్నాళ్ళకి మీ నాన్నకి కలిగిన కోరికని అనాలిగాని."

"ఏమండీ! ఇప్పుడే ఉద్యోగంలో చేరారు. మనదంటు ఓ కుటుంబం ఏర్పడుతున్నది. మనమూ, మన పిల్లలు సుఖంగా వుండాలంటే ఈ వయసులోనే మీరు కష్టపడి నాలుగు డబ్బులు వెనకేసుకోవాలి. అంతేగాని, ఈ రంగులు, కుంచెలు పెట్టుక్కూర్చుంటే...."

ఆమె మాట పూర్తి చెయ్యకుండానే, తను కాన్వాసు మడిచి, బ్రష్షు శుభ్రంచేసి, పెట్లో అడుగున పెట్టేశాడు. అంతే మళ్ళీ వాటిని గురించిన ప్రస్తావన రాలేదు. ఎంతో డబ్బు సంపాయించాడు. పిల్లల అవసరాలు, భార్య కోరికలు, తల్లి దండ్రుల ఆలనా పాలనా, ఇలా అన్నీ - తనకు తెలిసినంతవరకు ఎవరికి ఏలోటురానివ్వలేదు.

తనకు ప్రమోషన్ వచ్చినప్పుడల్లా ఓ మీటింగు పెట్టి దండవేసి, ఇంకాపైకి వెళ్ళాలని నాలుగు చిలక పలుకులు పలికేవాళ్ళు.



మోడల్ గర్ల్‌గా స్టెఫీగ్రాఫ్

టెన్నిస్ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపిన నెంబర్ వన్ క్రీడాకారిణి స్టెఫీగ్రాఫ్ యిప్పుడు 'మోడలింగ్' ప్రపంచంలోకి అడుగిడ బోతోంది.

ఈత దుస్తులు, కురచ దుస్తులను ఉత్పత్తి చేసే సంస్థ ఒకటి తమ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు స్టెఫీని మోడల్‌గా ఎన్నుకుందట. వాణిజ్య ప్రకటనల్లో స్టెఫీ దర్శన భాగ్యాన్ని కల్పించ వలసిందిగా అనేకమంది కోరుతున్నారని ఆమె తండ్రి తెలియ జేస్తున్నాడు. ఆమె నగ్న చిత్రానికి 7 లక్షల 50 వేల పౌండ్లు యిస్తామని 'ప్లేబాయ్' పత్రిక ముందుకు వచ్చిందట. ఇందుకు కూడా ఆమె తండ్రి గ్రీన్ సిగ్నల్ యిస్తున్నాడట కూతురి గుర్తింపుకోసం. 'అడిడాస్' క్రీడా దుస్తులకు మోడల్‌గా వున్న స్టెఫీని తమ సంస్థ తరఫున కూడా మోడలింగ్ గర్ల్‌గా కాంట్రాక్టు కుదుర్చు కునేందుకు అనేక సంస్థలు పోటీ పడుతున్నాయట. టెన్నిస్ కంటే మోడలింగ్ ప్రపంచమే గిట్టుబాటేమో! స్టెఫీ లాంటి అప్సరసలకు.

ఊహాల లోగిళ్ళ...

ఇకముందు ఆ అవకాశమూ లేదు. ఈ సమాజమూ, మనుషులు, ముఖ్యంగా తన కుటుంబంలో వాళ్ళూ కళని గురించిగాని, తన ఆవేదనను గురించిగాని, కళపట్ల తనకున్న మమకారాన్ని గురించిగాని ఏనాడూ పట్టించుకోలేదు. తనకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు....ఇప్పుడు తనే ఆ వూహాల లోగిళ్ళలోకి అడుగు పెట్టాలి.

ప్రకృతిలోని ప్రతి కదలికకూ, ఆకృతి నివ్వాలి. ఆ అందాల్ని అజరామరం చేసి, ముందుతరాలకు అందివ్వాలి. ఆయనలోని కళాదృష్టి కళ్ళు తెరిచింది. కళాతృష్ణ కదం తొక్కింది. ముందు జీవితాన్ని కళామయం చేసుకోవాలన్న కోరిక పురివిప్పి నాట్యం చేసింది. ఆలోచనల్లోంచి, అంతరంగ మధనం లోనుంచి పక్కకు తిరిగి పార్వతమ్మ వైపు చూశారు రావుగారు.

"ఏమండీ! నిద్రపట్టటం లేదా?" మెల్లగా అడిగిందామె.

"పార్వతీ! నా కోరిక తీరుస్తావా? నాకు తోడుగా నిలుస్తావా?" వేలగా అడిగాడాయన.

"అదేం మాటలండీ! జీవితంలో ఎప్పుడైనా మీ మాటకు ఎదురు చెప్పానా? ఏ విషయంలోనైనా వేరొక ఆలోచన చేశామా?"

"అదే పార్వతీ! అదే నా ధైర్యం. గతించిన కాలం కన్నా, ముందున్న భవిష్యత్తు గొప్పది. రేపటినుంచి నాకు ఉద్యోగ బాధ్యతల్లేవు. పై వాళ్ళ మెప్పులు, కిందివాళ్ళ పొగడ్తలు అసలే వుండవు. అందుకే నేను నేనుగా వుండటానికి నిశ్చయించుకున్నాను. నా కాన్వాసు, కుంచె నా ఊహాలకు ఆలంబన. ఏదీ ఆ పెట్టె తాళం తీయి."

"ఇప్పుడేమిటండీ!?"

"అదిగో! తొలికోడి కూసింది. తెల తెలవారుతున్నది. ఆ తూరుపురేఖల వెలుగుల్ని మన జీవితాల్లో ప్రసరింపచేసుకుందాం. ఈ తొలికోడి కూతల్లో భవిష్యత్తుకు మేలుకొలుపులు పాడుకుందాం! ఆ సప్తాశ్వరథారూఢుణ్ణి రంగుల్లో ముంచిన కుంచెతో ప్రతిబింబిస్తాను."

ఆయన ఆలోచన్లకు అంతే వాసిగా ఆమె లేచింది. ఆయన ఊహాలకు రూపకల్పనగా, ఆమె మంచందిగింది. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆమె ఆ పెట్టెమూత తీసింది.

[*]

ఈవారం లో మీ యోగం

13-4-1990 శుక్రవారం నుండి
19-4-1990 గురువారం వరకు

★ **మేషం:** పత్రికారంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. పత్రికా ప్రకటన కర్తలకు, పనిపాటలు చూచుకొను వారికి, రాజకీయరంగాన శ్రమించు వారికి, దూర దేశాలకు ప్రయాణం సాగించు వారికి అనుకూలం. స్త్రీలకు : వ్యవహార రంగాభివృద్ధి, సభా మర్యాద. కళారంగాన ధన వసతి గల వారం.

★ **వృషభం:** పంపిణీదారులకు, పాత్రికేయులకు, చిత్ర రంగాన శ్రమించువారికి అనుకూలం. వ్యవహారరీత్యా మేలైన సమయం. 'స్పెక్యులేషన్' ఫలితానికి రానున్న సమయం. కొంత కాలం ఆగిన ఒకానొక వ్యవహారం అనుకూలదాయకం. స్త్రీలకు: కళారంగాభివృద్ధి, చిత్రరంగానుకూలత.

★ **మిధునం:** అప్రయత్నంగా ధనలాభం. 'లాటరీ, స్పెక్యులేషన్' లందు మేలైన సమయం. యోగప్రదం. ఇంట శుభం నిశ్చయం కావచ్చు. తిరిగి తిరిగి హితులెవరో తెలిసికోగలుగుతారు. స్త్రీలకు: ఉత్తమ స్నేహం, చిత్రరంగానుకూలం, విద్యావేత్తల పరిచయం. సభా గౌరవం, శతృవులు అణగి యుంటారనేది ముఖ్యాంశం.

★ **కర్కాటకం:** ఇంట శుభం జరుగనున్నది. పంపిణీదారులకు యోగాధ్యం. పదిమందిలో ప్రతిష్ఠ. అనుకొన్న పనులు నెరవేరుటకు ఆస్కారం. రాజకీయ రంగాన ప్రసిద్ధి. నూతన వ్యాపార సంబంధ వ్యక్తుల పరిచయం. స్త్రీలకు: నగలు బట్టలు సేకరించుటకు అనుకూల సమయం.

★ **సింహం:** నూతన మిత్ర సంపద, చిరకాలం స్నేహం రెండూ మేలు. యోగదాయకమైన వారం. వృత్తియందు వికాసమున్నది. పదిమందిలో ప్రతిష్ఠ యున్నది. అప్రయత్నాదాయం. శుభదాయకమైన వారమే. 'అరింట' శని బహు యోగదాయకుడు. స్త్రీలకు: ధన లోపం రానివారం.

★ **కన్య:** మిత్రులతో, పరిచితులతో, తెలిసిన వారితో ధనవంతులతో, విద్యావంతులతో, పరిచయం లాభప్రదాయకం. ప్రథమంగా ఆలోచించిన రీతినే అమలుపరచండి. సభారంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. ధనాఢ్యుల పరిచయం అనేక రీతుల లాభదాయకమని గ్రహించాలి. స్త్రీలకు: యోగప్రదం. వ్యాపారం చేసేలాగైతే మేలే.

★ **తుల:** రాజకీయంగా కొంత మేలు చేకూరుట గమనింపదగిన అంశం. సహాయం చేసేవారున్నారు. వృత్తియందు వికాసమున్నది. 'గురుడు' అనుకూలుడు. ప్రజారంగాభివృద్ధి. అధిక వ్యయ సూచిత వారం. యోగాదాయం గలదని చెప్పవచ్చు. స్త్రీలకు: వ్యవహార విజయం. వ్యాపార లాభం, గ్రహించాలి.

★ **వృశ్చికం:** సభా మర్యాద యున్నది. అప్పులు వసూలవుతాయి. చాలా కాలంగా కనిపించని వారు, హటాత్తుగా వస్తారు. విద్యావేత్తల సహాయమున్నది. ఆర్థికంగా మేలు. వ్యాపారం కొనసాగుతుంది. ప్రజ్ఞావంతుల సహాయమున్నది, గ్రహించాలి. స్త్రీలకు: నూతన వ్యాపారం లాభదాయకమవుతుంది. సభా గౌరవమున్నది.


★ **ధనుస్సు:** ఆదాయమున్నది. ప్రజ్ఞావంతుల పరిచయం. వ్యవహారరంగానుకూలం. శుభ దాయకం. నూతన మిత్ర సమాగమం. పదిమందిలో ప్రసిద్ధి. ధన విషయంలో ఏ లోపం రాదని గ్రహించాలి. స్త్రీలకు: శుభదాయకమని, ఉద్యోగరీత్యా మేలున్నదని, నూతన వ్యక్తుల పరిచయమున్నదని తద్వారా వృత్తిలో లాభకరమని గ్రహించాలి.

★ **మకరం:** యోగాభివృద్ధి కుంటుపడుతుంది. కొంత కాలం, యిలాగే ఉంటుందని, ఆదాయ లోపం గలదని, అధిక వ్యయదాయకమని గ్రహింపగలరు. ఉత్తముల పరిచయం, బంధువర్గీయుల రాక, అతిధి అభ్యాగతులను ఆదరించవలసి రావటం, గమనిస్తారు. స్త్రీలకు: కొంత యిబ్బందే.

★ **కుంభం:** సభలో పెద్ద పీట అమరుతుంది. నూతనాంశాలు వింటారు. నూతన మిత్ర సమాగమం. శుభ కార్యాచరణం. ఆదాయమందు పెంపు. రాజకీయ రంగానుకూలత, నూతన వ్యక్తుల పరిచయం, గ్రహించండి. స్త్రీలకు: శుభదాయకం, సుఖదాయకం, ధనదాయకమైన వారం.

★ **మీనం:** గ్రహమండలంలో అనేక మార్పులు వచ్చాయి. 'రాహు కేతువులు' ఎప్పుడో మారారు. అనుకూలురే. శని మార్పు అనుకూలమే. ఆదాయ లోపం లేదు. యత్న కార్యసిద్ధి. ఉత్సాహజనకమైన కాలం, గమనించండి. స్త్రీలకు: వృత్తిలో మేలు, ఆదాయ వృద్ధి, ఉద్యోగరీత్యా మేలు.

- విద్వాన్‌కోట సత్యరంగయ్యశాస్త్రి



సీరియల్

వజ్రసంకల్పం

శాతవాహన

(గత సంచిక తరువాయి)

హెలికాప్టర్లోంచి ఆ అందమైన పాదం కిందికి దిగుతూనే వజ్రపాణి మరో అడుగు ముందుకేశాడు.

"స్వాగతం యువరాణీ, సుస్వాగతం" అత్యంత ఆకర్షణీయమైన చిరునవ్వుతో సగౌరవంగా తన కుడిచెయ్యి ముందుకు చాచాడు.

అంతవరకూ హెలికాప్టర్లో ప్రయాణిస్తూ జరిగిపోయిన కథంతా నెమరు వేసుకుంటున్న పింకీ హెలికాప్టర్ కిందికి దిగడంతో యాంత్రికంగా పాదం బయట పెట్టిందల్లా అతను స్వాగతం చెబుతూనే గత స్మృతుల్లోంచి పూర్తిగా తేరుకుంటూ తనూ చిరునవ్వు నవ్వింది.

వజ్రపాణి ఆ నవ్వు చూసి ముగ్ధుడైపోయాడు. గతంలో ఎందరెందరినో బుట్టలో పడేసిన చిరునవ్వది. పదేపదే ఆమె మొహంలోకే చూస్తుండిపోవాలనిపించే చిరునవ్వు. అలా నవ్వుతూనే తన కుడిచెయ్యి ముందుకు చాచింది.

వజ్రపాణి ఉత్సాహంగా ఆమె చెయ్యందుకున్నాడు. ఆమె ఆ చేతివేలికి పెట్టుకున్న వజ్రపుటుంగరం ధగధగా మెరిసిపోతోంది. సుందర్‌దాసు షాపులో కొన్న వజ్రపుటుంగరం అది. సుందర్‌దాసు సమర్పించుకున్న రెండున్నర లక్షలతో పాటు ఆ వజ్రపుటుంగరం కూడా ఆమెకే దక్కింది.

వజ్రపాణి దగ్గర ఎన్ని వజ్రాలున్నాయో అతనికే లెక్కతెలీదు. అయినా మరో వజ్రం చూసినప్పుడల్లా అతని కళ్ళు చమక్కుమంటాయి. ఆమె వేలికి పెట్టుకున్న ఆ వజ్రం వైపు ఆబగా చూస్తూ అతను పాశ్చాత్య పద్ధతిలో ఆమె చేతిని గౌరవసూచకంగా ముద్దు పెట్టుకున్నాడు. పింకీ అతని కళ్ళలోకి గ్రేషియస్‌గా చూసి నిజంగా యువరాణిలాగే దర్పంగా తల పైకెగరేసింది.

ఆమె వెనకే ప్రభు కూడా హెలికాప్టర్ దిగివచ్చి చేతిలో బ్రీఫ్‌కేసుతో ఆమె పక్కన నిలబడ్డాడు. ఫుల్‌సూట్లో చూడ్డానికి చాలా స్మార్ట్‌గా కనిపిస్తున్నాడతను.

"ఇతని పేరు ప్రభు. నా పర్సనల్ సెక్రటరీ."

అతన్ని పరిచయం చేసిందామె.

వజ్రపాణి ప్రయత్నంమీద ఆమె చెయ్యి విడిచిపెట్టి ప్రభుకి షేక్‌హేండిచ్చాడు. పింకీ చెయ్యి పట్టుకోవడానికి ఎంతో మృదువుగా వుంది. ఆమె చెయ్యి పట్టుకున్నప్పుడు వజ్రపాణి ఒక విధమైన థ్రిల్ ఫీలయ్యాడు. ఒక పట్టాన ఆమె చెయ్యి వదల్లేకపోయాడు.

"హలో మిస్టర్ ప్రభూ!" అన్నాడతనికి షేక్‌హేండిస్తూ.

"హలో మిస్టర్ వజ్రపాణీ" నమ్రతగా అన్నాడు ప్రభు. అక్కడికి బయల్దేరబోయేముందు పింకీ అతనికి సీరియస్‌గా వార్నింగిచ్చింది–

"వజ్రపాణి ముందు బుద్ధిగా వుండకపోయావో కథ మొత్తం అడ్డం తిరుగుతుంది జాగ్రత్త. అతని ముందు నీ తెలివి తేటలు ప్రదర్శించావంటే వజ్రపాణి నీ ఎముక లేరేస్తాడు. అవులిస్తే పేగులు లెక్కపెట్టగలిగినవాడా వజ్రపాణి."

ప్రభు ఆమెకు అభివాదం చేస్తున్న వాడిలా తమాషాగా ముందుకు వంగి, "ఆజ్ఞ యువరాణీ! మీరు చెప్పినట్టే నడుచుకుంటాను. లేకపోతే మీరు నా నడ్డి నిరభ్యంతరంగా విరగ్గొట్టొచ్చు" నాటకీయంగా అన్నాడు.

అతని ధోరణి ఎప్పట్లాగే పింకీకి నవ్వు తెప్పించింది.

"ఈ అతి తెలివి అక్కడ ప్రదర్శించావంటే నడ్డి విరగ్గొట్టేది నేనుగాదు - వజ్రపాణి" నవ్వుతూనే హెచ్చరించింది.

"అహ్హా! నువ్వే చూస్తావుగా. సుందర్‌దాసునెలా బురిడీ కొట్టించేశానో వజ్రపాణిని కూడా అలాగే బుట్టలో పెట్టేస్తాను. యువరాణి జ్యోతిర్మయీదేవికి అసలు సిసలైన సెక్రటరీగా నిజంగానే మారిపోతాను" అంటూనే తనలో తను గొణుక్కున్నాడు. "అయినా, నేను నీకు సెక్రటరీగా తప్ప ఫ్రెండుగా ఎప్పుడు తగలడ్డాను గనకలే."

పింకీ ఆ సణుగుడు వింది.

"ఏమిటీ?" అంది అతనన్న దేమిటో తనకు వినిపించనట్టు.

"అహఁ, ఏమీ లేదు. నీకు సెక్రటరీగా మారిపోయాక ఎలా బిహేవ్ చెయ్యాలో ఇప్పట్నుంచే సీరియస్‌గా ఆలోచించేస్తున్నాను." నాలిక్కొరుక్కుంటూ గబగబా అనేశాడు.

పింకీ అతని చెవి పట్టి మెలేసింది.

"నీ సణుగు డేమిటో నేను విన్నాను. ఏమన్నావ్, నిన్ను నేను ఫ్రెండుగా కాకుండా సెక్రటరీగా చూస్తున్నానా! మళ్ళీ చెప్పు ఆ మాట!"

ఆమె తన చెవి పట్టుకు పిండేస్తుంటే ప్రభు కీచుమంటూ అరిచాడు.

"మహంకాళీ, వదులు!"

పింకీ అతని చెవి వదిలేసింది. ప్రభు బలంగా చెవి రుద్దుకుంటూ ఆమె కేసి ఆరాధనగా చూశాడు.

"అయితే నేను నీ ఫ్రెండునే అంటావ్!"

"ఏం! అనుమానమా?" గుర్రుగా చూసిందామె.

"అయితే ఫ్రెండ్స్ ఏం చెప్పినా చెల్లిపోతుంది మరి. ఏం చెప్పడానికైనా ఫ్రెండుకి అధికారం వుంటుంది– అవునా! నువ్వు మళ్ళీ ఇలా చెవి మెలి పెట్టనంటే, నీతో ఓ మాట ఇప్పుడే చెప్పేస్తాను."

పింకీ అతని కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"మరేం లేదు, ఐ లవ్ యూ" అంటూనే అక్కడ్నించి రేసు గుర్రంలా పరిగెత్తాడతను.

పింకీ ఒక్క క్షణం అతన్ని వెర్రిదాన్లా చూసి "యూ..." అంటూ వెంటబడింది.

ఆ సీను గుర్తుకొస్తూనే పింకీ పెదవులమీద లీలగా చిరునవ్వు మెరిసింది. ప్రభు తనకు మాటిచ్చినట్టుగానే నిజంగా తనకు సెక్రటరీగానే మారిపోయాడు. సెక్రటరీ వేషంలో పూర్తిగా ఒదిగిపోయాడు. లీనమైపోయాడు.

ఇంతవరకూ సాగినకథ 30: విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. మణిపురం కొండల్లో వున్న వజ్రపాణి హవేలీకి పయనమై వెళ్తున్న పింకీకి క్యూబిక్ జిర్కోనియా ఇండస్ట్రీస్ అధినేత శక్తిధర్ పరిచయమై తన దగ్గరున్న అపురూప వజ్రాలను పింకీకి చూపెడతాడు. మితిమీరి పోతున్న వజ్రపాణి ఆగడాలను అరికట్టేవరకు మనవడిని చూపించనని విశ్వధరవర్మ కోడలు కౌసల్యకు తెలియజేస్తాడు.

వజ్రపాణి ప్రభూకి షేక్‌హేండ్ ఇస్తుండగానే అక్కడికో మోటార్ సైకిల్ దుమ్ము లేపుకుంటూ వచ్చి ఆగింది. మోటార్ సైకిల్ మీద నుంచి జూడా కిందికి దిగాడు. అతనితోపాటే వెనక సీటుమీద కూర్చొని వచ్చిన డేవిడ్ కూడా మంకీ కేప్ సర్దుకుంటూ మోటార్ సైకిల్ దిగాడు. జూడా మోటార్ సైకిల్ దిగుతూనే హడావిడిగా ముందు కొచ్చాడు.

"క్షమించండి బాస్! రావడంలో కొంచెం ఆలస్యమైంది" అన్నాడు వజ్రపాణిని సమీపిస్తూ. వజ్రపాణి ఏదో అనబోయాడు. అంతలోకే పింకీ చొరవగా ముందు కొచ్చింది.

"హలో మిస్టర్ జూడా! హౌడూ యూ డూ" అంటూ కుడి చెయ్యి ముందుకు చాచింది.

ఆమెని చూస్తూనే జూడా మొహం అత్యంత ప్రసన్నంగా మారిపోయింది. నమ్రతగా ఆమె చెయ్యందుకుని మృదువుగా నొక్కాడు. అత నామెకు షేక్‌హేండిస్తూనే చిన్నగా కన్ను గీటడం ఒక్క ప్రభు తప్ప అక్కడున్న వాళ్ళెవరూ గమనించలేదు.

"నమస్తే యువరాణీ! ఇక్కడికి రావడంలో మీకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదుగదా!" అతని గొంతు నమ్రతను సూచిస్తోంది.

పింకీ భుజా లెగరేసి మరోసారి ఆకర్షణీయంగా నవ్వింది.

"నాటిటాల్ మిస్టర్ జూడా! నాటిటాల్!"

జూడా వజ్రపాణికేసి తిరిగాడు.

"వీరే మా బాస్. పేరు..."

"వజ్రపాణి", అతని మాట మధ్యలో అందుకుంటూ తనే పూర్తి చేశాడు వజ్రపాణి.

"అఫ్‌కోర్స్, ఆ విషయం మాకు తెలుసు. చూడగానే మీ రెవరో మేము గుర్తు పట్టాం మిస్టర్ వజ్రపాణీ! గొప్పవారిని పూర్వ పరిచయం లేకుండానే గుర్తు పట్టెయ్యొచ్చు. వ...జ్ర...పా...ణి. వజ్రంలాంటి మనిషికి వజ్రంలాంటి పేరు ప్రభూ, ఏమంటావ్?" అందామె ప్రభు కేసి చూస్తూ.

"అక్షరాలా యువరాణీ!" వజ్రపాణికి అభివాదం చేస్తూ అన్నాడు ప్రభు.

"బైదిబై, వీరిద్దరూ ఎవరు?" డేవిడ్ వైపూ, భైరాగి వైపూ చూస్తూ అడిగిందామె.

తనని అప్పుడే చూస్తున్నదాన్లా ఆమె ఆ మాట అడుగుతుంటే డేవిడ్ తనలో తను ముసి ముసిగా నవ్వుకున్నాడు. భైరాగిని మాత్రం ఆమె అప్పుడే చూస్తోంది. ఆమె తనను గురించి అడగ్గానే అప్పటిదాకా మౌనంగా వున్న భైరాగి గారపళ్ళు బయటపెట్టి వెకిలిగా నవ్వాడు. వాళ్ళిద్దర్నీ వజ్రపాణి తనే స్వయంగా పరిచయం చేశాడు.

"ఇతని పేరు భైరాగి. నాకు, జూడా ఎంతో ఇతనూ అంతే. జూడా నా సామ్రాజ్యం బయట నా కార్య కలాపాలు జరిపితే, ఇతను నా సామ్రాజ్యం లోపల నా కార్య కలాపాలు జరుపుతాడు. ఒకవిధంగా చెప్పాలంటే భైరాగి నాకు హోం మినిష్టర్‌లాంటివాడు. అతని పేరు డేవిడ్. జూడాకి చాలా కావల్సిన మనిషి. పైకి అలా అమాయకుడిలా కనిపిస్తాడే తప్ప చాలా ప్రమాదకరమైన మనిషి.

"ఐ సీ! గ్లాడ్ టు మీట్ యూ మిస్టర్ భైరాగీ! గ్లాడ్‌టు మీట్ యూ మిస్టర్ డేవిడ్" పింకీ వాళ్ళిద్దరికీ షేక్‌హేండిచ్చి మళ్ళీ వజ్రపాణి కేసి తిరిగింది.

"ఇక వచ్చిన పని కానిద్దామా మిస్టర్ వజ్రపాణీ!"

వజ్రపాణి చిన్నగా నవ్వేడు.

"అప్పుడే అంత తొందరేమొచ్చింది యువరాణీ! ముందు మీరు హాయిగా విశ్రాంతి తీసుకోండి. ఆ తర్వాత మీకు నా సామ్రాజ్యమంతా చూపిస్తాను. నా సమర్థత పట్ల అన్ని విధాలా మీకు నమ్మకం కుదిరిం తర్వాతే మనం అసలు విషయం గురించి మాట్లాడుకుందాం. ఓకే?"

"ఓకే!" అంది పింకీ.

"అయితే పదండి యువరాణీ" సగౌరవంగా ఆమెకు దారి చూపించాడు వజ్రపాణి.

పింకీ ప్రభుతో కలిసి ముందుకు నడిచింది.


అక్కడికి కొంత దూరంలో ఓ చెట్టు మీద నుంచి



కళ్ళు మూస్తే గల్లంతు!

శాస్త్ర విజ్ఞానం ఎంత ముందుకు పయనిస్తుంటే మాత్రమేం.... అరాచకాలు, దోపిడీలు ఎల్లెడలా చోటు చేసుకుంటూనే వున్నాయి. బ్రతికున్న వాళ్ళ శరీరావయవాలను దొంగిలించి సొమ్ము చేసుకునే ప్రబుద్ధుల విషయాన్ని ఒక్కసారి మనం పరిశీలిస్తే వారు తమ జీవితాలను వెళ్ళబుచ్చుకునేందుకు ఎంతటి దారుణాలకు ఒడిగడుతున్నారో విశదమవుతుంది.

అవయవాల అపహరణలో డాక్టర్ల హస్తం కూడా లేకపోలేదు కూడా. బ్రతుకు తెరువు కోసం పట్నానికి వచ్చి కళ్ళు పోగొట్టుకున్న వెనిజులా రాష్ట్రానికి



చెందిన వ్యక్తి ఉదంతం ఒకటి యిటీవల వెలుగులోకి వచ్చింది.

సిమెన్స్ అనే ఆ వ్యక్తి ఉద్యోగాన్వేషణలో పూరంతా తిరిగి అలసిపోయి ఒక సత్రం చేరి నిద్రకుపక్రమించాడట. మధ్యలో మెలకువ వచ్చి చూస్తే ఏముంది అంతా అంధకారబంధురం. నిద్రమత్తులో అలా వుందేమోనని అతను కళ్ళు నులుము కున్నాడు. అంతే తన కళ్ళు వుండాల్సిన స్థానంలో గుంటలు పడి వున్నాయట. ఇంకేముంది.... ఎవరో అతని కళ్ళు అపహరించారు. అంత మొద్దు నిద్ర ఎలా పోయాడో మరి సిమెన్స్! ఏమైతేనేం ఉద్యోగం కోసం వచ్చి కళ్ళు పోగొట్టుకొని గుడ్డివాడయ్యాడు.

ఇలాంటి సంఘటనలు ఉత్తర అమెరికాలో సర్వ సాధారణమేనట! మరి అక్కడివాళ్ళు ఎలా బ్రతుకుతున్నారో!

ఓ

ఓ వజ్రకాయుడు సునిశితమైన చూపుల్తో తమనే గమనిస్తూ వుండటాన్ని వాళ్ళలో ఎవరూ గుర్తించలేదు.

వాళ్ళందరూ అక్కణ్ణించి కదలగానే ఆ వజ్రకాయుడు సాలోచనగా చెట్టు మీద నుంచి కిందికి దిగి నిశ్శబ్దంగా చెట్ల గుబురులోకి అదృశ్యమై పోయాడు.

* * * *

వజ్రకాయుడు చెప్పిందంతా శ్రద్ధగా విన్న విశ్వంభరవర్మ నెమ్మదిగా తలూపాడు.

"శభాష్ శక్తీ, శభాష్! సామాన్య మానవుడెవరూ దాటలేని లోయ దాటి వజ్రపాణి సామ్రాజ్యంలో ప్రవేశించడమే గాకుండా చాలా విలువైన సమాచారం సేకరించి తెచ్చావు. నువ్వీ పని సాధించగలిగావంటే ఇక వజ్రపాణిని మనం దెబ్బ కొట్టగల రోజు ఎక్కువ దూరంలో లేదు," అన్నాడు.

శక్తిధర్ దృష్టి చిన్నోడి వైపు మళ్ళింది. చిన్నమ్మ చిన్నోడి పక్కనే కూర్చుని వుంది. శక్తిధర్ చిన్నోడి భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేశాడు.

"ఇదంతా చిన్నోడి సాయం వల్లనే సాధ్యమైంది బాబా! చిన్నోడు ఆ లోయ గురించీ, వజ్రపాణి సామ్రాజ్యం గురించీ అన్ని వివరాలూ పూసగుచ్చినట్టు మనకు చెప్పబట్టే నేనీరోజు వజ్రపాణి సామ్రాజ్యంలోకి అడుగు పెట్టగలిగాను. ఆ లోయ దాటి వజ్రపాణి సామ్రాజ్యంలో ప్రవేశించడానికి ఓ అనువైన మార్గముంది. అయితే నేనొక్కణ్ణి మాత్రమే ఆ మార్గంవెంట లోయ దాటి వెళ్ళగలను. ఇతరులకది సాధ్యం కాదు," అన్నాడు.

విశ్వంభరవర్మ అతనికేసి సగర్వంగా చూశాడు.

"ఈరోజు నిజంగా నువ్వు శక్తిధరుడివే అనిపించావు. సామాన్యులెవరూ సాధించలేని ఇటువంటి మహాకార్యాలు సాధించగలందుకే నేను నిన్ను వజ్రకాయుడిగాతీర్చిదిద్దాను. అయితే నువ్వు చెప్పిందాన్ని బట్టి వజ్రపాణి సామ్రాజ్యంలో ఏదో కొత్తకథ ప్రారంభమైందన్నమాట. ఆ అమ్మాయి అక్కడికలా చేరుకోగలిగిందో నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. సరే, అనుక్షణమూ నువ్వక్కడేం జరుగుతోందో గమనించి నాకు తెలియజేస్తూ వుండు. పొరపాటున కూడా నువ్వు వజ్రపాణి ముందు బయటపడకూడదు. అర్థమైందా?"

శక్తిధర్ తలూపేడు.

విశ్వంభరవర్మ అతని కళ్ళలోకి సూటిగా చూసి మృదువుగా అతని చేతి మీద చెయ్యి వేశాడు.

"శక్తీ! కర్తవ్యపాలన ముందు మనసుకు తావులేదు. నాకు నువ్విచ్చిన మాట గుర్తుంచుకుంటావనీ మానసిక అనుభూతులకు లొంగిపోవనీ ఆశిస్తాను."

ఆయన ఆ మాట చెప్పగానే శక్తిధర్ మొహం గంభీరంగా మారింది. నెమ్మదిగా తలూపేడు.

విశ్వంభరవర్మ కళ్ళు మెరిశాయి.

"అయితే ఇక వెళ్ళు. నీ కర్తవ్యాన్ని నువ్వు నెరవేర్చు."

శక్తిధర్ మెరుపులా లేచి నిలబడ్డాడు. అతని మొహంలో ఎలాంటి భావమూ లేదు. కానీ, విశ్వంభరవర్మ అన్న మాటలతో లోలోపలే అతని గుండె చితికిపోయింది.

అతని గుండె చితికిపోయిందని విశ్వంభరవర్మకు తెలుసు. బాగా తెలుసు.

* * * * * *

వెన్నెల మండుతోంది.

వెన్నెల మండుతుంది కూడా. వెన్నెల మండుతోందని ఎవరో కవి రాసిన వాక్యం చదివినప్పుడు వెన్నెల మండడమేమిటని కొట్టిపారేసింది తను. వెన్నెల మండుతుందని ఇప్పుడే తెలిసింది. పింకీకి ఆ వెన్నెల రాత్రి దుర్భరంగా అనిపించింది.

శక్తిధర్ తన పెదవులమీద పెట్టిన ముద్దు ఇంకా తన పెదవుల్ని మండిస్తూనే వుంది. మునివేళ్ళతో పెదవులు తడుముకుంది. మునివేళ్ళు పెదవుల్ని తాకుతూనే ఆమెలో అంతులేని కలవరపాటు కలిగింది. తల పైకెత్తి చందమామ వైపు చూస్తున్నదల్లా ఆమె కలవరపాటుతో ఠపీచి ఎండో కర్టెన్ లాగేసి గిరుక్కున వెనుదిరిగి పరిగెత్తుకుంటూ కింగ్ సైజ్ మాస్టర్ బెడ్‌మీద వాలిపోయింది. మెత్తని ఫోంబెడ్ శరీరంలో ముళ్ళు గుచ్చుకున్నట్టుగా అనిపించింది. గిరుక్కున లేచి కూచుంది.

ఈ ఒంటరితనాన్ని తట్టుకోగలగడం తనవల్ల కాదు. ప్రభుతో కాసేపు బాతాఖానీ పెట్టుకుంటే ఈ తాపాన్ని మర్చిపోగలుగుతుందేమో!

ఆమె మాస్టర్ బెడ్‌మీద నుంచి లేచి తలుపు తెరుచుకుని ఆ గదిలోంచి బైటికొచ్చింది. వజ్రపాణి తన కోసమని తన హవేలీలో ప్రత్యేకంగా కేటాయించిన గది అది. ఆ గది కేవలం విలువైన అతిథులకు మాత్రమే పరిమితం. ఆ పక్క గదిలోనే ప్రభుకి వసతి ఏర్పాటు చేశాడు వజ్రపాణి.

తన గదిలోంచిబైటికొచ్చి కారిడార్లో ఎవరైనా కనిపిస్తారేమోనని అటూ ఇటూ చూసింది. ఎవరూ లేరు. పక్క గది ముందు నిలబడి ఆమె తలుపు తట్టింది. ప్రభు ఇంకా నిద్రపోనట్టున్నాడు. ఆమె తలుపు తడుతూనే వెంటనే వచ్చి తలుపు తెరిచాడు.

గుమ్మంలో ఎదురుగా పింకీ కనిపించేసరికి అతను కొద్దిగా ఆశ్చర్యపోయాడు.

"నువ్వా! రారా!" అంటూ పక్కకి జరిగాడు.

పింకీ ఆ గదిలోకి అడుగు పెట్టింది. తన గదంత అందంగా లేకపోయినా చాలా బావుంది. ప్రభు తలుపు మూసేసి వెనక్కి తిరిగి వచ్చేటప్పటికి ఆమె ఓ కుర్చీలో సౌకర్యంగా కూచుని అతని కేసి నవ్వుతూ చూసింది.

"నీ గది కూడా చాలా బావుంది" అంది.

"డబ్బున్నవాళ్ళేం చేసినా బాగానే వుంటుంది. ఈ మారుమూల పల్లెటూళ్ళో వజ్రపాణి ఎంత ఖరీదైన జీవితం గడిపేస్తున్నాడో ఆలోచిస్తే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు ప్రభు.

"సిల్లీగా మాట్లాడకు. వజ్రపాణి వజ్రాల్లో మునిగితేలుతున్నాడు. అతన్లాంటి మిలియనీర్‌కి ఈ మాత్రం ఖరీదైన జీవితం ఈ మారుమూల పల్లెటూళ్ళోనే కాదు, పాతాళంలోకెళ్ళి మకాం పెట్టినా దొరుకుతుంది."

ప్రభు నవ్వేడు.

"నువ్వు చెప్పింది కరెక్టే. అయినా నువ్వేమిటిలా ఇంతరాత్రివేళ ఇలా నేరుగా నా గదిలోకొచ్చేశావ్! నీకు అర్ధరాత్రి అపరాత్రి లేదా?"

"ఏం చెయ్యమంటావ్, నిద్రపట్టలేదు. నువ్వు కబుర్లు చెబుతావని ఇలావచ్చాను," అంది పింకీ.

ప్రభు ఆమె పక్కనే కూచున్నాడు.

"నిజం చెప్పాలంటే నాకూ నిద్రపట్టడంలేదు. కళ్ళుమూసినా తెరిచినా నాకా సూర్యనేత్రమే కనిపిస్తోంది. 765 క్యారెట్ల వజ్రమంటే కనీసం ఫుట్‌బాలంతైనా వుంటుందనుకుంటాను," అన్నాడు.

పింకీ నవ్వుతూ తల అడ్డంగా వూపింది.

"ఒక క్యారెట్ అంటే 200 మిల్లీగ్రాములు.

1000 మిల్లీగ్రాములు ఒక గ్రాము. అంటే 5 క్యారెట్ల వజ్రం ఒక గ్రాము బరువుంటుందన్న మాట. 765 క్యారెట్ల వజ్రం 153 గ్రాములుంటుంది. ఒక క్యారెట్ వజ్రమే అపురూపమైంది. ఇక 765 క్యారెట్ల వజ్రం వుంటుందనేది వూహించలేని సంగతి. జూడా చెప్పిన మాట నిజమైతే అంత పెద్ద వజ్రం అజ్ఞాతంగా ఈ హవేలీలోనే ఎక్కడో వుంది. అది బయటికొచ్చిన నాడు ఆ వార్తవిని ప్రపంచమంతా ఆశ్చర్యపోతుంది. ఫుట్‌బాలంత పెద్దవజ్రం వుండటం అసంభవం. ఒకవేళ వుంటే అది కొన్ని లక్షల కేరెట్ల బరువుండాలి. అంత పెద్ద వజ్రం మనిషికి ప్రకృతి ప్రసాదించలేదు" అంది.

"24 క్యారెట్ల బంగారమంటారే, అంటే సుమారు అయిదుగ్రాముల బంగారమన్న మాట!" అన్నాడు ప్రభు.

"తప్పు. బంగారం క్యారెట్లకీ, వజ్రాల క్యారెట్లకీ సంబంధం లేదు. ఆ క్యారెట్లు వేరు ఈ క్యారెట్లు వేరు. వజ్రాల క్యారెట్లు బరువును కొలుస్తాయి. బంగారం క్యారెట్లు స్వచ్ఛతను కొలుస్తాయి" అంది పింకీ.

"అంటే?"

వజ్రసంకల్పం

"ఎలాంటి కల్తీలేని స్వచ్ఛమైన బంగారం 24 క్యారెట్లు వుంటుంది. 24 క్యారెట్ల బంగారంతో ఆభరణాలు తయారు చెయ్యడం అసాధ్యం. అందులో కొంత కల్తీ కలిసినప్పుడే బంగారం గట్టిపడి ఆభరణాలు తయారౌతాయి. ఆ కల్తీనే బంగారు ఆభరణాలు అమ్మజూపినప్పుడు తరుగుకింద తీసేస్తారు."

"అర్థమైంది. అయితే సూర్యనేత్రం ఫుట్‌బాలంత వుండదన్నమాట," కొద్దిగా డిసప్పాయింట్ అవుతున్నవాడిలా అన్నాడు ప్రభు.

"ఇది మరీ బావుంది. గుర్రాన్నెప్పుడూ చూడని వాడికి గుర్రాన్ని చూపిస్తే, 'ఒసింతేనా! కనీసం కొండంతైనా వుంటుందనుకున్నాను.' అన్నాట్ట వెనకటికెవరో. అలావుంది నువ్వంటున్న మాట."

ప్రభునవ్వేశాడు.

"సరేగానీ, ఆ వజ్రపాణి మనకా సూర్యనేత్రం ఎందుకు చూపిస్తాడు? ఎంతాలోచించినా అదెక్కడుందో కనుక్కునే మార్గమే నాకు తోచడంలేదు," అన్నాడు.

"దానికి ఒక్కటే మార్గముంది"

ప్రభు ఎగిరి గంతేశాడు.

"అయితే, ప్లాన్ ముందుగానే ఆలోచించి పెట్టావన్నమాట." ఆనందంగా అన్నాడు.

పింకీ తలూపింది.

"చెప్పు, ఏమిటా మార్గం?" ఆత్రంగా అడిగాడు ప్రభు.

"నగ్నదేవత మైలమ్మ!"

ప్రభు ఆశ్చర్యంగా చూశాడు.

"మైలమ్మా!"

"అవును. జూడా మైలమ్మ గురించి ఏం చెప్పాడో గుర్తుందా?"

"గుర్తుంది. ఆమె వజ్రపాణి ఆరాధ్యదేవత. ఎప్పుడూ నగ్నంగానే వుంటుంది. ఆమె మాటంటే వజ్రపాణికి వేదవాక్కు."

"అదంతా సరే!" అసహనంగా అంది పింకీ "నగ్నదేవత మైలమ్మ గురించి జూడా మరో మాట చెప్పాడు."

"ఏమిటది?"

"సూర్యనేత్రం ఎక్కడున్నదీ వజ్రపాణికి ఒక్కడికీ కాదు, మైలమ్మక్కూడా తెలుసు."

"అవును, ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది."

"మైలమ్మ ద్వారా ఆ రహస్యం తెలుసుకోవడానికి మనం ప్రయత్నించాలి.

"ఆమె మనకెందుకు చెబుతుంది?"

"చెప్పేలా చేయాలి"

ప్రభు ఒక్క క్షణం ఆలోచించాడు.

"అంతా బాగానే వుంది. కానీ, ఆ మైలమ్మ ఎక్కడుంటుంది?" అడిగాడు.

పింకీ ఏదో చెప్పబోతూ తలపైకెత్తి చూసింది.

అంతే!

ఆ మరుక్షణం కెవ్వున వికృతంగా కేకపెట్టింది.

ప్రభు అదిరిపడి ఆమె చూసిన వైపు తలపైకెత్తి చూశాడు.

వాళ్ళకెదురుగా ఆ గదికో కిటికీ వుంది. తనా కిటికీ ఇంతకు ముందు మూసి వుంచినట్టు జ్ఞాపకం. కానీ, ఇప్పుడా కిటికీ తెరిచివుంది.

తెరిచివున్న ఆ కిటికీ అవతల భూతంలా నిలబడి తమకేసి చూస్తోంది నగ్నదేవత మైలమ్మ.

పరమ వికారంగా వున్న ఆమె నగ్నరూపం చూస్తూనే ప్రభు తలమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

ఆ కిటికీలో బొద్దింక ఒకటి పాకుతోంది. వాళ్ళిద్దరూ అలా కళ్ళప్పగించి చూస్తుండగానే మైలమ్మ చెయ్యి కిటికీలో పలికొచ్చి చటుక్కున బొద్దింకను ఒడిసిపట్టుకుంది.

వాళ్ళిద్దరూ చూస్తూనే వున్నారు.

మైలమ్మ ఆ బొద్దింకను చేతిలోకి తీసుకుని దానివైపు ఆప్యాయంగా చూసింది. ఆమె చేతుల్లో చిక్కుకున్న ఆ బొద్దింక తన చిన్న చిన్న కాళ్ళు వేగంగా కొట్టుకుంటోంది. మైలమ్మ ఆప్యాయంగా ఆ బొద్దింకను అలా చూస్తూనే అమాంతం నోరు తెరిచి దాన్నినోట్లో వేసుకుని నమిలేయసాగింది.

పింకీ రెండు చేతుల్తోనూ నోరు నొక్కేసుకుంటూ గొంతులోని అరుపును గొంతులోనే అదిమిపెట్టేసింది. ఆ దృశ్యం చూస్తున్న ప్రభు గొంతులో తడారిపోయింది. వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది.

మైలమ్మ బొద్దింకను తినడం పూర్తిచేసి వాళ్ళకేసి మరోసారి వికృతంగా చూసి నెమ్మదిగా వెనుదిరిగింది. వెళ్ళిపోతున్న ఆమెని వాళ్ళు అలాగే కళ్ళప్పగించి చూస్తుండిపోయారు.

ఇద్దరికీ కాళ్ళు చల్లబడిపోయినట్టనిపించింది.

(ఇంకా వుంది)

ఔరంగజేబు భార్యలు

ఔరంగజేబు ప్రథమ వివాహము ఆగ్రా పట్టణంలో 1637వ సంవత్సరము మే ఎనిమిదవ తేదీని నితాంత వైభవముతో జరిగెను. వధువు నామము 'దిల్ రుసుబాను' ఈమె 'షా నవజ్‌ఖాను' కుమార్తెలలో నొకతె. ఔరంగజేబునకీ 'దిల్ రుసుబాను' ప్రథమ కళత్ర మగుటచే బేగము బిరుదు వహించి గౌరవింపబడుచు వచ్చెను. పట్టుదల, గర్వము ఈమె సహజ గుణములు. అందువలన ఔరంగజేబునకు గూడ ఈమె యనిన పక్క బెదురుగనే యుండెడిది.

ఈమె చాలా కాలము జీవించినట్లగుపింపదు. ప్రసూత్యంతమున ఆమెకు జబ్బు చేసెను. తుదకా జబ్బు వలననే ఆమె 1657వ సంవత్సరమున అక్టోబరు ఎనిమిదవ తారీఖున ఔరంగబాదులో మరణించెను. అట్లగుట వివాహానంతర మామె ఇరువది సంవత్సరములు మాత్రమే జీవించినదన్నమాట. ఆమెను పాతిపెట్టిన చోట నొక సమాధికలదు. అద్దానికి ఆమె కొమారుడు 'ఆజమ్' అనువాడు ఔరంగజేబు ననుమతి వడసి బాగుచేయించెను. ఔరంగబాదు నందలి రమ్యదృశ్యములలో నా సమాధి యొకటి.

* * * *



ఔరంగజేబు రెండవ భార్య పేరు 'రహమతున్నీసా' నవాబుబాయి అని ఈమెకు మఱియొక నామము కలదు. ఔరంగజేబు ననంతరము మొగలాయి సామ్రాజ్య సింహాసన మధిష్ఠించిన మొదటి 'బహదూరుషా' 'రహమతున్నిసా' కొమారుడే. కాశ్మీర దేశమునందలి 'రాజేరి' సంస్థాన పరిపాలకుడగు రాజరాజునకీ 'నవాబు బాయి' తనయ రాజపుత్ర స్త్రీయగు 'నవాబుబాయికి' పుట్టిన వాడగుటచే 'బహదూరుషా' చక్రవర్తి సయ్యాదు అని పిలిపించుకొనుటకు వీలు లేకుండెను. ఈ చిక్కు విడదీయుటకై రాజాశ్రయులు 'రహమతున్నిసా'కు అయథార్థమైన వంశావళి నేర్పరచి ఈ క్రింది కథను కల్పించిరి.

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ వంశీయుడైన సయ్యదు షామోర్ అనుకాఫరు రాజేరి సంస్థానమునకు చెందిన పర్వతములలో శాంత జీవనము చేయుచుండెను. ఆ సంస్థానాధిపతి ఆ కాఫరును భక్తి తాత్పర్యములతో నారాధించి, అవివాహితయగు తన కొమార్తె నాతనికి నుపహారముగా నర్పించెను. అతడా యవ్వనవతిని సంతోష పూర్వకముగా స్వీకరించి, మహమ్మదీయ మతమున చేర్చుకొని పరిణయ మాడెను.

కాఫరున కామెయందొక పుత్రుడును, పుత్రికయు జన్మించిరి. అనంతర మా కాఫరు మెక్కా మెదీనాలకు తీర్థయాత్రకై వెడలెను. అతని తరువాతి వృత్తాంత మేమియు తెలియ వచ్చినది కాదు. రాజేరి సంస్థానాధీశుడు మనుమని మనుమరాలిని చేరదీసి హైందవ వాతావరణములో పెంచెను. ఆ బిడ్డల పితృత్వ విషయ మాతడెప్పుడును రహస్యముగనే యుంచెను. షాజహాను చక్రవర్తి ఒకప్పుడీ సంస్థానాధిపతిని ఆతని వంశ సంభూతు రాలైన కన్య నొకదానిని అరణము గానీయ వలసినదని యాజ్ఞాపించెను. అందుపై నాతడు మనుమరాలిని చక్రవర్తి కర్పించెను. అప్పటికే ఆమె నిండు జవ్వనము, నిర్మల హృదయము, నిశిత ప్రతిభ, వీను మిగిలి యుండెను. రాణివాసమున పెర్షియను స్త్రీలు నవాబు బాయికి నానా భాషలతో పరిచయము చేసిరి. అనతి కాలముననే ఆమె ఔరంగజేబున కర్ధాంగి యయ్యెను. నవాబు బాయి వంశ పరంపరను గూర్చి వాడుకలో నున్న అసంఖ్యాకము లగు కల్పిత గాథలలో నిది యొకటి. చరిత్రకారుడు ఖాఫీఖానుడీ వృత్తాంతము జన ప్రవాద మనుచున్నాడు. బహదూరుషా నుబ్బు వేయుటకు తదాశ్రయు లల్లిన కల్లబొల్లి కతగాని ఇదిఅన్యము కాదని చరితజ్ఞుల నిశ్చితాభి ప్రాయము. కాని ఆ కథనమున అసత్యతా సంశయ మునకు తావు లేదని చరిత్ర కారుడు సర్కారు అభిప్రాయ పడుచున్నాడు. కాశ్మీర దేశములోనే 'భీమచర్' మండలమున ముసల్మాను లకును, హైందవులకును మతాంతర వివాహము లుండెను. జన్మముచే ఏ మతమునకు చెందినను స్త్రీ తరువాత తాను వివాహమాడిన పురుషుని మతమును పొందుచుండు నాచారముండెను. 1634వ సంవత్సరమున అక్టోబరు మాసములో షాజహాను చక్రవర్తి ఆ యాచారమును నిషేధించి హైందవుడు మహమ్మదీయ స్త్రీని వివాహమాడుచో మహమ్మదీయ మతమును స్వీకరింప వలయునని శాసించెను. దీనిని బట్టి కాఫరు రాజపుత్రకుల సంజాతియగు రాజరాజు పుత్రికను పెండ్లి యాడుటలో విరుద్ధమేమియు లేదని సర్కారు వాదన.

చరమదశ

'నవాబు బాయి' చరమ దశయందు కష్టముల పాలయ్యెను. ఆమె పుత్రులగు మహమ్మదు సుల్తాను, మజ్జాము అనువారలు చెప్పుడు మాటలు విని చక్రవర్తిని తిరస్కరించి మెలగజొచ్చిరి. ఇది నవాబు బాయికి ఎంతయో మనస్తాపము కలిగించెను. మజ్జామును ఆమె బ్రతిమాలెను, బామాలెను, దుష్టబుద్ధులు చక్రవర్తి యెడ తిరస్కార భావము మానుమని. కాని అతడు వినిపించు కొనలేదు. తుదకాతడు బందీకృతుడయ్యెను. నవాబుబాయి అప్పటికే వీడు జవ్వనమున నుండుటచే ఔరంగజేబు ఆమె యందలి ప్రేమను అన్యథా పరివర్తించెను. పతిని, పుత్రులను పెక్కు సంవత్సరములు బాసియుండి తుదకామె 1691వ సంవత్సరమున ఢిల్లీలో మృతినొందెను.

* * * *

ఔరంగజేబు మూడవ భార్య 'ఔరంగబదిమహల్'. ఔరంగాబాదు నగరమున నుండగా మొగలాయి రాణి

వాసమున ప్రవేశమొనర్చుటచే నీమె కాపేరు కలిగినది. బీజపురమున 1688వ సంవత్సరమున నీమె బొబ్బరోగము వలన మరణించినది. వెనీసు దేశ యాత్రికుడగు 'మునూసి' అనువాడీమె సమాధిని గూర్చి వ్రాసి యున్నాడు. 'ఔరంగబది మహల్' రాణి పేరిట గొప్ప సమాధి నెలకొల్పుటకు ఔరంగజీబు పూనుకొనెను. ఆ సమాధి శిఖరము మిక్కిలి ఎత్తుగా నుండెను. అజ్మీరు రాష్ట్రము నుండి కొనితేబడిన చలవరాళ్ళచే నా సమాధి నిర్మింప బడెను.

★ ★ ★ ★

'ఉదిపురి మహల్' ఈమె ఔరంగజీబు ఉంపుడుకత్తె. 'కామ్ బక్షీ' ఈమె తనయుడు. ఆమె దాసీ పుత్రిక. తొలుత 'దారా' రాణివాసమున నుండెను. 'దారా' చేటు నొందిన తరువాత ఉదిపురిమహల్ ఔరంగజీబునకు ఉప స్త్రీ యయ్యెను.

వెనీసు యాత్రికుడయిన 'మునూసి' వ్రాతల వలన ఈ వృత్తాంతము తెలియుచున్నది. ఔరంగజీబు రాణి వాసమున చేరుసరికి ఉదిపురి మంచి పడుచుతనములో నుండి యుండును. 1667వ సంవత్సరమున తొలిసారి ఆమె సంతానవతి యయ్యెను. అప్పటికి ఔరంగజీబునకు ఏబదవ పడి. ఆమె యౌవన విలాసములకు ముగ్ధుడై ఔరంగజీబు ఆమె త్రాగుబోతు దనమును ఆమె పుత్రుడు 'కామ్‌బక్షీ' తప్పిదములను మన్నింపుచు వచ్చెను.

ఉదిపురి మహల్ దాసీ పుత్రిక యనుటకును ఔరంగజీబు వ్రాతలే ప్రబల సాక్ష్యము. 'జింజీ' నగరమును ముట్టడించు సందర్భములో శత్రువులతో లాలూచియైన 'కామ్‌బక్షీ'ని గురించి ఔరంగజీబు ఇట్లని వ్రాయుచున్నాడు. 'చక్రవర్తి వలన జనించిన వాడయ్యు దాసీ దాని కొమారుడు మంచి చేయజాలడు.' ఉదిపురి కొందరను కొనునట్లు దాసీ పుత్రిక గాక రాజపుత్ర స్త్రీ యని 'మీవారు దేశ చరిత్ర'లో 'టాడ్' వ్రాయుచున్నాడు. 'కామ్ బక్షీ' పేర తన అవసాన కాలమున ఔరంగజీబు వ్రాసిన ఉత్తరములో నీ తల్లియైన ఉదిపురి నాకు జబ్బు చేసినప్పటి నుండియు ఇచ్చటనే యున్నది. నాతోపాటు తాను కూడ మరణించెదనని చెప్పు చున్నది' అని వున్నది. ఈ వ్రాత నాధారము గైకొని 'టాడ్' చరిత్ర కారుడు ఉదిపురి రాజపుత్ర స్త్రీ అయి యుండునను చున్నాడు.

ఇది సత్యదూరము. హైందవ వనిత మహమ్మదీయుని పరిణయమాడుచో మహమ్మదీయ మతమును స్వీకరింప వలసి యుండును. మహమ్మదీయులు శవములను ఖననము చేయుదురు గాని హిందువులకు వలె దహనము చేయరు. అదియును గాక మొగలాయి రాణి వాసమున చేరిన మఱి ఏ రాజపుత్ర స్త్రీ గాని సహగమనము చేసినట్లు గనిపించదు. ఔరంగజీబు నందుండెడు అనురాగాతి శయము కొలదిని తన జీవితమును తుదముట్టించు కొనెదనని ఉదిపురి అని యుండును. కాని సాగుమానము సంగతి తలచి యుండ దనుట వాస్తవము. అందు వలన 'ఉదిపురి' రాజపుత్ర స్త్రీ కాదని చరిత్ర కారుడు సర్కారు వ్రాయుచున్నాడు.

★ ★ ★ ★

'జెయినాబది' ఈమెకు హీరాబాయి అని మఱియొక నామము కలదు. ఈమె ఔరంగజీబు పినతండ్రి (పిన తల్లి పెనిమిటి) 'మీరు ఖాలిమ్' సేవకురాండ్రలో నొకతి. దక్కనుకు వైసురాయిగా నున్నప్పు డొకసారి ఔరంగజీబు పిన తల్లిని చూడబోయెను. అప్పుడు తపతీ తటమునందలి ఉద్యాన వనమున పినతల్లి సేవకురాండ్లతో మేలి ముసుగు వేసి కొనక నిలిచియున్న హీరాబాయిని అతడు చూచుట తటస్థించెను. ఆ లావణ్యరాశి సమీపమున ఫల భారాన మితమై యున్న సహకార వృక్షము చెంతకేగి మునివేళ్ళపై నిలబడి కొమ్మలు వంచి కాయలు కోయ దొడగెను. అప్పటి ఆమె నిరుపమాన లావణ్యము తిలకించి ఔరంగజీబు మోహ పరవశుడయ్యెను.



తాను తిరిగి పోవునపుడు తనతో కూడ నామెను తీసికొని పోయి ఆమె కనుసన్నల మెలగుచుండెను. ఈ వృత్తాంతము 1153లో జరిగి యుండును. అప్పటికి ఔరంగజీబునకు ముప్పది అయిదు సంవత్సరము లుండును.

'జెయినాబది'కి ఔరంగజీబు ఎంత వశవర్తుడై మెలగినది తెలియజేసెడి కథ యొకటి యీ దిగువ నుదహరింప బడుచున్నది. ఒకనాడు జెయినాబది ఒక గ్లాసులో కల్లు సారాయి పోసి ఔరంగజీబున కందిచ్చి త్రాగుమని బలవంత పెట్టెను. మతాభి మానియైన ఔరంగజీబు అట్టి పాప కార్యము చేయనొల్లక అనుచితమైన అట్టి కోరిక కోరవలదని 'జెయినాబది'ని సహస్ర విధముల బ్రతిమాలను. 'జెయినా బది' వినలేదు. ఔరంగజీబు చేయునది లేక సారాయము త్రాగ నుద్యుక్తుడయ్యెను. వెంటనే ఆ మాయలాడి ఔరంగజీబు చేతినుండి కల్లు గ్లాసు లాగికొని ఇట్లనియెను. 'మీకు నాయందుండెడు అనురాగాతి శయమును నిర్ణయించు కొన వలయునను కుతూహలముతో నేనిట్టి కోరిక కోరితిని గాని, మతాభిమానులైన మీచే నిట్టి అకార్యము చేయింప వలెనను దుశ్చింతతో కాదు' నిండు జవ్వనమున నుండగనే ఈమె మరణించి ఔరంగజీబునకు కొలది ఇడరాని విచారము కల్గించెను.

- ఆంధ్ర శేషగిరిరావు.

–(1926, మార్చి 15వ తేదీ, ఆంధ్రపత్రిక నుండి)

బామ్మగారు తప్పిపోయింది

కిటికీలో నుండి జారిపడుతున్న ఎండ చురుక్కుమన డంతో యిక నిద్ర లేవక తప్పలేదు పార్థుకి.

బామ్మగారి సుప్రభాతంతో గంట క్రితమే మెలుకువ వచ్చినా పక్క దిగ కుండా అలా పొర్లుతూనే ఉన్నాడు.

"లేవరా పార్థుడూ వేపపూత తీసు కురావూ...." అని తెల్లవారు ఝామున లాలనగా మొదలు పెట్టిన బామ్మగారు, బ్రతి మాలింపు ధోరణిలో నుండి కేకలువేసే స్టేజికి వెళ్లినా లేవని పార్థు సూర్యభగవా నుడి కోపానికి హడలిపోయిన వాడిలా లేచి కూర్చున్నాడు కళ్లు నులుముకుంటూ.

కళ్లు తెరవక ముందే రెండు అరచే తులు కళ్లముందు పెట్టుకుని దేవుడిని తలు చుకుంటే శుభప్రదం రా పార్థూ... అని బామ్మగారు పోరగా..పోరగా ఆ పద్ధతే అల వాటు చేసుకున్న పార్థు దేవుడికి బదులు సజాతను తలుచుకుని....

"సుజీ! మై డార్లింగ్....." అని ముద్దు పెట్టుకున్నాడు అరచేతుల్లో.



నామనవడికి నామాట వేదవాక్కు అని మురిసిపోయే బామ్మగారి కంట ఎప్పుడైనా ఈ సీను కంటపడిందంటే "అయ్యో! అదేంపనిరా అబ్బి! దేవుడిని తలుచుకుని దణ్ణం పెట్టు కుంటారు గానీ.. ముద్దు పెట్టుకోవడం ఏమిట్రా...."అంటుంది విడ్డూరంగా.

పార్థు ఆవిడికి సమాధానం చెప్పలేక అబ ద్ధమాడేస్తాడు. "లేదు బామ్మా! ఈరోజు దేవుడికి బదులుగా దేవతను తలుచుకున్నాను. అందుకు....."

"అయ్యో! ఎవతైతే మాత్రం...." అని విరుచుకుపడబోయి ఏదో గుర్తువచ్చి నట్టు ముసిముసిగా నవ్వుకుంటూ "పిచ్చి సన్నాసి...." అంటుంది.

పార్థు తలతిప్పి కిటికీలో నుండి బయటకి చూశాడు.

లేలేత ఎండలో నవ వధువులా ముస్తా బైన గున్నమామిడి.....

ఎక్కడో చెట్టు గుబురులోంచి వినిపిస్తోన్న ఎలకోయిలగానం.... వీచే చల్లటి గాలి....

పార్థు మనసులో ఒక్కసారిగా ఏదో తెలి యని అనుభూతి.

పది రోజులు క్రితమే ప్రక్కింటి వాళ్ల అమ్మాయి పెళ్ళయింది. రంగులతో... అదో అందంతో.....నవ వధువులా క్రొత్త కళతో ఉందాయిల్లు.

పార్థు నిట్టూర్చాడు.

ఈవిడో చాదస్తపు బామ్మ! లేకపోతే ఈ వేసవిలో పెళ్లయి తనూ క్రొత్తల్లుడిలా ఉగాదికి అత్తారింట్లో ఉండే వాడు. లేకపోతే జాలీగా హనీమూన్ ట్రిప్‌లో నన్నా ఉండే వాడు.

"ఇద్దరి జాతకాల ప్రకారం యిప్పట్లో ముహూర్తాలు లేవురా నాయనా. శ్రావణం దాకా ఆగాలి...." అని బామ్మగారి ఆర్డరు.

"ఈ బామ్మని ఏం చేస్తే బావుం

టుంది..... అని ఆలోచించబోయి ధడాల్న తలుపు త్రోసుకొని ప్రక్కపోర్షన్ వాళ్ల పన్నెండేళ్ల రవి దూసుకు రావడంతో అప్పటికి వాయిదా వేశాడు.

"పార్థంకుల్! తాతగారింట్లో వేప్పూత అంతా కోసేశారు....." అన్నాడు వగరుస్తూ.

"ఊ.... పోనీద్దూ...."

"అమ్మాయమ్మగారింట్లో చెట్టు కూడా ఖాళీ అయ్యేలా ఉంది...." అసహనంగా ఉంది వాడి గొంతు.

"ఆ....! తాతగారింట్లో వేప చెట్టు అమ్మాయమ్మగారి వేపచెట్టేనా ఏమిటి దిక్కు. సిటీ ఏమైనా గొడ్డుపోయిందా...." అనేసి చప్పున నాలిక్కరుచుకున్నాడు.

కరెక్టే! ఇదేమైనా కృష్ణాజిల్లాలో ఉన్న తమ పల్లెటూరా. వీధికి నాలుగు వేపచెట్లుండడానికి.

బాబోయ్! బామ్మ రాత్రి నుండీ చెప్తూనే వుంది. "తెల్లవారు ఝామున లేచి తలంటోసుకుని వేపపూత తెచ్చి పెట్టరా పార్థుడూ...." అని.

అప్పటికీ ప్రొద్దుటి నుండీ ఏకవరసన అరుస్తూనే ఉంది. తనే బద్ధకించిపడుకున్నాడు.

"అంకుల్......."

రవి చెవిలో గట్టిగా అరిచేసరికి అంతెత్తున ఎగిరిపడి ఆ మట్టున దుప్పటయినా మడత పెట్టకుండా దొడ్లోకి పరిగెత్తాడు.

"అదేమిటి పార్థు! ఇంకా వెళ్ళనే లేదా! సరిపోయింది. ఇంకా మీరు వేపపూత పట్టుకొచ్చారనుకున్నాను.....ఏరా రవీ ఇప్పటిదాకా ఎక్కడ అఘోరించావు...." అంది ప్రక్కపోర్షన్ సుందరి.

"మరే పార్థంకుల్...."నసిగాడు వాడు..

గబగబా బ్రష్ చేస్తున్న పార్థు గతుక్కుమన్నాడు.

ఇంతలో సుందరి గభాల్న కొడుకు చెయ్యందుకని "ఏమిట్రా వెధవా! ఎక్కడ పడ్డావు? మో చేతులు అలా కొట్టుకుపోయాయి....." అంది తీవ్రంగాను, ఖంగారుగాను.

'అమ్మాయమ్మగారి వేపచెట్టెక్కుతుంటే పై కొమ్మ విరిగి అనసూయాంటీ వాళ్ల నుబ్బు నా మీదపడ్డాడు. ఇద్దరం...." అంటూ గుటకలు మింగాడు.

"ఓరి వెధవా! అమ్మాయమ్మగారి వేప చెట్టు ఎంత పెద్దదని కట్టగట్టుకుని అందరూ ఒకేసారి ఎక్కారు. లేత కొమ్మ లెక్కి కాళ్లు చేతులూ విరుచుకుంటే ఆనక ఎవడు చేస్తాడ్రా గుంటవెధవా. అన్నీ అబ్బబుద్ధులే... " అని తిడుతూ వాడిని లోపలికి లాక్కుపోయింది.

"ప్రొద్దుటే తలస్నానం చేసివెళ్లి మట్టి కొట్టుకొచ్చి..."

"బామ్మా కాఫీ....." అని అరిచి తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ దొడ్లో చిడీల మీదే చతికిలబడ్డాడు.

సుందరి భర్త కొంచెం దూరంలో కూర్చుని కూరలు తరుగుతున్నాడు.

ఎనిమిదేళ్ల కూతురు చీపురు పుల్లకు గుచ్చిన చింతపండు చీకుతూ కళ్లల్లో పడిన కుంకుడు నురుగు బాధను మర్చిపోయే ప్రయత్నం చేస్తోంది.

"బామ్మా! కాఫీ...." ఇంకో సారి గట్టిగా అరిచాడు.

"పార్థూ! వాడిప్పుడు ఎక్కడికీ రాలేదు కానీ నువ్వే కాస్త వేపపూత తెచ్చిపెట్టు



కుందుర్తి ఇందిరాదేవి

బాబూ..."అంది సుందరి లోపలి నుండి వస్తూ.

"మమ్మీ నేను కూడా అంకుల్‌తో వెడతా..." వెనకే నసుగుతూ వచ్చాడు రవి.

"ఛ వెధవా నోర్మూయ్! నీ కాళ్లు చేతులు అసలే తిన్నగా ఉండవు. ఉన్నది ఒక్క మగ నలుసువి. ఏ చెట్టు కొమ్మో విరిగి క్రింద పడ్డావంటే నేనేడవాలి ముందు...."

పన్నెండేళ్ల రవి ఎక్కితే విరిగే కొమ్మ పాతికేళ్లు దాటిన తనెక్కితే విరగదా" అని ధర్మసందేహం వచ్చింది పార్థుడికి

"మమ్మీ -ప్లీజ్......"

"పిల్లేదన్నానా వాళ్ల సుబ్బు వేపచెట్టెక్కి క్రిందపడ్డాడని నువ్వేగా చెప్పావు...."

"ఆహా అమ్మాయమ్మగారి వేపచెట్టెక్కి ఆ లేతకొమ్మల మీంచి తను క్రిందపడి కాళ్లు విరగ్గొట్టుకుంటే ఫరవాలేదన్నమాట."

అందులో తను ఒక్కడే మనవడు బామ్మ గారికి. వంశోద్ధారకుడు కూడా.

"ఏమిటి మీరు చూసే చోద్యం. త్వరగా కూరలు తరగండి. కుక్కరు పెట్టేస్తాను. మళ్లీ పిల్ల వెధవలు ఆగలేరు. ఆకలికి....." కళ్ళెర్రచేస్తూ రివ్వున లోపలికి వెళ్లింది సుందరి.

భార్య ఝాడింపుకి హడలిపోయి చప్పున బుర్రగోంచుకుని కసిగా అనపకాయిని సర్రునకోశాడు సుందరి భర్త.

మోచేతి మీద దెబ్బ తగిలిన చోట తల్లి వేసిన టించరు మంట పెడుతోంది కాబోలు. ఊదుకుంటూ, జాలిగా చూశాడు రవి.

"బామ్మా! ఎన్నిసార్లు పిలవాలి కాఫీ..?" అని అరిచాడు. లోపలి నుండి సమాధానం లేదు.

"సరేలే అక్కయ్యా! వేపపూత నేనే తెస్తాను..." అని "మీరు గాని వస్తారే మిటి....." అన్నాడు సుందరి భర్తనుద్దేశించి.

"నేనా....!" అతను ముఖం అదోలా పెట్టాడు. "అయనే ఉంటే గుండెందుకని ఆయనగారికి చెట్లెక్కడం వస్తే ఈ తిప్ప లెందుకు..." సుందరి కాఫీ గ్లాసు తెచ్చి పార్థుడి ముందు పెట్టింది.

"మాబామ్మలేదా...." సందేహంగా అడిగాడు.

"ఇప్పుడే వస్తానని బయటికి వెళ్ళింది. తొందరగా వెళ్లు పార్థూ. మళ్లీ వేపపూత దొరకదు..." తలకుచుట్టిన తువ్వాలు తీసి బారెడు జుట్టు విదిలిస్తూ అంది.

"బజార్లో కొనాలంటే వేపపూత ధర కూడా మండిపోతోంది..."

వేపపూత కోసం లంచమన్న మాట ఈ కాఫీ.

సుందరి భర్త చిరాగ్గా చూశాడు. "కుంకుడు పిప్పలన్నీ కూరల్లో పడుతు న్నాయి. కొంచెం అవతలకెళ్లి విదిలించుకో రాదూ....."

"కుంకుడు పిప్పలు పడుతున్నా గుంట్రా యిలా అక్కడే కూర్చోకపోతే మీరే కొంచెం వెనక్కి జరగ్గూడదూ...." ఆగ్రహం వచ్చింది సుందరికి.

పార్థు కిదంతా వినోదంగా ఉంది. సుందరి భర్త పేరు గోపాలం అయినా అత గాడు సుందరి భర్తగానే చెలామణి అవుతాడా వీధిలో.

"నా చిన్నతనంలో ఉగాది వచ్చిందంటే మా పెరట్లో వేపచెట్టెక్కి పది నిమిషాల్లో పూతంతా దూసి వీధంతా పంచేదాన్ని... హూ..." అని ఈసడింపుగా చూసింది.

"ఇంట్లో ఈయున్ని పెట్టుకొని తగుదునమ్మా అని నేను చెట్టెక్కితే నలుగురూ నా నోట్లో ఉమ్మేస్తారని ఆగాను గానీ........"

సుందరి వెక్కిరింపుకి ఇన్సల్ట్ ఫీలయిన భర్త ఆ కోపమంతా తరుగుతున్న కూరలు మీద చూపెడ్తున్నాడు.

రెండేళ్ల క్రితం సుందరి పుట్టింటి నుండి అనపకాయి విత్తులు తెచ్చి దొడ్లో నాటింది.

వాటిల్లో కొన్ని మొలిచి....మొలిచినవి కాస్తా చచ్చి...ఆ చచ్చిన వాటిల్లో తిరిగి ప్రాణం పోసుకుని ఒకే ఒక్క మొక్క మాత్రం బ్రతికి బట్టకట్టింది.

దానికి నీళ్లు పోసి, బాగా పాకడానికి తాళ్లు కట్టి ఏపుగా ఎదగడానికి ఎరువులు వేసి అపురూపంగా పెంచుతుంటే అది బాత్‌రూమ్ మీదికి పాకి పచ్చగా అల్లుకుంటుంటే సుందరి తెగ మురిసిపోయింది!

ఎంతైనా పుట్టింటి తాలూకూ కదూ!

సుందరి మురిపెం కాస్తా ముక్కల య్యేలా పూచిన పూతంతా రాలిపోయి, పడిన పిందెలు మురిగిపోయి పొరబాటున ఒక్క అన పకాయ మాత్రం బాత్‌రూమ్ రూఫ్ మీద పెరిగింది.

దాన్ని కోయమని సుందరి భర్తని పుర మాయించింది.

నాకు గోడ లెక్కడం రాదని అతగాడు దిక్కుముఖం పెట్టాడు.

ఒక స్టూల్ తెచ్చి వేసింది.

"ఉహూ! అందట్లేదు...." అన్నాడు.

దానిమీద ఇంకో స్టూల్ వేసింది.

"ఇంకొక్క జానెడు దూరం వుంది......"

ఆపైన పీటవేసింది.

"బాబోయ్! చచ్చాను..." అతగాడు ఢామ్మని బోర్లాపడి పెట్టిన కేకకి బామ్మ గారు ఛర్రున లేచి "ఒరేయ్ పార్థూ..." అని కేకేసింది.


బామ్మగారి ఆజ్ఞ అందుకోవడమేమిటి, పార్థు ఒక్క ఎగురు ఎగిరి, ఉడతలా గోడమీది కిపాకి క్షణంలో బాత్‌రూమ్ రూఫ్ చేరుకుని ఇంత పెద్ద అనపకాయని చిటికెలో కోసి సుందరికి అందించటం ఏమిటి నిమిషంలో జరిగిపోయింది.

మూలుగుతున్న సుందరి భర్తను బామ్మ గారు జాలిగా చూసి "అలా ఉండాలి మగబిడ్డ లంటే..." అని మనవడిని గర్వంగా చూసింది.

పాపం ఎముక విరిగి చేతికి బాండేజ్ వేసుకుని నెలరోజులు నానా అవస్థా పడ్డాడు సుందరి భర్త.

రెండు రూపాయల అనపకాయ కోసం రెండు వందల ఖర్చు అని సుందరి గుండెలు బాదుకుంటూ ఆనెల రోజులు అతన్ని సాధించి పెట్టింది.

"ఏమిటి పార్థూ చక్కెర చాల్లేదా....."



సుందరి కేకేసింది.

పార్థు ఉలిక్కిపడి గ్లాసు క్రిందపెడుతూ "ఆహా! ఈరోజు ఉగాదా... శ్రీరామ నవమా... అని సందేహం వచ్చి..." అంటూ లేచాడు.

భార్య మీద కోపంతో లోపల్లోపల పళ్లు కొరుకుతున్న సుందరి భర్త ప్రశంసిస్తూ నవ్వాడు మాటలకి.

తలుపులు వేసి వస్తూంటే వంటకి సిద్ధం చేసిన బామ్మగారి వంటిల్లు నీటుగా కనిపించింది.

బట్టలు మార్చుకుని బయటకి వస్తుంటే గుమ్మానికి కట్టిన మామిడాకులు తగిలాయి.

బామ్మగారి చాదస్తానికి విసుక్కుంటాడేగానీ బామ్మగారి ఆచారాల్లో ప్రతిబింబించే నీట్‌నెస్, డిసిప్లిన్....సాధారణంగా ఎక్కడపడితే అక్కడ కనిపించదు ఈ సిటీలో.

** ** ** **

రవిగాడు చెప్పింది నిజమే. తాతగారి వేపచెట్టు బోసిగా కనిపిస్తోంది. అమ్మాయమ్మగారి వేపచెట్టు కూడా ఖాళీ అయిపోయింది. పూత దూసేసి, కొమ్మలు విరిగిన వేపచెట్టు ఈసురో మంటూంది.

"ఏమిటయ్యా పార్థసారధి వచ్చావు. మీ బామ్మగారు వచ్చేటప్పటికే పిల్లవెధవలు చెట్టంతా దూసేసి కొమ్మలు గూడా విరగ్గొట్టారు....."అంది పేపర్లో రాశిఫలాలు చూస్తోన్న అమ్మాయమ్మగారు కళ్లజోడు సర్దుకుంటూ.

అంతే గాని విరిగిన కొమ్మల మీంచి క్రింద పడి కాళ్లు విరగ్గొట్టుకున్న వాళ్ల విషయం పొరబాటున కూడా ఎత్తలేదు.

"సో! ఇక్కడా వేపపూత దొరకలేదన్న మాట"

అతడు గుమ్మం దాటబోతుంటే "అన్నట్టు పార్థూ! వెనక వీధిలో ఉన్న చూడామణిగారింట్లో వేపచెట్టుంది. అక్కడికేమైనా వెళ్లి ఉంటుందేమో చూడు... " అని కేకేసి మరీ చెప్పింది.

ఇంత చాదస్తపు బామ్మను ఎక్కడా చూడలేదు. 'డబ్బులు పడేస్తే బజార్లో దొరుకుతుందే బామ్మా' అంటే వినదు కదా!

"వాళ్లూ, వీళ్లూ కోసుకొచ్చింది ఎలా పనికి వస్తుందిరా" అని నిలదీస్తుంది నోరూ వాయి లేని ఆ వేపచెట్టుకి మడితడి అంటగట్టి.

అందులో తన బామ్మకి ఈ కాలనీ అంతా పరిచయస్తులే. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆవిడ వాక్చాతుర్యం అలాంటిది.

"ఏమిటి పార్థూ! మళ్లీ వస్తివి..."

ఉలిక్కిపడి చూశాడు. చూడామణి!

"మా బామ్మ కోసమని..."

"మీ బామ్మ వచ్చేసరికి అందరూ కోస్తిరి. చిన్న పిల్లలుదా సగం కిందనే పడేస్తిరి. క్రింద పడింది పనికి రాదుట. గుప్పెడు పువ్వు ఏమూల కొస్తది అని ఇదిగో..." అంటూ కుడిచెయ్యి చాచి "ఇటువెళ్లె....." అంది అరవం, తెలుగు మిక్స్ చేసిన క్రొత్తరకం భాషలో.

"హతోస్మి!" పార్థు చిరాగ్గా నడక సాగించాడు.

ఎందుకో టైం చూసిన పార్థు ఖంగారు పడిపోయాడు. అప్పటికి టైం ఎనిమిది కావొస్తోంది.

చక చకా ఎక్కడ వేపచెట్టుందా అని వెతుకుతూ, బామ్మగారికి తెలిసిన ఇళ్లల్లో కనుక్కుంటూ చాలా దూరం వెళ్లాడు.

రాలేదన్నారు కొందరు. వచ్చి వెళ్లిందన్నారు వేపచెట్టు యజమానులు.

"ఈ పాటికి బామ్మ మడికట్టి ఉంటుంది. ఇంత పొద్దెక్కేదాకానా...." అని విసిగి ఇంటి ముఖం పట్టాడు.

"ఏందయ్యా...ఇంకా తానం గూడా సెయ్యకుండా ఈదిలో దిరుగుతున్నవు. మీ బామ్మగారేడబోయింద్రు..." పని అవ్వ ఎదురువచ్చింది.

పార్థు గుండె గుభేలుమంది. బామ్మ ఇంకా యింటికి రాలేదా. ఎటు పోయింది.

"అంతా పొద్దుగాల్నే బోయింది. యాడబోయిందో తెల్వదా. బేగెల్లి ఎతుకులాడు ..."

"అవ్వా...." పార్థుకి ఒక్కసారిగా దడ పుట్టింది.

"ఏమిటి? ఏమైంది...." అమ్మాయమ్మగారి కొడుకు స్పీడుగా వెడుతున్న సైకిలాపి అడిగాడు.

"ఏమిటి? ఏమైంది...." అరటి పళ్ల కోసం బజారువెడుతున్న తాతగారు ఆగారు.

"వాళ్ల బామ్మ కనబడటం లేదట..."

"ఏమిటీ! బామ్మగారే! అయ్యో! గంట క్రితం వేప్పూత కోసం మా యింటిక్కూడా వచ్చింది."

"పొద్దుగాల నేనే గిన్నెల్దోమినా, ఆరితో మాట్టాడతా..."

పార్థు నిశ్చేష్టుడయ్యాడు. అనుకోకుండా జరుగుతున్న సంభాషణకి.

"ప్చ్! పెద్ద తనం అయింది మతిమరుపు ఎక్కువవుతుందిరా. ఏదీ గుర్తుండిచావడం లేదు అంటోందీమధ్య...."

"అవును! ప్రొద్దుటనగా ఇంట్లో బయల్దేరిన మనిషి ఇంకా యింటికి చేరలేదంటే అనుమానమే మరి. జాగ్రత్తగా వెతుకునాయనా...." తాతగారు ముందుకు సాగిపోయారు.

"ఏటయింది...."రెగ్యులర్‌గా వచ్చే కూరలమ్మి ఆగి మరీ అడిగింది.

"మన వీధిలో ఉండే బామ్మగారు తప్పిపోయార్ట...." అని వెతకవోయ్. ఎక్కడో ఉంటుందిలే. ప్రొద్దున్నే పండుగపూట అందులో సంవత్సరాది...ప్చ్... అంటూ సైకిల్ ముందుకి దూకించాడు.

"ఓలమ్మో! ఆ బోడి బామ్మగారే. అందుకేనా ఆ బాబు పండుగ పూట తానమైనాజెయ్యకుండా తిరుగుతుంద్రు...."

పార్థు బిత్తరపోయాడు.

మనోరమ ఘనత!



వెయ్యి చిత్రాలలో నటించిన ఘనత మహిళల్లో తమిళ హాస్య నటి మనోరమకు దక్కుతుంది. ఈ నటి యిన్ని సినిమాలలో నటించటం అటుంచి ముగ్గురు ముఖ్యమంత్రులతో నటించిన ఘనత కూడా మనోరమదేట. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎం. జి. ఆర్. తోను, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధితోను నటించింది. ఎం. జి. ఆర్. తో అనేక చిత్రాలలోను, కరుణానిధి, అన్నాదురైలతో అనేక నాటకాలలోను మనోరమ నటించింది. ఇతర భాషా చిత్రాలలో నటించినా ఆమె నటించిన వాటిలో తమిళ చిత్రాలే ఎక్కువట.

–మ్మ అప్పు– ఎటు [illegible]. కొంపదీసి నిజంగానే తప్పిపోలేదు కదా...."

** ** ** **

పార్థు కాలనీ అంతా చెడ తిరిగాడు. ఎక్కడ వేపచెట్టు కనబడితే అక్కడికి పరిగెత్తేడు. ఫలితం శూన్యం.

అప్పుడొచ్చింది అనుమానం.

వేపపూత వెతుక్కుంటూ ఎటైనా వెళ్ళిపోలేదు కదా.

దొరికిన గుప్పెడు వేపపూతతో సరిపెట్టుకో కూడదూ. అబ్బే! అదెలా కుదురుతుంది.

"అదేమిట్రా అబ్బి! నేను చేసే ఉగాది ప్రసాదం కోసం ఎంత మంది వస్తారంటావు. ఒక్క చెంచా అన్నా పెట్టకుండా ఎలారా...." అంటుంది.

ఒట్టి పిచ్చిబామ్మ! అందరికీ తనే దిక్కనుకుంటుంది. వీధిలో వేపచెట్టు నాటాలని ఎన్నిసార్లు ప్రయత్నించింది. ఏ ఒక్క మొక్క బ్రతికి బట్టకట్టలేదు.

ఎలాగో ధైర్యం చేసి పెరట్లో వేస్తే అది ఎంచక్కా గజం ఎత్తున పెరిగి ఇల్లుగల వాళ్ల ఆగ్రహానికి గురై సాయంత్రానికల్లా చచ్చూరుకుంది.

వేపచెట్టు గాలి శ్రేష్ఠం, ఎంత ఆరోగ్యం! ఈ బస్తీ వాళ్లకు ఏం తెలుసు అని ఎంతగానో వాపోయింది పాపం.

వెధవది! తద్దినంనాడు వేపపూత పచ్చడి కోసం ఎంత యిబ్బందిపడాలి అని ఊర్నుండి వచ్చేవాళ్లనో, విజయవాడలో వేపచెట్టున్న బంధువులు వచ్చేటప్పుడో తీసుకురమ్మని ఎంతో శ్రద్ధగా ఉత్తరాలు వ్రాస్తుంది.

బామ్మగారు తప్పిపోయింది

పార్థుకి నీరసం వచ్చేస్తోంది. ఈ దిక్కుమాలిన సిటీలో ఇంటినిండా అందంగా పెంచిన పూల మొక్కలు, క్రోటన్స్, తప్పితే జామ చెట్లు తప్ప వేపచెట్లు పెంచరు.

అలా పెంచినట్టయితే ఈ పాటికి ఏ వేపచెట్టు దగ్గరో ప్రత్యక్షం అయ్యేది.

ఎండ చురుక్కుమంటోంది. ఏమైంది ఈ బామ్మ. అసలే రోజులు బాగాలేవు.

పార్థుకి నవ్వొచ్చింది.

బామ్మేమైనా వయసులో చిన్నపిల్లా. అరవై ఏళ్లు దాటిన గంగా భాగీరథీ సమానురాలు. పైగా ఒంటిమీద పీసమెత్తు బంగారం లేదు.

పళ్లూడిపోయి, ధవళవస్త్ర కిరీటధారియైన బామ్మగారు కళ్లల్లో మెదిలేసరికి కాస్త రిలీఫ్ కలిగింది.

వేపచెట్టు వెతుక్కుంటూ వెళ్లి దోవ తప్పి వుంటుంది.

బామ్మకన్నీ వెధవ చాదస్తాలే. పల్లెటూర్లో చేసినట్లు సంక్రాంతి క్కూడా నెల పట్టి, తెల్లవారుఝామునే లేచి ముగ్గులు పెడుతుంది.

తెల్లవారి చూస్తే ఏ అచ్చరలో తీర్చిదిద్దారన్నట్లు అందంగా ముంగిలంతా కళకళ్లాడిపోయేది.

ముగ్గులెయ్యడం రాని సిటీ ముగ్ధలు ప్రతి రోజు ఆ ముగ్గులు చూసి ముగ్ధులై మురిసిపోయి మెచ్చుకుంటారు.

ఓసారి సంక్రాంతి రోజు రథం ముగ్గంటూ మొదలు పెట్టి, అబ్బే ఇంత పెద్ద రథాన్ని లాగడానికి ఇంత చిన్న తాళ్లేం సరిపోతాయి అంటూ ముగ్గేసుకుంటూ పెరడు దాటి వీధి లోంచి ఎదురింటి దాకా వెళ్లిపోయింది.

వీధిన పోయేవాళ్లు విచిత్రంగా చూస్తుంటే, ఎదురింటివాళ్లు ఖంగారుపడిపోయి పరిగెట్టుకొచ్చారు ఏమైందేమైందంటూ.

ఆరోజు మరిహ నడుం ఎత్తలేక నానా అవస్థా పడింది.

కాలనీ దాటొచ్చినట్లు గమనించి పార్థు గుండెలు బాదుకున్నాడు. 'ఏమైపోయావే బామ్మా! ఒక్కసారి కనబడవే....'

ఇరవైనాలుగు గంటలు గ్రామ్‌ఫోన్ పెట్టినట్టే బామ్మగారు ఉంటే ఆవిడ చెప్పే హరికథలూ, చిన్ననాటి కబుర్లు వినలేక ఎక్కడికైనా పారిపోవలసిందే పార్థుడు అప్పుడప్పుడు.

ఈ మధ్య బామ్మ ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగానే వుంది. గుమ్మానికి నిండుగా వుండే బామ్మగారు చిక్కిపోయారనడానికి సాక్ష్యం వీధిలో తిరిగే నల్లకుక్క ఆవిడ పక్కనుండే ఫ్రీగా లోపలికెళ్లి అన్నంగిన్నె ఖాళీచేసి రావడమే.

ఆ మధ్య రెండు రోజులు జ్వరం వస్తే "మీ తాతగారు గుర్తొస్తున్నార్రా పార్థూ. చూసి నలభై ఏళ్లవుతోంది, అంది.

అమ్మో బామ్మ వెళ్లిపోతే తనసలు నాలుగు నిమిషాలైనా బ్రతగ్గలడా.

వీధిలో ఏ కష్టం వచ్చినా ఆదుకునే బామ్మగారు తనకే కాదు కాలనీకి కూడా అవసరమే.

క్రొత్తగా పెళ్లయిన అమ్మాయి శ్రావణ మాసం నోములు పట్టాలన్నా, అట్లతద్దె తీర్చాలన్నా, పుట్టిన పిల్లల్ని వుయ్యాల్లో వెయ్యాలన్నా బామ్మగారుండితీరాల్సిందేగదా.

బంధువుల ఇండ్లల్లో ఎక్కడ పెళ్లిళ్లయినా బామ్మ చెయ్యి పడకుండా ఆ పెళ్లి సలక్షణంగా జరుగదు కదా.

ఊరగాయ పెట్టినా, వడియాలు పెట్టినా, అప్పడాలు వత్తినా బామ్మలేంది జరుగదు కదా.

"ముసలిముండనైపోయానురా పార్థుడూ. ముదిమనవడిని ఎత్తుకోవాలిరా..." అని తెగ కలవరించిపోయేది. కనీసం తన పెళ్లయ్యేవరకైనా ఉండకుండా తప్పిపోయింది.

"వేపచెట్టు వెతుక్కుంటూ వెళ్లిన మా బామ్మ తప్పిపోయింది" అని రేడియోలో చెప్పిస్తే. లేకపోతే పేపర్లో వేయిస్తే.

టి.వి. అయితే బాగుంటుంది. ఈ రోజుల్లో జనం రోజూ రేడియో వినకపోయినా పేపరు చదవకపోయినా టి.వి. మాత్రం తప్పకుండా చూస్తుంటారు.

తలమీద ముసుగు, ముడతలు పడిన ముఖం, కుదించుకుపోయి చింతాకులంత



"అబ్బా! అమ్మా! ....యిస్సూ! ....ఉస్సూ!"

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలే గాని బాధించకూడదు. రసభరితంగా వుండాలే గాని అశ్లీలం కొట్టవచ్చి నట్టుండరాదు. కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదేతుది నిర్ణయం.

27-4-'90లోగా అందేలాగా రిపార్టీలు పంపించాలి!

అయిన కళ్లు, బోసినోటితో టి.వి.మీద ప్రత్యక్షమయ్యే బామ్మగారు తలపుకు రాగానే పార్థుకి పెద్దగా నవ్వొచ్చింది.

నవ్వుతూ తలెత్తేసరికి తెల్లటి పూతతో వేపచెట్టు దర్శనమిచ్చింది. "ఇక్కడగాని లేదు కదా" అనుకుంటూ గబగబా గేటు తీసి లోపలికి అడుగు వేయబోయి తక్కున ఆగి పోయాడు.

* * * * *

"ఏమిటోయ్ పార్థసారథీ! ఇలా వచ్చావు. వేపపూతకోసమా" సింహంలా వుండే ఆఫీసర్ అడుగుతుంటే పార్థుడుగారు పడిపోయి " గు..గుడ్ మార్నింగ్ సర్.." అని విష్ చేశాడు.

ఆయన ఫెళ్లున నవ్వాడు. "అ...! ఏమిటలా వచ్చావు. ఎవరికోసం. ఏమైనా పనుందా...."

"బామ్మ తప్పిపోతేనూ..." అని చప్పున ఆపేశాడు.

"తప్పిపోవటమా.... "

ఆఫీస్‌లో అందర్నీ గడగడలాడించే ఈ ఆఫీసర్‌గాడి పాలిటపడ్డాడేమిటి తను. ఈ రోజు ప్రొద్దుటే ఎవరి ముఖం చూశాడు తను.

కరక్టే! రవిగాడి ముఖం!

ఖంగారు పడుతున్న పార్థు "పార్థూ... " అని వినిపించి తలతిప్పి జూచి స్తన్నయి పోయాడు.

బామ్మ! అక్షరాలా తన బామ్మ.

కుర్చీలో కూర్చుని చెట్టెక్కి వేపపూత కోస్తున్న వాడికి క్రింద నుండి డైరెక్షన్ ఇస్తూ మరీ కోయిస్తోంది. ప్రక్కనే ఓ నలభై ఏళ్ల స్త్రీ ఎంతో అభిమానంగా, వినయంగా ఒదిగొదిగి కూర్చుని ఏదో చెబుతోంది.

"బామ్మా ...." పార్థు ఒక్కంగలో వెళ్లి పడ్డాడు.

"ఏమిట్రా పిచ్చినాయనా!' అని తల నిమిరి తల తిప్పి "నే చెప్పలే. నా మనవడు పార్థుడు. పార్థసారథి. ఒక్క క్షణం కనపడకపోతే వెతుక్కుంటూ వచ్చేస్తాడు.

"అబ్బ! ఊరుకోవే బామ్మా! ఆయన మా ఆఫీసర్... " గొణిగాడు.

"ఏమిటీ మీ మనవడు వీడేనా... " ఆఫీసర్ గారు ఆశ్చర్యంగా అడిగారు.

"వీడా...! ఎంత ధైర్యం వీడికి. వేపపూత కొచ్చినంతమాత్రాన ఇంత చులకన చేస్తాడా.... ' చర్రుమంది పార్థుడికి.

"నువ్వెప్పుడూ చెప్పలేదేమిటోయ్... " బామ్మగారి పక్క కుర్చీలో కూర్చుంటూ అన్నాడాయన.

పార్థు తెల్లబోయాడు.

బామ్మగారు ఆఫీసర్‌గారి వీపుమీద చెయ్యి వేసి నిమురుతూ అంది. "వాడికేం తెలుసురా జగ్గూ. అందులో చచ్చేంత మొహమాటం. అంతా వాళ్ల తాతగారి పోలిక... "

"కూర్చోవోయ్! కూర్చో... " పనివాడు తెచ్చేసిన కుర్చీ చూపించాడాయన.

పార్థు తెల్లబోతూ, కాళ్లు వణుకుతూంటే ఎందుకైనా మంచిదని కూర్చున్నాడు.

"కాఫీ తాగుతావుటోయ్ ...."

"వద్దుసర్.... "

"నువ్వింకా త్రాగలేదుకదురా. తెప్పించరా జగ్గూ.... " అని మనవడివైపు తిరిగి "మనవాళ్లేలేరా. విజయవాడలో ఉన్నప్పుడు వాడి చిన్నతనంలో మన పెరట్లో గోళీలాడేవాడు. ఇంతప్పటినుంచి తెలుసు.... " అంది.

అద్గదీ విషయం. అందుకే సింహంలాంటి ఆఫీసర్‌గాడిని రింగ్ మాస్టర్‌లా ఆడిస్తోంది బామ్మ. కుర్చీలో కూర్చుని మహారాణి మర్యాదలు అందుకుంటోంది.

"ఇన్నాళ్లూ తెలీదు కాబట్టి సరిపోయింది. ఇకనుండీ రాకపోకలు మొదలైనట్టే.. .." చిన్నపిల్లాడిలా అంటున్నాడాయన.

"హతోస్మి! ఇన్ని రోజులు ఆఫీస్‌తోనే సరిపోయింది. ఇకనుండి వీడి అధికారాలు ఇంటిదగ్గర కూడా భరించాలి కాబోలు..." కాఫీ త్రాగుతూ ఆలోచిస్తున్నాడు.

"పార్థు! బుద్ధిమంతుడన్నావుగా పిన్నీ. మా చెల్లెలికూతుర్ని చేసుకోరాదూ మనవాడికి...."

"వాడెప్పుడో ఓ అమ్మాయిని ప్రేమించాడు. సుజాతని మన నారాయణస్వామిగారు లేరూ. ఆయన మనవరాలు....."

"ఓరిసీ..... " పార్థు సిగ్గుపడిపోయాడు.

ఉందుండి బామ్మగారు ఆటంబాంబు పేల్చినట్టుగా అంది. "నీ గురించి వాడెప్పుడూ చెబుతూనే వుంటాడు."

"నాగురించా!... ఏమని... " ఆయన అనుమానంగా చూశాడు.

"నాకొంప ముంచావుగదే బామ్మా!" పార్థు భయపడిపోయాడు.

"ఆఫీసరంటే అచ్చు నీలాగ ఉండాలిట. నడిస్తే చాలు అడవిలో సింహం నడిచినట్లే ఉంటుందిట. చిన్నప్పుడు బాగా వ్యాయామం చేసేవాడివికదు. "

"ఫర్వాలేదు. బామ్మగారి బుర్ర అప్పుడప్పుడు పాదరసంలా పని చేస్తుంది. తను వర్ణించినట్లు భూతమని, యముడని, అనలేదు. థాంక్యూ బామ్మ! థాంక్యూ!"

ఒక్కసారి తన బాడీని చూసుకుని "చూశావా! నా ఫిజిక్, నా గొప్పదనం ఎటువంటివో" అన్నట్లు భార్యవైపు యమ స్టైల్‌గా చూశాడు.

ఆవిడ పెద్ద గొప్పే అన్నట్లు పెదవి విరిచింది.

"చిన్నప్పుడు ఎంత అల్లరిచేసేవాడు, చెట్లపి ఎక్కి... " ఆఫీసర్ తలమీద మొట్టుతూ అంది బామ్మగారు.

"ఇకనుండీ ఆఫీసర్‌తో తననేమైనా అంటే బామ్మతో చెప్పి రెండు జెల్లకాయలు వేయిస్తే సరి" అని గొప్ప ఆలోచన వచ్చింది.

కాని ఆయన మాత్రం ఆ మొట్టికాయలు తనకు సహజమే అన్నట్లు ఉల్లాసంగా "ఈ రోజు పండక్కి ఇక్కడే వుండిపో పిన్నీ. నీ చేతి ఉగాది పచ్చడి తినాలనుంది..." అన్నాడు.

"అదెలారా అబ్బీ! మా వీధిలో వాళ్లు నా చేతి ఉగాది పచ్చడి తినకపోతే నన్ను బ్రతకనిస్తారా..."

అక్కడికేదో వీధినంతా తనే ఉద్ధరిస్తున్నట్టు.. "సాయంత్రం ఎలాగూ వస్తావుగా... "

"తప్పకుండా... "

"మరయితే నేవస్తానిక.... "

వేపపూతతో పాటు పళ్లూ, పూలు పెరట్లో కాసిన కూరగాయలు బుట్టలోపెట్టి యిస్తూ "బాగా ప్రొద్దెక్కింది. మీకు వంటకి ఆలస్యం అయిపోతుందేమో... " అంది ఇంటి ఇల్లాలు.

"కుంపటి మూల పారేసి మూడు నెలలయింది. గ్యాస్ పొయ్యి కొన్నాడమ్మా మనవడు..." బామ్మగారు బోసినోటితో నవ్వింది.

"రేపు పెళ్లయ్యాక సుజాత ఎక్కడ కష్టపడి పోతుందోనని... "

ఓపెన్ విద్య అవసరం

ఈ దేశంలో విద్య గత దశాబ్దం నుండే అభివృద్ధి చెందటం మొదలయింది. కేరళలో ఉన్న ఎర్నాకులం జిల్లా నూరు శాతం అక్షరాస్యతను ఇటీవల సాధించింది. మన దేశం నుండి అనేకమంది పై చదువుల కోసం విదేశాలు వెళ్ళటానికి ముఖ్య కారణం వారి విద్యా విధానం. మేధావుల వలసకు (బ్రైన్ డ్రైన్) ప్రధాన కారణం అదే.


జపాన్‌లో ఒక విద్యార్థి ఉదయం కళాశాలకు వెళితే మధ్యాహ్నం ఒక ఫ్యాక్టరీలో నో, కార్యాలయంలో నో పని చేస్తాడు. దీనివలన ఆ విద్యార్థి ప్రాక్టికల్ నాలెడ్జి సంపాదించడంతో పాటు ఒక వయస్సు దాటాక తన స్వశక్తి మీద చదువు కొనసాగిస్తాడు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశం కంటే ఎంతో వెనుకబడిన పశ్చిమ జర్మని కేవలం నాలుగు దశాబ్దాల కాలంలో ఎంతో ప్రగతిని సాధించింది.

మన దేశంలో ఒక వ్యక్తి గ్రాడ్యుయేట్ అవ్వాలంటే కొన్ని వేలు ఖర్చవుతుంది. అదే ఇంజనీరింగ్, మెడిసిన్ గ్రాడ్యుయేట్లు అవ్వాలంటే యింకా ఎక్కువ. చదువు పూర్తయిన వారికే ఉద్యోగాలు కరువయ్యాయి. దీనివల్ల పాతికేళ్ళు వచ్చినా యువకులు తల్లి దండ్రులమీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పని చేసే హక్కు ప్రాథమిక హక్కు కాదు. అంటే ఒక వ్యక్తికి దేశం తిండి, బట్ట, ఉండటానికి నివాసం ఇస్తోంది కాని అతని నుండి ఎలాంటి ఉత్పత్తి లేదా పనిని ఆశించటం లేదన్న మాట. అంటే పని చేయని చాలామందిని మిగతా ప్రజలు పోషిస్తున్నారు. ఇది ఎంతో విచార కరమయిన విషయం.

గత సం. లలో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ విశ్వ విద్యాలయాలు, కళాశాల అధ్యాపకులకు, ప్రొఫెసర్‌లకు జీత భత్యాలు పెంచాక ఈ ఉద్యోగాలపై విద్యార్థికులలో ఆసక్తి పెరిగింది. గతంలో అధ్యాపక వృత్తిపై ప్రజల్లో ఆసక్తి ఉండేదికాదు. "బత కలేక బడి పంతులు" అనే నానుడి క్రమంగా తగ్గిపోవటం విద్యారంగంలో వస్తున్న ఒక ఆశించదగిన అభివృద్ధి. యు. జి. సి. వారు ఈమధ్య పరిశోధక విద్యార్థులకు పెంచిన ఫెలోషిప్‌లవల్ల పరిశోధనా రంగంలో కూడ ఆసక్తి ఏర్పడి ఈ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

గత కొద్ది సం. లలో వచ్చిన సార్వత్రిక విశ్వ విద్యాలయాలు విద్యా విధానాలలో కొత్త కొత్త



మార్పులు తెస్తున్నాయి. కుటుంబ బాధ్యతలవల్ల, వ్యక్తిగత, ఆర్థిక కారణాలవల్ల చదువుకోలేని యువకులకు, వయోజనులకు ఇవి విద్యావకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నాయి. పోస్టు ద్వారా కోర్సు మెటీరియల్, ఆడియో వీడియో క్యాసెట్‌లు, సంవర్గమాన తరగతులు, గ్రంథాలయ సదు పాయాలు, రేడియో, టీ వీ పాఠాలు మొ. అనేక పద్ధతుల ద్వారా దాదాపు తరగతి గది స్థాయి విద్యను అందించలుగుతున్నాయి. దేశంలో మొట్ట మొదట ప్రారంభమయిన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయం (హైదరాబాద్), న్యూఢిల్లీలో ని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ, కోట ఓపెన్ యూనివర్శిటీలు డిస్టెన్స్ లెర్నింగ్‌కు ఎంతో కృషి చేస్తున్నాయి. ఇదే కాలంలో దేశంలో అనేక విశ్వ విద్యాలయాలు కూడా కరస్పాండెన్స్ కోర్సులను ఎంతో అభివృద్ధి చేశాయి.

(భువనేశ్వర్‌లో జరిగిన ఈ సెమినార్‌కి ఈ రచయిత వ్రాసిన "డిస్టెన్స్ ఎడ్యుకేషన్ - కంట్రీ ఖైడ్ క్లాస్ రూమ్" అనే పేపర్ ఎన్నికయి సెమినార్‌లో పాల్గొని లోకసభ స్పీకర్ రబిరాయ్ ప్రశంసలనందుకోవటం జరిగింది).

హైదరాబాద్ సెంట్రల్ జైల్‌లో ఖైదీలు సైతం ఏ. పి. ఓ. యు. ద్వారా విద్యార్థికులవ్వటం ప్రజల్ని విశేషంగా ఆకర్షిస్తోంది.

అనేకంగా వస్తున్న వృత్తి విద్యా కోర్సులు ఈ దశాబ్దంలో జరిగిన అభివృద్ధి!

-జాగృతీ కిరణ్

వాళ్లంతా ఒకటే నవ్వులు.

"అయ్యో నీకు కాస్తంత కూడా సెన్సాఫ్ హ్యూమర్ లేదే బామ్మా. ఎదురుగ్గా వుంది మా ఆఫీసరే బామ్మా! ఆఫీసర్!" పార్థు మనసులో వాపోయాడు.

"మావాడికి తొందరగా ప్రమోషన్ వచ్చేమార్గం చూడరా" అంది బామ్మగారు లేస్తూ.

"అలాగే పిన్నీ...." మళ్లీ నవ్వులు.

"ఫరవాలేదు. బామ్మకి కాస్త లౌక్యం తెలుసు."

ఇంటిల్లిపాది గేటుదాకా వచ్చి సాగనం పారు.

ఆఫీసర్‌గారి రెండో అమ్మాయి అచ్చు

బామ్మగారు తప్పిపోయింది

సుజాతలా నాజూగ్గాఉంది. "సాయంత్రం యింటికి వస్తాం బామ్మగారూ. వచ్చేదా అన్నయ్యా... " అంది.

పార్థు తల ఊపాడు.

ఈ పాటికి సుజీ ఏం చేస్తుంటుందో. వాళ్ల అమ్మకి వంటలో సాయం చేస్తూనో, ఉగాది పచ్చడి తయారు చేస్తూనో, అదీ గాకపోతే తలస్నానం చేసిన జుట్టు చిక్కు తీసుకుంటూ తన గురించి ఆలోచిస్తూనో..

పార్థు శరీరం పులకరించింది.

అతని ఆలోచనలు సాగనివ్వకుండా బామ్మగారు దారిలోనే నోరు విప్పింది తన చిన్ననాటి ముచ్చట్లు గుర్తు చేసుకుంటూ.

"జగ్గూ చిన్నప్పుడు మన పెరట్లో లంగోటీ కట్టుకొని గోళీలాడుతుంటే.. "


"అబ్బ ఆపవే నీ సొద" పార్థుకి చిర్రెత్తు కొచ్చింది. "నువ్వు శుభ్రంగా తప్పిపోయినా బావుండేదే బామ్మా... " అనేశాడు.

"తప్పిపోవటమేమిట్రా. నేనేమైనా చిన్నపిల్లనా? మతిమరుపుదాన్నా?..." బామ్మగారు విడ్డూరంగా అంది.

పార్థు నుదురు కొట్టుకున్నాడు.

"అవును! బామ్మగారు తప్పిపోవటమే మిటి! తనకంత అదృష్టం కూడానా...!"

[*]



శ్రీ ఎడిటర్ దయ

శ్రీ ఎడిటర్ దయచేతను
నారూఢిగ సకల జానలు; కథలన్ పంపన్
ధారాళమైన పద్యము
లిలనే; ప్రథమంబుగాను పంపితి సుమతీ!

శ్రీ తోట పద్మారావు
(సికింద్రాబాదు)

పాప సందేహం

ఒక చిన్నపిల్ల తల్లితో ఇలా అంది! "అమ్మా! ప్రక్క ఇంటివాళ్లు నిజంగా చాలా పేదవాళ్లు కదూ!"

"అదేమిటి! ఎందుకలా అంటున్నావ్" అందాతల్లి ఆశ్చర్యపోతూ!

"వాళ్ల పాపాయి నయాపైసా మ్రింగినప్పుడు వాళ్లు చేసిన గడబిడ ఇంతా అంతా కాదమ్మా!" అని సమాధానమిచ్చిందా పిల్ల.

బి. పద్మావతి
(నెల్లూరు)

దేవతల బాధ

శూలధారి మేకతోలును ధరియించె
భైరవుండు అసలు బట్టలీడె;
పట్టుబట్టలాది విష్ణువు దాల్చుట
చాకలాడి బాధ తాళలేక!

–గిరిశ్రీ (మద్దికెర అగ్రహారం)

'పాక' సౌరభం

మహిత కైవల్య శ్రీసుధా మధురి మమ్ము,
సకల, సురలోక, సుమకోటి సౌరభమ్ము,
కల్పతరు, కామధేనుల గౌరవమ్ము
కలవు, కలవమ్మ నీ 'పచ్చిపులుసు'నందు
పంచభక్ష్యమ్ము, పరమాన్న పరియుతంబు
షడ్రసోపేత దివ్యభోజనము గూడ
పెక్కు చవులూరి లవణంబు దక్కు కూర
గాదె! ఓయమ్మ! నీ 'ఊరగాయ' లేక
ధాన్యమాత్ర, దర్శనమాత్ర, ఘ్రాణమాత్ర,
శ్రవణమాత్ర, లాలాజల స్రవకరంబు,
అద్వితీయంబు, రుచికరంబద్భుతంబు
వసుధ, నోయమ్మ! 'గోంగూర పచ్చ'డొకటి

పి. ఎస్. రంగారావు (జడ్చర్ల)

విన్నపము

అష్టైశ్వర్యము లిమ్మని నిన్నడగలేదు,
కాంత కనకము నిమ్మని నిన్ను
కలవరబెట్టలేదు
ధనధాన్యము లిమ్మని నీకు
దండము బెట్టలేదు
భూమినిమ్మని నిన్ను బతిమాలలేదు,
పేటలిమ్మని నిన్ను పలుమార్లు వేడలేదు,
వస్త్రవాహనము లిమ్మని నిన్ను
వరములడుగలేదు,
నేను కోరిన దొక్కటే వెంకటేశ;
వేగమే మంత్రి పదవిచ్చిన చాలు నాకు,
నిన్ను కోరకయే వీటిని సమకూర్చుకొందు
నిముషమ్ములోన,
ఏడుకొండలవాడ! వెంకటేశ!

కె. వి. వి. నరసింహారావు (విజయవాడ)


(మార్చి '62 ఆం. స. వారపత్రిక నుంచి)

దేవునికి దరఖాస్తు

విశ్వమెల్లను నిండి వెల్గొందుచున్నావు.
దేవదేవా! నీదు దివ్య సమ్ముఖమందు
ఉద్యోగమును జేయనుబలాట పడుచుంటి
కరుణతో నీవు నా మొర ఆలకించుమా!
పాపభీతియు, భక్తి, భయము, ప్రేమయుగల్గి
భూతదయతో నెపుడు భువిని నే చరియింతు
నిర్ణయించిన పనులు నెరవేర్పగాగలను
అంతెగానీ యితర అర్హతలు మరిలేవు!
పెద్ద సంసారంబు బీదవాడను నేను
ప్రొద్దుగడవదు మాకు పోషింపగాలేను
నేల, నింగియు దేవ! నీదు కార్యాలయమె
సువిశాల విశ్వమున చూడుమొక ఖాళీని
పెద్దమనుషుల మంచు సుద్దులెన్నియొ బల్కి
బుద్ధి లేకే వారు భువిని చరియించేరు!
వారి వద్దను నేను వసియింపగాలేను
భారమై జగతిలో బ్రతికియుండలేను
పనియొసగి నాకిపుడు బ్రతుకుదెరువును జూపు
అనయమ్ము నీ నామ యాత్మలో జపియింతు-
పెన్నిధిని గన్నట్టి పేదనై యుప్పొంగి
మిన్ను యన్నన నేను మేటినై చరియింతు!

- చిరయన శ్రీనివాసులు
(చెన్నూరు)

(మే '62 ఆం. స. వారపత్రిక నుంచి)



సీరియల్

హాట్ లిప్స్



జి.వి.అమరేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

రన్నింగ్‌లో బస్ దిగగానే శివాజీ అటుగా వెడుతున్న ఆటో ఆపి 'అడిక్‌మెట్' అన్నాడు. ఆటో డ్రయివర్ నిర్లక్ష్యంగా తను రానన్నట్టు తల అడ్డంగా ఊపాడు. "అర్జంటుగా వెళ్ళాలి... కావాలంటే ఒక పది రూపాయలు ఎక్స్‌ట్రా తీసుకో..."

పది రూపాయలు ఎక్స్‌ట్రా అనే మాట సమ్మోహనాస్త్రంలా పని చేసింది. ఆటో డ్రయివర్ వెంటనే మీటర్ వేశాడు.

శివాజీ ఆటోలో ఎక్కి కూర్చుంటూనే చెప్పాడు. "స్పీడుగా పోనియ్.... చాలా అర్జంటుగా వెళ్ళాలి".

ఆ మాటతో ఆటో రాకెట్ ఇంజన్ అమర్చిన విమానంలా దూసుకు పోవడం మొదలుపెట్టింది.

కరెక్టుగా పది నిమిషాల్లో ఆటో అడిక్‌మెట్ పోలీస్ స్టేషన్ దగ్గర ఆగింది. శివాజీ మీటర్ మీద పది రూపాయలు చెల్లించి ముందుకు కదిలాడు. పోలీస్ స్టేషన్ ప్రక్కనే ఉన్న తెల్ల రంగు బిల్డింగ్ ముందు సరికొత్త ఫియట్ కారు ఆగి ఉంది. కాకపోతే ఇపుడు దానికి ముందు భాగంలో నిమ్మకాయలూ, మిరపకాయలూ దండగా కట్టి ఉన్నాయి.

కాంతారావూ, అతడి భార్యాపిల్లలు, ఇరుగు పొరుగు వాళ్ళు కొత్త కారు వంక చూస్తున్నారు...

కాంతారావు కుటుంబ సభ్యుల ముఖంలో గర్వం, ఇరుగు పొరుగు వాళ్ళ ముఖాల్లో అసూయ కనపడుతున్నాయి. శివాజీ అంతకుముందే సర్వీస్ షాపు దగ్గర కాంతారావ్‌ని చూసి ఉండడం వల్ల అతడిని వెంటనే గుర్తుపట్టాడు. నేరుగా అతడి దగ్గిరికి వెళ్ళి తను కొద్దిసేపటి క్రితం జగన్‌జేబు నుంచి కొట్టేసిన పర్సు చూపిస్తూ చెప్పాడు.

"సార్! ఈ పర్సు మా షాపులో మర్చిపోయారుట. మా 'సారు' మీకు ఇమ్మని పంపించారు."

"దీన్ని గురించి నాకు ఇంతవరకూ గుర్తే లేదు..."

కాంతారావ్ ఆత్రంగా పర్సు అందుకుని డబ్బు లెక్క పెట్టి చూసుకున్నాడు.

"శుక్రవారం పూట... డబ్బు పారేసుకోవడం ఎంత అపశకునం".

కాంతారావు భార్య అన్నది.

"ఎక్కడ పోగొట్టుకున్నాం... పోయిన డబ్బు దొరికింది కదా!" కాంతారావ్ విసుక్కుంటూ చెప్పాడు.

"సర్! మరో విషయం...."

కాంతారావు ఏంటన్నట్టు చూశాడు.

"మా సారు ఒకసారి ఫియట్ ఇంజిన్ ట్యూనింగ్ ఎలా ఉందో చూడమన్నారు. డెలివరీకి ముందు టెస్ట్ చేయడం మర్చిపోయారుట. ఒకసారి కీస్ ఇస్తే టెస్ట్ చేస్తాను".

కాంతారావు తల ఊపి ఫియట్ తాళం చేతులు శివాజీకి అందించాడు.

శివాజీ డ్రయివింగ్ సీట్‌లో కూర్చుని ఇంజన్ స్టార్టు చేసి ఫియట్‌ను ముందుకు దూకించాడు.

కాంతారావు, అతడి భార్యా, పిల్లలు, వాళ్ళ ఇరుగు పొరుగు వాళ్ళు చూస్తుండగా ఫియట్ కారు వేగాన్ని పుంజుకుని ముందుకు పరుగుతీసి మలుపు తిరిగి అదృశ్యం అయింది.

* * * *

సాయంత్రం ఆరు గంటల సమయం.

ఫ్యాషన్ షో ప్రారంభం అయి పది నిమిషాలు అయ్యింది. నగరంలోని ప్రముఖులు ఆ ప్రదర్శనకు హాజరయ్యారు. రకరకాల సరికొత్త డిజైన్ల నగలు అలంకరించుకున్న అమ్మాయిలు డయాస్ మీదికి వచ్చి ప్రదర్శన ఇవ్వసాగారు.

షో ప్రారంభం అయి అయిదు నిమిషాలు అయింది.

ఎర్రరంగు మారుతీకారు దూసుకువచ్చి పార్కింగ్ స్పేస్‌లో ఆగింది. డ్రయివింగ్ సీట్‌లో నించి పార్వతి క్రిందికి దిగింది.

అదే సమయంలో రోడ్డుకు అవతలివైపు సరికొత్త ఫియట్ కారు రాకెట్‌లా దూసుకువచ్చి సడన్‌బ్రేక్‌తో కీచుమనే శబ్దాన్ని సృష్టిస్తూ ఆగింది. శివాజీ క్రిందికిదిగి రోడ్ క్రాస్‌చేసి ఫ్యాషన్ షో జరుగుతున్న హాలులోకి నడిచాడు.

లోపల ఆడియన్స్ కూర్చున్నవైపు లైట్లు లేకపోవడంతో అతడి కళ్ళు చీకటికి అలవాటు పడడానికి కొద్దినిమిషాల సమయం తీసుకుంది. అతడు ఒక కార్నర్ సీట్‌లో కూర్చున్నాడు. అరగంట తర్వాత దుస్తుల చాటునుండి ఒక నలుపురంగు మంకీక్యాపు, నల్లరంగు కళ్ళద్దాలు బయటకు తీశాడు.

మంకీ క్యాప్ తలకు ధరించి, నల్లరంగు కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. అక్కడ చీకటిగా ఉండడంవల్ల అతడిని గమనించడానికి ఎవరికీ అవకాశం కలగలేదు.

సరిగ్గా ఆ సమయంలో మెడలో వజ్రాలనెక్లెస్, కుడిచేతికి డైమండ్‌రింగ్, చెవులకు డైమండ్ ఆభరణాలు ధరించిన రజని స్టేజీమీదకు వచ్చింది.

స్టేజి మూలన అమర్చిన స్పాట్‌లైట్ నుంచి వెలువడిన ఒక బలమయిన కాంతిపుంజం ఆమె మీద పడింది.

కేవలం రజని నిలబడి ఉన్న ప్రదేశం తప్ప స్టేజి, మిగిలిన ఆడిటోరియం అంధకారంగా ఉంది. రజని హొయలు ఒలకపోస్తూ స్టేజిమీద అటూ యిటూ నడవసాగింది. స్పాట్‌లైట్ ఆమెను అనుసరించసాగింది.

లైటు కాంతిలో ధగధగా మెరుస్తున్న వజ్రాల

ఇంతవరకూ సాగినకథ :: 3:- మారు పేర్లతో మోసాలకు అలవాటుపడి వచ్చినదాంట్లో సమానంగా పంచుకుంటూ కాలం గడుపుతుంటారు శివాజీ- రజని. మొదటి భార్యపార్వతిని స్వర్గానికి పంపి తనను భార్యగా స్వీకరిస్తానని బిజినెస్ మాగ్నెట్ కాశీప్రసాద్ ఉంపుడుకత్తె అయిన మోహినికి మాట యిస్తాడు. పార్వతిని చంపేందుకు కురియన్-ఎర్రతేలు-నల్లముత్తు చేసిన ఏర్పాట్లు విఫలమవుతాయి. మళ్లీ పథకం వేస్తారు. హిమబిందు పేరుతో రజని ఫ్యాషన్ షోలో పాల్గొనబోతుంది.

నెక్లెస్ వంక చూస్తూ శివాజీ కుడికాలి మేజోడు నుంచి ఆరంగుళాల కత్తి బయటకు లాగాడు.

* * * * * *

పార్వతి ఆడిటోరియంలోకి వెళ్ళగానే ఎర్రతేలు నేరుగావచ్చి మారుతి కారు క్రిందికి దూరాడు. అతడిని చూసినవాళ్ళు ఎవరోకారు రిపేరు చేసుకుంటున్నారు అనే అభిప్రాయానికి లోనవుతారు. అయిదు నిమిషాల్లో ఎర్రతేలు తన పని ముగించుకుని బయటపడ్డాడు.

* * * *

శివాజీ మేజోడు నుంచి కత్తి బయటకు లాగిన సమయానికి పార్వతి తనుకూర్చున్న కుర్చీలోంచి పైకి లేచింది. ఆమెకు తలనొప్పిగా అనిపించడంతో బయటకు నడిచింది. ఆడిటోరియం ఎదురుగా ఉన్న మెడికల్‌షాపు ఆమెను ఆకర్షించడంతో అటువైపు నడిచింది. మెడికల్‌షాపు కష్టమర్లతో కిటకిట లాడుతోంది. పార్వతి ఒక తలనొప్పి బిళ్ళ కొనుక్కోవడానికి అయిదు నిమిషాల సమయం పట్టింది. తిరిగి రోడ్ క్రాస్‌చేసి వెడుతున్న ఆమెకు ఒక ప్రక్కగా గుంపుగా నిలబడిన ట్రాఫిక్ పోలీసులూ, రెండు పోలీసు ట్రక్కులూ ఒక పోలీస్ క్రేనూ, క్రేన్‌పక్కగా నిలబదిన ఐ.పి.యస్. ఆఫీసర్ కౌండిన్య కనిపించారు. వెంటనే రోడ్‌రూల్స్ సిటీలో చాలాస్ట్రిక్ట్‌గా అమలు జరుగుతున్న విషయం పార్వతికి గుర్తుకు వచ్చింది.

* * * *

శివాజీ చేతిలో ఆరంగుళాల కత్తి పట్టుకుని స్టేజివైపు పరుగుతీశాడు. ఆడియన్స్ అర్థం చేసుకునేలోపే రజని పక్కకుదూకి ఆమె కంఠం మీద కత్తి ఆన్చి పెద్దగా అరిచాడు.

"మీలో ఎవడు... ఏ మాత్రం కదిలినా ఈ అమ్మాయిగొంతు తెగిపోతుంది.... కమాన్ క్విక్... ద్వారం దగ్గిర నిలబడి ఉన్న వాళ్ళు జరిగి దారి ఈయండి..." చెప్పడం పూర్తి అయిన తర్వాత–

"ఈ హ్హాహ్హాహ్హాహ్హా... ఏ హ్హెహ్హెహ్హెహ్హె... ఓ హ్హూహ్హూహ్హూ అంటూ శివాజీ మూడుసార్లు భయంకరంగా నవ్వాడు.

"అబ్బ కాస్త మెల్లిగా నవ్వుబాబూ... చెవులు దిమ్మెక్కి పోతున్నాయ్..." రజని అతడికి మాత్రమే వినపడేలా అన్నది.

"ఊ కదలండి... ఈహ్హాహ్హాహ్హా!"

ఈసారి శివాజీ మరింత పెద్దగా నవ్వాడు.

గుమ్మం దగ్గిర నిలబడి ఉన్న వాళ్ళు దారి ఇచ్చారు.

సరీగ్గా అదే సమయంలో –

అక్కడికి దూరంగా కనపడుతున్న ఒ భవనం టెర్రస్‌మీద నిలబడి ఉన్న కాశీప్రసాద్, ఎర్రతేలు, కురియన్, నల్లముత్తు ఆడిటోరియం ముందు పార్కు చేసిన ఎర్రరంగు మారుతివైపు చూడసాగారు.

వాళ్ల కళ్లముందు చాలా పవర్‌ఫుల్ బైనాక్యులర్స్ ఉన్నాయి.

"నువ్వు కారుబ్రేకులు తీశేశావా?" కాశీప్రసాద్ అడిగాడు.

"తీసేశాను బాస్. మీ కారుతో నేను సెంచరీ పూర్తి చేసేశాఇప్పటికి వంద కార్లకు బ్రేకులు తీసేశా" అన్నాడు ఎర్రతేలు.

"అదిగో సార్ మీ మిసెస్ కారు ఎక్కుతోంది."

కురియన్ ముఖంలో యాంగ్జయిటీ.

"ఇంజన్ స్టార్ట్ అయ్యింది." నల్లముత్తు గొంతులో ఒణుకు. మరుక్షణం కాశీప్రసాద్ ముఖంలో ఒక విషపు నవ్వు ప్రత్యక్షమయ్యింది.

* * * *

శివాజీ తన చేతిలోని కత్తి రజని కంఠంమీద ఆకుపచ్చగా పైకి ఉబికిన రక్తనాళానికి ఒత్తి పట్టాడు.

"కాస్త మెల్లిగా, మరీ అంత గట్టిగా నొక్కకు."


గుసగుసగా చెప్పింది రజని.

శివాజీ కత్తి కాస్త ఒదులు చేశాడు.

ఇద్దరూ గుమ్మం వైపు కదిలారు.

"అబ్బ నడుం మీద చెయ్యి తియ్యి. చక్కిలిగింతగా ఉంది."

శివాజీ చెయ్యి కాస్త పైకి జరిపాడు. దాంతో ఆమె వక్షోజాలు మెత్తగా తగలడం, మరుక్షణం అతడి వేళ్ళ కొసలగుండా వెయ్యి ఓల్టుల విద్యుత్తు శరీరమంతా ప్రవహించటం, నరాలు నిక్క పొడుచుకోవడం వంటి పనులు ఒక్కసారిగా



జరిగిపోయాయి. అప్రయత్నంగా అతడు ఆమెను తన వైపు మరింత దగ్గరిగా హత్తుకున్నాడు.

"పోకిరీ వేషాలు వేశావంటే మర్యాదక్కదు జాగ్రత్త"

రజని హెచ్చరించింది.

అయినా శివాజీ ఆమె మాటలు లెక్క పెట్టకుండా అలాగే హత్తుకుని గుమ్మంనించి బయటకు నడిచాడు. రోడ్డుమీదికి చూసిన శివాజీ ముఖం ఒక్కసారిగా పాలిపోయింది. అతడు రెడీగా ఉంచుకున్న కాంతారావ్ ఫియట్ కారును పోలీసులు క్రేన్ సహాయంతో పైకి లేపి ట్రక్కులో పడేస్తున్నారు.

అపుడు శివాజీకి హఠాత్తుగా తను రాంగ్ పార్కింగ్ చేసిన విషయం గుర్తుకు వచ్చింది.

అతడికి ఏం చేయాలో పాలుపోలేదు.

సరిగ్గా అదే సమయంలో అతడికి మారుతి స్టార్ట్ చేసిన శబ్దం వినపడింది.

మరుక్షణం శివాజీ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. రజనితో సహా వేగంగా దూసుకు వెళ్ళి కదులుతున్న మారుతి తలుపు తెరిచి లోపలకు జంప్ చేశాడు.

"మర్యాదగా కారు ముందుకు పోనియ్యండి. లేకపోతే ఈ అమ్మాయి కంఠం తెగుతుంది... ఈహ్హాహ్హా...హ్హా...హ్హా"

మెరుపులా వచ్చిపడిన శివాజీ భయంకరంగా వికటాట్టహాసం చేయడంతో పార్వతి అప్రయత్నంగా అతడు చెప్పిన పని చేసింది.

మరుక్షణం మారుతి ముందుకు జంప్ చేసి వేగం

హిట్ లిస్ట్

పుంజుకుని దూసుకు పోయింది.

శివాజీ మారుతిలో పారిపోగానే అప్పటికి తేరుకున్న ఆడియన్స్ లోపల్నుంచి బయటకు దూసుకు వచ్చి–

"దొంగ... దొంగ... ముసుగు దొంగ పారిపోతున్నాడు. పట్టుకోండి" అంటూ కేకలు పెట్టసాగారు.

అదే ప్రదేశంలో స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న ఐ. పి. యస్. ఆఫీసర్ కౌండిన్య చాలా వేగంగా రియాక్టయ్యాడు. ప్రక్కనే ఉన్న జీప్‌లోకి దూకి శర వేగంగా మారుతిని ఫాలో చేయసాగాడు.

దూరంగా ఓ బిల్డింగ్ టెర్రస్‌మీద నిలబడి జరిగేదంతా దీక్షగా చూస్తున్న కాళీప్రసాద్ బృందం ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

వాళ్ళు నలుగురూ లిఫ్ట్ మీదుగా కిందికి దిగి రోడ్డు వారగా పార్క్ చేసిన రోవర్‌వేపు పరుగు తీశారు.

మరుక్షణం ఆ నలుగుర్నీ మోస్తూ రోవర్ మారుతి వెళ్ళిన దిశగా దూసుకు పోయింది.

"మనం మారుతికి యాక్సిడెంట్ అవ్వడం కళ్ళారా చూడాలి. త్వరగా పోనీ..."

డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్న నల్లముత్తును హెచ్చరించాడు కాళీ ప్రసాద్.

మరుక్షణం శరవేగంతో పోతున్న రోవర్ రాకెట్ వేగాన్ని అందుకుంది.

రోడ్డు మలుపు తిరిగేచోట పార్వతి భయంగా అరిచింది.

"బ్రేకులు... బ్రేకులు పని చేయడం లేదు."

ఆ మాట వింటూనే వెనక సీట్‌లో కూర్చున్న శివాజీ ముందు సీట్‌లోకి జంప్ చేసి పార్వతిని పక్కకు నెట్టి స్టీరింగ్ చేతిలోకి తీసుకున్నాడు.

పార్వతి చెప్పింది నిజం... మారుతికి బ్రేకుల్లేవు.

శివాజీ నుదుట చెమట బిందువులు పేరుకో సాగాయి. రోడ్డు మలుపు తిరిగినప్పుడల్లా అతడి హృదయ స్పందన పెరుగుతోంది.


అనుకోకుండా అతడి దృష్టి రియర్ వ్యూ మిర్రర్ మీద పడింది. మరుక్షణం తమను పోలీసులు వెంబడిస్తున్న విషయం గ్రహించాడు. దాంతో యాక్సిలేటర్ బలంగా ప్రెస్ చేశాడు. ఈసారి మారుతి మరింత వేగంగా పరుగిడ సాగింది.

రజని ఆ వేగానికి భయంతో ఒక్క గావు కేక పెట్టింది.

"షటప్" శివాజీ హెచ్చరించాడు.

మారుతి వేగంలో మార్పు గమనిస్తూనే వెనక జీపులో ఫాలో అవుతున్న ఎస్. పి. కౌండిన్య ఒక్కసారిగా వేగం పెంచాడు.

అతడి జీపులో పెరిగిన వేగం చూస్తూనే శివాజీ ముఖంలో చిరునవ్వు ప్రత్యక్ష మయింది. అతడిప్పుడు అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.



రోడ్డు 'ఎల్' షేపులో పూర్తిగా మలుపు తిరుగుతున్నచోట ఎదురు వస్తున్న ఆయిల్ టాంకర్ శివాజీ దృష్టిని ఆకర్షించింది.

అతడు అదే వేగంతో ఆయిల్ టాంకర్‌కు నైంటీ డిగ్రీస్ యాంగిల్లో సూటిగా దూసుకు పోయాడు. టాంకర్‌ను నడుపుతున్న డ్రయివరు భయంతో కళ్ళు మూసుకున్నాడు. ఆయిల్ టాంకర్ కేవలం కొద్ది అడుగుల దూరంలో ఉండగా శివాజీ స్టీరింగ్‌ను పూర్తిగా ఎడమ వైపుకు తిప్పాడు.

మారుతి పేవ్‌మెంట్ మీదికి ఎక్కి రెండవ ప్రక్కకు వెళ్ళి ఒక ఇంటి కాంపౌండ్‌లో ప్రవేశించి అంతటితో ఆగక ఆ ఇంటి కాంపౌండ్ చుట్టూ అమర్చిన వెదురు కంచెను ధ్వంసం చేస్తూ తిరిగి రోడ్డు మీదికి వచ్చింది.

మారుతిని ఫాలో చేయడంలోనే దృష్టిని కేంద్రీకరించిన కౌండిన్య హెయిర్‌పిన్ బెండింగ్‌లో నుంచి హటాత్తుగా కళ్ళ ముందు ప్రత్యక్షం అయిన ఆయిల్ టాంకర్‌ను చూస్తూనే అదిరిపోయాడు.

అతడి అరచేతుల్లో చెమటలు పోశాయి. భయంతో మెడ మీది రోమాలు నిక్కపొడుచుకున్నాయి. అతడు కళ్ళు మూసుకుని పూర్తిగా స్టీరింగ్ కుడి వైపుకు తిప్పాడు. దాంతో అదుపుతప్పిన జీపు రోడ్డుప్రక్కనే ఉన్న ఒక పెద్ద సినిమా హోర్డింగ్‌లోకి దూసుకుపోయింది.

గాలిలో తేలుతున్నట్టు అనుభూతి కలగడంతో కళ్ళు తెరిచిన కౌండిన్య జీపుతో సహా తనూ, తనతో పాటు ప్రయాణిస్తున్న నలుగురు పోలీసులూ జీవనదిలా ప్రవహిస్తున్న ఒక పెద్ద మురుగుకాలవలో పడిపోతున్న విషయం గ్రహించాడు.

పోలీస్ జీప్ పీడ విరగడ అవడంతో శివాజీ రిలాక్సింగ్‌గా నిట్టూర్చాడు. అతడి చూపు ఫ్యూయల్ ఇండికేటర్ మీద పడింది. అతడి మనస్సులో ఒక ఐడియా ఫ్లాష్‌లా మెరిసింది.

అదే సమయంలో అతడిని ఎదురుగా కనపడుతున్న వంతెన ఆకర్షించింది. వంతెనకు ప్రక్క ఉన్న ఒక ఎలక్ట్రిక్ పోల్ ఏదో యాక్సిడెంట్‌కి గురిఅవ్వడంతో రోడ్డుమీదికి వంగిపోయి ఉంది.

"మీరు ఆ మూలకు జరగండి" చేయి చూపిస్తూ అన్నాడు శివాజీ. పార్వతి, రజని అతడు చూపించినవైపు జరిగారు.

శివాజీ మారుతీకారును వేగంగా వంగిన ఎలక్ట్రిక్ పోల్‌కు దగ్గిరగా పోనిచ్చాడు. మరుక్షణం యాక్సిడెంట్ అయిన శబ్దం- ఎలక్ట్రిక్ పోల్ చివరిభాగం ఖచ్చితంగా పెట్రోల్‌టాంక్ ఉన్న ప్రదేశంలో గుద్దుకుంది.

శివాజీ ఊహ ఫలించింది. చిల్లుపడిన టాంక్‌నించి పెట్రోల్ కారిపోసాగింది.

అక్కడ్నించి కొద్దిదూరంలో నిర్మాణంలో ఉన్న ఎపార్ట్‌మెంట్స్ వాటిముందు అతి పెద్ద ఇసుక గుట్టలూ శివాజీని ఆకర్షించాయి. పెట్రోల్ కారిపోతున్నకొద్దీ ఫ్యూయల్ ఇండికేటర్‌లోని నీడిల్ క్రమంగా క్రిందికి దిగసాగింది.

రోవర్‌లో ప్రయాణిస్తూ జరిగేదంతా గమనిస్తున్న కాళీప్రసాద్ బృందం పెట్రోల్ కారిపోవడం గమనించింది.

శివాజీ ఏం చేశాడో వాళ్ళకు అర్థం అయింది.

కాళీప్రసాద్ కోపంతో పళ్ళు పటపట కొరికాడు. జేబులో నుంచి సిగర్‌లైటర్ తీసి వెలిగించి అతినైపుణ్యంగా రోడ్డు మీదికి విసిరాడు. సిగర్ లైటర్ నేరుగావెళ్ళి మారుతినుంచి కారుతూ కాలవకడుతున్న పెట్రోల్‌లో పడింది.

మరుక్షణం నాల్కలు చూస్తూ అగ్నిజ్వాలలు పైకిలేచాయి. అతివేగంగా వెడుతున్న మారుతివంక పరుగుతీశాయి. అకస్మాత్తుగా రోడ్డుమీద ప్రత్యక్షం అయిన మంటల్ని చూస్తూనే జనం గోలగోలగా అరుస్తూ పరుగులుతీశారు. వాళ్ళ అరుపులువిన్న శివాజీ తలత్రిప్పి చూశాడు.

వెనకనుంచి తరుముతూ వస్తున్న మంటలు అతడ్ని దిగ్భ్రాంతుణ్ణి చేశాయి. అదే క్షణంలో మారుతిలో వేగంతగ్గింది. ఫ్యూయల్ లెవెల్ పూర్తిగా పడిపోయిందని గ్రహించాడు శివాజీ.

వేగం తగ్గిన మారుతి నిర్మాణంలో ఉన్న ఎపార్ట్‌మెంట్స్ ముందున్న ఇసుకకుప్ప వైపు ప్రయాణించింది.

"దూకెయ్యండి..."

పెద్దగా అరుస్తూ శివాజీ డోర్ తెరచుకుని దూకేశాడు. అతడిని అనుసరించారు పార్వతి, రజని.

మారుతి ఇసుకకుప్పదాటి కొంతదూరం ప్రయాణించి గుట్టగా పేర్చిన ఇటుకరాళ్ళను గుద్దుకుని ఆగిపోయింది.

కేవలం అరక్షణం తర్వాత...

రోడ్డుమీద పరుగెడుతూ వస్తున్న మంటలు మారుతిని చుట్టుముట్టాయి. మరో రెండు క్షణాల్లో ఇంటర్‌కాంటినెంటల్ బెల్లాస్టిక్ మిస్సయిల్‌లా అది ధామ్మని పేలిపోయింది.

ఇసుక కుప్పమీదకు దూకుతూనే పరిగెత్తడం ప్రారంభించారు శివాజీ, రజని.

చుట్టుప్రక్కల జనం మాత్రం కాలిపోతున్న మారుతికి వందగజాల దూరంలో నిలబడి వినోదం చూడసాగారు.

(ఇంకా వుంది)



ఆర్టిస్ట్ ఛింపాంజీ!

జంతువులకు కళాత్మక దృష్టి వుంటుందా? వాటి వ్రేళ్ల మధ్య కుంచె నిలవడం సాధ్యమా? ఈ ఫోటోలోని లండన్‌కి చెందిన చింపాంజీ ఒక డజనుకు పైగా పెయింటింగ్స్ వేసి అది సాధ్యమే అని నిరూపించింది. మీరే చూస్తున్నారుగా తను గీచిన చిత్రాన్ని ఎలా మురిసిపోతూ చూసుకుంటోందో! బ్రిటిష్ కాంటెంపొరరీ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ వారు ఈ చింపాంజీ వేసిన పెయింటింగ్స్‌ని కొన్ని సంవత్సరాల క్రితం ప్రదర్శనకు పెట్టారు.

జ్ఞానోదయం

చింతా రాంబాబు

శ్రీహరికి కొత్తగా పెళ్ళయింది.

ఇంకా సంవత్సరం కూడ పూర్తి కాలేదు.

దాంతో ఇంకా కొత్త అల్లుడిగానే చెలామణి అవుతున్నాడు.

ఇప్పుడు దీపావళి పండక్కి భార్యతో కలసి అత్తగారింటికి రావడం జరిగింది.

పండుగరోజు అంతా నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉంటే శ్రీహరి మాత్రం ముభావంగా ఉండిపోయాడు.

ఆ రాత్రి "బాంబులంటే బావగార్కి భయం లాగుంది. ఒక్కటీ కాల్చటం లేదు. కనీసం కాకర పూవ్వొత్తన్నా కాల్చండి" అంటూ మరదలు వేళాకోళం చేస్తే అప్పుడైనా నోరు విప్పి నవ్వలేదు.

విప్పితే ఎలాగ? ఈ రెండు రోజులు కాస్త రిజర్వ్‌డుగానే ఉండాలనుకొన్నాడు.

సంతోషంగా కనిపిస్తే అసలు పట్టించుకోవడం మానేస్తారు.

ఇలా అంటీఅంటనట్టు ఉంటేనే తన పని కాస్త సులువు అవుతుంది.

ఆ రాత్రి పడుకోబోతుండగా "ఏమిటండీ వచ్చిన దగ్గర్నుండి అదోలా ఉంటున్నారు? వంట్లో బాగుండలేదా?" నుదుటిమీద చెయ్యి వేస్తూ అడిగింది భార్య విశాల.

"బాగానే ఉంది" ముక్తసరిగా అన్నాడు శ్రీహరి.

"బాగా వుంటే, ఓమాట పలుకు లేకుండా ఎందుకు బిగదీసుకొన్నట్టు? వచ్చినప్పుడల్లా ఎంతో సరదాగా ఎన్నో కబుర్లు చెప్పే బావగారు ఎందుకలా వున్నారంటే ఏం చెప్పాలో తెలియలేదు" నిష్ఠూరంగా అంది విశాల.

శ్రీహరి విననట్టే ఊరుకొన్నాడు.

"ఏమిటండీ మాట్లాడరు?" భర్తను కుదుపుతూ రెట్టించింది విశాల.

"అది సరేకాని విశాల! పండుగ బహుమతిగా మీవాళ్ళు ఏం ఇద్దామనుకొంటున్నారు?" మెల్లిగా అసలు విషయంలోకి దిగాడు శ్రీహరి.

"ఓహ్, అదా మీ భయం! ఇలా సీరియస్‌గా ఉంటేనేకాని బహుమతి ఇవ్వరనుకొన్నారా ఏమిటీ?" నిలదీసింది విశాల.

"అదికాదు విశాల!" తడబడ్డాడు శ్రీహరి.

"ఏది కాదండీ! వెధవ బహుమతి కోసం పండుగరోజు ఎవరన్నా ఇలా ఉంటారండీ! అయినా మావాళ్ళు వాళ్ళ శక్తికి తగ్గట్టు ఏదో ఇచ్చి పంపుతారే కాని వట్టి చేతుల్తో మాత్రం పంపరులెండి" కాస్త కోపంగానే అంది విశాల.

"అదే ఏం ఇద్దామనుకొంటున్నారు?" ఉండబట్టలేక అడిగాడు శ్రీహరి.

"ఏం ఇస్తారు! మనిద్దరిని బట్టలు కొనుక్కోమని చెరికొక మూడు వందలు ఇస్తారనుకొంటున్నాను" భర్త మనసులో ఉన్నదేమిటో తెలియక మామూలుగా అంది విశాల.

"అంతేనా?" అన్నాడు శ్రీహరి.

"ఏం చాలవా? పోని మీరు 'అంతేనా' అంటున్నారు కాబట్టి మీకు ఇంకో వందో, రెండు వందలో ఎక్కువ ఇమ్మని రికమండ్ చేస్తాను లెండి" వాతావరణాన్ని తేలికపర్చే ఉద్దేశంతో నవ్వుతూ అంది విశాల.

ఇంకా అసలు విషయం ప్రస్తావించకపోతే లాభం లేదనుకొన్నాడు శ్రీహరి.

"విశాలా! నేను ఉద్యోగంలో జాయినయిన దగ్గర్నుండి నెల నెలా కూడబెట్టింది దాదాపు ఓ అయిదు వేల వరకూ ఉందన్న సంగతి నీకు తెలుసుకదూ?"

"తెలుసు. అవి మన సూట్‌కేస్ అడుగున ఉన్న కవరులో భద్రంగా వున్నాయన్న సంగతి కూడ తెలుసు."

"ఆ అయిదువేలకి తోడు ఇంకో అయిదు వేలు పండుగ బహుమతిగా ఇస్తే కలర్ టి. వి. తీసుకుందాం."

భర్త మాటలకి ఖిన్నురాలైంది విశాల. వెంటనే తేరుకొని "ఏమిటండీ పండుగ బహుమతి అయిదు వేలా?" ఆశ్చర్యంగాఅడిగింది.

"ఏం. అంత ఆశ్చర్యం! అంతలేనివాళ్ళా మీ వాళ్ళు" వ్యంగ్యంగా అన్నాడు శ్రీహరి.

మధ్య తరగతి కుటుంబాల్లో అయిదు వేలంటే మాటలా! మతి ఉండే మాట్లాడుతున్నారా!"

శ్రీహరికి కోపం వచ్చేసింది.

"మతి ఉంది కాబట్టే టీ. వి. కోసం నా దగ్గరున్న అయి దు వేలు కూడ కలుపుకొని ఇంకో అయిదు వేలు మాత్రమే అడుగుతున్నాను. లేకపోతే పదివేలే అడిగేవాణ్ణి.

"అయినా పండుగ బహుమతి అయిదు వేలంటే అత్యాశేనండీ" భర్తకు నచ్చచెప్పే ధోరణిలో అంది విశాల.

"ఎందుకు అత్యాశ అవుతుంది? పెళ్ళయిన పదేళ్ళకి మొన్న నా పక్క సీటు సుబ్బారావుకు వాళ్ళ మామ కూతురు మోజు పడుతుందని నాలుగు వేలు పెట్టి టి. వి. కొన్నాడు. ఆయన పరిస్థితి మరి మీనాన్న పరిస్థితే."

"కావచ్చు. కాని, ఇప్పుడు మా నాన్న ఉన్న పరిస్థితి వేరండి. మా తమ్ముడికి పాలిటెక్నికల్ కాలేజిలో సీటు వచ్చింది. పదివేలు డొనేషన్ కట్టాలట. ఇంకా దానికే పూర్తిగా డబ్బు సర్దుబాటు కాక నానా అవస్థ పడుతున్నారు. ఇంకా నేనెలా అడగ్గల్నండీ"

"ఫర్వాలేదు. దానికి తోడు ఇంకో అయిదు వేలు సర్దుబాటు చేసుకొని ఇమ్మను" నిష్కచ్చిగా అన్నాడు శ్రీహరి.

భర్తకెలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు విశాలకు. క్షణాల్లో ఆమె మనసు గందరగోళంగా తయారైంది.

భార్య ఆలోచనల్లో పడటం చూసి శ్రీహరి "నాకు మాత్రం మీ వాళ్ళని బాధ పెట్టడం ఇష్టం అనుకుంటున్నావా విశాలా! మీ వాళ్ళు మనకిచ్చే చివరి బహుమతి కూడ ఇదే. నేనేమీ ఆ డబ్బుతో స్కూటరు కొనుక్కొంటాననడం లేదే! మనిద్దరి కోసం, పుట్టబోయే మన పిల్లల కోసం కలర్ టీ.వి కొంటానంటున్నాను. హైదరాబాద్‌లో మన ఇల్లు తప్పించి టీ.వి. లేని ఇల్లు ఇంకేదైనా ఉందంటావా? చెప్పు" అన్నాడు.

"పోని మీకంతగా మనసైతే బ్లాక్ అండ్ వైట్ తీసుకొందామండి" భర్త ఔనంటాడేమోనన్న ఆశతో అంది విశాల.

వెంటనే మళ్ళీ శ్రీహరికి కోపం వచ్చేసింది.

"ఆపు, నీ బోడి సలహా. దానికంత రాద్ధాంతం ఎందుకు? ఇప్పట్లో తీసుకుంటే కలర్ టీ.వియే తీసుకోవాలి. లేకపోతే మానుకోవడం మంచిది" కోపంగా అన్నాడు.

"పోని ఇంకో పని చేద్దామండీ" ఉత్సాహం తెచ్చుకొంటూ అడిగింది విశాల.

"ఏమిటది?" అన్నాడు శ్రీహరి విసుగ్గా.

"ఇప్పుడు మన దగ్గరున్న డబ్బు కట్టేసి, నెలనెలా ఇంతని కట్టే వాయిదాల పద్ధతి మీద తీసుకొందాము" ఎలాగైనా భర్త మనసు మార్చాలన్న పట్టుదలతో అంది విశాల.

"పద్ధతి బాగానే ఉంది కాని అది మనవల్ల అయ్యే పని కాదు విశాల! బ్రహ్మచారిగా ఉండి నాలుగు వేలు కూడబెట్టడానికి నాలుగేళ్ళు పట్టింది. ఇంకా ఇప్పుడు అదికూడ చెయ్యలేని పరిస్థితి. వచ్చే జీతంలో ఇంటి అద్దెకి, పాల ఖర్చుకే సగం పోతోంది. ఇంకా నెలనెలా ఏం మిగల్చగలం?"

నిజమేననిపించింది విశాలకు.

ఇంకా ఏం మార్గాలు భర్తకు తెలియ చెప్పాలో తెలియక నిస్సహాయంగా చూసింది.

వెంటనే 'తళుక్'న విశాల మెదడులో ఇంకో ఆలోచన మెదిలింది.

"పోని, ఇలా చేసేద్దామండి. కట్నంగా మావాళ్ళు నాకిచ్చిన ఎకరం పొలం అమ్మేద్దాం."

"ముష్టి అయిదు వేల కోసం ముప్ఫైవేలు ఖరీదు చేసే పొలం అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నావు కాని, మీ వాళ్ళని మాత్రం అడుగవు" అరచినంత పని చేశాడు శ్రీహరి.

"ఇంట్లో ఇంకాపెళ్ళి కావల్సిన ఇద్దరు చెల్లెళ్ళని, చదువు పూర్తి కావల్సిన ఇద్దరు తమ్ముళ్ళని పెట్టుకొని ఎలా అడగ్గల్నండీ? నాకు నోరు రావడం లేదు" విశాలకు కళ్ళనీళ్ళ పర్యంతరం అయింది.

"ఎలా అడుగుతావో నాకు అనవసరం. నాకు మాత్రం బహుమతిగా అయిదు వేలు కావల్సిందే" మొండిగా అన్నాడు శ్రీహరి.

ఇంకా ఏం చెప్పినా భర్త మనసు మారదని గ్రహించిన విశాల, ఇంకా అతని పక్కన పడుకోవడం మనస్కరించక కింద దుప్పటి పరచుకు పడుకొంది.

శ్రీహరి కూడ అదేమీ పట్టించుకోకుండా ముసుగు తన్ని పడుకొన్నాడు.

పడుకొన్నాడే కాని శ్రీహరికి కూడ భార్యనిలా బాధపెట్టవల్సి వచ్చినందుకు లోపల బాధగానే ఉంది.

ఇంకో మార్గం లేనప్పుడు తప్పదు మరి.

తన ఆఫీసులో ప్యూన్లు సైతం ప్రతీవాళ్ళు చిన్నదో, పెద్దదో టీ.వి. ఉన్న వాళ్ళే! తెల్లారి పొద్దుటే అంతా ఆఫీసుకి రాగానే రాత్రి టీవిలో వచ్చిన ప్రోగ్రాంల గురించి మాట్లాడుకొంటుంటే తను వాళ్ళ సంభాషణల్లో పాలు పంచుకోలేక పోతున్నాడు.

ఎప్పుడన్నా ఏదన్నా తెలియక అడుగబోతే "ఏమిటి, మీ ఇంట్లో టీ.వి. లేదా!" వింతగా అడుగుతుంటే ఎంతో చిన్నతనం అనిపించేది.

రాత్రి తన ఇంటి మీద పిడుగు పడిందన్నా వాళ్ళు అంత ఆశ్చర్యంగా అడగరేమో!

దాంతో వాళ్ళందరికి తనొక శ్రోతగా మిగిలి పోయాడు.



రేపు టీ.వి తీసుకోగానే ఆఫీసులో అడుగని వాళ్ళకి సైతం ఏకంగా తను కలర్ టీ.వియే తీసుకొన్నానని చెప్పి తీరవల్సిందే!

మొన్నటికి మొన్న తన కోలీగ్ సూర్యం ఇంటి కెళ్ళినప్పుడు "ఇంకా నీవు ఇప్పుడు ఇంటి కెళ్ళి చేసేది ఏముంది? ఇంకో పావు గంటలో టీ.వి.లో సినిమా వస్తుంది, చూసి వెళ్ళు" ఎంతో ఉదారంగా అన్నాడు.

వాడిది బ్లాక్ అండ్ వైట్ టీ.వియే.

రేపు తను కలర్ టీ.వి. కొన్నానని చెప్పినప్పుడు వాడి మొహం చూడాలి. వెధవన్నర వెధవని!

"పోర్టబుల్ టీ.వి. అన్నా తీసుకోరా" అంటూ ఎంతో సానుభూతిగా మాట్లాడే వాడు.

తెల్లార పొద్దుటే శ్రీహరి నిద్ర లేవంగానే రోజులా "బావగారు! మొహం కడుక్కోను బాత్‌రూములో నీళ్ళు పెట్టమంటారా? నీళ్ళు కాగాయ్" అంటూ ప్రేమగా కాసుకొన్నట్టు వచ్చే మరదలు ఆ పొద్దుట రాలేదు.

తనను చూడంగానే "గుడ్ మార్నింగ్ బావగారు!" అంటూ ఎంతో సంతోషంగా విష్ చేసే ఇంకో మరదలు పిల్ల తను ఎదురుపడ్డా గమనించనట్టే ఊరుకొంది.

తను నిద్ర లేవంగానే ఎవరి చేతిలో ఉన్నా పేపరు లాక్కొచ్చి తన చేతిలో పెట్టే బావమరిది ఈ రోజు అలవాటు లేకపోయినా తనే చదువుతూ కూర్చొన్నాడు.

జ్ఞానోదయం

దీనినిబట్టి తన బహుమతి సంగతి అప్పటికే భార్య ఇంట్లో చెప్పేసిందన్న సంగతి గ్రహించాడు శ్రీహరి.

పాపం మామగారు మాత్రం ఎప్పటిలా మామూలుగానే మెసలడం జరిగింది.

మొత్తం మీద ఇంట్లోని వాతావరణం గంభీరం గానే కనిపించింది శ్రీహరికి.

అయినా ఇవేమీ అతను లెఖ్ఖ చెయ్యదల్చుకో లేదు.

తను కూడ గంభీరంగా ఉండిపోయాడు.

ఇంకా ఆ సాయంత్రం తమ ఊరికి బయల్దేరతా రనంగా ఆ మధ్యాహ్నం అయిదువేలు తీసుకొచ్చి భర్త చేతిలో పెట్టింది విశాల.

కోత విధించకుండా అడిగిన మొత్తం చేతిలో పడినందుకు శ్రీహరి సంతోషపడ్డాడు.

మర్యాదకోసం "ఈ డబ్బుకోసం మీ నాన్నగారేమీ అవస్థపడలేదు కదా?" అన్నాడు.

"అవస్థేమీ లేదు. మా తమ్ముడి చదువుకోసం దాచిన అయిదువేలు మీకు ఇవ్వడం జరిగింది" మొహం తిప్పుకొంటూ అంది విశాల.

"మరి పాపం అతని పాలిటిక్నిక్ సీటో ?"

"ఇంకేం సీటండీ! ఇంకో అయిదువేలు కోసం అవస్థ పడకుండా మా వాళ్ళకి చాలా గొప్ప మేలు చేశారు. పొద్దుటనుండి వాడి మొహం చూడలేక తప్పుకు తప్పుకు తిరుగుతున్నాను" బాధతో విశాల గొంతు బొంగురు పోయింది.

వెంటనే శ్రీహరి ఆలోచనలు ఓ ఏడెనిమిది సంవత్సరాలువెనక్కి వెళ్ళాయి.

అప్పుడు తను ఇంటర్మీడియేట్ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. తమ ఊళ్ళో డిగ్రీ కాలేజి లేకపోవడంతో వేరే ఊళ్ళో ఉండి చదువుకోవల్సిన పరిస్థితి.

ఆ వేరే ఊళ్ళో కాలేజిలో తనకు సీటు రావటం, అక్కడ ఉండి చదువుకోటానికి వీలుగా రూము తీసుకోవడం అన్ని ఏర్పాట్లు జరిగి పోయాయి.

అందుకు కావల్సిన మూడు నాలుగు వేలు డబ్బు కూడ తండ్రి సమకూర్చాడు.

అప్పుడే పండుగకి తన అక్కా బావ ఇంటికి రావటం జరిగింది.

పండుగ మరుసటిరోజు, బావగార్కి రోజూ ఆఫీసుకి బస్సులో వెళ్ళి రావటం చాలా కష్టంగా ఉందని, ఓ నాలుగు వేలిస్తే లూనా కొనుక్కుంటా నంటున్నారని అక్క చెప్పినప్పుడు తండ్రి గుక్క తిప్పుకోలేక పోయాడు.

చాలామంది మధ్య తరగతుల్లాగానే తమది కూడ ఉండీలేని సంసారం. అలాంటిది నాలుగు వేలంటే మాటలా?

ఆ మాట చెప్పటానికి అక్క లోపల ఎంత బాధ పడిందో ఆమె మొహం చూడంగానే తెల్సిపోయింది.

ఎందుకంటే రాత్రి గదిలో వాళ్ళెంత మెల్లిగా మాట్లాడుకున్నా భార్యా భర్తలిద్దరూ ఎందుకో

సరిక్రొత్త సీరియల్
పైవారం వివరాలు
రాజముద్రిక

చాళుక్య భూపతుల రాజముద్రిక వరాహలాంఛనం. కడు సొంపై, ఉభయ తలాలు అంచులు తీర్చబడి, కింది భాగం నాలుగు రేకుల పువ్వులా వుండి, కర్ణిక ఉండే చోట వలయంతో తావడం చేసి వుంది. ఉపరితలం మధ్యలో 'త్రిభువనాంకుశం' అనే బిరుదాక్షరాలున్నాయి. శాసనభాష అయిన ప్రాకృత లిపి, వరాహ లాంఛనంతో పాటు చంద్రుడు, అంకుశం, శంఖం, ఛత్ర చామరం, దీపం శెమ్మెలు ముద్రిక మీద చోటు చేసుకున్నాయి. అడుగు భాగాన తామరపువ్వు వుంది. అతి ముఖ్యులు, పంచ ప్రధానులకు మాత్రమే ఈ ముద్రిక లభించేది. కోటలో ఎక్కడికైనా యధేచ్ఛా ప్రవేశానికి ఉపకరించేది ఈ ముద్రికే !



చాళుక్య రాజముద్రిక
(వరాహ లాంఛనం)

ఈ రాజముద్రికకి, మీరు త్వరలో చదువబోయే సీరియల్ కి చాలా దగ్గరి సంబంధం వుంది. ఏమా సీరియల్ ?

వచ్చేవారం చూడండి !

ఘర్షణ పడ్డారన్న సంగతి ఇంట్లో అందరికీ తెల్సిపోయింది.

అప్పటి తన తండ్రి పరిస్థితి దయనీయం

అటు కూతురు సంసారం, ఇటు కొడుకు భవిష్యత్తు.

ఇంట్లో కూడబెట్టి దాచుకొంది మూడు నాలుగువేలు మాత్రమే.

ఎటూ తేల్చుకోలేక తల్లడిల్లి పోతుంటే తనే గుండె చిక్కపట్టుకొని "నాన్నా! నేను కాలేజీలో జాయినవ్వను. మన ఊళ్ళోనే ఉండి టైపు నేర్చుకొంటా"నని చెప్పినప్పుడు తండ్రి తన తల నిమురుతూ జాలిగా చూడటం తప్పించి మరేం మాట్లాడలేక పోయాడు.

ఆ చూపుల్లోని నిస్సహాయత, ఆవేదన కడుపున పుట్టినందుకు కొడుకుగా తనుమాత్రమే అర్థం చేసుకోగల్గాడు.

తన భవిష్యత్తుని పణంగా పెట్టి ఆడబ్బు బావగార్కి ఇవ్వడం జరిగింది.

ఆనాడు తను డిగ్రీయే పూర్తి చేసి ఉంటే తన భవిష్యత్తే వేరుగా ఉండేది.

ఏ బ్యాంకులోనో, ఏ గవర్నమెంటు ఆఫీసులోనో ఆఫీసరయి ఉండేవాడు.

ఇలా టైపిస్టు కం గుమస్తాగా సెటిలయ్యేవాడు కాదు.

ఆనాడు తన భవిష్యత్తుని బలితీసుకొన్న బావగారి మీద కలిగిన అసహ్యం, కోపం ఈనాటికీ తన మనసులో అలాగే ఉండిపోయాయి.

మరి ఇప్పుడు తను చేస్తున్న పనేమిటి?

క్షణాల్లో శ్రీహరికి జ్ఞానోదయం అయింది.

వెంటనే తన పెట్టెడుగున దాచుకొన్న అయిదు వేలు కూడ బయటికి తీసి భార్య చేతిలో పెడుతూ "విశాల! ఈ పదివేలు మీ నాన్నగారికిచ్చి మీ తమ్ముణ్ని పాలిటెక్నికల్‌లో జాయిన్ చేయించమను" అన్నాడు

భర్త ప్రవర్తనకు విశాల విస్తుపోయింది!

క్షణంసేపు నోట మాట రాలేదు కూడ.

"ఇదేమిటండీ! కావలిస్తే వాళ్ళ అయిదువేలు వాళ్ళకిచ్చేద్దాం. మనం దాచుకొన్న అయిదు వేలు కూడ ఎందుకు?" తేరుకొని అంది.

"ఇంకో అయిదు వేలు కోసం తంటాలు పడుతున్నారన్నావుగా! ఈ అయిదు కూడ ఇవ్వు" శాంతంగా అన్నాడు శ్రీహరి.

భర్త ప్రవర్తన ఆమెకు వింతగాను, అయోమయంగాను ఉంది.

"అది కాదండీ....." అంటూ ఆమె ఇంకేదో అనబోతుంటే

"ప్లీజ్ విశాల! ఇంకేమి మాట్లాడకు. తీసికెళ్ళి మీ నాన్నగార్కి ఇవ్వు. మనస్ఫూర్తిగా చెప్తున్న మాట ఇది" అంటూ శ్రీహరి అక్కడినుండి కదిలి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మామగారు ఆయనిచ్చిన అయిదు వేలు తీసుకోక పోవటం అటుంచి, ఇంకో అయిదు వేలు కూడ జతచేసి ఇచ్చినందుకు బాధపడి పోతుంటే "పోని, అప్పుగా ఉంచండి మామగారు! రేపు మీ అబ్బాయి చదువు పూర్తయి ఉద్యోగం వచ్చాక అతనే తీరుస్తాడు" అంటూ శ్రీహరి బలవంతంగా ఆయనకు నచ్చచెప్పటం జరిగింది.


అల్లుడి మంచితనానికి ఆ మామగారి గొంతు మూగబోయింది.

తనపట్ల మామగారి కళ్ళల్లోని కృతజ్ఞత, బావమరిది కళ్లలోని ఆరాధన, భార్య కళ్ళల్లోని ప్రేమానురాగాలు చూసిన తర్వాత 'అయ్యో! టీ. వి. లేకపోయిందే' నన్న బాధ శ్రీహరి మనసులో మచ్చుకైనా మిగల్లేదు.

ఆసాయంత్రం బస్సుస్టాండులో వెంట వచ్చిన తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి వీడ్కోలు పలికి, భర్త చెయ్యి పట్టుకొని గర్వంగా తన ఊరు బస్సెక్కింది విశాల.

O

స్టిల్ నిజం-డైలాగ్ అబద్ధం



బహుమతిపొందిన 'డైలాగ్'

"ఆ సుకుమారి పప్పు రుబ్బుతూంటే అంత చూడలేని వాడివైతే ఒక మిక్సీ కొని పారేయ రాదూ? మీ చెల్లాయికి!"

-ఆర్. శ్రీజ్యోతి (ఏలూరు)

(వీరికి 3మాసాల పాటు ఆంధ్రసచిత్రవారపత్రిక బహుమతిగా పంపబడుతుంది.)

మరికొన్ని డైలాగ్‌లు

"మీ ఆవిడ మా పోర్షన్‌లో పప్పు రుబ్బుకోవటానికి వచ్చినప్పుడల్లా బాత్రూంకి తాళం వేయటం ఏం బాగోలేదండీ? "

-బి. మురళి (తెనాలి)

"హోటల్‌కొచ్చి నీతో టిఫిన్ తినడం పొరపాటయ్యిందిరా రాస్కెల్... నా బట్ట లిప్పిస్తే నీ చేత పిండి రుబ్బించేలా ఉన్నారురా...!"

- వియంరావు కనకాల (కాకినాడ)

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



ఇంతవరకూ సాగినకథ - 35: పాండవులు జూదంలో ఓడిపోయి అరణ్య, అజ్ఞాతవాసాలనుభవించిన అనంతరం అర్ధరాజ్యం కొరకు కృష్ణుడిని ధృతరాష్ట్రుడి వద్దకు పంపగా సంధియత్నం విఫలమై యుద్ధం అనివార్యమవుతుంది. కౌరవులు, పాండవుల మధ్య జరిగిన భీకరయుద్ధంలో కౌరవుల వైపు అందరూ మరణిస్తారు. పాండవుల విజయానంతరం హస్తినలో ధర్మరాజుకు పట్టాభిషేకం జరుగుతుంది. పట్టాభిషేకానంతరం కృష్ణుడి సలహాపై ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తాడు. అశ్వత్థామ శాప కారణంగా ఉత్తరకు జన్మించిన మృత కుమారుడికి కృష్ణుడు ప్రాణంపోస్తాడు. ధృతరాష్ట్రుడు సతీసమేతంగా అడవులకు వెళ్తాడు.

(గత సంచిక తరువాయి)

ఆమె నుంచి జవాబు రాకపోయేసరికి అన్నదమ్ములు అయిదుగురూ తలెత్తిచూశారు. ఆమె కళ్లను సన్నటి కన్నీటి పొర కమ్మేసింది.

తల వంచుకుని గబ గబ కదిలి వెళ్ళిపోబోతుంటే ద్రౌపది వచ్చి 'ఎప్పటికైనా మీ పిల్లలు మిమ్మల్ని సుఖపెట్టాలనుకున్నారు. దయగల తల్లికి పిడికెడు మెతుకులు కూడా పెట్టలేని నిర్భాగ్యులమయ్యామని అడవుల్లో వున్నాళ్ళూ ఆక్రోశించారు. రాజ్యం, భాగ్యం వచ్చినా రాకపోయినా మీరు కాలుకదపకుండా అన్నీ అమర్చి పెట్టాలనుకున్నారు. తీరా అన్నీ ఒనగూడాక మీరిప్పుడు వాళ్లకు దూరమవుతామంటున్నారు. కర్ణుణ్ణే చంపారన్న కక్షే ఇంకా మీకు వీ: బిడ్డల మీదుంటే అది 'నా దురదృష్టం' అంది.

కుంతి కోడల్ని దగ్గరకు తీసుకుని-

'పిచ్చిపిల్లా! నా బిడ్డల మీద నాకు కక్షేమిటి? అయినా కర్ణుడి బ్రతుకును మీరెవరూ కాదు కూల్చింది-నేను, నేనూ వాడి బ్రతుకులో నిప్పులు పోసింది, వాడి జన్మను అణిచేసింది....' అంది వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ. ఆ మసక కన్నీటి పొరల్లోంచి కర్ణుడు అస్పష్టంగా కనబడుతున్నాడు. 'కన్నె ప్రాయంలోనే బిడ్డను కని ఏటిపాలు చేసిన మాతృమూర్తీ నీకు వందనం. నా తల్లెవరో నాకు తెలియనన్నాళ్లూ నీ మీద అమితమైన గౌరవం వుండేది నాకు. కాని నువ్వే నన్ను కన్న అమ్మవని తెలిశాక అదేం పాపమో బిడ్డల్ని సాకే చేతులూ, తియ్యటి అమ్మ ఒడులూ, మాతృత్వపు మమకారాలూ అన్నీ ఈ లోకంలో మయల పడ్డట్టు తోస్తోంది. ......కుంతి భోజకుమారీ ఇంతకూ నువ్వెవరు? నువు స్త్రీ వా? తల్లివా? రాక్షసివా? నా పాలిట శాపానివా? ఎవరివైతేనేం నా బ్రతుకులో చీకట్లు నింపావు' అని నిందాస్తుతి చేస్తున్నట్టనిపించింది.

ఎవరెంత బ్రతిమాలినా వినకుండా కుంతి గాంధారీ ధృతరాష్ట్రుల వెంట వెళ్లిపోయింది. ద్రౌపది తలవంచుకుని అక్కడ నుంచి వచ్చేసి దూరంగా నిలబడి తపోవనానికి తరలి వెళ్తున్న అత్తగారినీ, తల్లికి ప్రదక్షిణాలు చేస్తున్న పాండుకుమారుల్ని చూసింది. కళ్ల వెంట నీళ్ళు తిరిగాయి.

-ఇది జరిగిన చాలా రోజుల వరకూ ధర్మరాజు మళ్లీ మామూలు మనిషి కాలేదు. గంగానదికి ఆవలి ఒడ్డున శతయూపుడి ఆశ్రమ ప్రాంతంలో గాంధారీ ధృతరాష్ట్రులూ, విదురుడూ, తన తల్లీ పర్ణశాలలు నిర్మించుకుని ప్రశాంత జీవనం గడుపుతూ తపస్సులో కాలం వెళ్లబుచ్చుకుంటున్నారని విన్నప్పుడు మాత్రం కొంత వూరట పొందాడు.

రోజులు గడుస్తున్నాయ్.

నారదుడొచ్చాడొక రోజు.

ఎప్పుడూ గల గల మాట్లాడేవాడు ఆ రోజు ఎందుకో మూగయ్యాడు.

'మీరు రావడం మా భాగ్యం' అంటూ ధర్మరాజే ఎదురు వెళ్లి మహర్షికి ఉచిత మర్యాదలు చేశాడు. తరవాత ఆయన పక్కనే కూర్చుని 'త్రిలోక సంచారులు మీరు, మీకు తెలియని విషయం వుండదు. శాశ్వత స్వర్గవాసం పొందేందుకు మార్గాలేమిటో చెప్పరూ' అని అడిగాడు.

'తపస్సు, దానం ఇంద్రియనిగ్రహం, ఆత్మ సంయమనం, భూతదయ, సత్యవాక్కు పాటించే వారికి సురలోక ప్రాప్తి కలుగుతుంది. జన్మరాహిత్యం సిద్ధిస్తుంది' అని మహర్షి అంటూ వుండగానే ధర్మరాజు మధ్యలో అందుకుని-

'అలా అయితే మా అమ్మకు శాశ్వత స్వర్గవాసమే లభిస్తుంది. ఆవిడ అందరిలాంటి మనిషి కాదు. అహంకారాన్నీ, ఈర్ష్యా ద్వేషాలనూ, రాగబంధాలనూ త్యజించింది. తన బిడ్డలకు అన్యాయం చేసిన వాళ్లకే తోడు నీడగా వుంటూ సపర్యలు చేస్తోంది' అన్నాడు.

నారదుడు మాట్లాడలేదు.

ఆయన మాట్లాడకపోయేసరికి, ధర్మరాజే-

'మీరెందుకో అన్యమనస్కంగా వున్నారు. నా నుంచి మీరేదో దాస్తున్నట్టనిపిస్తోంది' అంటూ మహర్షి రెండు చేతులూ పట్టుకున్నాడు. ఆయన చాలా సేపు మౌనంగా

వుండి పోయి నెమ్మదిగా తలెత్తాడు.

'ఎలా చెప్పను నీకు?' అన్నాడు.

గాద్గదికమైన స్వరంతో

'ఫరవాలేదు, చెప్పండి' అన్నాడు ధర్మ రాజు ఆతృతగా.


'నీకు తెలుసా నాయనా-మీ అమ్మ ఎప్పుడో స్వర్గలోకం చేరి తన భర్తను కలుసు కుంది' నారదుడు చెప్పింది విని, ధర్మరాజు కెవ్వున అరిచాడు.

ఆ అరుపు విని అంతఃపురంలో వున్న ద్రౌపది పరుగు పరుగున వచ్చింది. భర్తకు ఉపచారాలు చేసిన తరువాత నార దుడి వైపు చూసి 'ఏమైంది?' అని అడిగింది.

నారదుడు తడబడుతూ 'ఏం చెప్పను తల్లీ అరణ్యాలలో గాలినే భుజిస్తూ ధృత రాష్ట్ర మహారాజు చాలా కాలం తపస్సు చేశాడు. గాంధారి మంచి నీరు మాత్రమే సేవించేది. మీ అత్తగారు మాసోపవాసవ్రతం చేసింది. ఒకరోజు వాళ్లు ముగ్గురూ గంగా నదిలో స్నానం చేసి ఆశ్రమానికి వస్తుంటే, అగ్ని గాలితో చెలరేగింది. అరణ్యంలో వున్న చెట్లనీ, పొదల్నీ మాడ్చేసింది. అడవి జంతు వుల్ని బూడిద చేసింది. ఆకాశాన్నంటిన ఆ మంటల్లో మీ వాళ్లు చిక్కుకున్నారు. ఆహారం లేక శుష్కించి వున్నారేమో పరు గెత్తి ప్రాణాలు రక్షించుకోలేక మంటలకు ఆహుతయ్యారు' అని చెప్పాడు.

అది వినేసరికి వణికిపోయింది ద్రౌపది.

కళ్లనీళ్లు పెట్టుకుంటూ 'ధర్మ, భీమ, అర్జునుల్ని కన్న వీరమాతే అనాధలా అగ్గిలో కాలి బూడిదయిందంటే ఏం అనాలి? చేసిన వుపకారం మర్చిపోయే దేవుళ్లే వున్నప్పుడు మామూలు మనుషుల్లో గుణ గణాలు ఎంచ డమెందుకు? మీరు చెప్పండి మహర్షి- ఖాండవ వన దహన సమయంలో అర్జునుడు తనను రక్షించాడే ఆ ఉపకారం మరిచిపోయి అర్జునుడి తల్లినే పొట్టనపెట్టుకున్నాడా అగ్ని దేవుడు. అన్యాయం కదూ! కృతఘ్నుల నుంచి, కుత్సి తుల నుంచి, నేల బారు మనుషుల్నుంచి, బాధ ల్నుంచి మా కుంతీ మాతకు ఇన్నాళ్లకైనా విముక్తి కలిగినందుకు నిజంగా నాకు ఆనం దంగా ఉంది' అంది. అంటూనే కుప్పకూలి



పోయి వెక్కి వెక్కి ఏడ్చింది. సరిగ్గా అపుడే వచ్చారు భీమార్జున నకుల సహదేవులు. జరిగినదంతా తెలుసుకుని వాళ్లూ కుమిలిపోయారు. చేసేది లేక ధౌమ్యుణ్ణి, నారదుణ్ణీ, విప్రుల్నీ వెంటబెట్టుకుని అన్నదమ్ములైదుగురూ గంగా తీరానికి వెళ్ళారు. వాళ్ళ వెంట ద్రౌపది కూడా వెళ్ళింది. గాంధారీ ధృతరాష్ట్రులకూ, కుంతీ దేవికీ తిలోదకాలిస్తున్న భర్తల్ని చూసి పెద్దగా ఏడ్చింది. పన్నెండు రోజుల పాటు అక్కడే పలు కుటీరాలు వేసుకుని వున్నారు. పితృమేధప్పుడు బ్రాహ్మణులు చెయ్యమన్నది చెయ్యడం మినహా ధర్మరాజు ఎవరితోనూ మాట్లాడలేదు. కర్మకాండ మాత్రం యథావిధిగా చేశాడు. అస్థికలు ఏరాడు. బూడిద నీటిలో కలిపాడు. కాలి బొగ్గయిన తల్లి అస్థికలు ఏరుతున్నప్పుడు మాత్రం దుఃఖం ముంచుకొచ్చింది. ఏ తల్లయితే తమ నెత్తి మీద అనురాగపు గొడుగులు ఎత్తి పట్టి తమ నింత వాళ్లను చేసిందో ఆ తల్లి ఎముకలు ఏరడం.....

ధర్మరాజు తల్లిని తల్చుకుని వెక్కుతూ 'అమ్మా, అమ్మా' అంటూ ఏడ్చాడు. తమ్ముళ్లు నలుగురూ అన్నను చుట్టేసుకుని బావురుమన్నారు. వాళ్లను చూసి ద్రౌపది కరిగిపోయింది. చేతులు సాచి ఐదుగుర్నీ గుండెల మీద చేర్చుకుంది.

ద్రౌపది

ఓం శ్శాంతి-శ్శాంతి-శ్శాంతిః

'మహారాజా! ప్రాణి ఎగిరిపోయాక అప్పటి వరకూ శరీరాన్ని అంటిపెట్టుకు నున్న ఆత్మ ఎవరు కనిపిస్తే వారిని ఆశ్రయించ డానికి ప్రయత్నిస్తుంది. అది జరగకుండా వుండేందుకే ఈ కర్మ చెయ్యడం. కర్మ వలన ఆత్మకు విముక్తి లభిస్తుంది. లేవండి మీ అమ్మ ఆత్మ, మిమ్మల్ని స్వర్గం నుంచి దీవిస్తోంది' అంది.

అందరూ వెళ్లి పదమూడవరోజు అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. అన్నదానానికి ముందు ముని శ్రేష్ఠులు, విప్రవరేణ్యులు, ఋత్విక్కులకు గోదాన, భూదాన, సువర్ణ దానాలు చేశారు. వాళ్లంతా పాండవులను దీవించి వెళ్లారు. ధర్మరాజు పరివారంతో మళ్ళీ హస్తినాపురం చేరుకున్నాడు.

*** *** *** ***

ఏళ్లు గడిచాయి.

ఈలోగా అనుకోని పరిణామాలు చాలా సంభవించాయి. కృష్ణుడి కొడుకు సాంబుడికి ఆడపిల్ల వేషం వేసి కణ్వ, విశ్వామిత్ర, నారద మహర్షులను ఆట పట్టించినందుకు మిమ్మల్ని నాశనం చేసే ముసలం సాంబుడికే పుడుతుందని వాళ్లు యాదవుల్ని శపించారు. కృష్ణుడూ, బలరాముడూ తప్ప మిగిలిన యాదవులంతా ఆ ముసలం వల్ల నిజంగానే ప్రాణాలు పోగొట్టుకున్నారు. బలరాముడు అధిక నిష్ఠతో శరీరం విడిచి సముద్రంలో ప్రవేశించాడు. అన్న వెళ్లిపోగానే కృష్ణుడ్ని ఒంటరితనం భయపెట్టింది. తను భూలోకంలో చెయ్యవల్సిన పనులన్నీ అయిపోయాయనుకుని వెంటనే సమాధి స్థితి పొంది నేలమీద శయనించాడు కృష్ణుడు. జర అనే రాక్షసి చూసిందదంతా. మెల్లగా దగ్గరకు వచ్చింది. సరిగ్గా అప్పుడే దానికో వేటగాడు కనిపించాడు. వాడి కంటికి కృష్ణుడు లేడిలా కనిపించేటట్టు మాయ చేసిందది. ఆ వేటగాడు మా మంచి లేడి దొరికిందనుకుంటూ గురిచూసి బాణం విడిచాడు. అది కృష్ణుడి అరికాల్లో గుచ్చుకుని పాదంపైనుంచి దూసుకుపోయింది. కృష్ణుడికి నవ్వొచ్చింది. దుర్వాసుడు తన కిచ్చిన శాపం కూడా వృధాకాలేదనుకున్నాడు. నవ్వుతూనే మానవ దేహాన్ని విడిచి పెట్టాడు.

* * * *

కృష్ణుడు లేని సామ్రాజ్యం, అధికారం, రత్నఖచిత కిరీటాలూ, గండపెండేరాలూ అన్నీ నిరుపయోగంగా అనిపించాయి పాండవులకు. అతను హస్తినలో వున్నా ద్వారకలో

వున్నా ఆపద సమయాల్లో అతనిని గురించిన యోచన, అతని నామ స్మరణకూడా ఆలంబనలా ధైర్యంలా, మనసుకు వూరటలా వుండేవి. ఇప్పుడవన్నీ మాకు ఎవరిస్తారు.? కన్నీళ్లతో ధర్మరాజు చూపు మందగించింది.

"అమ్మా సుభద్రా" అని పిలిచాడు. ఆయన పక్కనే భీమార్జున నకుల సహదేవులు, యుయుత్సుడు, పరీక్షితుడు వున్నారు.

"మహాప్రస్థానం చెయ్యాలని పిస్తోంది నాకు. తమ్ముళ్లందరూ కూడా అలా చెయ్యడానికే ఇష్టపడుతున్నారు" అన్నాడు.

సుభద్ర చప్పున తలెత్తి అర్జునుడి వైపు చూసింది. దైన్యం ఆవరించి వుంది అతని మొహంలో. గాండీవం, అక్షయతూణీరాలూ, అమ్ములపొదులూ ఏవీ లేవతని దగ్గర. సుభద్ర కళ్లు వూట బుగ్గలయ్యాయి. చెక్కిళ్లనిండా అశ్రుధారలు ప్రవహించాయి. '.... కృష్ణుడి చెల్లిలివి నువ్వు, పిచ్చిగా అధైర్యపడకు. పరీక్షితుడికి పట్టాభిషేకం చేస్తాను. యుయుత్సుడికి రాజ్యతంత్రం, అంతఃపుర చరిత్రలూ అన్నీ ఉపదేశించి మహానాయకుణ్ణి చేస్తాను. నీ మనుమడు కౌరవకుల నాధుడవుతుంటే అతని వెనకే వుండి సక్రమంగా రాజ్యపాలన జరిగేలా చూసే బాధ్యత నీకు లేదూ...' అన్నాడు.

'అంటే నేను రావడం లేదా మీవెంట' సుభద్ర తడబడుతూ అడిగింది. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా 'ముందర పరీక్షితుడి పట్టాభిషేకం కానీ" అన్నాడు ధర్మరాజు.

* * * * *

మరునాడే ధౌమ్య, కృపాచార్యుల సమక్షంలో పరీక్షిత్తుకి పట్టాభిషేకం చేశారు.

'ఈ రోజునుంచీ ఇతనే మీ రాజు. మా అయిదుగురికి బదులుగా ఇతన్ని గౌరవించండి. ఇతని మీద అనురాగం కలిగి మీ కార్యాలు చక్కబెట్టుకోండి. మేము మహాప్రస్థానం చెయ్యబోతున్నాం. మా అన్నతమ్ముళ్ని అనుమతించండి ' అని ప్రజల దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు ధర్మరాజు.

హస్తినాపుర వాసుల మొహాలు చిన్నబోయాయి. పెద్దగా ఏడుస్తూ 'మేమూ మీతో పాటే వస్తాం' అన్నారు.

ధర్మరాజు మనసు ఆర్ద్రమైంది.

'మీ ప్రేమనూ, ఆదరాభిమానాలనూ ఇన్నేళ్లుగా అనుభవించాం. మీసేవలో పునీతులమయ్యాం ఆ అదృష్టం మా పరీక్షితుడికి కూడా కలగనివ్వండి. మా సుభద్ర కూడా ఇక్కడే వుంటుంది. ఆవిడకు ఈరోజు నుంచీ మీరంతా బిడ్డలే. ఆ తల్లిని మీరంతా కాపాడుకోండి. మీకు మా కృతజ్ఞతలు'

అన్నదమ్ములైదుగురూ ఒకరి తర్వాత ఒకరు ప్రజలకు నమస్కారాలు చేసి శెలవని చెప్పి వెళ్లిపోయారు.

* * * * *

అన్నదమ్ములైదుగురూ ఆభరణాలన్నీతీసేసి నార చీరలు కట్టుకున్నారు. ద్రౌపది కూడా అలాగే చేసింది. సుభద్ర, ఉలూచి, చిత్రాంగదలు కూడా ఆభరణాలన్నీ తీసేసి నార చీరలు కట్టుకోబోతుంటే ద్రౌపది కళ్లలో నీళ్లు నిల్చాయి. 'వద్దు కష్టాలన్నీ నాతోనే మొదలయ్యాయి. నేనొక్కదాన్నే అనుభవించాలి. నన్ను కట్టుకున్నందుకు పాండవులు అనుభవించాలి మీరొద్దు' అరచేతుల్లో మొహం దాచుకుని ఏడ్చింది. ఇంతలో ధర్మరాజు పిలవడంతో 'వెళ్లండి. నేను మీనుంచి దూరంగా వెళ్లాకైనా మీ శేష జీవితాలు ఆనందంగా గడవాలని కోరుకుంటున్నాను' అంది. అలా అంటున్నప్పుడు ఆవిడ కంటినుంచి నీటి చుక్కలు తెగి కిందపడ్డాయి.



యువ మల్లులకు సలహా యిస్తున్న మల్లయోధుడు

లిథూనియా భీముడు

90 కిలోల ఇసుకబస్తాను భుజాన వేసుకుని 200 మీటర్లు పరిగెత్తడానికి మీరెప్పుడైనా ప్రయత్నించారా? మామూలు వాళ్లకైతే నడుములు విరగడం ఖాయం. కానీ ఉర్విస్‌మార్కా ఆ పనిని అవలీలగా చేయగలిగాడు.

లిథూనియా "మహాబలుడు-89" బిరుదుకోసం పోటీ ఇటీవలే లిథూనియాలోని విల్నియూస్ క్రీడాభవనంలో జరిగింది. మొత్తం 15 మంది ఎథ్లెట్లు తమ సత్తా చూపించారు. ఇందులో నలుగురు ఎస్తోనియా, ఫిన్‌లాండ్‌లకు చెందిన వారు. వారికి నాలుగు పోటీలు పెట్టారు. మొదటిది 25.5 కిలోల దీర్ఘచతురస్రాకారపు రాయిని ఎత్తి దూరంగా విసరాలి. లిథూనియా ఫారెస్టర్ క్యస్తూతిస్ అయితే ఈ బండను 6.8 మీటర్ల దూరం విసరగలిగాడు. రెండోది 550 కిలోల బరువు సరుకులున్న లోహపు బండిని లాగాలి. లిథూనియా నావికుడు జిన్‌కియవిసియస్ 1,050 కిలోల బరువున్న బండిని లాగగలిగాడు. మూడోది కనీసం 370 కిలోల బరువు గల సరుకులుంచిన ఒక వేదికను ఎత్తాలి. లిథూనియా ఎథ్లెట్ విత్క్యవిసియస్ 640 కిలోల బరువున్న వేదికను ఎత్తగలిగాడు. పోటీలో నాలుగవ అంశం ఇసుక బస్తాను మోసుకుపరుగెత్తడం. ఈ, నాలుగింటిలోనూ విజయం సాధించిన జిన్‌కియ విసియస్ లిథూనియా మహాబలుడు-89 బిరుదును గెలుచుకున్నాడు. ఈ 32 ఏళ్ల ఛాంపియన్‌కు 2,500 రూబుళ్ళ పారితోషికం, ఫిన్‌లాండ్ ఉచిత సందర్శనావకాశం లభించాయి.

వీక్లీపోస్ట్

ఇల్లాలే

23-3-90 రాధ ముఖచిత్రంతో వెలువడిన మా అభిమాన పత్రికలో పి. కుసుమారెడ్డిగారి హాస్య నవలిక ఇంటికి శాపం ఇల్లాలే ముగింపు బాగుంది. ఈ నవలికలో రచన, మంగళ పాత్రలు రచయిత్రి అద్భుతంగా మలిచారు. మంగళ పాత్ర ద్వారా ఒక సామాన్య స్త్రీ యొక్క పరిస్థితిని, రచనపాత్ర ద్వారా అమాయకమైన స్త్రీ యొక్క అవున్నత్యాన్ని తెలియ జేశారు కదా! ఇంత మంచి రచనని అందించిన రచయిత్రికి, ప్రచురించిన ఎడిటర్‌గార్కి మా శుభ సుమాంజలితో...

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులు.

–పెయ్యేటి చండీరంజని, పెయ్యేటి చాముండేశ్వరి (ఒంగోలు)

'విముక్తి'

23-3-90 'రాధ' సంచికలో వెలువడిన, విముక్తి చాల బాగుంది. మన్నెం శారదగారి సూపర్‌హీరో నిజంగానే సూపర్‌గా ఉంది. చల్లా సుబ్రహ్మణ్యంగారి లవ్‌గేమ్ నన్ను ఎంతో ఆకట్టుకున్నది. ద్రౌపది నిజంగా చదువుతుంటే మహాభారతం కళ్లకు కట్టినట్లు వుంది. పత్రిక ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు చదువుతానా అని వారం వారం పత్రిక కోసం ఎదురు చూస్తాను. ఇన్ని మంచి కథలు మంచి సీరియల్స్ అందిస్తున్న మీకు మా ధన్యవాదాలు.

–కె. రాగవకుమారి (కాకినాడ)

హీరో

"సూపర్ హీరోయిన్ రాధ" సంచిక (అందులో ఉగాది!) సూపర్బ్. హిట్‌లిస్ట్ సీరియల్ ష్యూర్‌గా హిట్ అవ్వచ్చు. షంట్ మషాళాతో ప్రారంభించింది గదా! కారుచీకటిలో కాంతిరేఖలా నిరుద్యోగ యువత పాలిట చిరు దీప కళికలా "దమ్ము", "సాహసం"



(4 వ పేజీ తరువాయి)

వుండాలిగాని ఏ పని స్వయంగా చేస్తే సాధించలేనిదేముంది అన్న సందేశం "ఉగాది పచ్చడి" చెప్పింది. (డిడీర్ అంటే అర్థం???) 82వ సంవత్సరపు కీర్తి బావుటా ఎగరేస్తూ 23-3-90 మీ (మా) సంచిక మార్కెట్‌లోకి 24న రావడం, గళ్ల నుడికట్టు ముగింపు తేదీ 20.3.90 అనడం... ఐనా మీ పత్రిక మా అనురాగ పుత్రికేకదా!!

బి. ఆర్. మూర్తి, (మచిలీపట్నం-2)

★ సాహితీ పజిల్ కూడా 16.3.90 సంచికలో మొదటిసారిగా వేశాము.

★ "డిడీర్" పచ్చడి అంటే ఇన్‌స్టాంట్ చెట్నీ అన్నమాట! ఇది మద్రాస్ టచప్!

సీరియల్సు!

అందాల 'రాధ' ముఖ చిత్రం (23.3.90) అందంగా ఉంది. శ్రీ చల్లా వారి 'లవ్ గేమ్' ప్రతివారం ఇంట రెస్టింగ్‌గా ఉంటుంది. ముఖ్యంగా మన్మథరావు, శ్రీమతిల మధ్య జరిగిన బాత్‌రూం సీన్ చక్కగా ఉంది. మన్మథరావుకు జరిగిన అవమానం పాఠకులు నవ్వుకునేలా ఉంది. అలాగే నవ్య, స్వాగత్‌ల మధ్య జరిగిన పందెం కూడా బాగుంది. మొత్తానికి వచ్చే వారం కోసం పాఠకులు ఎదురు చూసేలా చేస్తున్న రచయితకు థాంక్స్.

అలాగే శ్రీ జి. వి. అమరేశ్వరరావుగారి 'హిట్ లిస్ట్' కూడా మొదట్లోనే హడలగొట్టింది. కులాంతర, మతాంతర దొంగ వివాహాలు చేసుకొని, ఆ డబ్బుతో విలాసాలు, దొంగతనాలు చేయడం శివాజీ, రజనీల హాబీలాగుంది. అలాగే శివాజీ జబ్బార్ అనుచరులతో ఫైటింగ్‌లు చదువుతుంటే సినిమా చూస్తున్న అనుభూతి కల్గుతుంది. మున్ముందు ఎన్ని సాహసాలతో కథ నడుస్తుందో మరి. బాగుంది. టానా పోటీల్లో గెలుపొందిన కథ, కవితలు చక్కగా ఉన్నాయి. గడియారాలు మారుతున్నాయి కాని కాలం మారడం లేదు. శీర్షిక పురాతన గడియారాలు సేకరణ వివరాలు బొమ్మలతో బాగున్నాయి. ఇకపోతే టిట్ ఫర్ టాట్ , హల్లో డాక్టర్ నేనేం చెయ్యాలి, ప్రశ్నావళి,పజిల్‌లు ఇలా దేనికవే వాటి ప్రత్యేకతలను సంతరించుకుంటూ అశేష ఆంధ్ర పాఠకులను అలరిస్తున్నాయి. ఎడిటర్‌గార్కి థాంక్స్.

(పత్రిక ఈ వారం లేటు అయిందికదా!)

-పోలోజు వెంకటాచారి, (బోడుప్పల్)

ఫెంటాస్టిక్

ఈ వారం పత్రిక రియల్లీ ఫెంటాస్టిక్. వీక్లీలు అన్నిటికన్నా - పత్రిక మిన్న. టిట్ ఫర్ టాట్, ప్రశ్నావళి, హలో డాక్టర్ నేనేం చేయాలి? శీర్షికలు వారం వారం మీ (మా) ఆంధ్ర పత్రికను చూశేలా చేస్తున్నాయి.

-శీలం నరసింగరావు, శ్రీను, మోహన్, రామలక్ష్మి, అప్పారావు, నారాయణమ్మ, (అలమండసంత)

మార్పు

పి. ఉపేంద్రగారు మంత్రి అయ్యాక ఆకాశవాణి, దూరదర్శన్‌లలో చాలా మార్పు వచ్చింది.

ముఖ్యంగా ఉగాది రోజున ప్రొద్దుటే రేడియోలో విష్ణు సహస్ర ం వింటోంటే చాలా ఆనందం కలిగింది. సాయంకాలం టి. వి. లో తెలుగు సినిమా అనేసరికి ఆశ్చర్యం కలిగి చూస్తోంటే సంతోషం కలిగినది.

-ఖండవల్లి శ్రీనివాస చక్రవర్తి, విజయవాడ

రాధ

"రాధ" ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వార పత్రిక చాలా బావుంది. కవితలు చాలా బావున్నాయి. -ఎస్. సుధాకర్, బరంపురం ○

మీ జి. కె. ఎంత? జవాబులు

(1) 'తేహి ప్రాజెక్ట్ డామ్' (2) ఇంగ్లాండులో, 1840లో (3) ఇరాక్ (4) ఉద్దమ్‌సింగ్ (5) ఎమ్. ఎస్. స్వామినాథన్ (6) నీరజామిశ్రా. 1986 సంవత్సరం హైజాక్ చేయబడిన 'పాన్- ఆమ్' విమానంలో అనేక మంది ప్రాణాలు కాపాడి హైజాకర్లచే కాల్చివేయబడింది. మరణానంతరం ఈ అవార్డులు లభించాయి. (7) ఎ. సాలుంకే. ఇతను 1917లో నిర్మించబడిన 'లంకాదహన్' చిత్రంలో 'రాముడు' మరియు 'సీత పాత్రలను ధరించాడు (8) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (10,976) (9) కిరణ్‌బేడీ (10) ఫారిన్ ఎక్స్ఛేంజ్ రెగ్యులేషన్ యాక్ట్.

Editorial Adviser: *S. RADHAKRISHNA*, Editor: *VEERAJI*.
Printed and Published by *S. NAGESWARARAO* for Nageswara Rao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003.
Phones: Editorial: 75667, Business: 61247, 61248.

సాహితీ పజిల్ — గెల్చుకోండి రు. 200

1			2	■	3			4
	■	■		■		■	■	
	■	■	5			■	■	
6		7		■	8	9		
■	■		■	■	■		■	■
10			11	■	12			13
	■	■	14			■	■	
	■	■		■		■	■	
15				■	16			

గళ్లనుడి కట్టు-28

ఆధారాలు

నిలువు

1. అమ్మమ్మను సంస్కృతంలో పిలవండి.
2. చెడును విడనాడుట చాలా మంచిది.
3. ఈయన తెనుగు హాస్యానికి సాక్షి.
4. రంజన చెడితే విభక్తి తగిలించండి.
7. జీవితం ఇలాటిదే.
9. మొద్దు రాచిప్ప తిరగబడితే చిన్నేమిటి పెద్దేమిటి.
10. పేనుకు పెత్తనం ఇస్తే తలంతా కొరికింది.
11. ఈ మధ్య ప్రతివాడు దబాయించటం నేర్చుకున్నాడు.
12. భారతవీరుల మగటిమి చూస్తున్నారుగదా.
13. నీరాజనాలలో ధాన్యం.

అడ్డం

1. బుద్ధుని కడుపార గన్నతల్లి.
3. ఒడ్డులేనివారం సముద్రం.
5. నారింజను ఇలాకూడ అంటారు.
6. ఘటోత్కచుడి మామ.
8. అల్లాటప్పా కాదు టీక తాత్పర్యం.
10. భీముడికి తగ్గ పెద్ద ఆయుధం.
12. వాల్మీకి ఇలా జపం చేశాడు.
14. అద్దెను ఇలా అంటారు.
15. ఈ మాట వ్రాసి పజిల్ ముగించండి.
16. వేదవాక్కులు అమృతపు చినుకులు.

ఆధారాలున్నాయి. నుడి కట్టు గళ్లు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి. ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు. 200/-లు బహుమతి లభిస్తుంది-ఒకరి కన్నా ఎక్కువ మంది కరెక్టు ఆన్సర్లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే.

-ఎడిటర్

ముగింపు తేదీ : 30-4-90

-కూర్పు: పింగళి వి. కృష్ణారావు

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు.......................................

పూర్తి చిరునామా.......................................

....పిన్ కోడ్..........

గళ్లనుడికట్టు-26 ఫలితాలు-బహుమతులు

వందలాది మంది పాఠకులు అత్యంత ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్నారు. వారందరికీ మా అభినందనలు!

అయితే సరైన సమాధానం ఏడుగురు మాత్రం పంపగలిగారు. బహుమతి మొత్తం రు. 200 లను ఈ ఏడుగురికి పంచివేశాము. రు. 29 ల చొప్పున వీరికి త్వరలో నగదు రూపంలో పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పజిల్ ఒకరు ఎన్ని కూపన్‌లైనా పంపవచ్చు. కాని ఒక్క బహుమతికే అర్హులు. తెల్లకాగితం మీద వ్రాసిన కూపన్‌లు చెల్లవు. పత్రికలో కూపన్‌నే నింపి పంపాలి. మీరు పంపిన జవాబులు మావద్దగల సీలుచేసిన జవాబుకు సరిపోవాలి.

- ఎడిటర్.

■	1 క్లా	ఫీ	2 సం	■	3 రా	బం	4 దు	■
■	మా	■	ద	■	ణు	■	ర్ధ	■
5 ము	రి	■	6 కం	7 దు	లు	■	8 శే	9 చి
ని	■	■	■	మ్ము	■	■	■	ల
10 మా	ర్జా	ల	ము	■	11 ప	సి	రి	క
ణి	■	■	■	12 కం	■	■	■	మ
13 క్యాం	14 వా	■	15 అ	ప	16 ర	■	17 కీ	ర్తి
■	రా	■	ర	■	ధాం	■	ర	■
■	18 హి	ర	ణ్యం	■	19 గం	ఢ	ము	■

సరైన జవాబులు పంపినవారి పేర్లు:

టి. వాణిశ్రీ (గుర్జూరు), వి. లక్ష్మీవెంకటరమణ (వరంగల్), జి. పుల్లప్ప (చాగలమర్రి), వింజమూరి సుబ్బలక్ష్మి (వరంగల్), టి. వి. కృష్ణయ్య (గుర్జూరు), టి. రఘు (కాజీపేట), హెచ్.ఎం.పి. సోమనాథశాస్త్రి (పెనికేరు).

పుస్తకాల పేజీ

*ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ చరిత్ర

గ్రంథకర్తలు: శ్రీ ఆర్.కె.వి. రమణశాస్త్రి, శ్రీ ఏకా వేంకట సుబ్బారావు, పుటలు: 95, వెల: ముప్పది రూపాయలు, (క్రీడాకారులకు రు. 20) ప్రతులకు: క్రీడా జగత్తు పబ్లికేషన్స్, 2/8, బ్రాడీపేట, గుంటూరు-2 (ఆం. ప్ర).

పూర్వాంధ్ర రాష్ట్ర జిల్లాలలో 1904 నుంచి టెన్నిస్ ఆట ప్రారంభమైనప్పటి నుంచి అనేక మంది ప్రముఖులు పాల్గొన్న వివిధ పోటీల వివరాలను, వారి టెన్నిస్ జీవితాలను గూర్చి ఈ పుస్తకంలో గ్రంథకర్తలు సంగ్రహంగా వివరించారు. శ్రీ కోట రామస్వామినాయుడు, శ్రీ ఎం. ఆర్. అప్పారావు, శ్రీ ఎన్. భుజంగరావుల వంటి ఎందరో ప్రముఖుల టెన్నిస్ జీవితాలు యిందులో చోటుచేసుకున్నాయి.

* కృష్ణలహరి

రచయిత: డా. ధారా రామనాథశాస్త్రి, పుటలు: 27, వెల: పది రూపాయలు, ప్రతులకు: మధుమతి పబ్లికేషన్స్, ఇ.కె. నివాస్, మామిడిపాలెం, ఒంగోలు-523 002.

* ఆవేదన

(గేయ సంపుటి), రచన: భానుచంద్ర, పుటలు:86, వెల: పది రూపాయలు, ప్రతులకు: సూర్యా పబ్లికేషన్స్, మెయిన్‌రోడ్, భీమునిపట్నం - 531 163.

* పాచికలు

(కథల సంపుటి), రచయిత: సత్యాగ్ని, వెల : పది రూపాయలు, ప్రతులకు: శ్రీమతి యస్. నజీరున్నిసా, 7/37, శింహాద్రి వంతులువీధి, కడప - 516 001.

* హనుమత్సందేశము

రచయిత: పరిటి సూర్య సుబ్రహ్మణ్యం, పుటలు: 99, వెల:పదిహేను రూపాయలు, ప్రతులకు: పరిటి సూర్య సుబ్రహ్మణ్యం, శ్రీ శారదాపీఠం, 25-11-5, అయ్య కోనేరు తూర్పుగట్టు, విజయనగరం - 531 202.

* వేయి పడగల మణిప్రభలు

రచయిత: డాక్టర్ తుమ్మపూడి కోటేశ్వరరావు, పుటలు: 93, ప్రతులకు: త్రివేణి పబ్లిషర్సు ప్రైవేట్ లిమిటెడ్, పోస్టుబాక్స్ నెం: 15, మచిలీపట్నం - 521 001 లేదా నవోదయ పబ్లిషర్సు, ఏలూరురోడ్డు, విజయవాడ - 2.

* మహర్షుల హితోక్తులు

రచన: గోపరాజు వెంకటానందము, పుటలు: 54, వెల: పది రూపాయలు, ప్రతులకు: శ్రీ గోపరాజు వెంకటానందము (జర్నలిస్టు), రామ్‌నగర్, నిడదవోలు - 534 303.

* పుష్పబాణ విలాసము

రచన: పరిటి సూర్య సుబ్రహ్మణ్యం, పుటలు: 25, వెల: మూడు రూపాయలు, ప్రతులకు: పరిటి సూర్య సుబ్రహ్మణ్యం, శ్రీ శారదాపీఠం, 25-11-5, అయ్యకోనేరు తూర్పుగట్టు, విజయనగరం - 531 202.

* వెలుగుబాట

గేయ కావ్యం: రచయిత: యం.సి. నాగన్న, పుటలు: 40, వెల: ఎనిమిది రూపాయలు, ప్రతులకు: యం.సి. నాగన్న, రిటైర్డ్ హెడ్‌క్లర్క్ (రైల్వే), బలిజపల్లె గ్రామం, మామిళ్లపల్లె (పోస్టు) - 516 004, కడప జిల్లా.

* పర్వతేశ ప్రభుశతకము

రచయిత: ఆచార్య కోట సుందర రామశర్మ, పుటలు: 48, వెల: అమూల్యము, ప్రతులకు: త్రిపుర సుందరీ ప్రతిష్ఠానము, చింతగుంటపాలెము, మచిలీపట్టణము - 521 001.

★ మా హృదయం

రచయిత: పి. చంద్రశేఖర అజాద్, పుటలు : 156, వెల : పదిరూపాయలు, ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ –2.


టి. వి. లు పిల్లలపై ప్రభావం చూపుతున్న దశలో వారికి మంచి సాహిత్యాన్ని అందించాలన్న తపన, బాలల చెంతకు సాహిత్యాన్ని ఓ ఉద్యమంలా తీసుకు వెళ్లాలన్న దృఢదీక్ష ఈ నవల్లో ప్రస్ఫుటించాయి. పిల్లలకు 'మంచి మంచి పుస్తకాలను అందించాలన్న రచయిత కృషి ఎంతైనా ప్రశంసనీయం.

★ తర్జని

డాక్టర్ కరుణ రచనల సంపుటి, పుటలు : 100, వెల : ఐదు రూపాయలు, ప్రతులకు : స్నేహ ప్రచురణలు, కరుణ నిలయం, నవోదయ కాలనీ, విజయవాడ – 520010.

పెళ్లి కాకుండా తల్లి కాబోతున్న కూతురి పట్ల కన్నతల్లే ఎలా ప్రవర్తిస్తుందో, ఎంత భేద భావంతో చూస్తుందో ఒక సాంఘిక బాధ్యతగా కాకుండా డాక్టర్‌గా చెప్పారు రచయిత్రి. ప్రతి అనుభవమూ సజీవ రచనగా రూపు దాలుస్తుందన డానికి ఈ వ్యాసాలే తార్కాణం.

హైదరాబాద్‌లో యిటీవల ప్రణవోదయ సాంస్కృతిక సంఘం ఏర్పాటుచేసిన '60వసంతాల ' శార్వరి' గ్రంథం ఆవిష్కరణోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రావూరి భరద్వాజ. డాక్టర్ సి. నారాయణరెడ్డి, శ్రీ జ్వాలాముఖి, డాక్టర్ వి.వి.యల్, శ్రీ త్రిపురనేని సుబ్బారావులను కూడా చిత్రంలో చూడవచ్చు.





"నా బాధ్యత మరింత పెరిగింది"

– విజయశాంతి

"నేను ఏ పాత్రనైనా సంపూర్ణ న్యాయం చేకూర్చాలనే తపనతో నే నా శక్తి సామర్థ్యాలన్నీ వినియోగించి నటిస్తాను. ఐతే, 'భారతనారి' చిత్రానికి అవార్డు వస్తుందని నేను ఊహించలేదు. ఇది నా 100వ చిత్రం కావడం మరో విశేషం. అందుకే ఎంతో ఆనందంగా ఉంది," అంది విజయశాంతి.

ఈమెకు ఇది రెండవ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు. అది వరకు "ప్రతిఘటన" చిత్రానికి తొలిసారిగా ఉత్తమ నటి అవార్డు అందుకున్న విషయం అందరికీ తెలిసిందే!



"ఎంత శ్రమతో కూడుకున్న పాత్రయైనా నేనెక్కడా రాజీ పడను. ఆర్టిస్టుకు తన శక్తి సామర్థ్యాల మీద పూర్తి విశ్వాసం ఉండాలి. ఆ ఆత్మవిశ్వాసమే శ్రీరామరక్ష. ఏ ఆర్టిస్టయినా ముందుకు సాగాలంటే కృషి ఎంతైనా అవసరం అని నమ్మే వారిలో నేనొకతెను," అనే విజయశాంతి ఇప్పుడు రెండు హిందీ చిత్రాలలోనూ నటిస్తోంది. రతన్ ఇంటర్నేషనల్ వారి "అపరాధి" చిత్రంలో అనిల్‌కపూర్ సరసన, తాతినేని రామారావు దర్శకత్వంలో అట్లూరి పూర్ణచంద్రరావు సమర్పించే "ముకద్దర్ కా బాద్ షా" చిత్రంలో వినోద్‌ఖన్నా సరసన నటిస్తోంది.

"ఈ రెండూ విభిన్నమైన పాత్రలు. ఒక ఛాలెంజ్‌గా తీసుకుని నటిస్తున్నాను," అందామె.

"కర్తవ్యం" చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతిగా ఈమెకు ఎన్నో ప్రశంసలు వస్తాయని చాలా మంది భావిస్తున్నారు.... తథాస్తు.

(జి.వి.జి)

సినిమా... సినిమా...

"ప్రేమ పావురాలు"

"ప్రేమకు చిహ్నం తెల్లని పావురం. ప్రేమకు సరికొత్త నిర్వచనమిచ్చే ఇతివృత్తం. ప్రేమను సరికొత్త కోణంలో చూపే ఈ సినిమా స్కోప్- ఫోర్ ట్రాక్ స్టీరియో ఫోనిక్ సౌండ్‌సిస్టమ్ చిత్రం హిందీలో 'మైనే ప్యార్ కియా' నవ నటీనటులతో తయారైనా మల్టీస్టారర్‌కి చిత్రాల వసూళ్ళను అధిగమించి, కొత్త రికార్డును సృష్టించింది." అన్నారు తారాచంద్ బరజాత్యా. ఈయన రాజశ్రీ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంలో ఈ చిత్రం తెలుగు పరివర్తనను త్వరలో రాష్ట్రమంతటా విడుదల చేయనున్నారు. సలీమ్‌ఖాన్, భాగ్యశ్రీ నాయకా నాయికలు. రాజశ్రీ మాటలు, పాటలు రాశారు. రామ్‌లక్ష్మణ్ సంగీత దర్శకులు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : సూరజ్ ఆర్. బరజాత్యా.


సత్యనారాయణ, కోట సమర్పించే "భలే ఖైదీలు"

"కాకినాడలో ఒకే షెడ్యూల్‌లో మే నెలలో పూర్తవుతుంది" అన్నారు జి. వి. హెచ్. ప్రసాద్. ఈయన నిర్వహణలో సుదర్శన్ నిర్మించే సుదర్శన్ పిక్చర్స్ "భలే ఖైదీలు" చిత్రానికి తనికెళ్ళ భరణి రచయిత. సత్యనారాయణ, కోట శ్రీనివాసరావు ప్రధాన పాత్రధారులు.

సుదర్శన్ పిక్చర్స్ సుమన్‌తో నిర్మిస్తున్న "మహాయజ్ఞం" చిత్రం షూటింగ్ మార్చి 12 నుండి 28 వరకు సిమ్లా, కులు, మనాలి, కీలాంగ్ ప్రాంతాలలో జరిగింది. సుమన్, నవనటి అనూష, సత్యనారాయణ,కోట శ్రీనివాసరావు రాధారవి,తనికెళ్ళ భరణి ప్రభృత నటవర్గం. భరణి మాటలు, చక్రవర్తి సంగీతం, పేకేటి రంగా శిల్పం, జయరాం ఛాయ, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో విజయన్ కథ, స్క్రీన్‌ప్లే, సాహసాలు, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.


"నాయకురాలు"

"ఏప్రిల్ నెలాఖరున విడుదల చేయాలనుకుంటున్నాం", అన్నారు డి. ప్రభాకర్. ఈయన సినిమాస్కోప్‌లో నిర్మించే ప్రియ ఆర్ట్ ప్రొడక్షన్స్ "నాయకురాలు" చిత్రంలో ఊర్వశి శారద, భానుచందర్, నాగబాబు, ఆహుతి ప్రసాద్, రంగప్రసాద్, సాయికిరణ్, కాళిదాస్, సీత ఆదిగాగల వారు నటించారు. గణేష్‌పాత్రో సంభాషణలు, రాజ్-కోటి సంగీతం, దివాకర్ ఛాయ, మనోజ్-సూర్యం ప్రొడక్షన్, రంగారావు శిల్పం, నందమూరి హెనర్జీ కూర్పుతో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : సత్యారెడ్డి.



చిరాకులో చిద్విలాసం


వారు వెళ్ళేటప్పుడే చెప్పాను గా సార్... ఎక్కువగా మాట్లాడే వారంటే ఆయనకు చిరాకని.. విన్నారు గాదు...
OFFICER
ఎందుకయ్యా అలా చిరాకు పడ్తావ్...నేనేం... తిన్నానో ఒకసారి వరసగా లెక్క చెప్పమన్నాను అంతేగా....
నేను రాసిన కవితలు మరీ అంత చిరాకు కలిగించాయా ఎడిటర్ గారూ...
ఆ ఓడిపోయిన బాక్సర్ అసలే చిరాకులో వున్నాడు... ఇంటర్వ్యూ తర్వాత చేద్దాం అంటే విన్నావ్ కాదు...
బాక్సింగ్ పోటీలు
PRESS
డాక్టర్ గారు చిరాగ్గా వున్నారు.. ఇంజక్షన్ కైతే మళ్ళీ రా...
DOCTOR
పక్కింటావిడతో ప్రతిరోజూ నేను మాట్లాడ్డం నీకు మరీ అంత చిరాకు కలిగిస్తుందండి...?



కృష్ణా ఎంటర్‌ప్రైసెస్ తొలి చిత్రం

"ఫామిలీ డ్రామా, సెంటిమెంట్‌తో పాటు కామెడీ ఉంటుంది. హైదరాబాద్‌లో జూన్, జులైలో 1-15 తేదీల మధ్య షూటింగ్ పూర్తవుతుంది." అన్నారు ప్రముఖ పంపిణీ సంస్థ అధినేత సి. సత్యనారాయణ. నరేష్, వాణీ విశ్వనాథ్ నాయకా నాయికలు. శాతవాహన కథ, కాశీ విశ్వనాథ్ సంభాషణలతో రేలంగి నరసింహారావు దర్శకుడు.

"కన్నెపిల్లలు బాబోయ్-కన్నెపిల్లలు"

"అందమైన అర్థాంగి ఉండీ తప్పు తొక్కే భర్తలకు ఈ చిత్రం కనువిప్పు ంది. జయప్రద సోదరుడు రాజబాబు సరసన లండన్ మోడల్ గర్ల్ చాందినీ నాయిక", అన్నారు సి. జి. ధర్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో గుణశేఖర్ నిర్మించే మంజీరా ఫిలిమ్స్ "కన్నెపిల్లలు బాబోయ్-కన్నెపిల్లలు" చిత్రంలో వాణిశ్రీ, ప్రమీల, జయలలిత, లీనాదాస్, సిల్క్‌స్మిత, శోభన్‌రాజ్ పాల్గొంటున్నారు. రాజబాబు కథకు గురుచరణ్ సంభాషణల కర్త. బప్పీలహరి బాణీలకు ఆ్టూరి, సీతారామశాస్త్రి గీతాలు రాశారు. జన్ ఛాయ, భాస్కరరావు శిల్పం, ప్రమీలరాణి నృత్యాలు, జయకుమార్ సహకార దర్శకత్వం, సురేష్ ప్రొడక్షన్, అంబాలన్ కూర్పుతో దేశిరెడ్డి బచ్చన్ నిర్మాణ సారథి.

"లారీ డ్రైవర్"లో బాలకృష్ణ

"వేదాగ్ని" మేలో

"కేరళ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చిత్రం. రహస్యాంగ పూజ సన్నివేశంలో స్మిత ఒళ్ళు దాచుకోకుండా నటించింది. తాంత్రిక శక్తులను ఉపాసించి, తనను మాతృ వియోగానికి గురి చేసిన బ్రాహ్మణ వంశ నాశనానికి వేదాగ్నిగా మారిన పాత్రలో మమ్ముటీ నటించారు. మన వేదాలు, ఉపనిషత్తులలోని అసామాన్య విషయాలతో 'అథర్వం' మలయాళ చిత్రం కేరళలో సంచలనం సృష్టించింది. దాని తెలుగు సేత 'వేదాగ్ని'గా మే నెలలో విడుదలవుతుంది," అన్నారు యు. వి. బాబు. ఈయన సారథ్యంలో గీతా ప్రేమనాథ్ సమర్పించే సాయిబాబు మూవీ మేకర్స్ "వేదాగ్ని" చిత్రంలో జయభారతి, పార్వతి, రేణుక, గణేశ్, తిరగన్, చారుహాసన్ ప్రభృతులు నటించారు. ఆనందకుట్టన్ ఛాయ, డెన్నీ జోసఫ్ దర్శకత్వంతో యు. రాజ్యలక్ష్మిబాబు నిర్మాత.


"వేదాగ్ని"లో స్మిత



"డాక్టర్ భవాని" చివరి షెడ్యూల్

"మార్చి 9 నుంచి 25 వరకు రెండో జరిగింది. ఆఖరి షెడ్యూల్ ఏప్రిల్ 1 ను వరకు", అన్నారు వై. నాగేశ్వరరావు. దర్శకత్వంలో డి. జగదీశ్‌రెడ్డి నిర్మించే రవికి మూవీస్ "డాక్టర్ భవాని" చిత్రంలో ఊర్వశి శారద, భానుచందర్, వాణీ విశ్వనాథ్, జగ్గయ్య, బాలయ్య, రాజీ కృష్ణమూర్తి, బ్రహ్మాజీ, కిట్టు, కిన్నెర, శ్రీలత, రాధాబాయి, పరుచూరి గోపాలకృష్ణ పాత్రధారులు. ఆంజనేయ పుష్పానంద్ కథకు పరుచూరి సోదరులు స్క్రిప్టు రాశారు. జొన్నవిత్తుల గీతాలను చక్రవర్తి స్వరపరిచారు. ఆర్. రామా రావు ఛాయ, రఘురామ్ నృత్యాలు, రాజు శిల్పం, విక్కి సాహసాలు, కె. భాపిరెడ్డి సంయుక్త దర్శకత్వం, వి. ఎన్. రామచంద్రుడు సహకార దర్శకత్వం, నరసింహారావు కూర్పుతో ద్వారంపూడి నరసారెడ్డి నిర్మాణ సారథి. ఎన్. గణేష్ సమర్పణలో మద్దిపాటి కొండలరావు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

-జి.వి.జి.


శ్రీరాఘవేంద్ర ఆర్ట్ పిక్చర్
ఎమ్.కృష్ణ.శేఖర్
ఎస్.ఎస్.రవిచంద్ర